



# గురువులు


విచారణ

# మన మహోన్నత వారసత్వం









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వారి వెబ్ సైట్: http://www.unworldliness.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.



**SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)**

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

## రామ కృష్ణ సేవా సమితి బాపట్ల వారి వెబ్ సైట్:

## http://www.unworldliness.org/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# మన మహోన్నత వారసత్వం

## (మన పూర్వీకుల కథల ద్వారా వ్యక్తిత్వ నిర్మాణం)


రచన, కూర్పు
అమిరపు నటరాజన్

సహ రచయితలు
'వినాయక వ్రతకథ' : డా॥ నెమ్మాని రామగోపాల్
'కచుడు' : డా॥ నారాయణం శేషుబాబు

సలహా మండలి
అమిరపు సురేష్
అమిరపు నరేష్
సి. శ్రీధర్ I.A.S
డా॥ పన్నాల శ్యామసుందర మూర్తి
డా॥ (శ్రీమతి) సిహెచ్. చిరంజీవి
కంభంపాటి వేంకట రామగోపాల శర్మ



ప్రకాశకులు
**శ్రీరామకృష్ణ సేవా సమితి**
**విజయలక్ష్మీపురం**
**బాపట్ల - 522 101**

**ప్రకాశకులు**
**శ్రీరామకృష్ణ సేవాసమితి**
**విజయలక్ష్మీపురం**
**బాపట్ల - 522 101**
**గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్**



**ప్రథమ ప్రచురణ -** ఆగష్టు, 2010 3000 కాపీలు

ప్రతులకు
**శ్రీరామకృష్ణ సేవా సమితి**
**విజయలక్ష్మీపురం**
**బాపట్ల - 522 101**

e-mail : rksamithibapatla@gmail.com
web-site : www.unworldliness.org

# ప్రకాశకుల మనవి

మన వారసత్వం మహోన్నతమైనదని వివేకానంద స్వామి మాటిమాటికీ గుర్తుచేసేవారు. మనమందరమూ మహాత్ములైన ఋషుల సంతానమనీ, ఆ విషయాన్ని తెలుసుకుని, గుర్తుంచుకోవడం ద్వారా మనం కూడా అటువంటి గొప్పతనాన్ని సాధించాలనీ ఆయన ఉద్బోధించేవారు. "ఒక జీవితం మరొక జీవితానికి వెలుగునిస్తుంది!" మహోన్నతులైన మన పూర్వీకుల కథలను మనం చదివినప్పుడు మనలో కూడా అదే విధంగా జీవించాలనే ప్రేరణ కలుగుతుంది.

మనందరమూ ఆత్మగౌరవం అనే మాట వినే ఉంటాము. ఈ మాటకు అర్థం తెలుగు ఆకాడమీ వారి నిఘంటువులో "ఆత్మాభిమానం, ఒక ప్రమాణంతో కూడిన ప్రవర్తన" అని ఇవ్వబడింది. మన పూర్వీకులలో సూర్యుని వెలుగులా మనకు కనపడే లక్షణం ఈ ఆత్మగౌరవమే. వారు ఒక ఉన్నతమైన స్థాయిలో జీవించాలనీ, ఎట్టి పరిస్థితులలోనూ ఆ స్థాయినుంచి తగ్గడానికి రాజీపడకూడదనీ దృఢంగా నిశ్చయించుకుని జీవించారు. వారి దృష్టిలో ప్రాణాలు ముఖ్యమైనవి కావు. వారి ఆదర్శం, వారి ధర్మవర్తనం అన్నిటికన్నా ముఖ్యమైనవి. ఒక గడ్డిపరకను వదిలినట్టు తమ ప్రాణాలను త్యజించడానికి వారు అనుక్షణం సిద్ధంగా ఉండేవారు. తాము సాధించాలనుకున్న విషయం కోసం, తాము నేర్చుకోవాలనుకున్న విషయం కోసం ఎంత కష్టాన్నైనా ఓర్చుకోవడానికి వారు వెనుకాడేవారు కారు. అటువంటి సుగుణాలను అలవరచుకోవడానికి మనం కూడా వారి జీవితకథలను చదివి, వాటి నుంచి స్ఫూర్తిని పొందాలి.

ఈ పుస్తకంలోని కథలను బాపట్ల శ్రీరామకృష్ణ సేవాసమితిలో "బాలవిహార్" పిల్లలకు బొమ్మలు చూపించి చెపుతూ ఉంటారు. వాటిలోని సందేశానికి వివేకానంద సందేశం జోడించి బోధిస్తూ ఉంటారు. వాటినే ఇప్పుడు పుస్తకరూపంలో మీ ముందుకు తెస్తున్నాము.

వివేకానంద స్వామి మన పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకోవలసిన అవసరాన్ని మనకు నొక్కి చెప్పారు. ఈ పుస్తకంతోనే ఆగక, ఈ కథలకు మూలగ్రంథాలైన రామాయణ, మహాభారతాలను కూడా చదివితే మన జాతి ఔన్నత్యం మనకు మరింత చక్కగా అవగతమౌతుంది.

ప్రకాశకులు

# కృతజ్ఞతలు

వినాయకచవితి పండుగ సందర్భంగా సమితిలో ఏటా జరిగే వ్రతకథ పఠనంలో భాగంగా 'వినాయక వ్రతకథ'ను డా॥ నెమ్మాని రామగోపాల్ గారు అనేక పర్యాయాలు ఉపన్యసించారు. వారు మా కోరిక మేరకు ఆ కథను వ్రాసి ఇచ్చారు. వారికి మా ధన్యవాదాలు.

'కచుడు' కథను డాక్టర్ నారాయణం శేషుబాబుగారు మన సమితిలో జరిగిన ఒక సభలో ఉపన్యాసంగా చెప్పారు. మా కోరికను మన్నించి ఈ పుస్తకంలో ప్రచురించడం కోసం దాన్ని వ్రాసి ఇచ్చారు. వారికి మా ధన్యవాదాలు.

ఈ పుస్తకంలోని చిత్రాలను శ్రీ జి. వెంకటేశ్వర్లు గారు (బాపట్ల) చిత్రించి ఇచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని మరింతగా మెరుగుదిద్దడానికి సలహా ఇచ్చిన సలహామండలి సభ్యులకు మా కృతజ్ఞతలు. వ్రాతప్రతిని సరిదిద్దడంలో సహకరించిన సమితి యువసభ్యులకు మా ఆశీస్సులు.

ప్రకాశకులు

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# ముఖచిత్ర వివరణ

ముఖచిత్రంలో ఉన్న పర్వతశిఖరం హిమాలయాలలోని కైలాస పర్వత శిఖరం. వివేకానంద స్వామి మన పూర్వీకులను హిమాలయ పర్వత శిఖరాలతో పోల్చేవారు. చూడగానే కైలాసపర్వతం మన హృదయాలను ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ నింపివేస్తుంది. అలాగే, చిత్రంలో పారుతున్న చల్లని ప్రవాహాన్ని మన పూర్వీకుల నుంచి వస్తున్న వారసత్వంగా మనం భావించవచ్చు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## విషయసూచిక

**ఉపనిషత్తులలోని కథలు**

# ప్రార్థన

**వక్రతుండ మహాకాయ**
**కోటిసూర్య సమప్రభ ।**
**నిర్విఘ్నం కురు మే దేవ**
**సర్వకార్యేషు సర్వదా ॥**

వంకర తిరిగిన తొండంతోనూ, పెద్ద శరీరంతోనూ, కోటిసూర్యులకు సమమైన ప్రకాశంతోనూ వెలుగొందే ఓ వినాయకా! మేము చేసే అన్ని పనులూ, ఎల్లవేళలా నిర్విఘ్నంగా జరిగేలా ఆశీర్వదించు స్వామీ!

**అగజానన పద్మార్కం గజాననమహర్నిశం ।**
**అనేకదం తం భక్తానాం ఏకదంతముపాస్మహే ॥**

తన మీది పుత్రోత్సాహంతో, తన తల్లి, పర్వతరాజకుమారి అయిన పార్వతీదేవి ముఖమనే పద్మాన్ని సూర్యునిలా శోభించేలా చేసేవాడునూ, ఒకే దంతమున్న ఏనుగు ముఖం కలవాడునూ, భక్తులకు అనేక శుభాలను ఇచ్చేవాడునూ అయిన గణేశుణ్ణి నేను రాత్రింబవళ్ళూ స్మరిస్తాను.

**మాణిక్యవీణాం ఉపలాలయంతీం**
**మదాలసాం మంజుల వాగ్విలాసామ్ ।**
**మాహేంద్ర నీలద్యుతి కోమలాంగీం**
**మాతంగ కన్యాం మనసా స్మరామి ॥**

మణులు పొదిగిన వీణను రెండుచేతులతో లాలిస్తున్నట్టుగా పట్టుకొని, ఇంద్రనీలమణి కాంతులతో ప్రకాశించే పుష్టిగల శరీరంతో, మనోహరమైన మాటలు పలికే మాతంగ కన్యను, సరస్వతీ దేవిని మనసారా స్మరిస్తాను.

**ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైక మూర్తయే ।**
**నిర్మలాయ ప్రశాంతాయ దక్షిణామూర్తయే నమః ॥**

ఓం! ఓంకారానికి అర్థరూపంగా అవతరించి, శుద్ధజ్ఞానస్వరూపుడై, నిర్మలమైన, ప్రశాంతమైన స్వభావం కలిగిన దక్షిణామూర్తికి నమస్కరించుచున్నాము.

**వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ॥**

మాట, దాని అర్థం ఎలా విడదీయరానివిగా ఉంటాయో, అదే విధంగా ఈ జగత్తుకే తల్లిదండ్రులుగా వెలసిన పార్వతీపరమేశ్వరులను నేను పలికే శబ్దార్థాలకు మహత్వాన్ని, పటుత్వాన్ని ప్రసాదించమని కోరుతూ నమస్కరిస్తున్నాను.

**కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా**
**శ్రవణనయనజం వా మానసం వాఽపరాధమ్ ।**
**విహితమవిహితం వా సర్వమేతత్ క్షమస్వ**
**జయ జయ కరుణాబ్ధే శ్రీమహాదేవ శంభో ॥**

ఓ మహాదేవా! శంభో శంకరా! కరుణాసాగరా! చేతులతో కానీ, కాళ్ళతో కానీ, వాక్కుతో కానీ, చెవులతో కానీ, కన్నులతో కానీ, శరీరంతో కానీ, మనసుతో కానీ, తెలిసి కానీ, తెలియక కానీ చేసిన నా తప్పులన్నింటినీ క్షమించు!

**సర్వధర్మ స్థాపకస్త్వం సర్వధర్మ స్వరూపకః ।**
**ఆచార్యాణాం మహాచార్యో రామకృష్ణాయ తే నమః ॥**

అన్ని ధర్మాలలోని సత్యాన్ని సాక్షాత్కరించుకోవడం ద్వారా వాటిని నిర్ధారించి, సుస్థాపితం చేసి, వాటిని నీ స్వస్వరూపంగా చేసుకుని, ఆచార్యులకే మహాచార్యుడివిగా వెలుగొందిన ఓ రామకృష్ణా! నీకు మా నమస్సులు.

**యథాగ్నేర్ దాహికా శక్తీ రామకృష్ణే స్థితా హి యా ।**
**సర్వవిద్యా స్వరూపాం తాం శారదాం ప్రణమామ్యహమ్ ॥**

అగ్నిలో దహించే శక్తి ఎలా దాగివుంటుందో, అలాగే రామకృష్ణుని అర్ధాంగిగా అవతరించిన ఓ శారదామాతా! అన్ని విద్యల స్వరూపానివీ నీవే! నీకు మా ప్రణామములు.

**పరతత్త్వే సదాలీనో రామకృష్ణ సమాజ్ఞయా ।**
**యో ధర్మస్థాపనరతో వీరేశం తం నమామ్యహమ్ ॥**

నిరంతరం పరతత్త్వంలో లీనమై ఉండి, శ్రీరామకృష్ణుని ఆదేశం మేరకు ఈ ప్రపంచంలో ధర్మాన్ని తిరిగి స్థాపించడానికి అలుపెరగకుండా కృషి చేసిన ఓ వివేకానంద స్వామీ! నీకు మా ప్రణామములు.

**ఆర్తానాం ఆర్తిహన్తారం**
**భీతానాం భయనాశనమ్ ।**
**ద్విషతాం కాలదండం తం**
**రామచంద్రం నమామ్యహమ్ ॥**

ఆర్తులైనవారికి వారి ఆర్తిని నశింపజేసేవాడు, భయపడుతున్నవారి భయాన్ని తొలగించేవాడు, శత్రువులకు యమపాశమైనవాడు అయిన శ్రీరామచంద్రుడికి నేను నమస్కరిస్తున్నాను.

**శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపమ్ ।**
**ఆజానుబాహుం అరవిందదళాయతాక్షం**
**రామం నిశాచర వినాశకరం నమామి ॥**

దశరథుడి కొడుకుగా పుట్టి, సాటిలేనివాడైన శ్రీరాముడికి, సీతాదేవికి పతి అయిన వాడికి, రఘుకులానికి రత్నదీపమై వెలుగొందిన వాడికి, ఆజానుబాహువునకు (మోకాళ్ళను తాకే దృఢమైన చేతులు కలవాడికి), తామరపూరేకుల వంటి కన్నులు గలవాడికి, రాక్షసులను మట్టుపెట్టినవాడైన రఘురాముడికి నమస్కరించుచున్నాను.

**ప్రసన్నతాం యా న గతాభిషేకతః**
**తథానమమ్లౌ వనవాస దుఃఖతః ।**
**ముఖాంబుజశ్రీ రఘునన్దనస్య మే**
**సదాస్తు సా మంజుల మంగళప్రదా ॥**

'నీకు పట్టాభిషేకం చేయబోతున్నాము!' అని చెప్పినప్పుడు శ్రీరాముడి ముఖం సంతోషంతో వెలిగిపోకుండా ప్రసన్నంగానే ఉంది. 'లేదు! నీవు ఇప్పుడు వనవాసానికి పోవాలి!' అని చెప్పినప్పుడు కూడా అతడి ముఖం విషణ్ణం కాలేదు. అటువంటి స్థితప్రజ్ఞుడైన రఘురాముడి ముఖారవిందం మాకు సదా మంగళప్రదమైనదిగా విరాజిల్లుగాక!

**వసుదేవసుతం దేవం**
**కంసచాణూర మర్దనమ్ ।**
**దేవకీ పరమానందం**
**కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

వసుదేవుని కుమారుడు, కంసచాణూరాది రాక్షసులను సంహరించినవాడు, దేవకీదేవికి పరమానందాన్ని కలిగించినవాడు, సకలమత సారమైన భగవద్గీతను బోధించి జగద్గురువుగా వాసికెక్కిన శ్రీకృష్ణుడికి నేను నమస్కరిస్తున్నాను.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

ఉపనిషత్తులన్నింటినీ ఆవుగా చేసి, గోపాలనందనుడైన శ్రీకృష్ణుడు వాటి సారాన్ని పాలుగా పితికి, దూడవంటి అర్జునుణ్ణి నిమిత్తమాత్రునిగా చేసి, మహత్తరమైన గీతామృతాన్ని ధీరులైన మానవులకు అందించాడు.

**మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।**
**యత్కృపా తమహం వందే పరమానంద మాధవమ్ ॥**

ఎవరి కృప వలన మూగవాడు మాట్లాడగలుగుతాడో, కుంటివాడు కొండలపై నుండి దూకగలుగుతాడో, అటువంటి పరమానందదాయకుడైన శ్రీకృష్ణునికి నా ప్రణామములు.

**కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతమ్ ।**
**వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి ॥**

పద్మంవంటి చేతితో పద్మం వంటి కాలును పట్టుకొని పద్మం వంటి ముఖం దగ్గరకు లాగితెచ్చి కాలి బొటనవేలును నోటిలో ఉంచుకుని, మర్రిఆకు మీద శయనించి ఉన్న బాలకృష్ణుని మనసారా స్మరిస్తాను.

**అతులితబలధామం స్వర్ణశైలాభదేహం**
**దనుజవనకృశానుం జ్ఞానినామగ్రగణ్యమ్ ।**
**సకలగుణనిధానం వానరాణామధీశం**
**రఘుపతివరదూతం వాతజాతం నమామి ॥**

సాటిలేని బలానికి నిలయమైన వాడు, బంగారుకొండ వంటి దృఢమైన దేహం కలవాడు, రాక్షససైన్యమనే వనాన్ని నాశనం చేసినవాడు, జ్ఞానులలో అగ్రగణ్యుడు, అన్ని సుగుణాలకూ నిలయమైన వాడు, వానరులలో ముఖ్యుడు, శ్రీరాముడు మెచ్చిన దూత, వాయుపుత్రుడు అయిన హనుమంతునికి నమస్కరిస్తున్నాను.

**ఉల్లంఘ్య సింధో సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః ।**
**ఆదాయతేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాంజలిరాంజనేయమ్ ॥**

సాగరాన్ని అవలీలగా ఒక్క దుముకులో దాటి, జానకీదేవి శోకాన్ని దగ్ధం చేసి, లంకాపట్టణాన్ని తగులబెట్టిన ఆంజనేయునికి నేను అంజలి ఘటిస్తున్నాను.

**మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।**
**వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి ॥**

వాయువేగ, మనోవేగాలతో ప్రయాణించగలవాడు, ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకున్నవాడు, బుద్ధిమంతులలో అత్యున్నతుడు, వాయునందనుడు, కపిశ్రేష్ఠుడు, శ్రీరాముని దూత అయిన మహావీరునికి నేను నమస్కరిస్తున్నాను.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# పరిచయం

మన వారసత్వం మహోన్నతమైనదని ఎందుకు భావించాలి? అందులో మహోన్నతమైనది ఏమిటి? దానిని గురించి మనం ఎందుకు చదవాలి? తమ జీవితానికి సరైన గమ్యాన్నీ, తమ దేశానికి తిరిగి ఉన్నతమైన స్థితిగతులనూ కల్పించాలని తహతహలాడే నవీన భారతదేశపు యువత ఈ ప్రశ్నలకు సమాధానాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఆ ప్రశ్నలకు సమాధానంగా వివేకానంద స్వామి ఇలా చెప్పారు:

"మనిషి సమస్యలను తీర్చగలిగేది విద్య ఒక్కటే! మన దేశప్రజలకు వారు పోగొట్టుకున్న వ్యక్తిత్వాన్ని తిరిగి ఇవ్వండి! అటువంటి విద్యను నేర్పడానికి ఉద్దేశించినవే మన పురాణాలు."

"మనం ఈనాడు అభ్యసిస్తున్న విద్య వల్ల ఎంతటి ఘోరమైన దుష్ప్రభావాలు కలుగుతున్నాయంటే వాటివల్ల ఆ విద్యలో ఏ కొంచెమైనా మంచి ఉంటే అది నీరుగారిపోతోంది. అది వ్యక్తిత్వాలను నిర్మించే విద్య కాదన్న విషయాన్ని మనం అన్నిటికన్నా ముందుగా చెప్పుకోవాలి. వినాశకరమైన విద్య కన్నా మరణమే మేలు!"

"ఒక పిల్లవాడు బడికి వెళ్ళినప్పుడు అన్నిటికన్నా ముందు తన తండ్రి ఒక తెలివితక్కువవాడని నేర్చుకుంటాడు. ఆ తర్వాత తన తాత ఒక పిచ్చివాడనీ, తన గురువులందరూ ఆత్మవంచకులనీ, ఆపైన మన పవిత్రమైన శాస్త్రాలన్నీ పుక్కిటిపురాణాలనీ నేర్చుకుంటాడు. ఇక పదహారేళ్ళు వచ్చేసరికి జీవమూ, వెన్నెముకా లేకుండా అతడొక వ్యతిరేకభావాల పుట్టగా తయారవుతాడు."

"ఇటువంటి విద్య యొక్క ఫలితం ఏమిటంటే, ఈ దేశపు మూడు ప్రెసిడెన్సీలలోనూ కలిపి చూసినా, సొంతభావాలు కలిగిన మనిషి గత ఏభైయేళ్ళలో ఒక్కడు కూడా తయారుకాలేదు. (ఇది స్వామీజీ 1890 దశకంలో చెప్పినమాట.) అటువంటి వాడు ఎవరైనా తయారయివుంటే వాడు ఈ దేశంలో విద్య నేర్చినవాడు కాక వేరే ఎక్కడో విద్యనేర్చుకున్నవాడే. లేకపోతే ఈ కొత్త విద్యవల్ల సోకుతున్న మూఢనమ్మకాలను వదిలించుకోవడానికి తిరిగి మన పాత విశ్వవిద్యాలయాలకు వెళ్ళి విద్యను అభ్యసించినవారు మాత్రమే సొంతభావాలు కలిగినవారుగా తయారయ్యారు."

"ఎంతోకొంత సమాచారాన్ని మెదడులోకి దట్టించుకుని, అది ఎప్పటికీ జీర్ణంకాక, జీవితమంతా గందరగోళాన్ని సృష్టిస్తూ ఉంటే, అలాంటి దాన్ని విద్య

అని అనలేము. జీవంపోసే భావాల్ని, పౌరుషంగల మనుష్యుల్ని తయారుచేసే ఆశయాలను, మంచి స్వభావాన్ని నిర్మించే ఆలోచనలను మనం ఆకళింపు చేసుకోవాలి. మీరు అటువంటి ఐదు ఆలోచనలను ఆకళింపు చేసుకుని, వాటినే మీ జీవితంగా, శీలంగా మలచుకుంటే ఒక గ్రంథాలయం మొత్తాన్ని కంఠస్థం చేసినవాడికన్నా మీకు ఎక్కువ విద్య అబ్బిందని చెప్పవచ్చు."

**'యథా ఖరశ్చందన భారవాహీ భారస్య వేత్తా న తు చందనస్య'**

"గంధపు చెక్కలను మోస్తున్న గాడిదకు వాటి బరువు మాత్రమే తెలుస్తుంది, కానీ వాటి విలువ తెలియదు"

"ఒక మనిషి కొన్ని పరీక్షలలో ఉత్తీర్ణుడై, మంచి ఉపన్యాసాలు ఇవ్వగలిగితే చాలు, మీరు అతణ్ణి చదువుకున్నవాడని, విద్యాధికుడని పరిగణిస్తారు. ఏ విద్య అయితే సామాన్య జనావళిని తమ జీవనపోరాటానికి సమాయత్తం చెయ్యలేదో, ఏ విద్య బలమైన సత్-శీలాన్ని పెంపొందించదో, సాటి మానవుల్ని ప్రేమించే శక్తినీ, సింహసదృశమైన ధైర్యాన్నీ ఇవ్వదో - అటువంటి దాన్ని విద్య అనగలమా? నిజమైన విద్య మనిషిని తన కాళ్ళమీద తాను నిలబడేలా చెయ్యగలగాలి. ఈ రోజున మీరు పాఠశాలల్లో, కళాశాలల్లో నేర్చుకుంటున్న చదువు మిమ్మల్నొక అజీర్ణరోగుల జాతిగా మార్చివేస్తోంది. మీరు యంత్రాలలాగా జీవిస్తూ, కేవలం జెల్లీచేపలలాగా బ్రతుకీడుస్తున్నారు."

"ఏ విద్యవల్ల మంచి స్వభావం రూపొందుతుందో, మనోబలం పెంపొందుతుందో, బుద్ధి విశాలమవుతుందో, ఏ విద్య ద్వారా మనిషి తన కాళ్ళ మీద తాను నిలబడగలుగుతాడో అటువంటి విద్య మనకు కావాలి."

"ఎంతకాలం పాటు హిందూజాతి తన పూర్వీకులు అందించిన ఈ గొప్ప వారసత్వాన్ని మర్చిపోకుండా ఉంటుందో అంతవరకూ ఈ భూమి మీద ఉన్న ఏ శక్తీ దాన్ని నాశనం చెయ్యలేదు."

"భారతదేశపు ముద్దుబిడ్డలారా! మనం ఆచరణలో పెట్టవలసిన కొన్ని విషయాలను గురించి నేను మీకు చెపుతాను. గతించిన కాలంలోకి వెనుతిరిగి చూడడంవల్ల మరింత దిగజారడం తప్ప ఒరిగేదేమీ ఉండదనీ, అందుచేత మనం భవిష్యత్తులోకే దృష్టి సారించాలనీ, నాకు చాలామంది చాలాసార్లు చెప్పారు. అది నిజమే కానీ, గతించిన కాలం నుండే భవిష్యత్తు నిర్మించబడుతుందని మనం మరచిపోకూడదు. కాబట్టి ఎంత దూరం వీలైతే అంత దూరం, గతంలోకి చూడండి. అనాదిగా పైకి ఎగజిమ్ముతున్న ఆ అమృతజలాలను నిండుగా త్రాగండి. ఆ తర్వాత మీ దృష్టిని ముందుకు సారించి, ముందుకు కదం తొక్కండి! భారతదేశాన్ని మరింత ఉజ్జ్వలమైనదానిగా, గొప్పదానిగా, మునుపు ఎన్నడూ

లేనంత ఉన్నతమైన దానిగా తీర్చిదిద్దండి! మన పూర్వీకులు ఎంతో గొప్పవారన్న విషయాన్ని ముందు మనం గుర్తు చేసుకోవాలి. మన పుట్టుకకు మూలాలు ఏవో, మన రక్తనాళాలలో ప్రవహిస్తున్న రక్తం ఎటువంటిదో, ముందు మనం తప్పక తెలుసుకోవాలి. ఆ రక్తం ద్వారా మనకు సంక్రమించిన వారసత్వంలోనూ, గతంలో అది సాధించిన ఘనతలోనూ మనకు విశ్వాసం ఉండితీరాలి. ఆ విశ్వాసంలో నుంచి, గత వైభవాన్ని గురించిన జ్ఞానంలో నుంచి, ఇంతకు మునుపు ఎన్నడూ లేనంత గొప్ప భారతదేశాన్ని మనం నిర్మించాలి!"

"ఇతర దేశాలకు వ్యాపించడానికి ముందే ఆధ్యాత్మిక జ్ఞానం సనాతనమైన ఈ దేశాన్ని తన మాతృభూమిగా చేసుకుంది. సముద్రమంత వెడల్పుతో పారే ఇక్కడి నదులూ, ఒకదాన్నొకటి తలదన్నే అత్యున్నత హిమశిఖరాలతో ఆ స్వర్గలోకాల రహస్యాలలోకే తొంగిచూస్తున్నాయా అన్నట్లు పైకిలేచే అనాదియైన హిమాలయాలూ, ఈ భారతదేశంలో వెల్లువెత్తిన ఆధ్యాత్మిక ప్రవాహాలకు మన కళ్ళ ముందు తారాడే ప్రతిరూపాలుగా అగుపిస్తున్నాయి. భూమి మీద నివసించిన ఋషులందరి కంటే మహోన్నతులైన ఋషులు ఈ భారతదేశపు గడ్డమీదే తిరుగాడారు. మానవుని స్వభావాన్ని గురించీ, మనిషి యొక్క లోపలి ప్రపంచాన్ని గురించీ ఇక్కడే మొట్టమొదటిసారిగా ప్రశ్నలు ఉదయించాయి. ఆత్మకు చావులేదన్న సిద్ధాంతాలు; పైనుండి అజమాయిషీ చేసే భగవంతుడు ఒకడున్నాడన్న భావం; ప్రకృతిలోనూ, మనిషిలోనూ అంతర్గతంగా ఉండే దేవుణ్ణి గురించిన భావం; ఇక్కడే మొదటిసారిగా వెలుగు చూశాయి. ఇక్కడే అత్యున్నత మతాదర్శాలు, తత్త్వశాస్త్రం వాటివాటి సర్వోత్కృష్ట స్థాయిలను అందుకున్నాయి. ఆధ్యాత్మికత, తత్త్వశాస్త్రం పెను ఉప్పెనలలాగా ఈ దేశం నుంచే మాటిమాటికీ ఉప్పొంగి, ప్రపంచాన్ని ముంచెత్తాయి. దినదినం పతనమవుతున్న జాతులకు ప్రాణం పోసి, వారిలో కొత్త ఉత్తేజాన్ని నింపడానికి మరొకసారి ఈ దేశం నుంచే అటువంటి ఉప్పెనలు వెలువడి తీరాలి. శతాబ్దాల తరబడి వందలాది పరాయి దేశాల దండయాత్రల వలన, ఈ దేశపు ఆచార, వ్యవహారాలు వందలసార్లు తల్లక్రిందులైనందువలన తగిలిన బలమైన దెబ్బలను ఈ భారతదేశమే తట్టుకుని నిలబడింది. (మన పూర్వీకుల నిస్వార్థమైన, ధర్మబద్ధమైన ప్రవర్తనయే మన సమాజం యుగయుగాలు గా మనుగడ సాగించడానికి కారణం.) మన దేశపు జవసత్త్వాలు నాశనానికి అతీతమైనవి. దాని ఉత్తేజం అలుపెరుగనిది. ప్రపంచంలోని మరే ఇతర దేశం కన్నా సుస్థిరంగా, చెక్కుచెదరకుండా, పర్వతశిఖరంలాగా నిలబడింది మన దేశమే. ఆది–అంతం లేని అమరమైన ఆత్మకు ఉండే స్వభావాన్నే మన భారతదేశం కూడా కలిగివుంది. అటువంటి దేశం యొక్క ముద్దుబిడ్డలం మనం!"

మహానుభావులైన మన పూర్వీకులు మనకు అందించిన వారసత్వమే మన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు. వాటిలోని కొన్ని కథలను మనం ఈ పుస్తకంలో చదువబోతున్నాము. అయితే, "వాటిని మనం అసలు ఎందుకు చదవాలి?" అన్న సందేహానికి వివేకానంద స్వామి ఇచ్చిన వివరణ ఏమిటో తెలుసుకుందాము:

"ప్రతి పురాణానికీ ఏదోవొక చారిత్రకమైన నిజం కేంద్రంగా నిలుస్తుంది. (శ్రుతులలో బోధించబడిన) సులువుగా అర్థం కాని మహోన్నతమైన, అతిసూక్ష్మమైన సత్యాలను రకరకాల పద్ధతులలో మానవాళికి బోధించడమే పురాణాల లక్ష్యం. ఈ పురాణాలలో ఒకవేళ ఎటువంటి చారిత్రకమైన నిజం లేకపోయినా అవి మనకు నేర్పగలిగే అత్యున్నత సత్యాలవల్ల అవి గొప్ప సాధికారికతను సంతరించు కున్నాయి. రామాయణాన్నే ఉదాహరణగా తీసుకోండి. శీల-నిర్మాణాన్ని నేర్పడానికి ఆ పురాణాన్ని గొప్ప సాధికారికత కలదానిగా చూస్తున్నాం. ఇలా చూడడానికి రాముడనేవాడు పూర్వం ఒకనాడు జీవించి ఉండవలసిన అవసరం ఏమాత్రం లేదు. రామాయణ మహాభారతాలలో ప్రతిపాదించబడిన మహత్తరమైన ధర్మసూక్ష్మాల నియమాలు రాముడు, కృష్ణుడు మొదలైన వ్యక్తులు నిజమైనవారా, కాదా అన్న సత్యం మీద ఎంతమాత్రం ఆధారపడవు. అటువంటి వ్యక్తులు చరిత్రలో ఎప్పుడూ జీవించి ఉండకపోయినా సరే, వారి గురించి వ్రాయబడిన ఆ గ్రంథాలు మానవాళి ముందు ఉంచే ఉన్నత ఆదర్శాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని గొప్ప సాధికారికత కలిగినవిగా పరిగణించవచ్చు. పురాణాలలోని సత్యాలను గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడానికి, ఆ పురాణాలలోని పాత్రలు ఆయా సమయాలలో నిజంగా జీవించారా, లేక ఆ పాత్రలు కేవలం కల్పితాలా అని ప్రశ్నించుకోవలసిన పని మనకు లేదు. మానవాళికి విద్య నేర్పడమే పురాణాల లక్ష్యం. ఆ పురాణాలను వ్రాసిన ఋషులు కొన్ని చారిత్రక వ్యక్తిత్వాలను కల్పించి, వాటి మీద తమకు నచ్చినట్లు అత్యుత్తమమైన లేదా అతినీచమైన లక్షణాలను ఆపాదించారు. వాటి ఆధారంగా మానవాళి ఎలా నడుచుకోవాలో చెప్పే నైతిక నియమావళిని రూపొందించారు."

అలా స్వామీజీ చెప్పిన సమాధానం మన అనుమానాలను నివృత్తి చేస్తుంది. ఆయన చెప్పిన పరిష్కారం మనకు శిరోధార్యమవుతుంది. ఆయన చెప్పినట్టుగా మహోన్నతులైన మన పూర్వీకుల కథలను తెలుసుకోవడం ద్వారా మనం కూడా అటువంటి ఉన్నతిని సాధించాలి.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# పురాణ కథలు

## 1. భగీరథుడు

శ్రీరాముడి పూర్వీకులలో సగరుడు అనే రాజు ఉండేవాడు. అతడికి కేశిని, సుమతి అనే ఇద్దరు భార్యలు ఉన్నా సంతానం కలుగలేదు. సంతానం కోసం అతడు హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేశాడు. భృగుమహర్షి అతణ్ణి చూసి సంతోషించి, "నీకు సంతానం కలుగుతారు. నీ భార్యలలో ఒకరికి ఒక్కడే కొడుకు కలుగుతాడు. అతడి వలన నీ వంశం నిలబడుతుంది. రెండవ భార్య ద్వారా నీకు మహాబలిష్ఠులైన అరవైవేలమంది కొడుకులు పుడతారు" అని దీవించాడు. ఆ విధంగా కేశినికి అసమంజసుడు అనే కొడుకు జన్మించాడు. సుమతికి జన్మించిన ఒకే పిండం అనేకంగా విభజన చెంది, అందులో నుంచి అరవై వేలమంది మహాబలిష్ఠులైన కొడుకులు కలిగారు.

కాలక్రమంలో ఆ అరవైవేలమంది అందమైన, బలిష్ఠులైనవారిగా తయారైతే, అసమంజసుడు మాత్రం మతిభ్రమించినవాడుగా, క్రూరుడుగా తయారయ్యాడు. అతడు చిన్నపిల్లలను నదిలోకి విసిరివేసి వారు గిలగిలా తన్నుకుంటూ, మునిగి చనిపోతుంటే వికటంగా నవ్వుతూ ఉండేవాడు. అటువంటి ప్రజాకంటకుడు తనకు కొడుకైనందుకు సగరుడు ఎంతో దుఃఖించి, వాణ్ణి దేశం నుంచి బహిష్కరించాడు. ప్రజల మేలు కోసం ప్రాణాలనే పణంగా పెట్టే సగరుడిలాంటి రాజు, తన కొడుకే అయినప్పటికీ ప్రజాకంటకుడైనవాడి మీద జాలి తలచడు కదా! ఇటువంటి పాలకులు ఈనాడు మనకు ఎంతైనా అవసరం. అయితే, అప్పటికే అసమంజసుడికి అంశుమంతుడు అనే ఒక కొడుకు కలిగాడు. అతడు తండ్రి బుద్ధులకు వ్యతిరేకంగా, గొప్ప ధైర్యశాలిగా, సద్గుణాల రాశిగా ఎదిగాడు.

సగరుడు అశ్వమేధయాగాన్ని తలపెట్టాడు. ఈ యాగంలో ఒక గుర్రాన్ని దేశాల మీదికి వదిలిపెడతారు. దాన్ని యజ్ఞాశ్వం అంటారు. అది ఏయే దేశాలలో తిరుగుతుందో అక్కడి రాజులు, ఆ యాగం చేసే రాజుకు దాసోహమని, అతణ్ణి తమ చక్రవర్తిగా అంగీకరించాలి. అలా కాని పక్షంలో ఆ రాజుతో యుద్ధం చెయ్యాలి. ఆ యుద్ధంలో ఓడిపోతే ఆ రాజు కోరినంత ధనాన్ని ఇచ్చి, గుర్రాన్ని కూడా విడిచిపెట్టాలి. అలా ప్రపంచమంతా తిరిగి వచ్చిన యజ్ఞాశ్వంతో యజ్ఞాన్ని పూర్తి చేస్తారు. ఈ యజ్ఞం చేసిన వాడికి గొప్ప శక్తులు లభిస్తాయి.


అయితే మానవులకు ఇలాంటి శక్తులు లభించడం దేవతలకు ఇష్టం ఉండదు. అందుచేత ఇంద్రుడు ఆ అశ్వాన్ని అపహరించి పాతాళలోకంలో కపిలమహాముని ఆశ్రమంలో విడిచిపెట్టాడు.

ఆ యజ్ఞాశ్వం మాయమైపోయేసరికి సగరుడు చాలా ఆందోళన చెందాడు. యజ్ఞం మధ్యలో ఆగిపోవడం అమంగళకరమే కాక అవమానకరం కూడా. సుమతి కొడుకులైన అరవైవేలమంది మహాబలులైన రాకుమారులను దాన్ని వెతికితేవడం కోసం పంపించాడు. వారు ప్రపంచమంతా గాలించినా ఆ గుర్రం దొరకలేదు. ఆ గాలింపులో వారు మంచీచెడూ చూడకుండా ఎదురుపడిన వారందరినీ వేధించి, ప్రతివొక్కరికీ కోపం తెప్పించారు. చివరికి వారు భూమిని త్రవ్వి పాతాళలోకంలోకి ప్రవేశించారు. అక్కడ కపిల మహాముని ఆశ్రమంలో వారికి యజ్ఞాశ్వం కనిపించింది. సగరుని పుత్రులు ఆయనే దాన్ని దొంగిలించి తెచ్చాడనుకుని, "యజ్ఞాశ్వాన్ని దొంగిలించింది కాక, ఇక్కడ తపస్సు చేసుకునే వాడిలాగా వేషం వేశావా?" అంటూ ఆయనను పట్టుకోబోయారు. దీంతో ఆయన తపస్సు భగ్నమైంది. తన తపస్సును ఆటంకపరుస్తున్న వారి మీద కోపించిన ఆ మహర్షి ఒక్క చూపుతో ఆ అరవై వేలమందినీ బూడిదగా మార్చేశాడు.

ఎంతకాలం గడిచినా తన పుత్రులు తిరిగిరాకపోవడంతో సగరుడు ఆందోళన చెంది, మనుమడైన అంశుమంతుణ్ణి పిలిచి, 'నాయనా! నీవు బుద్ధిమంతుడివి, పరాక్రమవంతుడివి. నీవు ఆయుధాలు ధరించి వెళ్ళి ఆ యజ్ఞాశ్వం ఎక్కడ ఉన్నా వెతికి తీసుకురా!" అని పంపాడు. అంశుమంతుడు పినతండ్రులలాగా దర్పాన్ని ప్రదర్శించకుండా దారిపొడవునా అందరికీ మర్యాద చూపిస్తూ ముందుకుసాగాడు. తన పినతండ్రుల అడుగుజాడలను జాగ్రత్తగా వెతుకుతూ చివరకు పాతాళ లోకానికి చేరి, అక్కడ కపిల మహాముని ఆశ్రమంలో యజ్ఞాశ్వంతో పాటు గుట్టలుగా పడివున్న బూడిదను చూశాడు. అక్కడ తపస్సు చేసుకుంటూ ఉన్న కపిలుణ్ణి చూసి, భక్తితో నమస్కరించాడు. అంశుమంతుడి భక్తికి మెచ్చి కపిలుడు, "నాయనా! బుద్ధిహీనులైన నీ అరవైవేలమంది పినతండ్రులు నా తపస్సును భగ్నం చేశారు. నా తపశ్శక్తితో వారు భస్మం కాగా మిగిలిన బూడిద ఇదంతా. వీరికి పుణ్యలోకాలు కలగాలంటే దేవలోకంలో ఉన్న గంగాదేవిని భూమి మీదకు తీసుకురావాలి. భూమి నుంచి ఆమెను పాతాళానికి తెచ్చి, ఆ గంగాజలంతో ఈ బూడిదను తడపాలి. నీవు సుగుణశీలుడివి! ముందు ఆ యజ్ఞాశ్వాన్ని తీసుకుపోయి యాగాన్ని పూర్తి చేయించు! ఆ తర్వాత గంగను భూమి మీదకు తేవడానికి ప్రయత్నించు!" అని చెప్పాడు. అంశుమంతుడు తీసుకువచ్చిన యజ్ఞాశ్వంతో సగరుడు యాగాన్ని పూర్తిచేయగలిగినా, తన పుత్రుల మరణానికి ఎంతగానో దుఃఖించాడు. సగరుడి మనుమడైన అంశుమంతుడు, అతని కొడుకు దిలీపుడు అన్ని విధాలా గొప్పవారే అయినప్పటికీ దేవలోకంలోని గంగను భూమి మీదకు తేలేకపోయారు. దిలీపుడి కొడుకైన భగీరథుడు రాజ్యసింహాసనమెక్కి, తనకు

సంతానప్రాప్తి కోసం, గంగానదిని భూతలం మీదకు తేవడం కోసం గోకర్ణానికి వెళ్ళి తపస్సు ప్రారంభించాడు. అతడు చేసిన ఘోరమైన తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమన్నాడు. భగీరథుడు తన రెండు కోరికలనూ వెల్లడించాడు. బ్రహ్మ అతడి రెండు కోరికలనూ అనుగ్రహించాడు. అయితే, 'గంగానది దేవలోకం నుండి నేరుగా భూమి మీద పడితే భూమి భరించలేదు కాబట్టి ఆ ప్రవాహాన్ని అడ్డుకునేందుకు సహాయపడమని మహాదేవుడైన పరమశివుణ్ణి ప్రార్థించు! ఆయన మాత్రమే ఆ నదీప్రవాహాన్ని భరించగలడు' అని చెప్పాడు.

భగీరథుడు మళ్ళీ ఘోరమైన తపస్సు చేసి పరమశివుణ్ణి మెప్పించాడు. ఆయన సహాయం చేస్తానని మాట ఇవ్వడంతో బ్రహ్మ గంగానదిని భూలోకానికి దిగమన్నాడు. కానీ గంగాదేవి మనస్సులో అహంకారం ప్రవేశించి, తన



ప్రవాహంలో శివుణ్ణి కూడా లాగుకొనిపోవాలనుకుని, మహావేగంతో క్రిందకు రాసాగింది. అయితే శివుడు ఆమె మనస్సులోని ఆలోచనను కనిపెట్టి ఆ ప్రవాహం మొత్తాన్ని తన జటాజూటంలో చిక్కుకునేలా చేసి, ఒక్క చుక్క కూడా బయటకు పోకుండా ఆపివేశాడు. దీనితో గంగానది అహంకారం అణిగింది. కానీ భగీరథుడు అనుకున్న పని మధ్యలోనే ఆగిపోయింది. అతడు మళ్ళీ తన తపస్సుతో శివుణ్ణి మెప్పించవలసి వచ్చింది. అయితే అతడి చిత్తశుద్ధికి మెచ్చిన శివుడు గంగను కొద్దికొద్దిగా బిందుసరస్సులో వదిలిపెట్టాడు. ఆ విధంగా గంగ భూమిని చేరి, పాతాళలోకం వైపు ప్రవహించడం మొదలుపెట్టింది.

భగీరథుడు ముందు దారిచూపుతూ ఉంటే, గంగ అతణ్ణి అనుసరించసాగింది. అయితే దారిలో జహ్ను మహర్షి ఆశ్రమాన్ని ముంచెత్తి, అక్కడి యజ్ఞకుండాన్ని ధ్వంసం చేసింది. దానితో ఆ మహర్షి మొత్తం నదినే ఆపోశన పట్టి తాగేశాడు. దీనితో భగీరథుడి కథ మళ్ళీ మొదటికి వచ్చింది. అతడు ఆ మహర్షిని వేడుకుంటే ఆయన కరుణించి గంగానదిని తన కుడిచెవి ద్వారా బయటకు వదిలాడు. ఆయన శరీరంలో నుంచి అలా బయటకు వచ్చింది కాబట్టి గంగకు 'జాహ్నవి' అనే పేరు వచ్చింది. అక్కడ నుంచి ఆ నది సముద్రాన్ని చేరి, అక్కడ నుంచి పాతాళంలో ఉన్న సగరపుత్రుల బూడిదను తడిపింది. దానితో వారికి దివ్యలోకాలు కలిగాయి. భగీరథుడి మహోజ్జ్వలమైన యత్నం వల్ల భూమిమీద అవతరించింది కాబట్టి గంగకు 'భాగీరథీ' అన్న పేరు కూడా వచ్చింది.


భగీరథుడు ఏ విధంగా విసుగు చెందకుండా, మొక్కవోని ఉత్సాహంతో పని చేశాడో మనం చూడవచ్చు. అలా ఉద్యమించి పనిచేయడానికి 'భగీరథప్రయత్నం' అనే నానుడి కూడా లోకవ్యాప్తమయింది.

భగీరథుడి కథను మనం మరొక విధంగా కూడా అర్థం చేసుకోవచ్చు. మన కోరికలకు బ్రహ్మాండమైన శక్తి ఉందని మనం ఎల్లప్పుడూ గుర్తెరగాలి. అది మంచికైనా కావచ్చు, చెడుకైనా కావచ్చు. అంటే అవి మానవాళికి మేలు చేయవచ్చు లేదా వినాశనాన్ని కొనితేవచ్చు. దివి నుండి భువికి గంగను తేవాలనే భగీరథుడి కోరిక వలన కూడా బహుశా ప్రపంచం నాశనం అయివుండేదేమో! కానీ అతడు సర్వమానవాళి శ్రేయస్సును మనసులో ఉంచుకుని తాను చేసే పని వలన మంచి ఫలితం మాత్రమే కలగాలని హృదయపూర్వకంగా కోరుకున్నాడు. అందుచేతనే అతడి కోరిక వలన ప్రపంచానికి మేలు జరిగింది.

మనం కూడా జీవితంలో కొన్ని విషయాలను కోరుతాము. వాటికోసం మన మనస్సు తహతహలాడుతుంది. ఆ కోరికల వలన మంచి ఫలితాలు కలుగవచ్చు లేదా చెడు ఫలితాలు రావచ్చు. అయితే గంగ వేగానికి భూమి తట్టుకోలేనట్టు, మన

కోరికలు తీరినా, తీరకపోయినా, తద్వారా కలిగే మానసిక పరిణామాల ఉద్ధృతిని మనం తట్టుకోలేము. అందువలననే జీవితంలో మనకు కలిగే కోరికలను భగవంతుడికి అర్పించాలి. అప్పుడు పరమశివుడు గంగను నిరోధించినట్టు భగవంతుడు మన కోరికల వల్ల కలిగే రకరకాల ఫలితాలను తట్టుకునే శక్తిని మనకు ఇస్తాడు.

ఉదాహరణగా అణుశక్తిని తీసుకోండి. మానవుడు అణుబాంబును పరుల వినాశనాన్ని కోరి, తయారుచేశాడు. దాని పర్యవసానంగా హిరోషిమా, నాగసాకి నాశనమవ్వడమే కాక, ఇప్పుడు మనిషి తయారుచేసి కుప్పలుపోసిన మరింత శక్తిమంతమైన అణుబాంబుల వలన ఏ రోజు ఏ ప్రమాదం



ముంచుకువస్తుందో అని మొత్తం మానవాళి బిక్కుబిక్కుమంటూ జీవిస్తోంది. శాంతియుతమైన ప్రయోజనాల కోసం అణుశక్తిని ఉపయోగిస్తే కలిగే మంచి ఫలితాలు కూడా మనకు తెలుసు.

భగవంతుడి మీద భక్తితో, అంటే తాను కోరే కోరిక లేదా తాను చేసే ప్రయత్నం అందరికీ ఉపయోగపడాలన్న ఆలోచనతో మనిషి పనిచేస్తే ఎటువంటి విపరీతమైన ఫలితాలూ కలుగవు. 'స్వదేశో భువనత్రయం' – 'మూడులోకాలూ నాకు స్వదేశమే' అని చెప్పినట్టు ఎల్లప్రపంచం నాదే అనుకుని మనిషి ప్రవర్తించాలి.

మన ప్రవర్తన  ఎలా ఉండాలన్న విషయాన్ని కూడా ఈ కథ నుంచి మనం నేర్చుకోవచ్చు. సుమతి పుత్రులైన అరవైవేలమందికి కన్నూమిన్నూ కానక ప్రవర్తించడం వల్ల ఎటువంటి గతి పట్టిందో, అన్నిచోట్లా మర్యాదగా ప్రవర్తించిన అంశుమంతుడు ఎలా విజయం సాధించాడో మనం ఈ కథలో చూశాము.

ఇక్కడ వివేకానంద స్వామి చెప్పిన ఒక బోధనను మనం గుర్తుచేసుకోవచ్చు. "ప్రపంచంలోని వివిధజాతులు కోరికలను తీర్చుకోవడం ద్వారా అనంతమైన ఆనందాన్ని పొందాలని ప్రయత్నించాయి. కానీ ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ధనం కోసం, అధికారం కోసం ప్రాకులాడుతూ, దానిలోనుంచి పుట్టుకొచ్చిన చెడునూ, బాధలనూ భరించలేక ఆ నాగరికతలన్నీ అంతరించిపోయాయి. ఈ ఆధునికకాలంలో కూడా అదే పద్ధతిలో పయనిస్తున్న కొన్ని జాతులు నేడోరేపో కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్నాయి. శాంత స్వభావం, యుద్ధోన్మాదం – వీటిలో ఏది నెగ్గుతుంది; అలాగే ఓరిమి, అసహనాలలో ఏది నెగ్గుతుంది; మంచితనం, దుష్టస్వభావాలలో ఏది నెగ్గుతుంది; బుద్ధిబలం, బాహుబలాలలో ఏది నెగ్గుతుంది; ప్రాపంచికత, ఆధ్యాత్మికతలలో ఏది నెగ్గుతుంది; అన్న విషయాన్ని ఆయా జాతులు ఇంకా తేల్చుకోలేకుండా ఉన్నాయి. కానీ మనం యుగాల క్రితమే ఈ ప్రశ్నకు తిరుగులేని సమాధానాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటాము. మనం ఇచ్చిన సమాధానం వైరాగ్యం. యుగయుగాలుగా మనదేశం మాత్రమే దీనిని ఆచరణలో చూపింది. ప్రపంచదేశాలలో మన దేశాన్ని సముచితస్థానంలో నిలబెట్టి, మన దేశపు మనుగడకు సార్థకతను ఇచ్చేది ఈ వైరాగ్యమనే భావనయే. ఆ వైరాగ్యమే మన దేశం పాడిన అనంతగీతాల సందేశం, మన దేశానికి వెన్నెముక. మన దేశపు ఉనికికే అది కారణం."

కాబట్టి మనం కూడా మన పూర్వీకుల గొప్పతనాన్ని సాధించడానికి వారి వైరాగ్యబుద్ధిని అలవరచుకోవాలి. దానివల్లనే ఈ ప్రపంచంలో శాంతిసౌఖ్యాలు వెల్లివిరుస్తాయి.

✦ ✦ ✦ ✦ ✦

## 2. గరుత్మంతుడు

దక్షప్రజాపతి పదమూడుమంది కుమార్తెలను బ్రహ్మమానస పుత్రుడైన మరీచి మహర్షి సుతుడు కశ్యపప్రజాపతి వివాహమాడాడు. దేవతలకూ, రాక్షసులకూ, జంతుసామ్రాజ్యానికీ ఆదిపురుషుడు కశ్యపుడే. ఒకరోజు అతడు తన భార్యలలో కద్రువ, వినత అనే ఇద్దరిని పిలిచి, "మీకు వరమిస్తాను. మీకు ఎలాంటి సంతానం కావాలో కోరుకోండి!" అన్నాడు. కద్రువ వెంటనే, "నేను వేయిమంది బ్రహ్మాండమైన సర్పాలకు తల్లిని కావాలి!" అని కోరుకుంది. వినత, "నాకు ఇద్దరు పుత్రులు కావాలి. అయితే వారు కద్రువ సంతానం కన్నా బలవంతులై ఉండాలి" అని కోరింది. కశ్యపుడు 'తథాస్తు!' అని దీవించి, ఈ కోరికలను తీర్చడానికి అవసరమైన యజ్ఞాన్ని చేయడానికి వెళ్ళాడు. ప్రక్కవారికన్నా గొప్పగా ఉండాలనుకునే ఆ కద్రువ, వినత ఇద్దరూ అసూయకు బానిసలు. ఆ అసూయ వల్లనే వారికీ, వారి బిడ్డలకూ అనేక కష్టాలు కలిగాయి.

ఇంద్రాదిదేవతలు కశ్యపుడికి అదితి అనే భార్యవల్ల కలిగిన పుత్రులు. ఇంద్రుడు ఇతర దేవతలతో కలసి కశ్యపుడి వద్దకు వచ్చి, "తండ్రీ! తమరు చేసే యజ్ఞంలో తమకు సహాయంగా మమ్మల్ని ఏమి చేయమంటారు?" అని అడిగాడు. బొటనవ్రేలంత చిన్నచిన్న శరీరాలుగల వాలఖిల్యులనే ఋషులు కూడా యజ్ఞాన్ని నిర్వహించడానికి వచ్చారు. కశ్యపుడు వారితో, "మీరందరూ యజ్ఞానికి కావలసిన సమిధలు (కట్టెలు) తీసుకురండి!" అని చెప్పి పంపాడు. ఇంద్రుడు పర్వతమంత మొత్తంలో సమిధల్ని ఒంటి చేతితో తెస్తూ ఉంటే, వాలఖిల్య ఋషులు చిన్న కొమ్మను మోసుకురావడానికి ఆయాసపడుతూ కనిపించారు. ఇంద్రుడు వాళ్ళను చూసి అవహేళనగా నవ్వాడు. దానితో వారికి కోపం వచ్చి, "ఈ ఇంద్రుడి గర్వం అణచాలి!" అనుకున్నారు.

యజ్ఞం మొదలైంది. వాలఖిల్యులు మంత్రాలు చదువుతూ, "మా తపఃఫలం మొత్తాన్ని ధారపోస్తున్నాము. ఈ ఇంద్రుడికి ప్రతిగా మరొక ఇంద్రుడు జన్మించు గాక! అతడు సంకల్పమాత్రం చేత ఎక్కడికయినా వెళ్ళగలవాడై ఉండాలి. తన సంకల్పం చేతనే ఎంత బలాన్నయినా, ఏ రూపాన్నయినా పొందగలిగి ఉండాలి" అని మంత్రాలు చదివారు. ఇది చూసి గాభరా పడిన ఇంద్రుడు పరుగెత్తిపోయి, కశ్యపుడితో మొరపెట్టుకున్నాడు. కశ్యపుడు వాలఖిల్య ఋషులతో, "మీరు కొత్తగా సృష్టించిన ఇంద్రుడు పక్షులకు రాజు అంటే పక్షీంద్రుడవుతాడు. ఈ ఇంద్రుణ్ణి స్వయంగా బ్రహ్మదేవుడే నియమించాడు కదా! అర్ధాంతరంగా అతణ్ణి తొలగించడం బాగుండదు. తన తప్పు కాయమని మిమ్మల్ని వేడుకుంటున్నాడు కనుక అతణ్ణి క్షమించండి!" అని కోరాడు.

వాలఖిల్య ఋషులు శాంతించి, 'ఓ కశ్యపా! సంతానాన్ని కోరి ఈ యజ్ఞం చేశావు కాబట్టి, నీవు కోరిన విధంగా నీకు సంతానం లభిస్తుంది" అని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. కొన్ని నెలలకు వినత రెండు గుడ్లను కన్నది. కద్రువ వెయ్యి గుడ్లను కన్నది. వాటిని వారిరువురూ సంరక్షించసాగారు.

సంవత్సరాలు గడిచాయి. ఆ తల్లులిద్దరూ ఆ గుడ్లలో నుంచి తమ సంతానం ఎప్పుడు బయటికి వస్తారా అని ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఒకరోజున కద్రువకు పుట్టిన వెయ్యి గుడ్లు పగిలి, వాటిలో నుంచి వెయ్యి నాగులు పుట్టారు. కద్రువ ఆనందానికి మేరలేదు. ఇది చూసి వినతకు ఎక్కడలేని ఈర్ష్య కలిగింది. ఉండబట్టలేక తన రెండు గుడ్లలో ఒక గుడ్డును పగలగొట్టి చూసింది. అందులో ఒక పిల్లవాడు కనిపించాడు. అతడి పేరు అనూరుడు. అయితే ఆ గుడ్డును తొందరపడి పగలగొట్టడం వలన వాడికి సగం శరీరమే ఏర్పడింది. మిగిలిన శరీరం మాంసం ముద్దలాగా ఉన్నది. ఇది చూసి ఆమెకు దిగ్భ్రాంతి కలిగింది. అలా చేసినందుకు ఆ పిల్లవాడు వినతను శపిస్తూ, "అసూయతో, తొందరపాటు తనంతో ఇలా చేశావు కాబట్టి, దీనికి ప్రతిగా నీవు బానిసగా బ్రతకవలసి వస్తుంది!" అని శపించాడు. ఇంకా, "అయితే నీవు కనుక ఈ రెండవ గుడ్డును ఓపికగా సంరక్షిస్తే, అందులో నుంచి పుట్టే నా తమ్ముడు నీకు దాస్యవిముక్తి కలిగిస్తాడు!" అని శాపవిమోచనాన్ని కూడా చెప్పి సూర్యుడి రథసారథిగా ఉండేందుకు గగనమండలంలోనికి ఎగిరిపోయాడు. వినత ఎంతో బాధపడింది. కానీ ఏమిటి ప్రయోజనం? తొందరపాటుకు మూల్యం చెల్లించక తప్పదు కదా!



ఇక చేసేదేమీలేక రెండవ గుడ్డు ఎప్పుడు పగులుతుందా అని వినత ఎదురుచూడసాగింది.

నిజానికి అసూయ అనేదే మనల్ని బానిసలుగా చేస్తుంది. అసూయ వలననే మనకు కోరికలు పెరిగి, అవి తీరాలన్న పంతాలు ఎక్కువవుతాయి. ఆ పంతాలవల్ల మనం ఎంత నీచమైన పనిచేయడానికైనా తయారవుతాము. ఇటువంటి ప్రవర్తన ఆయా వస్తువుల కోసం, విషయాల కోసం ప్రాకులాడేలా మనల్ని దిగజారుస్తుంది, మనశ్శాంతి లేకుండా చేస్తుంది. కాబట్టి ఈ అసూయను సమూలంగా వదిలించుకున్నప్పుడే మనం ఔన్నత్యాన్ని సాధించగలం.



ఇలా ఉండగా ఒకనాడు కద్రువ, వినత సాగరతీరాన వాహ్యాళికి వెళ్ళారు. అదే సమయంలో దేవతల గుర్రం అయిన ఉచ్చైశ్రవం అక్కడ విహరిస్తోంది. అది సూర్యుడు అస్తమిస్తున్న సంధ్యాసమయం. కద్రువ దూరం నుంచి దానిని చూసి, "ఆ గుర్రం ఏ రంగులో ఉంది?" అని అడిగింది. వినత, "అది తెల్లరంగులో వెలిగిపోతూ ఉంది" అని జవాబిచ్చింది. కద్రువ, "చూడు! దాని శరీరమంతా తెల్లగా ఉన్నా తోక మాత్రం నల్లగా ఉంది" అని పలికింది. వినత అందుకు ఒప్పుకోక, "కాదు! తోక కూడా తెల్లగానే ఉంది!" అని అంది. ఆ మాట మీద

వారిద్దరూ వాదించుకున్నారు. ఎవరిమాట నెగ్గితే వారికి రెండవవారు జీవితాంతం దాసిగా ఉండాలని పందెం వేసుకున్నారు. అప్పటికి చీకటి పడిపోయింది కాబట్టి మరునాడు వచ్చి చూడాలని ఇద్దరూ నిశ్చయించుకున్నారు.

ఇంటికి చేరగానే కద్రువ తన కుమారులైన నాగులందరినీ పిలిచి, వారికి ఆ రోజు జరిగిన విషయం చెప్పి, తన పంతం నెగ్గేందుకు వారిని సహాయపడమని కోరుతూ, "తెల్లవారేసరికి మీరు ఆ ఉచ్చైశ్రవం తోకను చుట్టుకుని నల్లని రోమాలుగా కనిపించండి!" అని ఆజ్ఞాపించింది. అయితే వారు, అటువంటి అన్యాయపు పని తమవల్ల కాదన్నారు. కద్రువ కోపంతో, "మీరందరూ జనమేజయుడు చేసే సర్పయాగంలో నాశనమైపోతారు!" అని శపించింది. ఒక తల్లి తన బిడ్డలనే శపించేలా చేయగలిగే అసూయ, కోపం ఎటువంటివో చూడండి! అయితే ఆ నాగులలో ఒకడైన కర్కోటకుడు, "అమ్మా! ఆ పని నేను చేస్తాను!" అని చెప్పి వెళ్ళి ఆ గుర్రం తోకకు చుట్టుకుని, అది నల్లగా కనిపించేలా చేశాడు. న్యాయాన్యాయాలను పట్టించుకోకుండా ప్రవర్తించే క్రూరుడైన మనిషిని 'కర్కోటకుడు' అని పిలవడం ఇక్కడ నుంచే నానుడిగా తయారైంది.

తెలతెలవారుతుండగా వినత, కద్రువ ఇద్దరూ మళ్ళీ సాగరతీరానికి వెళ్ళి చూడగా ఆ గుర్రం తోక నల్లగా కనిపించింది. దానితో వినత పందెంలో ఓడిపోయింది. అది మొదలు వినత కద్రువకు దాసిగా ఉంటూ, సేవలు చేయడం మొదలుపెట్టింది. అదే రోజున వినతకు రెండవ గుడ్డునుంచి గరుత్మంతుడు జన్మించాడు. పుట్టడంతోనే, మహాపరాక్రమంతో ఆకాశంలో విహరించి వచ్చి, తల్లి వినతకి నమస్కరించి, ఆ తర్వాత పెత్తల్లి కద్రువకు కూడా నమస్కారం చేశాడు. కద్రువ గరుత్మంతుడితో, "నాయనా! మీ అమ్మలాగానే నువ్వు కూడా మాకు దాసుడివై ఉండాలి. ఇది మొదలుగా నా బిడ్డలందరినీ నీ మూపురం మీద ఎక్కించుకుని ఆడిస్తూ ఉండు!" అని ఆజ్ఞాపించింది.

గరుత్మంతుడు అలాగే చేయసాగాడు. కాలం సాగిపోతోంది. ఇలా వేరొకరికి దాస్యం చేయడం గరుత్మంతుడికి నచ్చలేదు. ఒకరోజు, గరుత్మంతుడు నాగుల్ని తన మూపున ఎక్కించుకుని ఇంకాయింకా పైపైకెగిరి, సూర్యమండల సమీపానికి చేరాడు. సూర్యుని తాపానికి తాళలేక నాగులన్నీ తలలు వాల్చి, స్పృహతప్పి నేలమీద పడిపోయే స్థితికి చేరాయి. అది చూచి కద్రువ ఇంద్రుణ్ణి ప్రార్థించింది. ఇంద్రుడు కుంభవృష్టి కురిపించాడు. దానితో నాగులకు సాంత్వన కలిగింది. అప్పటినుంచీ, కద్రువ వినతను, గరుత్మంతుణ్ణి మరింత కష్టపెట్టసాగింది.

"ఎంతకాలం ఈ దాస్యం?" అని గరుత్మంతుడు వాపోసాగాడు. చివరకు ఏమి చేస్తే తన తల్లికి ఈ దాస్యం నుంచి విముక్తి కలుగుతుందో చెప్పమని నాగుల్ని



అడిగాడు. ఇదే అదనుగా భావించిన ఆ నాగులు తమకు అమృతం తెచ్చి ఇవ్వాలనీ, అలా చేస్తే దాస్యవిముక్తిని ప్రసాదిస్తామనీ చెప్పారు. అతడు ఎప్పటికీ అమృతాన్ని సాధించలేడని వారి నమ్మకం. గరుత్మంతుడు తన తల్లి దగ్గరకు వెళ్ళి, "అమ్మా! అమృతాన్ని తెచ్చి ఈ నాగులకు ఇస్తే మనకు దాస్యం నుంచి విముక్తిని ఇస్తామని నాగులు చెప్పారు. అమృతాన్ని సాధించగల శక్తి నాకుంది. అందువలన నిస్సంకోచంగా నన్ను ఈ పని చేయడానికి పంపించు!" అన్నాడు. తల్లి వినత అతణ్ణి కార్యసాధకుడివై రమ్మని ఆశీర్వదించి పంపింది.

గరుడుడు ఆకాశవీధిలో వెడుతుండగా, తండ్రి కశ్యపుడు కనిపించి, "నాయనా! క్షేమంగా ఉన్నావా!" అంటూ పలకరించాడు. "తండ్రీ! నా తల్లికి దాస్య విముక్తి కలిగించడానికి అమృతం తీసుకురావడానికి దేవలోకానికి వెడుతున్నాను. నన్ను ఆశీర్వదించండి! కానీ నాకు చాలా ఆకలిగా ఉన్నది. నా ఆకలి తీరే మార్గం చెప్పండి?" అన్నాడు.

కశ్యపుడు, "నాయనా! ఇక్కడికి సమీపంలో ఒక సరస్సు ఉంది. దానిలో ఒక గజము (ఏనుగు), ఒక కచ్ఛపము (తాబేలు) నిర్విరామంగా పోరాడుతున్నాయి. చిత్రం ఏమిటంటే అవి రెండూ గత జన్మలో సోదరులుగా పుట్టినప్పటికీ, అప్పటి వైరం వలన ఇప్పుడు ఇలా పుట్టి, ఇంకా కొట్టుకుంటున్నారు. ఆ జన్మలో వారి పేర్లు విభావసుడు, సుప్రతీకుడు. ఇద్దరూ నిష్ఠగా తపస్సు చేసుకునేవారే అయినా సంపదల మీద వ్యామోహం వదలక తన భాగం తనకు ఇమ్మని తమ్ముడు అన్నని అడిగాడు. అన్నకు ఆస్తి పంపకాలు ఇష్టం లేదు. అన్న తమ్ముడితో, 'తమ్ముడూ!

లోభబుద్ధిగల మనుష్యులే ఇలా ఆస్తులు పంచుకోవాలనుకుంటారు. ఒకరినొకరు చంపుకోవడానికి కూడా వెనుకాడరు. అన్నదమ్ముల మధ్య ఇటువంటి ద్వేషాన్ని అదనుగా తీసుకుని ఇతరులు వారి సొమ్మును కాజేస్తారు. కాబట్టి వాటాలు పంచుకోవడం మంచిది కాదు!' అని నచ్చజెప్పినా తమ్ముడు వినిపించుకోలేదు. మాటామాటా పెరిగి, చివరకు విపరీతమైన కోపంతో ఒకరినొకరు శపించుకుని ఇలా ఏనుగుగా, తాబేలుగా పుట్టి ఇంకా కొట్టుకుంటున్నారు. వాటిలో ఒకటి మహాపర్వతంలాగా ఉంటే, మరొకటి పెద్దమేఘంలాగా ఉంటుంది! వాటిని తిని నీ ఆకలి తీర్చుకో" అని చెప్పాడు.

గరుత్మంతుడు ఆ సరోవరాన్ని సమీపించి ఆ ఏనుగునూ, తాబేలునూ పట్టుకుని ఆకాశంలోకి ఎగిరి, ఎక్కడ వాలి వాటిని తిందామా అని చూస్తూ, మేరుపర్వతం మీద ఉన్న ఒక పెద్ద మర్రిచెట్టు కొమ్మ మీద వాలాడు. ఆ బరువుకు ఆ కొమ్మ విరిగి నేలకూలసాగింది. అదే సమయంలో ఆ కొమ్మకు కాళ్ళు తగిలించి,



తల్లక్రిందులుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న వాలఖిల్య ఋషులను గరుత్మంతుడు చూశాడు. ఆ కొమ్మ నేలమీద పడితే వారందరూ మరణిస్తారని, వెంటనే గరుత్మంతుడు ఆ కొమ్మను ముక్కున పట్టి గాలిలోకి లేచాడు. ఎక్కడ దిగాలో వెతుకుతూ, తిరిగి కశ్యపుడు తపస్సు చేసుకునే చోటికి వెళ్ళాడు. ఏకకాలంలో గజకచ్ఛపాలనూ, ముక్కుతో పెద్ద మర్రికొమ్మనూ పట్టుకుని ఎగురుతూ గరుత్మంతుడు చేస్తున్న సాహసాన్ని చూసి కశ్యపుడు ఆశ్చర్యపోయాడు. పరిస్థితిని

అర్థం చేసుకున్న వాలఖిల్యులు, తమకు ఏ హానీ కలుగనివ్వకుండా క్రిందకు దించిన గరుత్మంతుణ్ణి ఆశీర్వదించి, అక్కడ నుంచి మరొక వృక్షశాఖ మీదకు చేరి తమ తపస్సు కొనసాగించారు. గరుత్మంతుడు ఒక నిర్జన ప్రాంతంలో ఆ కొమ్మను పడవేసి, ఆ గజకచ్ఛపాలను తృప్తిగా ఆరగించి, మహావేగంతో దేవలోకం వైపు ఎగిరిపోయాడు.

గరుత్మంతుడి వేగానికి, రెక్కల తాకిడికి, రేగిన దుమ్ముమేఘాలతో ఆకాశం నిండిపోయింది. ఉల్కలు రాలిపడ్డాయి. దేవతలు ఆందోళన చెందసాగారు. దేవేంద్రుడు భయపడి, దేవతల గురువైన బృహస్పతి దగ్గరకు వెళ్ళి, ఈ ఉత్పాతం ఏమిటని అడిగాడు. బృహస్పతి, “అమృతాన్ని అపహరించుకుపోవడానికి గరుత్మంతుడు వస్తున్నాడు. అతడు సర్వశక్తిసంపన్నుడు. నువ్వు వాలఖిల్య మహర్షులను పరిహసించినందుకు కలిగిన ఫలితం ఇది!” అని చెప్పాడు.

దేవేంద్రుడు తక్షణమే అమృతభాండానికి రక్షణగా అనేకమంది దేవతలను నియోగించాడు. గరుత్మంతుడు దేవభూమిలో దిగుతూ ఉంటే అతడి రెక్కలవిసురులో పుట్టిన గాలికి మహావృక్షాలు సైతం ఊగిపోయి, నేలకూలుతున్నాయి. రక్షణగా నిలుచున్న దేవతల గుండెలు గజగజలాడుతున్నాయి. ఆ గాలికి రేగిన ధూళి వారి కళ్ళలో పడుతూ ఉంటే, వాయుదేవుడు ఆ ధూళిని తొలగించాడు. యుద్ధం మొదలైంది. గరుత్మంతుడు దేవతలతో పోరాడుతూ, తన కాలిగోళ్ళతో, ముక్కుతో వారి శరీరాలను చీల్చివేస్తూ పరాక్రమించాడు. వారందరినీ ఓడించి, అమృత కలశం దగ్గరకు చేరబోతుండగా ఆ కలశం చుట్టూ అగ్నిజ్వాలలు రేగాయి. క్షణంలో అతడు తన నోటినిండా నదులలోని నీటిని తెచ్చి చల్లి, ఆ జ్వాలలను ఆర్పివేశాడు.

ఇక ఆ అమృతభాండం చుట్టూ పదునైన కత్తులు అమర్చిన చక్రం ఒకటి పరిభ్రమిస్తోంది. ఈ అవరోధాన్ని దాటడానికి తన శరీరాన్ని అతి సూక్ష్మంగా చేసుకుని చక్రం లోపలికి చేరాడు. అక్కడ రెండు మహాసర్పాలు కావలి కాస్తున్నాయి. మణుల్లా మెరుస్తున్న వాటి కళ్ళలో దుమ్ము కొట్టి, ఆ వెంటనే వాటిని తన గోళ్ళతో చీల్చివేసి, శరీరాన్ని పెంచి కత్తుల చక్రాన్ని తుత్తునియలు చేసి, అమృతభాండాన్ని పట్టుకుని గాలిలోకి లేచాడు. ఇది చూసి, అతణ్ణి ఎలా ఆపాలో తోచక ఇంద్రాది దేవతలు తెల్లముఖం వేశారు.

అమృతభాండాన్ని తన చేతులలో పట్టుకున్నా ఆ అమృతాన్ని తానే త్రాగవచ్చునని గరుత్మంతుడు అనుకోలేదు. తన స్వలాభం గురించి అతడు ఏమాత్రం ఆలోచించలేదు. తన తల్లికి దాస్యవిముక్తి కలిగించాలన్న ఆలోచన తప్ప అతడికి వేరే ఆలోచన లేదు. స్వార్థత్యాగానికి గరుత్మంతుడు అత్యుత్తమమైన ఉదాహరణ. ఆ మంచిబుద్ధినీ, పరాక్రమాన్నీ చూసిన మహావిష్ణువు ముగ్ధుడయ్యాడు. అతడిలో

ఉన్న ఇటువంటి ఉదాత్తమైన గుణాలవల్ల ఆ దేవదేవుడే అతడితో స్నేహం చేయాలనుకున్నాడు. గరుత్మంతుడికి విష్ణువు ఎదురువచ్చి, "నీవంటి పరాక్రమవంతుణ్ణి నేను చూడలేదు. నీకు వరం ఇస్తాను కోరుకో!" అన్నాడు. "స్వామీ! నన్ను మీ ధ్వజం మీద చిహ్నంగా స్వీకరించండి. ఈ అమృతంతో నిమిత్తం లేకుండా, నాకు చావుపుట్టుకలు లేని వరమివ్వండి!" అని గరుడుడు కోరాడు. పద్మనాభుడు ఆ వరాన్నిచ్చి, "నువ్వు నా వాహనంగా ఉండు!" అని నిర్దేశించాడు. గరుత్మంతుడు సంతోషంగా ఒప్పుకున్నాడు.

ఈ సమయానికి దేవేంద్రుడు అక్కడికి చేరుకుని, గరుత్మంతుడి మీద వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. కానీ గరుత్మంతుడికి దానివల్ల చిన్న దెబ్బ కూడా తగలలేదు. ఇది చూసి దేవేంద్రుడు ఆశ్చర్యంతో, "నీ అంతటి శక్తిగలవాడు ముల్లోకాలలోనూ లేడు. నాతో స్నేహం చెయ్యమని నిన్ను వేడుకుంటున్నాను. ఈ అమృతాన్ని నాగులకు ఇస్తే వారు దీన్ని సేవించి లోకకంటకులవుతారు!" అని తన బాధను వ్యక్తం చేశాడు. గరుడుడు, "దేవేంద్రా! నా తల్లికి దాస్యవిముక్తి కలిగించడానికి దీనిని నాగులకు ఇస్తానని మాట ఇచ్చాను. కాబట్టి నేను వారికి ఇది ఇవ్వక తప్పదు. అయితే నేను వారికి ఇచ్చిన మరుక్షణమే నీవు దానిని పట్టుకుపోవచ్చు!" అన్నాడు. ఇందుకు ఇంద్రుడు అంగీకరించాడు.

గరుత్మంతుడు నాగుల దగ్గరకు వెళ్ళి, "ఇదుగో! ఈ అమృతభాండాన్ని ఈ పవిత్రమైన దర్భల మీద ఉంచుతున్నాను. మీరందరూ స్నానాలు చేసివచ్చి దీన్ని సేవించండి. ఇక మా అమ్మకూ, నాకూ దాస్యవిముక్తి కలిగినట్టే కదా!" అన్నాడు. వారు ఔనౌనంటూ ఆనందంగా తలలు ఊపారు. తత్క్షణమే గరుత్మంతుడు తన తల్లితో అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. ఇంద్రుడు వచ్చి అమృతాన్ని అపహరిస్తాడని ఊహించని నాగులు స్నానానికి బయలుదేరారు. మరుక్షణంలో ఇంద్రుడు వచ్చి అమృతకలశాన్ని అపహరించుకుపోయాడు. ఆ విధంగా గరుత్మంతుడు తన తల్లికి దాస్యవిముక్తి కలిగించాడు.

ఈ కథలోని నీతిని మనం ఈ విధంగా చూడవచ్చును. మనలోనే అనాదియైన, సర్వశక్తిమంతమైన ఆత్మ ఉంది. దానినే ఈ కథలో అమృతంతో పోల్చారు. అమృతం మరణమే లేని స్థితిని ఇస్తుంది కదా. మనలోని ఆత్మ కూడా అటువంటిదే. ఆ ఆత్మను తెలుసుకోవడం ద్వారా మనం అమృతత్వాన్ని పొందగలం. కాబట్టి దాన్ని తెలుసుకోవడమే మన జీవితాదర్శం కావాలి.

ఈ కథలోని ఇంద్రుణ్ణి మన ఇంద్రియాలతో పోల్చవచ్చు. మనిషిలోనే ఆత్మ ఉన్నా దానిని పట్టించుకోకుండా అతడు తిరిగినట్టు, ఇంద్రుడి దగ్గర అమృతం ఉన్నా, అతడు దానిని పట్టించుకోకుండా ఇతర విషయాల వెంటపడ్డాడు. కేవలం

ఇంద్రుడు మాత్రమే కాక, ఇతర దేవతలు కూడా తమ స్వార్థాన్ని గురించి, సుఖాలను అనుభవించడం గురించే ఆలోచిస్తారు కానీ పరిపూర్ణత్వాన్నీ, మోక్షాన్నీ పొందడానికి ప్రయత్నించరు. అందువలన ఎన్నో చేదు అనుభవాలను చవిచూస్తుంటారు. అయినా ఏమీ నేర్చుకోరు. బలవంతుడైన వాడు ఆత్మవిశ్వాసంతో తన స్వార్థాన్ని లెక్కచేయకుండా, అందరితో స్నేహంగా ఉంటాడు. బలహీనుడు కోరికలకూ, క్రోధానికీ, లోభానికీ సులభంగా లొంగిపోయి, స్వార్థపరుడుగా తయారవుతాడు. స్వార్థపరుడు ఇతరులను గేలిచేసి, శత్రువులను తయారు చేసుకుంటాడు. కాబట్టి ఇంద్రియసుఖాలను గురించి ఆలోచించడం మాని, మరింత ఉన్నతమైన ఆదర్శం కోసం మనం



ప్రయత్నించాలి. పై కథలో లాగా ఆత్మ అనే అమృతం మన దగ్గరే ఉన్నా, మన ఇంద్రియాలూ, మనస్సూ అశాశ్వతమైన కోరికల వెంట పరుగులు తీస్తూ దాన్ని పట్టించుకోవు. అంతేకాక, ఇంద్రియాలవల్ల కలిగే సుఖాలు కొంచెం అలవాటయి, కొంచెం ధనం చేతికి రాగానే, కథలోని ఇంద్రుడు వాలఖిల్యులను అవమానించిన విధంగా, మనిషి కళ్ళు నెత్తికెక్కి, కన్నూమిన్నూ కానక ప్రవర్తిస్తాడు. పర్యవసానం విషాదమే కదా!

అయితే ఈ ఇంద్రుడి కన్నా గొప్పవాడు గరుత్మంతుడైన పక్షీంద్రుడు. అతణ్ణి మనలోని సంకల్పశక్తితో పోల్చవచ్చు. ఈ సంకల్పశక్తి గరుత్మంతుడిలాగా "ఏమైనా చెయ్యగలదు, అన్నీ సాధించగలదు". ఇంకా ముందుకు వెడితే, గరుత్మంతుడు ఇంద్రాదిదేవతలతో చేసిన పోరాటాన్ని మనం మన ఇంద్రియాలతో చేసే పోరాటంతో పోల్చవచ్చును. పక్షీంద్రుడు ఇంద్రుణ్ణి ఓడించినట్టు, మన సంకల్పశక్తి చేత ఇంద్రియాలను వశపరచుకుని, వాటికి నాయకత్వం వహించే మనస్సును మన స్వాధీనంలోకి తెచ్చుకుని ముందుకు సాగాలి.

అంతేకాక ఈ కథలో గరుత్మంతుడు, నాగులు వరుసగా రాజసిక, తామసిక గుణాలకు ప్రతీకలు. గరుత్మంతుడు నాగులను నిర్జించినట్టు, సంకల్పశక్తితో రాజసికగుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా తామసికగుణాన్ని జయించవచ్చు. గరుత్మంతుడు ఈ కథలో అమృతాన్ని తీసుకురావడమనే ఆదర్శాన్ని తీసుకున్నాడు. అందుకు బయలుదేరే ముందు గజకచ్ఛపాలను తినడం ద్వారా తన శారీరిక, మానసికబలాలను పెంపొందించుకుని బయలుదేరాడు. జీవితంలో ఏది సాధించా లన్నా శారీరకంగా, మానసికంగా మహాబలవంతులై ఉండడం తప్పనిసరి కదా!

గరుత్మంతుడు ఎదుర్కొన్న అగ్నిజ్వాలలను మనలోని రాగద్వేషాలతోనూ, కత్తుల చక్రాన్ని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు చెడు లక్షణాల తోనూ, ఆ తర్వాత ఎదురైన రెండు మహాసర్పాలను అహంకారమమకారాలతోనూ పోల్చవచ్చును. వీటన్నింటితోనూ పోరాడి, గెలిచినప్పుడే మనం అమృతాన్ని, అమృతత్వాన్ని, చేరుకోగలుగుతాము.

నిజానికి, గరుత్మంతుడిలాంటి రాజసికులే క్రమంగా సత్త్వగుణాన్ని సాధించి అమృతత్వాన్ని సాధిస్తారు కానీ నాగులలాంటి తామసికులకు అమృతత్వం ఆమడదూరంలో ఉంటుంది. అన్ని జీవులలోనూ నిండిన సర్వవ్యాపకత్వానికి చిహ్నమైన మహావిష్ణువుకు వాహనం కావడానికి గరుత్మంతుడు సంతోషంగా ఒప్పుకున్నట్లు, మన సంకల్పశక్తి ద్వారా సాధించే అద్భుతకార్యాలను నిస్వార్థబుద్ధితో లోకకళ్యాణానికి అంకితం చెయ్యాలి.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 3. దిలీపుడు

శ్రీరాముడి పూర్వీకులందరూ మహాత్ములే. సృష్టి ప్రారంభంలో స్వయంభూబ్రహ్మ అనంతరం మరీచి, కశ్యప, వివస్వంతులు పుట్టారు. వివస్వంతుడి సంతానమే వైవస్వత మనువు. మనువు పెద్ద కొడుకు ఇక్ష్వాకువు. అతడు అయోధ్యాపతి. అతడి పేరుమీద అది ఇక్ష్వాకు వంశమయింది. ఆ వంశంలో కుక్షి, వికుక్షువు, బాణుడు, అనరణ్యుడు, పృథువు, త్రిశంకువు, ధుంధుమారుడు, యువనాశ్వుడు, మాంధాత, సుసంధి, ధ్రువసంధి, భరతుడు, అసితుడు, సగరుడు, అసమంజసుడు, అంశు మంతుడు, దిలీపుడు, భగీరథుడు, కకుత్థ్సుడు, రఘువు, సుదానుడు, శంఖుణుడు, సుదర్శనుడు, అగ్నివర్ణుడు, శీఘ్రగుడు, మరువు, ప్రశుశ్రువు, అంబరీషుడు, నహుషుడు, నాభాగుడు, అజుడు, దశరథ మహారాజు వరుసగా జన్మించారు.

శ్రీరాముడి పూర్వీకులలో అంశుమంతుడి కొడుకు దిలీపుడు. అతడు తన మంచి నడవడికి, ధర్మనిరతికి పేరెన్నికగన్నవాడు. అతడి భార్య సుదక్షిణ అన్నివిధాలా అతడికి తగిన భార్య. దిలీపుడి రాజ్యప్రజలు అతణ్ణి ఎంతగానో ప్రేమించేవారు. అయినా అతడికి ఒక చింత పట్టుకుంది. దానికి కారణం అతడికి బిడ్డలు లేకపోవడమే. ఒకరోజు దిలీపుడు సుదక్షిణతో, "నాకు ఒక ఆలోచన కలిగింది. మనం మన రాజగురువైన వసిష్ఠులవారి వద్దకు వెళ్ళి మన సమస్య గురించి చెపుదాము. ఆయన మనకు సహాయం చెయ్యగలుగుతాడు" అన్నాడు. సుదక్షిణ అందుకు సమ్మతించింది.

కొన్ని రోజుల తర్వాత దిలీపుడు తన రాజ్యాన్ని విశ్వాసపాత్రులైన మంత్రులకు అప్పగించి సుదక్షిణతో కలసి వసిష్ఠముని ఆశ్రమానికి వెళ్ళాడు. వసిష్ఠుడు, "నాయనా! నీవెలా ఉన్నావు! నీ రాజ్యప్రజలు క్షేమమే కదా!" అని కుశలప్రశ్నలు వేశాడు. దిలీపుడు, "ఆచార్యా! మీ దీవెనల వల్ల నా రాజ్యం సమృద్ధిగా ఉంది. ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. కానీ నేను, నా రాణి మాకు ఒక పుత్రుడు కలగాలని కోరుకుంటున్నాము. మాకు ఇంతవరకూ సంతానం ఎందుకు కలుగలేదో కారణం తెలియడం లేదు" అని తన బాధను వ్యక్తం చేశాడు.

వసిష్ఠుడు ఒక క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించి, "నాయనా! చాలాకాలం క్రితం, నీవు యువకుడిగా ఉన్నప్పుడు సుదక్షిణతో కలసి ఇంద్రుడి దగ్గరకు వెళ్ళావు. ఆ కాలంలో గంగానది దేవలోకంలో ప్రవహిస్తోంది. నీ పర్యటన ముగించుకుని, గంగానదీ తీరంలో అందమైన పరిసరాలను చూస్తూ తిరిగి వస్తున్నావు. తిరిగివచ్చే దారిలో నీకు కామధేనువు అయిన సురభి ఎదురైంది. నీవు నీ భార్యతో కలసి తనకు పూజ చేస్తావని ఆ గోవు అక్కడే నిలబడింది. కానీ నీవు అక్కడి ప్రకృతి రమణీయతను చూస్తూ, సురభిని పట్టించుకోలేదు. దానికి సురభి

చిన్నబుచ్చుకుని, అంతవరకూ నిన్ను దీవించాలనుకుంటున్న దానికి బదులుగా, 'ఓ రాజా! నన్ను నిర్లక్ష్యం చేసిన పాపానికి నీకు సంతానం కలుగదు. నీవు నా సంతానానికి సేవలు చేసి మెప్పించినప్పుడు మాత్రమే, ఈ శాపం తీరి, నీకు బిడ్డలు కలుగుతారు!' అని నిన్ను శపించింది. గంగానది ఘోషలో నీకు ఆ శాపం వినిపించలేదు. మహాత్ములైన వారిని ఎవరు చిన్నచూపు చూస్తారో వారే నష్టపోతారు కదా!" అన్నాడు. దానికి దిలీపుడు, "స్వామీ! నేను అది తెలియక చేశాను. మరి దానికి ప్రాయశ్చిత్తం ఏమిటో మీరే సెలవియ్యండి!" అని ప్రాధేయపడ్డాడు. వసిష్ఠుడు వారితో, "నాయనా! సురభికి పుట్టిన నందిని అనే ఆవు నా దగ్గర ఉన్నది. నీవు, నీ భార్యతో కలసి ప్రేమతోనూ, భక్తితోనూ నందినికి అన్ని రకాల సేవలూ చేయండి. ఆ గోవును అడవికి తోలుకుపోవడం, మేపడం మొదలైన పనులను కొంతకాలం చేస్తే మీకు శాపవిమోచనం కలుగుతుంది" అని సలహా ఇచ్చాడు. అదే సమయానికి నందిని వచ్చి వారి పక్కనే నిలబడింది. వసిష్ఠుడు వారితో, "ఇదుగో నందినీ ధేనువు! సూర్యోదయం కావడంతోనే రాణి సుదక్షిణ నందినికి పూజచేసి అడవికి సాగనంపాలి. మరలా సాయంత్రం అడవి నుంచి తిరిగివచ్చేటపుడు ఆమె దానికి ఎదురేగి ఆశ్రమానికి తోడ్కొని రావాలి. మిగిలిన రోజంతా నీవు అడవిలో నందిని వెంటే ఉంటూ ఆమెను అన్ని విధాలా సేవిస్తూ, సంరక్షించాలి. ఇలా నందినికి సేవ చేస్తే ఆమె కృప వలన మీకు మహోన్నతులైన పుత్రులు కలుగుతారు," అని చెప్పాడు.

అదే విధంగా, సుదక్షిణ, దిలీపుడు నందినిని అర్చించసాగారు. ప్రతిరోజూ సూర్యోదయంతోనే సుదక్షిణ నందినికి పూజచేసి, అడవిదాకా వదలిపెట్టేది. నందినితోపాటే బయలుదేరిన దిలీపుడు ఆ ధేనువును ఎంతో అప్రమత్తతతో అనుసరించేవాడు. ఆ అడవిలో ఎక్కడెక్కడ మంచి పచ్చిక లభిస్తుందో నందినికి బాగా తెలుసు. అందువలన ఆయా చోట్లకు ఆమె దారి తీసేది. సూర్యాస్తమయం వరకూ వారు వేర్వేరు చోట్లలో తిరిగేవారు. నందిని నడిస్తే దిలీపుడు కూడా నడిచేవాడు. నందిని ఆగి విశ్రాంతి తీసుకుంటే దిలీపుడు కూడా ఆగేవాడు. సాయంత్రం తిరిగివచ్చినపుడు సుదక్షిణ వారికి ఎదురేగి, ఆశ్రమానికి తీసుకువచ్చేది.

ఇలా ఇరవైయొక్క రోజులు గడిచాయి. ఇరవై రెండవ రోజున, "ఈ మహారాజు ఇన్ని రోజులుగా చాలా ఓపికగానూ, అప్రమత్తంగానూ, ఉంటున్నాడు. ఈ రోజు నేను అతడి ధీరోదాత్తతను పరీక్షిస్తాను!" అని నందిని అనుకుంది. అందుకోసం నందిని అడవిని దాటి ఇంకా ముందుకుపోసాగింది. హిమాలయాల అంచులలో ఏటవాలుగా ఉన్న పచ్చికబయళ్ళను దాటి ఇంకా ముందుకు దారితీసింది. దిలీపుడు ఎంతో జాగ్రత్తగా ఆమెను గమనిస్తూ, అనుసరించసాగాడు. ఆమె



చివరికి శివవనంలో ప్రవేశించింది. అది చూసిన దిలీపుడు కొంచెం కలవరపడ్డాడు. కానీ, "నందిని పవిత్రమైన గోవు కదా. ఆమె పవిత్రతే ఆమెను కాపాడుతుంది" అనుకుంటూ ధైర్యం తెచ్చుకున్నాడు. వారు చేరుకున్న ప్రదేశం ఎంతో మనోహరంగా ఉంది.

ఆ చుట్టూవున్న పరిసరాల్ని చూస్తూ ఆనందిస్తున్న దిలీపునికి 'అంబా' అంటూ నందిని ఆక్రందన వినిపించింది. దిలీపుడు ఉలిక్కిపడి, "నందినికి ఏదో అపాయం వచ్చింది!" అనుకుంటూ ఆమెవైపు పరుగెత్తి చూసేసరికి, ఒక పెద్ద సింహం నందినిని నేల మీదకు పడదోసి చంపబోతూ కనిపించింది. దిలీపుడు, 'ఒక్క బాణంతో ఈ సింహాన్ని సంహరిస్తాను' అనుకుని ఎడమ చేతిలో విల్లు పట్టుకుని కుడిచేతితో ఒక బాణాన్ని తీయబోయాడు. కానీ అతని కుడిచేయి కదలలేదు సరికదా, చచ్చుబడిపోయినట్టు తోచింది. ఇంకా ఆశ్చర్యకరంగా ఆ సింహం మాట్లాడుతూ, "ఓ రాజా! నేనే నీ చేతిని కదలకుండా చేశాను. ఈ చెట్టుకు కావలి కాయమని పరమశివుడు నన్ను ఇక్కడ నియమించాడు. ఈ చెట్టును శివపార్వతులు కన్నబిడ్డలా ప్రేమిస్తారు. ఈ ఆవు ఈ చెట్టు ఛాయలకు వచ్చింది కాబట్టి దానిని

నేను చంపక తప్పదు!" అంది. వెంటనే దిలీపుడు, "కాదుకాదు! అది మా గురువుగారి గోవు. దానిని చంపవద్దు. కావాలంటే దానికి బదులు నన్ను చంపు!" అన్నాడు. అప్పుడు ఆ సింహం ఎంతో తెలివిగా సంభాషణ కొనసాగిస్తూ, "నేను అలా ఎలా చేయగలను? ఈ చెట్టు దగ్గరకు వచ్చినది ఆ ఆవు కదా! నీవు కేవలం భయభక్తులు కలిగిన కొడుకులాగా దాన్ని అనుసరించి వస్తున్నావు. నీ తప్పు లేనపుడు నిన్ను ఎలా శిక్షించను? నీకు దాని మీద ఎంతో ఆరాధనాభావం ఉండవచ్చు. అది వేరే విషయం. చేసిన తప్పుకు ఈ గోవు శిక్ష అనుభవించక తప్పదు!" అంది. దిలీపుడు, "నువ్వు చెప్పినట్టు భక్తి కలిగిన కొడుకులాగానే నేను నా ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాడు. ఆ సింహం వాదనను కొనసాగిస్తూ, "నీవు మహారాజువు కదా! నీవు చనిపోతే సాధించేది ఏముంటుంది? నీ ప్రాణాలు నిలబడితే దానివల్ల లక్షలాది ప్రజల జీవితాలు సుఖపడతాయి. పైగా నీవు లేకపోతే నీ వంశం నాశనమౌతుంది. కాబట్టి నీవు నీ విలువైన జీవితాన్ని కాపాడుకుని, ఇంటికి మరలిపోవడమే మంచిది!" అని పలికింది. దిలీపుడు అందుకు నిరాకరిస్తూ, "ఓ మృగరాజా! నీవు చెప్పేది సమంజసంగా లేదు. ఈ చెట్టుకు కావలి కాయమని నిన్ను పార్వతీపరమేశ్వరులు నియమించారని చెప్పావు. ఈ చెట్టు నాశనమయితే నీవు శివుడికి నీ ముఖం చూపించగలవా? దాన్ని రక్షించడానికి నీవు అంత పట్టుదలగా ఉన్నావు కదా! నీకులాగానే నాకు కూడా అపారమైన స్వామిభక్తి ఉంది. ఈ ధేనువును నేను రక్షించి తీరాలి. నా గురువు నా మీద ఉంచిన విశ్వాసాన్ని నేను ఎలా వమ్ము చేయగలను?" అన్నాడు. అప్పుడు ఆ సింహం, "నీ గురువైన వసిష్ఠమహర్షి గురించి నీవు బెంగపడనవసరం లేదు. ఆయనకు కోరినన్ని కానుకలు ఇచ్చి ఆయన కోపాన్ని పోగొట్టవచ్చులే!" అంది. అప్పుడు దిలీపుడు, "మహర్షి కోపాన్ని తొలగించవచ్చునేమో కానీ నా ఆత్మగౌరవం సంగతేమిటి? నా శరీరం గతించిన తర్వాత నిలిచివుండేది నా ఆత్మగౌరవమే కదా! నా ఆత్మగౌరవమే పోయిన తర్వాత నేను జీవించి ప్రయోజనమేమిటి? కాబట్టి ఆ ఆవుకు బదులు నన్ను ఆహారంగా స్వీకరించు!" అని స్థిరంగా పలికాడు. ఆత్మగౌరవంతో బ్రతకడమంటే మనిషి తాను నిర్ణయించుకున్న స్థాయి నుంచి దిగజారకుండా, దేనికీ రాజీపడకుండా బ్రతకడం. "ప్రాణాలకంటే ఇచ్చినమాటను నిలబెట్టుకోవడమే ముఖ్యం!"

ఎప్పుడైతే దిలీపుడు అలా స్థిరంగా పలికాడో, "సరే! అలాగే కానివ్వు!" అంటూ ఆ సింహం ముందుకు అడుగువేసింది. దిలీపుడి చేయి మళ్ళీ స్వాధీనంలోకి వచ్చింది. అతడు తన విల్లును, బాణాలను పక్కన పడవేసి ఆ సింహం ముందు మోకరిల్లి, ఆ సింహం పంజాదెబ్బ కోసం ఎదురుచూస్తున్నాడు. అయితే అందుకు



బదులు, "నాయనా! పైకి లే!" అన్న మధురమైన కంఠస్వరం వినిపించింది. దిలీపుడు తలపైకెత్తి చూస్తే ఎదురుగా నందిని నిలబడి ఉంది. నందిని మాట్లాడుతూ, "నాయనా! ఆశ్చర్యపడకు! నిన్ను పరీక్షించడానికే నేను ఈ మాయను కల్పించాను. వసిష్ఠుడి తపశ్శక్తి నన్ను ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటుంది కాబట్టి యముడైనా నన్ను తాకలేడు. నీ భక్తివిశ్వాసాలకు మెచ్చాను. నీకు ఏమి వరం కావాలో కోరుకో!" అని పలికింది. దిలీపుడు ఆనందంగా, "తల్లీ! నాకు ఒక ఉత్తముడైన కుమారుణ్ణి ప్రసాదించు!" అని కోరాడు. నందిని, "తథాస్తు!" అని దీవించింది. కొద్దిరోజుల తర్వాత ఆ రాజదంపతులు తమ రాజ్యానికి తిరిగి వచ్చారు. వారికి కలిగిన కుమారుడే భగీరథుడు.

మనుష్యులు జీవితంలో రాజీపడడం వల్లనే అవినీతి పుడుతుంది. ఆత్మగౌరవం ఉన్న మనిషి తాను నిర్ణయించుకున్న ఒక స్థాయిలో జీవించాలనుకుంటాడు. ఆ స్థాయినుంచి దిగజారకుండా జీవించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తాడు. దీనికి భయం ఏ కోశానా లేకుండా ఉండడం ఎంతో అవసరం. "భయం నుంచి చెడు, అవినీతి పుడతాయి. భయం వల్లనే దుఃఖం కలుగుతుంది. భయమే మరణానికి మూలకారణం! మరి ఈ భయానికి కారణం ఏమిటి? మన నిజస్వభావం ఆత్మతత్త్వమని మనకు తెలియకపోవడమే!" అని వివేకానంద స్వామి చెప్పారు. కాబట్టి మన నిజస్వభావం ఆత్మేనని తెలుసుకుని మనిషి భయాన్ని పూర్తిగా విడిచిపెట్టి నడచుకోవాలి. నిర్భయత్వమే మనిషి తన స్వలాభాల కోసం రాజీపడకుండా చూస్తుంది. నిర్భయత్వమే నీతిమంతమైన జీవితానికి పునాది.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 4. క్షీరసాగరమథనం

సప్త ఋషులలో ఒకడైన అత్రి మహర్షికీ, అతని భార్య అనసూయకూ కలిగిన పుత్రుడే దూర్వాసుడు. దూర్వాస మహాముని పరివ్రాజకుడై అన్ని లోకాలూ తిరుగుతున్నాడు. అప్పుడు ఆయనకొక అప్సరస కనిపించింది. ఆమె చేతిలో దేవలోకంలోని పూలతో కూర్చిన దండ ఒకటి ఉంది. దాని పరిమళాలు నలుదిక్కులా వ్యాపిస్తున్నాయి. దానిని చూసి దూర్వాసుడు ఆ అప్సరసతో, "ఆ పూలదండ ఎంతో బాగుంది. దానిని నాకు ఇవ్వు!" అని కోరాడు. ఆ అప్సరస సంతోషంగా, "స్వామీ! మీవంటి సత్పురుషులకు ఈ దండను బహూకరించడం కంటే మహద్భాగ్యం ఏముంటుంది?" అని దాన్ని ఆయన చేతికి ఇచ్చి, ఆయన పాదాలకు నమస్కరించి వెళ్ళిపోయింది.


దూర్వాసుడు ఇంకొంత ముందుకు వెళ్ళగానే అక్కడ ముల్లోకాలకూ అధిపతి అయిన ఇంద్రుడు ఎదురయ్యాడు. ఇంద్రుడు తన పట్టపు ఏనుగయిన ఐరావతం మీద కూర్చుని ఊరేగుతున్నాడు. దూర్వాసుడు ఇంద్రుడితో, "ఓ ఇంద్రా! ఈ అద్భుతమైన పూలమాలను నీకు బహుమతిగా ఇస్తున్నాను, స్వీకరించు! దీని మీద ఇప్పటికీ తేనెటీగలు వాలి మకరందాన్ని గ్రోలుతున్నాయి చూడు!" అంటూ ఆ పూలమాలను ఇంద్రుడికి అందించాడు. ఇంద్రుడు దాన్ని తీసుకుని, వేళాకోళంగా ఐరావతం కుంభస్థలం మీద వేశాడు. ఐరావతానికి ఆ పూల పరిమళం ఘాటుగా తోచి, దాన్ని తొండంతో తీసి నేలమీద విసిరికొట్టి, కాళ్ళతో తొక్కింది. ఇది చూసి దూర్వాసుడు కోపంతో ఊగిపోయాడు. ఇంద్రుడితో, "ఓ ఇంద్రా! లక్ష్మీనిలయమైన ఈ పూలమాలను నేనెంతో గౌరవంతో నీకిస్తే, అహంకారంతో కళ్ళు నెత్తికెక్కి, దాన్ని క్రింద పడవేస్తావా? నేనేదో మామూలు సాధువుననుకుని ఈ పని చేశావా?" అంటూ, "ఎలాగైతే నీవు ఈ పూలమాలను నేలపాలు చేశావో, అలాగే మీ దేవతల సర్వశక్తులూ, వైభవం నేలపాలవుతాయి!" అని శపించాడు.

అంతవరకూ ఒళ్ళుతెలియకుండా ఉన్న ఇంద్రుడికి ఆ శాపం వినేసరికి తెలివి వచ్చింది. తాను తప్పు చేశానని అర్థం చేసుకున్నాడు. ఏనుగు మీద నుంచి గబగబా దిగివచ్చి, "ఓ మహర్షీ! పుణ్యపురుషా! తప్పయిపోయింది, క్షమించండి! ఆదమరచిన క్షణంలో తప్పుచేశాను!" అని వేడుకున్నాడు. కానీ దూర్వాసుడి కోపం చల్లారలేదు. "నేను దయగలవాణ్ణి కాను! త్వరగా క్షమించే మనస్తత్త్వం కూడా నాకు లేదు. అహంకారమే నీ స్వభావం! చేసింది చాలక, ఇప్పుడు నక్క వినయాలు చూపితే నేను కరిగిపోతాననుకున్నావా?" అని విసవిసా వెళ్ళిపోయాడు.

దేవతలు (అమరులు లేదా సురులు), దానవులు (రాక్షసులు లేదా అసురులు) అని రెండు వర్గాల గురించి మన పురాణాలలో చెప్పబడింది. వారిరువురూ సొంత

అక్కచెల్లెళ్ళ బిడ్డలు. వారి మధ్య తేడా ఏమిటో రెండు మాటలలో చెప్పుకుందాం. దేవతలు మానవులు చేసే యజ్ఞయాగాదులకు, సత్కార్యాలకు సంతోషించి భూమి మీద సకాలంలో వర్షాలు కురిసి, చక్కగా పంటలు పండేలా, ప్రకృతి సమృద్ధిగా ఉండేలా చూస్తారు. సాధువులనూ, సన్మార్గులనూ రక్షిస్తారు. కానీ రాక్షసులు అందరినీ పీడిస్తూ, లోకాలను అల్లకల్లోలం చేస్తుంటారు. ఇలా వ్యతిరేకమైన స్వభావాలు కలిగిన దేవదానవులు ఎల్లప్పుడూ కలహించుకుంటూ ఉంటారు.

ఇక అలా శాపం పొందిననాటి నుంచీ ఇంద్రుడితోపాటు మిగిలిన దేవతలందరికీ కూడా తమ శక్తులన్నీ ఉడిగిపోతున్నట్టు అనిపించసాగింది. ఇదే అదనుగా తీసుకుని, రాక్షసులు దేవలోకం మీద దండెత్తి, “ఓరీ మదాంధులారా! యుద్ధానికి రండి” అని కయ్యానికి కాలుదువ్వారు. యుద్ధం చేయాలన్న ఉత్సాహం లేకపోయినా, దేవతలకు యుద్ధం చేయక తప్పలేదు. ఆత్మవిశ్వాసం లోపించిన కారణం చేత, ఆ యుద్ధంలో దేవతలు ఓడిపోయారు.



పారిపోయిన దేవతలు మేరుపర్వతశిఖరం మీద ఉన్న బ్రహ్మలోకానికి చేరుకున్నారు. అక్కడ చక్కని వాతావరణం, పరిమళభరితమైన పుష్పాలు, లతలు, చల్లని నీటితో పారే సెలయేళ్ళు ఉన్నాయి. కానీ అవేవీ దేవతలకు ఊరటనివ్వలేకపోయాయి.

వారు బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళి ఆయనతో, "స్వామీ! ముల్లోకాలకూ సృష్టికర్తవు నీవే! మమ్మల్ని రక్షించు! దూర్వాసముని శాపం నుంచి బయటపడేందుకు ఏమి చెయ్యాలో సెలవియ్యి!" అని ప్రార్థించారు. బ్రహ్మ వారి ప్రార్థనలకు కరుణించి, కొద్దిసేపు ధ్యానించి, "సర్వలోకాలూ, సకలప్రాణులూ, చివరకు నాతో సహా ఎవరి నుంచి ఉద్భవించాయో ఆయన సహాయాన్ని కోరదాం, పదండి!" అని వారిని శ్రీమహావిష్ణువు వద్దకు తీసుకువెళ్ళాడు. అక్కడ, కన్నులు మిరుమిట్లుకొలిపేలా మెరిసిపోతూవున్న ఒక నిరాకారరూపాన్ని వారు దర్శించారు. ఆ ఆకారాన్ని భక్తిప్రపత్తులతో వారు ఆరాధించారు. అప్పుడు వేయి సూర్యుల కాంతితో మెరిసిపోతున్న విష్ణువు వారికి సాకారరూపంలో దర్శనమిచ్చాడు. దేవతలు, "ఓ ప్రభూ! నీకు తెలియనిదేమీ లేదు. మా కష్టాలు తీర్చి, అసురులను జయించేందుకు కావలసిన బలాన్ని మాకు అనుగ్రహించు!" అని కోరారు.

శ్రీమహావిష్ణువు వారితో, "నేను చెప్పేది శ్రద్ధగా వినండి! నేను చెప్పినట్టు చేస్తే అంతా సవ్యంగా జరుగుతుంది. మీ శత్రువులు మీ మీద విజయం సాధించారు కాబట్టి ప్రస్తుతానికి మీరు వారితో సంధి చేసుకోండి!" అన్నాడు. దానికి దేవతలు, "ప్రభూ! అలా సంధి చేసుకోవడం సాధ్యమేనా? ఆ రాక్షసులు వీలు చిక్కినప్పుడల్లా మమ్మల్ని అన్యాయంగా వేధిస్తున్నారే!" అన్నారు. దానికి విష్ణువు, "అవసరమైతే పాము కూడా ఎలుకతో స్నేహం చేస్తుంది. కాబట్టి అవసరమైతే శత్రువులనైనా సరే మంచి చేసుకోవాలి" అన్నాడు. ఇంకా, "మీరు ఇప్పుడు పాలసముద్రాన్ని మథించాలి. దానిలోనుంచి అమృతం పుడుతుంది. ఒకసారి ఆ అమృతాన్ని మీరు సాధిస్తే, మీరు అమరత్వాన్ని సాధించడమే కాక, రాక్షసులవల్ల కూడా మీకు భయం ఉండదు!" అని ఉద్బోధించాడు. ఇప్పుడు దేవతలకు ఒక అనుమానం కలిగింది. వారు విష్ణువుతో, "స్వామీ! రాక్షసులు మాతోపాటు అమృతాన్ని వెలికితీయడంలో సహాయం చేస్తే, మరి వారు కూడా అందులో వాటా అడుగుతారు కదా?" అన్నారు. "వారు మీకు సహాయపడినా సరే, వారికి అమృతం దక్కదు!" అని విష్ణువు అభయమిచ్చాడు.

గత్యంతరంలేక దేవతలు అసురుల్ని కలవడానికి బయలుదేరారు. వారు కొంచెం ముందుచూపుతో నేరుగా రాక్షసుల ఏలిక అయిన బలిచక్రవర్తి దగ్గరకు వెళ్ళారు. ఆ సమయానికి, అతడు ముల్లోకాలనూ జయించి, తిరిగి అసురపురికి


చేరి ఉన్నాడు. బలిచక్రవర్తి సంధి కోసం తన వద్దకు వచ్చిన దేవతల మీదకు మిగిలిన రాక్షసులు దాడిచేయకుండా వారించి, విషయమేమిటో చెప్పమన్నాడు. దేవతలు, "ఓ దానవేంద్రా! నీకు అమృతాన్ని సాధించడం ఇష్టమేనా?" అని అడిగారు. బలితోపాటు మిగిలినవారు కూడా తమకు ఇష్టమేనన్నారు. దేవతలు, "మేము అమృతాన్ని సాధించడానికి ఒక మార్గం కనుగొన్నాము. క్షీరసాగరాన్ని మథిస్తే అందులోనుంచి అమృతం పుడుతుంది. మీరూ, మేమూ కలిస్తేనే ఈ పనిని సాధించగలం. అలా వచ్చిన అమృతాన్ని పంచుకుంటే ఇద్దరమూ అమరత్వాన్ని సాధించగలుగుతాము. అప్పుడు మన వైరానికి స్వస్తి చెప్పవచ్చు!" అన్నారు. బలిచక్రవర్తికి ఈ పథకం నచ్చింది. తనతోటి రాక్షసులైన శంబరుడు, అరిష్టనేమి, పౌలోముడు, కాలకేయుడు మొదలైన వారితో చర్చించాడు. వారు కూడా అది బాగానే ఉందన్నారు.

ఈ పథకాన్ని ఆచరణలో పెట్టడం కోసం అంతవరకూ విరోధిస్తున్న దేవతలు, రాక్షసులు కలసి పనిచేయవలసి వచ్చింది! క్షీరసాగరమథనానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. ముందుగా వారందరూ పాలసముద్రం దగ్గరకు వెళ్ళి, అందులో రకరకాల ఓషధుల్ని వేశారు. మరి అంత పెద్దదిగా ఉన్న సముద్రాన్ని చిలకడం ఎలా? ఒక పెద్ద పర్వతాన్ని కవ్వంగా తెచ్చి పెడితేనే దాన్ని చిలకడం సాధ్యమవుతుంది. ఇందుకు మందర పర్వతాన్ని తెచ్చి, ఆ సముద్రంలో కవ్వంలా ఉపయోగించవచ్చునని వారు అనుకున్నారు. ఇక ఆ మందర పర్వతం చిన్నదేమీ కాదు. దాని శిఖరం ఎప్పుడూ మేఘాలతో కప్పబడి ఉంటుంది. అడుగు భాగం భూమిలోకి లోతుగా కూరుకుపోయి ఉంటుంది. ఇంద్రుడు, బలి చక్రవర్తితోపాటు మిగిలిన సురాసురులందరూ కలసి దాన్ని త్రవ్వి పైకి తీశారు. అందరూ ఒక్కసారిగా దానిని పైకెత్తి సముద్రం వైపు మోసుకుపోసాగారు. కానీ కొంతదూరం నడిచాక ఇక మోయలేకపోయారు. అది వారిమీదే పడింది. అనేకమంది దేవతలు, రాక్షసులు దాని క్రింద నలిగి ప్రాణాలు విడిచారు. "ఈ కష్టం నుంచి ఎలా గట్టెక్కాలి?" అని వారు ఆలోచిస్తున్నంతలో మహావిష్ణువు తన వాహనమైన గరుత్మంతుడి మీద ఎక్కి అక్కడకు వచ్చాడు. అతడు చనిపోయిన దేవతలను, రాక్షసులను బ్రతికించి, మందర పర్వతాన్ని అలవోకగా ఎత్తి గరుడుడి భుజాలమీద పెట్టాడు. గరుడుడు దానిని అనాయాసంగా పాలసముద్రంలో దించాడు.

ఇక దేవతలకు మందర పర్వతాన్ని కవ్వంగా చేసి తిప్పడానికి దానికి సరిపోయే తాడు కావలసి వచ్చింది. వారు సర్పాలకు రాజయిన వాసుకి దగ్గరకు వెళ్ళి, సముద్రాన్ని చిలకడానికి సహాయపడమని కోరారు. వాసుకి అందుకు అంగీకరించాడు. వాసుకి మందరపర్వతానికి చుట్టుకుని, ఒకవైపు తల, మరొక

వైపు తోక విడిచిపెట్టాడు. దేవతలు తలవైపు పట్టుకోవడానికి సిద్ధమయ్యారు. దానవులు తోకవైపు పట్టుకోవడాన్ని పరువుతక్కువతనంగా భావించి, "మీరే తోకవైపు పట్టుకోండి!" అని దేవతల్ని గద్దించారు. దేవతలు, "ఇంత చిన్న విషయాన్ని గురించి వివాదం ఎందుకు? మీకు నచ్చినట్టే కానివ్వండి!" అన్నారు.

ఎట్టకేలకు సముద్రమథనం మొదలైంది. కానీ అటూయిటూ తిరగడం మొదలు పెట్టిన కొద్దిసేపటికే మందరపర్వతం సముద్రంలో మునిగిపోసాగింది. ఏమి చెయ్యాలో పాలుపోక దేవదానవులు చూస్తున్నంతలో మహావిష్ణువు మళ్ళీ వచ్చాడు. ఈసారి ఆయన కూర్మం (అంటే తాబేలు) రూపంలో వచ్చి, మందర పర్వతానికి క్రింద చేరి, దాన్ని పైకిలేవనెత్తాడు. దానితో మళ్ళీ సాగరమథనం మొదలైంది.



కొంత మథనం జరిగాక, ఆ ఒరిపిడికి తట్టుకోలేక, వేయి పడగల వాసుకి విషవాయువులు కక్కడం మొదలుపెట్టాడు. వాటివల్ల దేవదానవులు ఊపిరందక ఇబ్బంది పడసాగారు. ఇంద్రుడు చల్లని వర్షాన్ని కురిపించి ఆ వాయువుల్ని తొలగించాడు. మథనం కొనసాగింది. ఆ మథనం నుంచి రకరకాల చేపలు, పాములు, తిమింగలాలూ పుట్టుకు వచ్చాయి.

ఇక ఆపైన, అమృతం వస్తుందని ఎదురుచూస్తున్నవారికి దిగ్భ్రమ కలిగిస్తూ, హాలాహలం అనే విషం వెలువడింది. అది ఒక పెద్ద మేఘంలాగా అన్ని లోకాలనూ క్రమ్మివేయసాగింది. ఆ కాలకూటవిషం ధాటికి సకల జీవరాశి నశించిపోయేలా

ఉంది. అప్పటివరకూ ఆదుకుంటున్న బ్రహ్మ, విష్ణువు కూడా ఈసారి సాయం చేయలేమన్నారు. దానితో దేవదానవులు పరమశివుడికి ప్రార్థన చేశారు. శివుడు ఆ గరళం మొత్తాన్ని తన అరచేతిలోకి తీసుకుని మింగివేశాడు. కానీ దానిని కడుపులోనికి పోనివ్వకుండా తన కంఠంలోనే నిలిపాడు. ఆ విషం యొక్క ప్రభావానికి అతడి కంఠం నీలంగా మారింది. అందుచేతనే ఆయనకు నీలకంఠుడనే పేరు వచ్చింది. దేవదానవులందరూ పరమశివుడికి కృతజ్ఞతలు తెలుపుతూ, 'ఓ జగద్రక్షకా! మా ప్రార్థనలు విని మమ్మల్ని రక్షించినందుకు నమస్సులు! లోకరక్షణార్థమై నీవు చేసిన త్యాగం ఈ లోకానికే ఆదర్శం. నీవు యతులకే యతీశ్వరుడివి!" అని స్తుతించారు.

ఆ తర్వాత సురాసురులు క్షీరసాగరమథనాన్ని కొనసాగించారు. అందులో నుంచి సురభి అనే కామధేనువు, ఉచ్చైశ్రవం అనే గుర్రం, అప్సరసలు, పారిజాతవృక్షం, వారుణి అనే దేవత బయటకు వచ్చారు. వాటిని దేవతలు, రాక్షసులు ఎక్కువ విభేదాలు లేకుండానే పంచుకున్నారు. వాటి తర్వాత చంద్రుడు వెలువడ్డాడు. చంద్రుణ్ణి శివుడికి కానుకగా ఇచ్చారు. చంద్రుడు విశ్వేశ్వరుడి జటాజూటానికి అలంకారమయ్యాడు.

ఆ పైన అందులోనుంచి లక్ష్మీదేవి పుట్టింది. ఆమె మనోహరమైన రూపాన్నీ,



గొప్ప తేజస్సునూ చూసి దేవదానవులందరూ ఆమెకు సేవ చెయ్యడానికి సిద్ధమయ్యారు. గంగ మొదలైన పుణ్యనదులు తమ జలాలతో ఆమెకు అభిషేకం చేశారు. వసంతుడు ఆమెకు పూలూ, పండ్లూ అర్పించాడు. అప్సరసలు ఆమె ముందు నాట్యం చేశారు. గంధర్వులూ, కిన్నెరలూ ఆమె ముందు ఆడిపాడారు. వరుణుడు వైజయంతిమాలను తెచ్చి ఆమె చేతికిచ్చాడు. లక్ష్మీదేవి ఆ దండను శ్రీమహావిష్ణువు మెడలో వేసి ఆయనను భర్తగా వరించింది.

ఇక చిట్టచివరిగా దేవవైద్యుడైన ధన్వంతరి అమృతకలశాన్ని తీసుకుని బయటకు వచ్చాడు. అతణ్ణి చూడడంతోనే రాక్షసులందరూ పరుగున వెళ్ళి, వారి సహజప్రవృత్తికి తగ్గట్టు, దానిని అతడి దగ్గర నుంచి లాక్కుని పరుగులు పెట్టారు. దేవతలు చేసేదేమీ లేక, వెళ్ళి శ్రీమహావిష్ణువుతో మాకు న్యాయం చెయ్యమని కోరారు. విష్ణువు అప్పుడు జగన్మోహినీ రూపాన్ని ధరించాడు. ఈలోపలే దానవులు అమృతం కోసం తమలోతాము పోట్లాడుకోవడం మొదలుపెట్టారు. అయితే, వారు జగన్మోహినిని చూడడంతోనే ఒళ్ళు మరిచిపోయి, ఆమె వెంటబడ్డారు. “మాకు ఈ అమృతాన్ని పంచుకోవడం కుదరడం లేదు. నువ్వే పంచిపెట్టు!” అని ఆమెనే కోరారు. మోహిని వారితో, “అయితే మీరు నా నిర్ణయాన్ని తప్పుపట్టకూడదు!” అని హెచ్చరించింది. వారు సరేనన్నారు.

సురాసురులు బారులుతీరి కూర్చున్నారు. మోహిని ముందుగా దేవతలకు అమృతాన్ని పోయడం ప్రారంభించింది. ఆమె వాలకం చూస్తే రాక్షసులకు ఏమీ మిగిల్చేలా కనపడలేదు. కానీ మోహినినే కన్నార్పకుండా చూస్తున్న రాక్షసులు ఇది గమనించలేదు. కానీ రాహుకేతువులనే రాక్షసులకు, “మాకు అమృతాన్ని పంచే ఆలోచన ఈమెకు ఉన్నట్టు లేదే!” అని అనుమానం కలిగి, మారురూపాలతో దేవతల వరుసలో కూర్చున్నారు. మోహిని వారికి కూడా అమృతాన్ని పోసింది. అయితే వారు మ్రింగేలోపల సూర్యుడు కనిపెట్టి, “వారు రాహుకేతువులు! వారికి అమృతాన్ని పోయవద్దు!” అని హెచ్చరించాడు. రాహుకేతువులు ఈ లోపలే అమృతాన్ని తమ నోటిలో పోసుకున్నారు. అమృతం వారి గొంతులోకి దిగేలోపలే మోహినిరూపంలోని విష్ణువు తన చక్రంతో వారి మెడలను కత్తిరించాడు. రాహువు తల ఎగిరిపోయి అంతరిక్షంలో పరిభ్రమించసాగింది. తెగిన తలలకు అమృతత్వం లభించింది మరి!

ఎప్పుడైతే మోహినిరూపంలో ఉన్నది విష్ణువని రాక్షసులు గ్రహించారో వారికి జరిగిన మోసం అర్థమయింది. వారు యుద్ధానికి దిగారు. ఆ యుద్ధంలో, సహజంగానే అమృతం తాగి కొత్త శక్తిని సంతరించుకున్న దేవతలది పైచేయి అయింది. ఓడిపోయిన రాక్షసులు పాతాళానికి పారిపోయారు.

జీవితంలో ఏదోవొక ఉన్నతమైన ఆదర్శాన్ని చేపట్టి సాధించడం, మనస్సును స్వాధీనం చేసుకోవడం, పరిపూర్ణతను సాధించడం అనే ఘనకార్యాలు అమృతాన్ని సాధించడంతో సమానమైనవే! అవి ఎంత కష్టమో, వాటిని ఎలా సాధించాలో వివరించేందుకే ఈ కథను మన పూర్వీకులు చెప్పారని మనం అర్థం చేసుకోవచ్చు.

మన అహంకారమే మన కళ్ళు మూసుకుపోయేలా చేసి మన పతనానికి కారణమవుతుందని ఈ కథలో మనం నేర్చుకోవలసిన మొదటి విషయం. దేవేంద్రుడు-దూర్వాసుడి వృత్తాంతంలో ఈ విషయం తెలుస్తుంది. అయితే, ఒకసారి పతనమైతే ఇక మనకు ఏ భవిష్యత్తూ లేదని నిరాశ చెందకుండా, దేవతలలా, ఆ స్థితి నుంచి బయటపడడానికి మార్గాన్ని అన్వేషించాలి. అసలు మనిషిగా పుట్టి, బ్రతకవలసిరావడమనే ఈ స్థితి, దివ్యత్వం నుంచి పతనమవ్వడం వల్లనే మనకు కలిగింది.

ఇటువంటి స్థితిలో బ్రహ్మ, విష్ణువులాంటి గురువులు మనకు తటస్థపడితే ఏ మార్గాన్ని అనుసరించాలో సూచిస్తారు. లేశమైనా స్వార్థంలేని అటువంటి గురువులు మన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరిష్కారం చూపుతారు. వారు మనకు నిర్దేశించే ఆదర్శం మన మేలు కోరేదిగానూ, మనకు ఔన్నత్యాన్ని కలిగించేదిగానూ ఉంటుంది. ప్రస్తుతకథలో విష్ణువు ఆదేశించినట్టు, అమృతాన్ని త్రాగి, అమరత్వాన్ని సాధించడమనే ఉన్నతాదర్శాన్ని దేవతలు చేపట్టారు. అలాగే మనం కూడా ఏ ఆదర్శాన్నయినా చేపట్టవచ్చును. ఇక ఆ ఆదర్శాన్ని సాధించడం అమృతాన్ని సాధించడమంత కష్టం. దాన్ని సాధించడానికి పర్వతాన్ని కవ్వంగా చేసుకుని, సముద్రాన్ని చిలకాలి. అంటే అంత పెద్ద ఎత్తున ప్రయత్నం చెయ్యాలి. మనిషిగా పుట్టినందుకు, మనం జీవితంలో చెయ్యవలసిన ప్రయత్నం ఎంత బృహత్తరమైనదో సూచించడానికే సముద్రమథనాన్ని ఉదాహరణగా మన పూర్వీకులు చెప్పారు.

మహావిష్ణువు సముద్రాన్ని చిలకమనీ, దాని ద్వారా అమృతాన్ని సాధించుకోమనీ చెప్పాడు కదా! అలా ఎందుకు చేశాడు? తానే క్షణంలో అమృతాన్ని సృష్టించి వారి చేతిలో పెట్టవచ్చు కదా! కానీ భగవంతుడు అలా చెయ్యడు. మనిషి కష్టపడి పనిచేసి 'మనీషి'గా ఎదగడాన్ని చూడడమే భగవంతుడికి ఇష్టం. దీనిని వివరించే చక్కని పద్యం ఒకటి ఉంది.

**విను, పురుషుడు గావింపని**
**పనులకు దైవమది యెట్లు ఫలమొనరించున్?**
**జనములు కార్యము నడుపగ,**
**ననుకూలత నిచ్చుగాక యయ్యయి ఫలముల్ ॥**

మనిషి చేయని పనులకు ఏ దేవతలు మాత్రం ఫలితాన్ని ఇవ్వగలరు? మనిషి ఎంతగా పనిలో లీనమైపోయిన తత్పరతతో పనిచేశాడన్న దాన్ని బట్టే భగవంతుడు ఫలితాన్ని ఇస్తాడు. మనిషి పనిచేస్తున్నప్పుడు అతడి చిత్తశుద్ధిని గమనించి అతడికి పరిస్థితులు అనుకూలించేలా చేయడమే భగవంతుడు చేసే పని.

ఈ కథలో దేవతలు, దానవులు కలిసి పనిచేశారని చెప్పారెందుకు? లక్ష్యసాధన కోసం దైవగుణాలూ, రాక్షసగుణాలూ రెంటినీ మనం పనిలోపెట్టాలని దాని అర్థం. దేవదానవులు అక్కచెల్లెళ్ళ సంతానం - అంటే వరుసకు అన్నదమ్ములు అవుతారు. అదే విధంగా మంచీచెడూ లక్షణాలు ఒకే నాణానికి బొమ్మాబొరుసూ లాంటివి. వాటన్నింటినీ సరైన రీతిలో ప్రయోగించినప్పుడే మనకు విజయం సంప్రాప్తిస్తుంది. ముందుగా, ఉత్సాహం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం మొదలైన దైవగుణాలను వినియోగించుకోవాలి. ఈ దైవగుణాలను పనిలో పెట్టడాన్ని గురించి మనం అర్థం చేసుకోవచ్చు కానీ, మరి రాక్షసగుణాలను ఎలా పనిలో పెట్టాలి? కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం మొదలైన రాక్షసగుణాలను మనలోని జడత్వాన్ని (బద్ధకాన్ని), అశ్రద్ధను వదిలించుకోవడానికి ఉపయోగించాలి. వాటిని కాదంటే కుదరదు. కామం సహాయంతో ఆదర్శం మీద మక్కువ పెంచుకోవాలి. దాని మీద తగినంత పట్టుదల, శ్రద్ధ కలుగనందుకు మన మీద మనమే క్రోధాన్ని చూపించుకోవాలి. లోభి ధనం కోసం తహతహ లాడినట్టు, మనం మన ఆదర్శం కోసం తహతహలాడాలి. మోహంతో కళ్ళు మూసుకుపోయినవాడు మిగిలిన విషయాలను పట్టించుకోనట్టు, మన ఆదర్శం గురించే యోచించడం కోసం మోహాన్ని ప్రయోగించాలి. మన పూర్వీకుల గొప్పతనాన్ని తలచుకుని గర్వించేందుకు మదాన్ని ఉపయోగించాలి. అభ్యాసంలో ఇతరుల కంటే వెనుకబడకూడదన్న భావనను పెంపొందించుకోవడం కోసం మాత్సర్యాన్ని నియోగించాలి.

మన జీవితంలో ఒక ఆదర్శాన్ని చేపట్టడమే చాలా కష్టం. మందరపర్వతాన్ని తీసుకుపోయి సముద్రంలో పెట్టడంతో దాన్ని పోల్చవచ్చు. ఆపైన, ఒక ఆదర్శాన్ని చేపట్టిన తర్వాత ఎలా పనిచెయ్యాలి? "జీవితంలో మనం ఒకే ఆలోచనను చేపట్టాలి" అని వివేకానంద స్వామి చెప్పారు కదా! "దాన్ని గురించే ఆలోచించండి, దానినే కలగనండి, దానినే మీ జీవితంగా మలచుకోండి!" అని ఆయన చెప్పినట్టు, మనం ఆ ఆలోచనను (అంటే మనం చేపట్టిన ఆదర్శాన్ని) మనస్సులో ఉంచి, కొండతో సముద్రాన్ని చిలికినట్టు చిలకాలి. సముద్రంలో ఓషధులు వేసినట్టు మన మనస్సుకు, శరీరానికి బలాన్ని కలిగించే ఆహారాన్ని, వ్యాయామాన్ని ఇవ్వాలి. వాటి ద్వారా, "ఇనుప కండరాలు, ఉక్కునరాలు, దానిలో వజ్రకఠోరమైన మనస్సు"లను

పెంపొందించుకోవాలి. అప్పుడే పైన చెప్పుకున్నంత కృషి చేయడం సాధ్యపడుతుంది. ఇలా పనిచేయడాన్నే 'అభ్యాసం' అంటారు.

ఇక మన కథలో మందర పర్వతం మునిగిపోయినట్టుగా, మనం పనిచేయడం ప్రారంభించినప్పుడు నిస్పృహ ఆవరిస్తుంది. ఈ పని సాధ్యమవ్వదేమో, దీన్ని వదిలి వేరే పనిని చూసుకోవడం మేలేమోనన్న ఆలోచన కలుగుతుంది. మందర పర్వతాన్ని కూర్మరూపంలో మహావిష్ణువు పైకి లేవనెత్తాడు కదా. కూర్మం (అంటే తాబేలు) వైరాగ్యానికి చిహ్నం. ఎలాగయితే తాబేలు ఒకసారి తన కాళ్ళను, తలను లోపలికి లాగుకున్న తర్వాత ఎట్టి పరిస్థితులలోనూ వాటిని బయటకు విడిచిపెట్టదో, అలాగే మనం మిగిలిన విషయాలన్నింటినుంచీ మనస్సును వెనక్కి పట్టితెచ్చి, నిస్పృహ నుంచి లేవనెత్తి, చేపట్టిన పని మీద లగ్నంచేసి, చావో రేవో తేల్చుకుందామన్నట్టు ఆ పనిని వదలకుండా చెయ్యాలి. ఇలా మనస్సును మిగిలిన విషయాలనుంచి వెనక్కి మరలించడాన్నే 'వైరాగ్యం' అంటారు.

మనం ఏ పని అయినా మొదలుపెడితే దాని మీద ఎన్నో విమర్శలు వస్తాయి. "ప్రతి పనీ అవహేళన, వ్యతిరేకత, ఆ తర్వాత సమ్మతి అనే మూడు స్థితులను దాటిపోవలసిందే!" అని వివేకానంద స్వామి చెప్పారు! ఎటువంటి వ్యతిరేకతనూ ఎదుర్కోకుండా తన లక్ష్యాన్ని సాధించిన మానవుడు ఈ భూప్రపంచంలో ఇంకా పుట్టలేదు. వాసుకి విషాన్ని కక్కడం, హాలాహలం వెలువడడం కూడా ఆ వ్యతిరేకత వంటివే. అయితే వాటికి ప్రతిగా మనం కూడా విసుగు, నిరాశ, నిస్పృహ చూపకూడదు. పరమశివుడు హాలాహలాన్ని ఉదరంలోనికి పోకుండా కంఠంలోనే నిలిపినట్టు మనం కూడా ఆ వ్యతిరేకత అనే విషాన్ని భరించి, అది మనల్నే కాల్చివేయకుండా దానిని నిగ్రహించి, పనిని కొనసాగించాలి. ఎదుర్కొన్న విమర్శలలో నుంచి మన ఆదర్శాన్ని సాధించేందుకు ఉపయోగపడేదేమన్నా ఉంటే దాన్ని గ్రహించాలి.

మథనం చేస్తున్నప్పుడు వెలువడిన రకరకాల మంచిమంచి వస్తువులలాగా మనం ఆదర్శం కోసం ప్రయత్నం చేస్తున్నప్పుడు అనేక ప్రలోభాలు పుట్టుకువచ్చి – అవి మనకు మంచివిగానే తోచవచ్చు గాక – మన దృష్టిని మరలుస్తాయి. సాధారణంగా మనుష్యులు వాటి వ్యామోహంలో పడి, వాటితోనే సంతృప్తిపడి, అక్కడితోనే ఆగిపోతారు. అయితే అలా ఆగిపోకుండా, మనం చేపట్టిన ఆదర్శం సిద్ధించేవరకూ, ఆ దేవతలు, రాక్షసులు చేసినట్టు, పట్టుదలతో పనిచెయ్యాలి.

ఈ ప్రయత్నంలో కొంతదూరం వెళ్ళాక, అంతవరకూ మనం చేసిన శ్రమకు ఫలితంగా, కొన్ని శక్తియుక్తులు, వాటి ద్వారా చంద్రుడిలాంటి రూపంలో పేరుప్రఖ్యాతులు లభిస్తాయి. ఆ శక్తియుక్తులతో విర్రవీగకుండా, 'అందరికీ మామ

చందమామ' అన్నట్టు, అందరితో స్నేహంగా ఉండి, మన శక్తియుక్తులు లోకానికి మేలుచేసేలా ప్రవర్తించాలి. ఆ తర్వాత పుట్టిన లక్ష్మీదేవిలాగా ధనం, సంపదలు కూడా కలుగవచ్చు. లక్ష్మీదేవి సర్వవ్యాపకత్వానికి చిహ్నమైన విష్ణువును వరించి నట్లు మనం సంపాదించిన ధనం విశ్వమానవ సమాజాన్ని సేవించడానికే ఉపయోగించాలి. పేరుప్రఖ్యాతుల వలన, ధనం వలన కలిగే అహంకార మమ కారాలు మన ఆదర్శాన్ని సాధించనివ్వకుండా మనల్ని ఇట్టే పక్కదోవ పట్టిస్తాయి. కాబట్టి వాటిని ఎలా అదుపులో పెట్టుకోవాలో ఈ కథలో చక్కగా సూచించబడింది.

మన పురోగతికి మోకాలడ్డే ఈ ఆటంకాలన్నింటినీ పట్టించుకోకుండా, మన వైరాగ్యాన్ని నిలుపుకుంటూ, అభ్యాసాన్ని కొనసాగించాలి. దేవదానవులు అనేకమైన ఇతర విషయాలు పుట్టుకువచ్చినా తమ దృష్టిని పక్కలకు మరల్చకుండా మథనాన్ని కొనసాగించారు కదా! చివరికి అమృతం లభించినట్లు, అలా కృషి చేసినప్పుడే మన ఆదర్శాన్ని సాధించగలుగుతాము. ఒకసారి అమృతాన్ని అంటే పూర్ణత్వాన్ని సాధించిన తర్వాత భగవంతుడే జగన్మోహినిలాగా, మన బాధ్యతను స్వీకరించి, మనలోని దైవ లక్షణాలను పరిరక్షించి, రాక్షస లక్షణాలను నిర్మూలిస్తాడు.

భర్తృహరి ఈ సముద్రమథనాన్ని దృష్టాంతంగా తీసుకుని ధీరులైన వారు పనిచేసే పద్ధతి ఎలా ఉంటుందో క్రింది శ్లోకంలో వివరించాడు.

**రత్నైర్మహాబ్ధేస్తు తుషుర్న దేవా**
**న భేజిరే భీమవిషేణ భీతిమ్ ।**
**సుధాం వినా న ప్రయయుర్విరామం**
**న నిశ్చితార్థాద్విరమంతి ధీరాః ॥ (భర్తృహరి)**

**తనిసిరే వేల్పు లుదధి రత్నములచేత?**
**వెఱచిరే ఘోరకాకోల విషముచేత?**
**విడిచిరే యత్న మమృతంబు వొడముదనుక?**
**నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు ॥ (ఏనుగు లక్ష్మణకవి)**


పాలసముద్రాన్ని దేవతలు మథించారు. ఆ మథనంలో ముందుగా పుట్టిన మణులకే వారు సంతోషపడిపోలేదు. భయంకరమైన కాలకూటవిషం పుట్టినా భయపడిపోలేదు. అమృతం తయారయ్యేవరకూ తమ ప్రయత్నాన్ని మానుకోలేదు. నిపుణులైన బుద్ధిమంతులు ఆ విధంగా తాము సంకల్పించిన పని సక్రమంగా పూర్తయ్యేవరకూ వదిలి పెట్టరు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# 5. విశ్వామిత్రుడు

విశ్వామిత్రుడు పూర్వాశ్రమంలో ఒక రాజు. ఒకనాడు తన సేనలతో కలసి వెడుతుండగా మార్గమధ్యంలో బ్రహ్మర్షి వసిష్ఠుడి ఆశ్రమం తటస్థించింది. ఆ ఋషి వారిని సాదరంగా ఆహ్వానించి, తన ఆతిథ్యం తీసుకోమని కోరాడు. అందుకోసం వసిష్ఠుడు తన దగ్గర ఉన్న సబల అనే ఆవును రప్పించి, "తల్లీ! వీరందరికీ మనం విందు ఏర్పాటు చెయ్యాలి!" అని కోరాడు. వెంటనే అక్కడ అద్భుతమైన ఆహారపానీయాలు ప్రత్యక్షమయ్యాయి. అటువంటి భోజనాన్ని వారు అంతకు ముందు తిని ఉండలేదు. ఇదంతా చూసిన విశ్వామిత్రుడికి ఆ ఆవును సొంతం చేసుకోవాలన్న కోరిక కలిగింది.

విశ్వామిత్రుడు వసిష్ఠుడికి కృతజ్ఞతలు తెలుపుతూనే, దేశానికి రాజు అయిన తన వద్ద ఆ ఆవు ఉంటే మరింత ఉపయోగకరంగా ఉంటుందని చెప్పి దానిని తనకు ఇమ్మన్నాడు. అయితే అటువంటి దైవదత్తమైన కామధేనువును వేరొకరికి ఇవ్వడం వసిష్ఠుడికి సుతరామూ ఇష్టం లేదు. ఆయన అనేక కారణాలు చెపుతూ తనను బలవంతం చెయ్యవద్దని బ్రతిమాలాడు. అయితే వసిష్ఠుడు వద్దన్నకొద్దీ



విశ్వామిత్రుడి మొండిపట్టు పెరిగిపోయింది. అనునయంతో చెప్పిన మాటలకు వసిష్ఠుడు ఒప్పుకోకపోవడంతో ఆ ఆవును బలవంతంగా బంధించి తీసుకురమ్మని విశ్వామిత్రుడు తన సైనికులకు ఆజ్ఞ ఇచ్చాడు.

అయితే ఆ ఆవు వారికి దొరకకుండా తప్పించుకుని వసిష్ఠుడి వద్దకు చేరింది. "స్వామీ! ఈ దుర్మార్గుడు నన్ను తీసుకుపోకుండా, నన్ను నేను రక్షించుకునేందుకు నాకు అనుజ్ఞ ఇవ్వండి!" అని కోరింది. గత్యంతరం లేక వసిష్ఠుడు అందుకు అంగీకరించాడు. మరుక్షణం సబల పెద్ద సైన్యాన్ని పుట్టించింది. విశ్వామిత్రుడి సైన్యాన్ని వారు ఇట్టే ఓడించారు. ఇది చూసి విశ్వామిత్రుడు తానే విల్లు, అమ్ములు చేతబట్టి యుద్ధం చేసినా లెక్కకుమిక్కిలిగా పుట్టుకువస్తున్న ఆ సైన్యం ధాటికి ఏమీ చేయలేకపోయాడు. ఇక, అక్కడే ఉన్న విశ్వామిత్రుడి కొడుకులు వసిష్ఠుడి మీద దాడికి దిగారు. అయితే ఆయన తపోబలానికి కాలి బుగ్గి అయిపోయారు.

ఈ విధంగా పరాజయాన్నీ, పరాభవాన్నీ చవిచూసిన విశ్వామిత్రుడు ప్రతీకారం తీర్చుకోవడం కోసం, దివ్యశక్తులను పొందాలనుకున్నాడు. రాజధానిలో మిగిలి వున్న ఒక కొడుకుకు తన రాజ్యాన్ని అప్పగించి, తపస్సు చేయడానికి హిమాలయాలకు సాగిపోయాడు. వసిష్ఠుడి కంటే ఎక్కువ శక్తిని పొందాలన్న కోరికతో శివుణ్ణి గురించి ఘోరమైన తపస్సు చేశాడు. అతడి తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమన్నాడు. 'నాకు అన్ని దివ్యాస్త్రాలనూ, వాటిని ప్రయోగించడంలో అద్భుతమైన నేర్పునూ ప్రసాదించు, ప్రభూ!' అని విశ్వామిత్రుడు కోరాడు. పరమశివుడు సమ్మతించి, దేవ-గంధర్వ-యక్ష-రాక్షసులకు సంబంధించిన అన్ని అస్త్రాలనూ విశ్వామిత్రుడికి అనుగ్రహించాడు.


వాటన్నింటినీ పొంది, వరగర్వంతో పొంగిపోతూ విశ్వామిత్రుడు వసిష్ఠుడి ఆశ్రమానికి వచ్చాడు. ఒక్క అస్త్రంతో ఆ ఆశ్రమాన్ని బుగ్గిచేశాడు. వసిష్ఠుడు ఏమి జరిగిందో గ్రహించి, పరిస్థితి ఇలా దిగజారినందుకు బాధపడుతూ తన దండంతో అతడికి ఎదురువచ్చాడు. అతణ్ణి చూసి మరింత కోపంతో విశ్వామిత్రుడు తన దగ్గర ఉన్న ఆయుధాలను ప్రయోగించసాగాడు. వసిష్ఠుడు వాటినన్నింటినీ తన దండంలో లయం చేసేశాడు. చివరిగా విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తే అది కూడా వసిష్ఠుడి మంత్రదండంలో లయమైపోయింది. ఇది చూసి విశ్వామిత్రుడు నిశ్చేష్టుడయ్యాడు. తన అస్త్రశక్తి వసిష్ఠుడి యొక్క తపశ్శక్తి ముందు ఎందుకూ కొరగాదని గ్రహించి తాను కూడా వసిష్ఠుడిలాగా బ్రహ్మర్షి కావాలని భావించి తిరిగి తపస్సు చేయడానికి బయలుదేరాడు.

ఏళ్ళ తరబడి ఘోరమైన తపస్సు చేశాడు. ఒకనాడు బ్రహ్మ ప్రత్యక్షమై అతడి తపస్సుకు ఫలితంగా అతడు 'రాజర్షి'గా పిలువబడతాడని పలికి అదృశ్యమై

పోయాడు. కానీ దీనితో విశ్వామిత్రుడికి సంతృప్తి కలుగలేదు. వసిష్ఠుడికి సమమైన బ్రహ్మర్షి స్థితిని పొందాలని మళ్ళీ ఘోరమైన తపస్సులో మునిగిపోయాడు.

ఆ కాలంలో సూర్యవంశపు రాజైన త్రిశంకువు అయోధ్యను పాలిస్తున్నాడు. అతడికి తన అందమైన శరీరం మీద విపరీతమైన వ్యామోహం ఉండేది. చనిపోయిన తర్వాత ఆ శరీరాన్ని వదిలివేయవలసి వస్తుందన్న భయంతో, ఆ శరీరంతోనే స్వర్గానికి పోవాలనుకున్నాడు.

తన గురువైన వసిష్ఠుడి దగ్గరకుపోయి తన కోరికను తెలిపాడు. అయితే ఈ అసాధ్యమైన కోరిక నెరవేరజాలదని చెప్పి, వసిష్ఠుడు ఆ ఆలోచన మానుకో మన్నాడు. కానీ త్రిశంకువుకు ఆ హితవు చెవికెక్కలేదు. వసిష్ఠుడి పుత్రుల దగ్గరకు వెళ్ళి ఇదే మాటను అడిగాడు. తమ తండ్రి చేయనన్న పని తాము కూడా చేయమనీ, అటువంటి అహంకారం తగదనీ, వాళ్ళు చీవాట్లు పెట్టారు. అయితే త్రిశంకువు ఊరుకోకుండా, "మీరు చేయలేనంటున్నారు కాబట్టి మీకన్నా ఎక్కువ తపోబలం ఉన్న మనిషిని నేనే వెతుకుతానులేండి!"



అని వారితో చెప్పాడు. దానితో వారి కోపం తారస్థాయికి చేరి, "ఛండాలుడివై పో!" అని శపించారు. ఆ శాపబలం వల్ల మహారాజు రూపం వికృతంగా, ఎవరూ గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

ఆ విధంగా తయారైన ఆ రాజును గుర్తుపట్టలేక, ప్రజలు అతణ్ణి దేశం నుండి తరిమేశారు. రాజ్యభ్రష్టుడైన త్రిశంకువు అడవులుపట్టి తిరుగుతూ, చివరికి విశ్వామిత్రుడి ఆశ్రమానికి చేరాడు. అయితే రాజర్షి విశ్వామిత్రుడు అతణ్ణి గుర్తుపట్టి "నువ్వు త్రిశంకువువు కదా! ఎందుకు ఇలా తయారయ్యావు? ఎవరు నిన్ను శపించారు?" అని ప్రశ్నించాడు. త్రిశంకువు జరిగిన కథ అంతా వివరించాడు. "స్వామీ! నేను ఎప్పుడూ ధర్మం విడిచి నడవలేదు. నేను ఏ పాపమూ చెయ్యలేదు. నా గురువు, అతని కొడుకులు నాకు చీవాట్లు పెట్టడమే కాక, ఇలా అయ్యేలా శపించారు. నన్ను మీరే రక్షించాలి!" అని విశ్వామిత్రుణ్ణి వేడుకున్నాడు.

క్షణంలో విశ్వామిత్రుడికి అతడి మీద జాలి కలిగింది. "నీ కోరిక తీరుస్తాను!" అని అతడికి మాట ఇచ్చాడు. పైగా వశిష్ఠుడి కన్నా తాను గొప్పవాణ్ణని నిరూపించుకోవడానికి ఇంతకు మించిన అవకాశం దొరకదని అతడికి తోచింది. విశ్వామిత్రుడిలో ఉన్న పెద్ద బలహీనత ఇదే. క్షణికమైన ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవడం, కోపం, జాలి, కామం మొదలైన భావోద్రేకాలకు లొంగిపోవడం, తాను జీవితంలో ప్రస్తుతం ఏ లక్ష్యం కోసం పనిచేస్తున్నాడో దానిని మరచిపోయి, ఎదురుగా కనిపించిన మరో లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించడం అనే చెడు లక్షణాలను అతడిలో మనం గమనించవచ్చు.

విశ్వామిత్రుడు త్రిశంకువుతో తియ్యగా మాట్లాడుతూ, "నేను నీకు అభయం ఇస్తున్నాను. నిన్ను బొందితో స్వర్గానికి పంపేందుకు కావలసిన యాగాన్ని నేను చేయిస్తాను. ఈ ఛండాలదేహంతోనే నీవు స్వర్గానికి చేరతావు చూడు!" అని చెప్పాడు. దానికి తగ్గట్లుగా, అంతవరకూ ఎవరూ కనీవినీ ఎరుగనటువంటి కార్యాన్ని సాధించడానికి అవసరమైన యాగానికి తగిన ఏర్పాట్లను తానే చేశాడు.

అందరు ఋషులనూ, వారి శిష్యులనూ పిలుచుకు రమ్మని తన శిష్యుల్ని పంపాడు. రాలేమని అంటే ఎక్కడ శపిస్తాడోనన్న భయంతో వారందరూ వచ్చారు. అయితే వసిష్ఠుడి పుత్రులు మాత్రం ఈ వింత యాగాన్ని గురించి గేలిచేస్తూ మాట్లాడారు. ఇది తెలిసి విశ్వామిత్రుడు మండిపడి, వారు అప్పటికప్పుడు చనిపోయి, ఏడుతరాలపాటు కుక్క మాంసం తినే ఆదిమ జాతులలో పుడతారని శపించాడు. అతడి శాపం అక్షరాలా నిజం అయింది.

యాగం మొదలైంది. ఎక్కడ శపిస్తాడోనన్న భయంతో ఇతర ఋషులు కూడా అందులో సహాయపడ్డారు. కానీ దేవతలకు హవిస్సులు అర్పించేటప్పుడు, ఏ

దేవతా వాటిని స్వీకరించడానికి దిగిరాలేదు. యాగం విఫలమవుతున్న విషయం స్పష్టమై, అక్కడకు చేరిన ఋషులు తమలో తాము నవ్వుకోసాగారు. ఇది చూసి కోపంతో మండిపడ్డ విశ్వామిత్రుడు, "ఓ త్రిశంకూ! నా తపఃఫలాన్ని మొత్తం నీకు ధారపోస్తున్నాను. దాని బలంతో నువ్వు స్వర్గానికి పోతావు! దేవతలకు నచ్చక పోయినా సరే, నువ్వు స్వర్గానికి వెళ్ళి తీరతావు!" అన్నాడు. అతడు సంపాదించిన తపోబలం తక్కువేమీ కాదు. ఆ అమోఘమైన తపశ్శక్తి సహాయంతో ఒక్కసారిగా త్రిశంకువు గాలిలోకి లేచి స్వర్గం వైపు ఎగిరిపోసాగాడు.



అయితే స్వర్గానికి చేరుకున్న త్రిశంకువును ఇంద్రుడు రానివ్వకుండా, "గురువు చేత శపించబడినవాడికి స్వర్గంలో స్థానం లేదు! మళ్ళీ భూమి మీదకే పో!" అని క్రిందకే నెట్టివేశాడు. దానితో త్రిశంకువు మళ్ళీ భూమి మీద పడిపోతూ, "ఓ విశ్వామిత్ర మహర్షీ! నన్ను రక్షించండి!" అని కేకలు పెట్టసాగాడు. ఇది చూసి విశ్వామిత్రుడు కోపంతో మండిపడుతూ, "ఈ దేవతలకు నేను గుణపాఠం నేర్పుతాను. ఆగు! త్రిశంకూ! అక్కడే ఆగు! చూడు! సృష్టికి ప్రతిసృష్టి చేస్తాను!"



అన్నాడు. త్రిశంకువు అక్కడికక్కడే ఆగి ఆకాశంలో ఒక తారలాగా వ్రేలాడ సాగాడు. అది చూసి విశ్వామిత్రుడు అతడి చుట్టూ మరొక స్వర్గాన్ని నిర్మించడానికి సిద్ధపడ్డాడు. అతడి చుట్టూ ఒక క్రొత్త నక్షత్రమండలాన్ని నిర్మించి, క్రొత్త జీవజాలాన్ని కూడా సృష్టించి, చివరికి కొత్త దేవతలనూ, కొత్త ఇంద్రుణ్ణీ కూడా సృష్టించబోయాడు. ఇది చూసి దేవతలు భయపడ్డారు. వారు విశ్వామిత్రుడి వద్దకు దిగివచ్చి, “స్వామీ! ఎల్లవేళలా శిష్యుడి హితవును కోరే గురువును పరిహాసం చేసి, అతడిచేత శాపానికి గురైనవాణ్ణి స్వర్గంలోకి రానివ్వడం ధర్మబద్ధం కాదు కదా! కొత్త స్వర్గాన్ని సృష్టించకండి. మీరు చేసిన ప్రతిసృష్టి వృథా కాబోదు. త్రిశంకువు ఎక్కడ ఉన్నాడో అక్కడే ఉండనివ్వండి. మీరు సృష్టించిన జీవులు, నక్షత్రాలు, ఇతర గ్రహాలన్నీ కూడా అలాగే నిలిచివుంటాయి. మీ కోపాన్ని తగ్గించుకుని, మా మీద దయ చూపండి!” అని వేడుకున్నారు.

దానితో శాంతించిన విశ్వామిత్రుడు తన ప్రతిసృష్టిని ఆపివేశాడు. అతడికి ఎంత త్వరగా కోపం వస్తుందో, అంతే త్వరగా చల్లారిపోతుంది కూడా! అయితే అతడు చేసిన ఆ పనివల్ల అంతవరకూ సాధించిన తపశ్శక్తి వృథా అయిపోయింది. ఇది గుర్తుకువచ్చి మరొకసారి అతడి కళ్ళు తెరుచుకున్నాయి. తన మానసిక సమ తూకాన్ని కోల్పోకూడదని గట్టిగా నిర్ణయించుకుని మళ్ళీ తపస్సు ప్రారంభించాడు. కానీ త్వరలోనే అతడు మరొకసారి పొరపడే పరిస్థితి రానే వచ్చింది.

అంబరీషుడు అనే రాజు తలపెట్టిన యజ్ఞంలో అవసరమైన యజ్ఞపశువును ఎవరో దొంగిలించారు. ఎక్కడ వెతికినా అది దొరకలేదు. సాధారణంగా ఈ యజ్ఞయాగాదుల నిర్వహణ చాలా కష్టమైన పని. దానివల్ల కలిగే మంచి ఫలితాల సంగతి ఎలా ఉన్నా, ఏర్పాట్లలో ఏ చిన్న లోపం జరిగినా చేసేవాడికి గొప్ప హాని కలుగుతుంది. రాజు కనుక ఈ విషయంలో తప్పు చేస్తే అతనికే గాక అతడి ప్రజలకు కూడా గొప్ప హాని కలుగుతుంది.

అంబరీషుడు చాలా మంచి రాజు. తన ప్రజలకు అపకారం జరగడం అతడికి ఎంతమాత్రం ఇష్టం లేదు. అందుచేత మార్గాంతరం కోసం తన పురోహితుణ్ణి సలహా అడిగాడు. యజ్ఞపశువుకు బదులు ఎవరైనా బ్రాహ్మణుణ్ణి బలి ఇస్తే సరిపోతుందని అతడు సలహా ఇచ్చాడు. కానీ అటువంటివాడు ఎక్కడ దొరుకుతాడు? అంబరీషుడు తానే రాజ్యమంతా తిరిగి వెదుకసాగాడు. ఎవరూ దొరకలేదు. చివరకు అతడు ఋచీకముని ఆశ్రమానికి చేరాడు. ఆయనకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. వారిలో ఒకరిని ఇస్తే దానికి ప్రతిగా లక్ష గోవులను ఇస్తానని అంబరీషుడు వారిని ప్రలోభపెట్టాడు. ఆ భార్యాభర్తలిద్దరూ ముఖాలు చూసుకున్నారు. ఆ ముని, “పెద్ద కొడుకును ఇవ్వను!” అన్నాడు. ఆమె, “చిన్న

కొడుకు నాతోనే ఉంటాడు" అంది. ఇది విని మధ్యవాడైన శునశ్శేపుడు, "అయ్యా! నేను తమతో వస్తాను. మా నాన్నగారికి లక్ష గోవులు ఇవ్వండి" అని కోరాడు. అంబరీషుడు అలాగే చేసి, శునశ్శేపుణ్ణి తన వెంట పెట్టుకుని తీసుకుపోసాగాడు. హఠాత్తుగా వచ్చిపడిన ఈ మృత్యుగండం శునశ్శేపుడి హృదయాన్ని శోకంతో నింపింది.

మార్గమధ్యంలో వారు ఒక చోట విశ్రాంతికి ఆగారు. శునశ్శేపుడు అక్కడ అటూయిటూ తిరుగుతూ ఉంటే దూరంగా విశ్వామిత్రుడి ఆశ్రమం కనిపించింది. విశ్వామిత్రుడు శునశ్శేపుడి తల్లికి అన్నగారు. శునశ్శేపుడు వడివడిగా పోయి విశ్వామిత్రుడి పాదాలమీద పడి, తన విషాదకథను వినిపించాడు. విశ్వామిత్రుడు తన కొడుకులను పిలిచి, శునశ్శేపుడికి బదులు వారిలో ఒకరిని బలిపశువుగా వెళ్ళమన్నాడు. కానీ వారు అందుకు అంగీకరించలేదు. దానితో కోపం వచ్చి వారిని శపించాడు. మరొకసారి అతడి తపశ్శక్తి వ్యర్థమయిపోయింది. కోపం వల్ల ఎంత నష్టమో చూడండి! అయితే విశ్వామిత్రుడు శునశ్శేపుడికి రెండు మంత్రాలను ఉపదేశించి, యజ్ఞంలో బలి ఇవ్వబోయే ముందు వాటిని చదివితే అతడికి ప్రాణభయం ఉండదని అభయమిచ్చాడు. శునశ్శేపుడు అంబరీషుడితో కలసి వెళ్ళి, విశ్వామిత్రుడు చెప్పినట్టుగా చేశాడు. బలి ఇచ్చే సమయంలో అతడు ఆ మంత్రాలతో చేసిన ప్రార్థన వల్ల ఇంద్రుడు దర్శనమిచ్చి, యజ్ఞఫలాన్ని రాజుకు అనుగ్రహించి, శునశ్శేపుణ్ణి బలి ఇవ్వవలసిన అవసరం లేదని చెప్పాడు.

అయితే విశ్వామిత్రుడు క్షణికమైన కోపంలో తన కొడుకులకు ఇచ్చిన శాపం వల్ల తపోబలాన్ని మొత్తం పోగొట్టుకుని మళ్ళీ మొదటికి వచ్చాడు. శునశ్శేపుడికి ఇచ్చిన మంత్రమేదో ముందే ఇచ్చివుంటే సరిపోయేది కదా! ఇకపై, మరెప్పుడూ ఉద్రేకాలకు లొంగకూడదని దృఢంగా నిశ్చయించుకుని, తపస్సులో మునిగిపోయాడు. ఆ తపస్సుకు మెచ్చి బ్రహ్మ దర్శనమిచ్చి, "రాజర్షివైన నువ్వు ఇక నుంచీ అసలైన ఋషిగా పిలువబడతావు!" అని వరమిచ్చాడు. కానీ విశ్వామిత్రుడికి కావలసిన 'బ్రహ్మర్షి' అన్న స్థితి ఇంకా కలుగలేదు.

దీనితో విశ్వామిత్రుడు పుష్కరతీర్థానికి చేరి మరొకసారి తీవ్రమైన తపస్సులో మునిగిపోయాడు. కానీ దేవతలకు ఇది నచ్చలేదు. అతణ్ణి మోహింపజేసేందుకు వారు అప్సరస అయిన మేనకను పంపారు. విశ్వామిత్రుడు ఆమెను మోహించి, తపోదీక్షను వదిలిపెట్టి ఆమెతో సుఖంగా ఉండసాగాడు. తాను చేపట్టిన ఉన్నతమైన ఆదర్శాన్ని మరచిపోయాడు. పది సంవత్సరాలు క్షణంలాగా గడచి పోయాయి. హఠాత్తుగా అతడికి తను చేస్తున్న తప్పు తెలిసివచ్చింది. తన ఆదర్శం గుర్తుకు వచ్చింది. విషయం అర్థమైన మేనక విశ్వామిత్రుడు తనను శపిస్తాడేమో

నన్న భయంతో వణికిపోయింది. కానీ విశ్వామిత్రుడికి కోపం రాలేదు. అతడు మేనకను శపించకుండా తిరిగి దేవలోకానికి వెళ్ళిపొమ్మన్నాడు. మరొకసారి తాను ప్రలోభపడినందుకు తనను తానే నిందించుకుంటూ హిమాలయాలకు పోయి తిరిగి తపస్సు కొనసాగించాడు. (మేనకకు విశ్వామిత్రుడి వల్ల ఒక కుమార్తె జన్మించింది. మేనక ఆ బిడ్డను కణ్వమహర్షి ఆశ్రమంలో వదిలి వెళ్ళిపోయింది. కణ్వుడు ఆమెకు శకుంతల అని నామకరణం చేసి పెంచి పెద్ద చేశాడు. ఉత్తములైన శకుంతలాదుష్యంతులకు పుట్టిన భరతుడి వల్లనే మన దేశానికి భరతవర్షమనే పేరు వచ్చింది.)

అనేక సంవత్సరాలు అతడు చేసిన తపస్సుకు మెచ్చి, బ్రహ్మ ప్రత్యక్షమై, "నాయనా! నీ తపస్సుకు మెచ్చాను. ఇక నుంచీ నీవు 'మహర్షి' అని పిలువ బడతావు!" అని వరమిచ్చాడు. ఇది విని, "నాకు నా ఇంద్రియాల మీద, మనస్సు మీద పూర్తి ఆధిపత్యం కలిగినట్టేనా?" అని బ్రహ్మను ప్రశ్నించాడు. బ్రహ్మ, "లేదు నాయనా! దానికోసం నీవు ఇంకా తపస్సు చేయాలి!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అలా, తాను కోరిన బ్రహ్మర్షి అన్న బిరుదును తనకు లభించేవరకూ మానకూడదన్న పట్టుదలతో విశ్వామిత్రుడు తన తపస్సును కొనసాగించాడు. అయితే అతణ్ణి మరొకసారి ప్రలోభపెట్టడానికి మరొక అప్సరస అయిన రంభను ఇంద్రుడు పురికొల్పాడు. అంతేకాక విశ్వామిత్రుడు తపస్సు చేస్తున్న ప్రాంతమంతా వసంతశోభతో నిండిపోయేలా చేశాడు. పక్షుల కిలకిలారావాలతోనూ, కోకిలల గానంతోనూ తపోభంగమైన ఆ మహర్షికి ఎదురుగా రంభ కనిపించింది. అయితే కామానికి, మోహానికి బదులు ఈసారి అతడి మనస్సు కోపంతో నిండిపోయింది. ఆ కోపాన్ని అణుచుకోవడానికి బదులు, "కామక్రోధాలను జయించడం కోసం తపస్సు చేస్తున్న నన్ను ప్రలోభపెట్టావు కనుక పదివేల సంవత్సరాల పాటు శిలవై పడివుండు" అని శపించాడు. కానీ ఇలా శాపం ఇచ్చిన తర్వాత అతడి కళ్ళు తెరుచుకున్నాయి. కామక్రోధాలను నిగ్రహించుకోవడంలో తాను ఇంకా విజయం సాధించలేదన్న విషయం అర్థమయింది. ఈసారి తూర్పుదిక్కుగా వెళ్ళి మరింత కఠోరమైన తపస్సు చేశాడు.

చాలాకాలం తపస్సు చేశాక ఒకనాడు అతడికి తన కోపాన్ని అదుపులోకి తెచ్చుకోగలిగాననిపించింది. అన్నాళ్ళుగా చేస్తున్న ఉపవాసాన్ని విరమించాలి అనుకుని కొన్ని ఫలాలనూ, కందమూలాలనూ సేకరించి, తినడానికి కూర్చున్నాడు. సరిగా అదే సమయంలో ఇంద్రుడు ఒక బ్రాహ్మణుడి రూపంలో వచ్చి, తనకు తినడానికి ఏదైనా ఇవ్వమన్నాడు. విశ్వామిత్రుడు ఇసుమంతైనా కోపతాపాలను చూపకుండా, తాను తినబోతున్న ఆహారాన్ని అతడికి ఇచ్చివేశాడు.

మరింత కాలం తన తపస్సును కొనసాగించాడు. చివరికి బ్రహ్మ మరొకసారి ప్రత్యక్షమై, "విశ్వామిత్రా! నువ్వు ఇన్నాళ్ళుగా చేసిన ఘోరమైన తపస్సుకు తగిన ఫలితం దక్కింది. ఇక నుంచి నీవు బ్రహ్మర్షిగా కొనియాడబడతావు" అని ఆశీర్వదించాడు. అయితే వసిష్ఠుడు కూడా తన నోటితో తనను బ్రహ్మర్షిగా పిలవాలని విశ్వామిత్రుడు కోరాడు. వసిష్ఠుడు కూడా సంతోషంగా, "సోదరా! నీ తపస్సుకు తగిన ఫలితం లభించింది. నీవు కూడా బ్రహ్మర్షివే!" అని కీర్తించాడు.

ఈ కథలో మనం నేర్చుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. ముందుగా కోపం అనేది – అది ఏ రూపంలో ఉన్నా సరే – మన నాశనానికే దారి తీస్తుంది. కాబట్టి కోపాన్ని జయించిన వాడే ఏమయినా సాధించగలవాడు.

జీవితంలో కొందరు చాలా గొప్ప పనులు చేసి మనకు కనిపిస్తారు. అటువంటి వారు తమ ఇంద్రియాలను పూర్తిగా నిగ్రహించిన వారే కాకపోవచ్చు. ప్రాపంచిక జీవితంలో గొప్ప పనులు చెయ్యడం గొప్ప విషయమే కానీ, దానితోనే పారమార్థిక జీవితంలో ఔన్నత్యాన్ని సాధించగలరని చెప్పలేము. కాబట్టి ప్రాపంచిక జీవితంలో విజయవంతంగా జీవిస్తున్నవారి గొప్పతనం అంతవరకే. కామక్రోధాలను పూర్తిగా జయించి, ధనం మీద, పేరుప్రఖ్యాతుల మీద అణువంతైనా ఆసక్తి లేనివాడే నిజమైన పారమార్థికుడు, బ్రహ్మర్షి.

విశ్వామిత్రుడు తన జీవితంలో ఒక ఆదర్శాన్ని సాధించాలని నిర్ణయించుకున్నాడు. దానికోసం తీవ్రంగా కృషి చేశాడు. మధ్యలో కామక్రోధాలకు లొంగిపోయి, అనేకసార్లు పొరపాట్లు చేసి క్రిందికి దిగజారాడు. అయినా తన పట్టుదలను విడువకుండా, మళ్ళీ ప్రయత్నించి చివరకు సాధించాడు. "జీవితంలో ఒక ఆదర్శాన్ని పెట్టుకున్నవాడు వంద పొరపాట్లు చేస్తే, ఏ ఆదర్శం లేనివాడు ఏభైవేల తప్పులు చేస్తాడు" అని వివేకానంద స్వామి చెప్పారు కదా. పైగా, "మనిషి మాత్రమే పొరపాట్లు చేస్తాడు. అలాగే మనిషి మాత్రమే గొప్పతనాన్ని సాధించ గలడు. ఒక ఆవు అబద్ధం చెప్పదు! కానీ అది కేవలం ఒక ఆవు మాత్రమే. అది ఎప్పటికీ గొప్పతనాన్ని సాధించలేదు. మనిషి మాత్రమే గొప్పతనాన్ని సాధించ గలడు. కాబట్టి వెయ్యిసార్లు అపజయం పాలైనా, నిరాశ పడకుండా, మరొకసారి ప్రయత్నించండి! అటువంటి పట్టుదల కలిగివుండండి! మీరు ఘనకార్యాలు సాధిస్తారు!" అని కూడా వివేకానంద స్వామి చెప్పారు. వైఫల్యాలతో క్రుంగిపోకుండా, పట్టువదలకుండా ఎలా పనిచెయ్యాలో విశ్వామిత్రుడి కథ మనకు నేర్పుతుంది. అంతేకాక, గాయత్రీమంత్రాన్ని రచించడం ద్వారా విశ్వామిత్రుడు మానవజాతికి మహోపకారం చేశాడు.

+ + + + + + +

## 6. వాల్మీకి

వాల్మీకి కథను వివేకానంద స్వామి ఇలా చెప్పారు:

రామాయణ మహాభారతాలు పూర్వకాలంలో భారతదేశంలోని మనుష్యుల ప్రవర్తన, అలవాట్లు, ఆచారాలు, సామాజిక స్థితిగతులు, నాగరికత ఎలా ఉండేవో వివరిస్తాయి. ఇటువంటి పురాణాలలో అతిపురాతనమైనది రామాయణం (అంటే రాముడు చూపిన మార్గం అని అర్థం). రామాయణమే అసలైన మొదటి సంస్కృత పద్యకావ్యమని చాలామంది అంగీకరిస్తారు. ఈ గ్రంథానికి ముందు సంస్కృతంలో కొన్ని పద్యకావ్యాలు ఉన్నాయి. వాటిని ఒక రకమైన ఛందస్సులో వ్రాశారు. (వాటిని అసలైన పద్యకావ్యాలుగా వర్గీకరించరు.) రామాయణానికి పూర్వపు రచనలన్నీ వేదవాఙ్మయం లోనివే.

రామాయణాన్ని వ్రాసిన కవి పేరు వాల్మీకి. కాలం గడిచేకొద్దీ చాలామంది కవుల కథలన్నీ అతడికే ఆపాదించబడ్డాయి. వాల్మీకి తర్వాతకాలంలో రామాయణంలో చాలా శ్లోకాలను చేర్చి, అవన్నీ కూడా వాల్మీకి వ్రాసినవే అనడం సాధారణమైపోయింది. అయితే ఈ చేర్పులన్నీ ఎలా ఉన్నా మొత్తం మీద ఆ గ్రంథం ఒక అందమైన కూర్పుగా తయారైంది. ప్రపంచ సాహిత్యంలో దానికి సాటి మరొకటి లేదు.

పూర్వం రత్నాకరుడు అనే ఒక యువకుడు ఉండేవాడు. అతడు తన కుటుంబాన్ని పోషించడానికి ఏ మార్గమూ దొరకక, చివరకు దారులుకొట్టేవాడిగా తయారయ్యాడు. అడవిలో వెళ్లేవారిని దోచుకుని, నిర్దాక్షిణ్యంగా చంపి, ఆ ధనంతో తన తల్లిదండ్రులనూ, భార్యాపిల్లలనూ పోషిస్తున్నాడు. ఇలా చాలా రోజులు గడిచాయి. చివరికి ఒకరోజు నారదమహర్షి ఆ త్రోవలో వచ్చాడు. యథాప్రకారం ఈ రత్నాకరుడు అతణ్ణి అటకాయించాడు.

ఆ మహర్షి రత్నాకరుడితో, "నన్ను ఎందుకు దోచుకోవాలనుకుంటున్నావు? ఇలా మనుష్యుల్ని దోచుకోవడం, చంపడం మహాపాపాలని నీకు తెలియదా? దీనివల్ల ఎంత పాపాన్ని మూటగట్టుకుంటున్నావో తెలుసా?" అని అడిగాడు. "అవన్నీ నాకు తెలియదు. నేను ఈ డబ్బుతో నా కుటుంబాన్ని పోషించాలి కాబట్టి, ఈ పని చేస్తున్నాను!" అన్నాడు రత్నాకరుడు. ఇది విని నారదమహర్షి, "నీకు తెలియదంటున్నావు కాబట్టి చెపుతున్నాను విను! నువ్వు ఇలా అనేకమందిని బాధించి, చంపి బోలెడు పాపాన్ని మూటగట్టుకుంటున్నావు! మరి నీ ధనంలో వాటా పంచుకుంటున్న నీ కుటుంబంలోని వాళ్ళు నీ పాపాలలో కూడా వాటా పంచుకుంటారా?" అని అడిగాడు. రత్నాకరుడు కొంచెం కూడా తడబడకుండా, "తప్పకుండా పంచుకుంటారు!" అని సమాధానం చెప్పాడు. "చాలా మంచిది

నాయనా! వారినే ఆ విషయం అడిగి తెలుసుకుంటే మేలేమో కదా! ఇప్పుడు నువ్వు ఒక పని చెయ్యి. నన్ను ఇక్కడే చెట్టుకి కట్టివేసి, నీ ఇంటికి వెళ్ళి నీవు సంపాదించే డబ్బులో వాటా తీసుకుంటున్నట్టుగానే, నీ పాపంలో కూడా వాళ్ళు వాటా తీసుకుంటారేమో కనుక్కుని రా!" అని రత్నాకరుడికి చెప్పాడు. రత్నాకరుడు అలాగే చేసి, తన తండ్రి దగ్గరకు వెళ్ళి, "తండ్రీ! నేను



కుటుంబాన్ని పోషించడానికి కావలసిన డబ్బును ఎలా సంపాదిస్తున్నానో మీకు తెలుసా?" అని ప్రశ్నించాడు. తండ్రి, "నాకు తెలియదు!" అని జవాబిచ్చాడు. "దారులుకొట్టి, ప్రాణాలు తీసి ఈ డబ్బు సంపాదిస్తున్నాను!" అని చెప్పాడు. ఇది వినగానే అతడి తండ్రి, "ఓరి దరిద్రుడా! ఇదా నువ్వు చేసే పని! పో అవతలికి!" అని శాపనార్థాలు పెట్టాడు. రత్నాకరుడు తన తల్లి దగ్గరకు వెళ్ళి, "అమ్మా! నేను మిమ్మల్ని ఎలా పోషిస్తున్నానో నీకు తెలుసా?" అని అడిగాడు. ఆమె కూడా తనకు తెలియదని చెప్పింది. తాను దోపిడీల ద్వారా డబ్బు సంపాదించే హంతకుణ్ణని అతడు తల్లితో చెప్పగానే ఆమె, "ఎంత ఘోరం!" అని వాపోయింది. రత్నాకరుడు ఆమెతో, "అమ్మా! మరి నువ్వు నా పాపంలో వాటా పంచుకుంటావా?" అని అడిగాడు. ఆమె ఏడుస్తూ, "నేనెందుకు తీసుకోవాలి? నేనే పాపమూ చెయ్యలేదే!" అన్నది. ఇక రత్నాకరుడు తన భార్య దగ్గరికి వెళ్ళాడు. ఆమెను కూడా తాను తనను ఎలా పోషిస్తున్నానో తెలుసా అని అడిగితే తెలియదని చెప్పింది. "నేనొక బందిపోటు దొంగను. చాలా ఏళ్ళుగా నేను బాటసారులను దోచుకుంటూ, మిమ్మల్నందర్నీ పోషిస్తున్నాను. ఇప్పుడు నేను నిన్ను అడిగేదేమంటే నువ్వు నా పాపంలో వాటా తీసుకుంటావా అని?" అని ప్రశ్నించాడు. అతడి భార్య మరుక్షణమే, "ఎట్టి పరిస్థితులలోనూ నీ పాపాలలో నేను వాటా తీసుకోను. నీవు నా భర్తవు కావా? నన్ను పోషించాల్సిన బాధ్యత నీకు లేదా?" అని ఎదురు ప్రశ్నించింది.

ఈ సమాధానాలతో రత్నాకరుడి కళ్ళు తెరుచుకున్నాయి. "ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది కాబోలు! ఎవరి కోసమైతే నేను ఈ దొంగతనాలన్నీ చేస్తున్నానో, అటువంటి నాకు అతి సన్నిహితులైన బంధువులు కూడా నా పాపంలో పాలుపంచుకోవడానికి ఇష్టపడడం లేదే!" అనుకుని, త్వరత్వరగా నారదమహర్షిని కట్టిపడవేసిన చోటికి వచ్చి, ఆయన కట్లు విప్పి, ఆయన పాదాలమీద పడ్డాడు. జరిగినదంతా ఆయనతో చెప్పాడు. గొప్ప వ్యాకులతతో, "నన్ను రక్షించండి! తెలియక ఇంతకాలంగా తప్పు చేస్తున్నాను. ఇప్పుడు నేనేమి చెయ్యాలి?" అని అడిగాడు. నారదమహర్షి, "నీవు సాగిస్తున్న జీవితాన్ని ఇక విడిచిపెట్టు. మీ కుటుంబంలో ఎవరూ నిన్ను నిజంగా ప్రేమించడం లేదని ఇప్పుడు తేటతెల్లమయింది కదా. కాబట్టి ఈ భ్రమలన్నింటినీ వదలిపెట్టు. వాళ్ళు నీ సంపదలలో పాలుపంచుకుంటారు కానీ, నీ దగ్గర ఏమీలేని మరుక్షణం నిన్ను వదిలిపెట్టిపోతారు. నీ పుణ్యాన్ని పంచుకోవడానికి అందరూ తయారవుతారు కానీ, నీ పాపాన్ని పంచుకోవాలంటే మాత్రం ఎవ్వరూ కంటికి కనపడరు. ఎవరైతే మనం మంచి చేస్తున్నా, చెడు చేస్తున్నా మనల్ని విడిచిపెట్టడో, అతణ్ణి ఆరాధించడం

ప్రారంభించు! ఆయన ఎప్పటికీ మన చేయి విడిచిపెట్టడు. ఎందుకంటే ఆయనొక్కడే మనల్ని నిజంగా ప్రేమించేవాడు. నిజమైన ప్రేమ ఎప్పటికీ దిగజార్చదు. దానిలో ఎటువంటి స్వార్థమూ ఉండదు. నీకు ఇది ఇస్తే నాకేమి ఇస్తావంటూ నిజమైన ప్రేమ లెక్కలు వేయదు" అని సమాధానమిచ్చాడు.



నారద మహర్షి అతడికి 'రామ' అనే మంత్రాన్ని బోధించి, ఎలా జపం చెయ్యాలో నేర్పాడు. రత్నాకరుడు అన్నీ వదిలిపెట్టి అడవిలోకి వెళ్ళి తపస్సు చేయసాగాడు. అతడు ధ్యానంలో ఎంతగా తాదాత్మ్యం చెందాడంటే, అతడి చుట్టూ చీమలు పుట్టలు పెట్టాయి. కానీ అతడికి అదేమీ తెలియదు. అలా కొన్ని సంవత్సరాల పాటు తపస్సు చేసిన తర్వాత, "ఓ మహర్షీ! ఇక పైకిలే!" అని ఒక కంఠస్వరం వినిపించింది. "నేను మహర్షినా? నేనొక దారులుకొట్టేవాణ్ణండీ!" అని రత్నాకరుడు పలికాడు. ఆ కంఠస్వరం, "ఇక నీవు దొంగవు కావు! నీలోని పాపమంతా పోయి, నీవు ఇప్పుడొక పవిత్రమైన మనిషిగా తయారయ్యావు. నీ పాత పేరు ఇక లేదు. చుట్టూ వల్మీకాలు (అంటే చీమలపుట్టలు) పెరుగుతున్నా తెలియనంత అగాధమైన తపస్సులో మునిగిపోయావు కాబట్టి ఇక నుంచి నీవు 'వాల్మీకి' అని పిలువబడతావు!" అని పలికింది. (వాల్మీకి అంటే వల్మీకంలో పుట్టినవాడు అని అర్థం.) ఆ విధంగా ఒక బందిపోటు మహర్షి అయ్యాడు.

హంతకుడైన రత్నాకరుడు మారగలడని నారదుడు ఎలా ఊహించాడో తెలుసుకోవాలంటే, అతడు ఏ పని చేస్తున్నాడన్న దానికన్నా ఎలా పనిచేస్తున్నాడో గమనించాలి. అతడు భార్యాబిడ్డలను పోషించడానికి తాను చేసే పనిని పట్టుదలతో చేస్తున్నాడు. అతడికి దానిలోని తప్పు అర్థం కాకపోయినా అతడిలోని ఉత్సాహం చాలా గొప్పదని నారదుడు గ్రహించాడు. అటువంటి ఉత్సాహం, బలం కలవాడే ఏమయినా సాధించగలడు. వివేకానంద స్వామి ఒక సందర్భంలో మాట్లాడుతూ, "దుర్మార్గుడైనా మనిషి బలవంతుడైతే అతడు తనను తాను మార్చుకోగలుగుతాడు. కాబట్టి శారీరికంగా బలహీనుడిగా ఉన్నవాడి కంటే బలవంతుడే మెరుగు. ఎందుకంటే అతడు ఏదోవొకనాటికి బాగుపడతాడని మనం ఆశపడవచ్చు!" అని బోధించారు. కాబట్టి వాల్మీకిలాంటి పట్టుదల, బలం మనకు కావాలి. చుట్టూ చీమలు పుట్టలు పెట్టినా తెలియనంత ఏకాగ్రతతో తపస్సు చేయడానికి దృఢనిశ్చయం ఉన్న మనస్సుతోపాటు అతి దృఢమైన శరీరం కూడా కావాలి కదా!

మహర్షిగా మారిన వాల్మీకి ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని ప్రశాంతమైన జీవనాన్ని గడుపసాగాడు. ఒకరోజు అతడు స్నానానికి గంగానదికి వెళుతున్నాడు. దారిలో ఒక క్రౌంచపక్షుల జంట ఒకదానిచుట్టూ మరొకటి తిరుగుతూ, ముద్దాడుకుంటూ కనిపించాయి. వాల్మీకిముని ఆ దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్న క్షణంలోనే ఎక్కడ నుంచో ఒక బాణం రివ్వునవచ్చి వాటిలోని మగపక్షిని నేలకు పడగొట్టింది. ఆడపక్షి చనిపోయిన మగపక్షి చుట్టూ బాధతో తిరగసాగింది. వాల్మీకి వెనక్కి తిరిగి చూస్తే ఆ వేటగాడు కనిపించాడు. "ఓరి నీచుడా! నీకు అణువంతైనా జాలి లేదా! అవి ప్రేమించుకుంటున్నాయని చూసి కూడా నీ కసాయి చేయి వెనక్కి తగ్గలేదా?" అని దుఃఖంతో అన్నాడు. కానీ ఆ క్షణంలో తాను పలికిన పలుకులు వాల్మీకికే ఆశ్చర్యం కలిగించాయి. "ఇదేమిటి? నేను పలికినది చాలా విచిత్రంగా ఉందే! ఇంతకు ముందెన్నడూ నేను ఈ విధంగా ఏదీ పలుకలేదే!" అని తనకు తానే ఆశ్చర్యపోయాడు. అదే సంస్కృతంలో రచించబడిన మొదటి శ్లోకం. అప్పుడు ఎక్కడ నుంచో ఒక కంఠస్వరం, "భయపడకు నాయనా! నీ నోటినుంచి పలుకుతున్నదే కవిత్వం. శ్రీరాముడి జీవితాన్ని ఈ పద్యకావ్యభాషలో రచించు! దానివల్ల మానవజాతికి మేలు జరుగుతుంది!" అని ఆశీర్వదించింది. ఈ విధంగా వాల్మీకి హృదయంలో పెల్లుబికిన శోకం ప్రేరేపించగా ఆ మొట్టమొదటి శ్లోకం అతడి నోట పలికింది. అదే పద్ధతిలో ఆయన మనోహరమైన రామాయణాన్ని రచించాడు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 7. జటాయువు

రామాయణకాలంలో సంపాతి, జటాయువు అనే ఇద్దరు రాబందులు ఉండేవారు. వారిరువురూ సోదరులు. చిన్నతనంలో వారిద్దరూ ఒకసారి పోటీలు పెట్టుకుని ఆకాశంలో ఎగురుతూ ఉంటే, తమ్ముడైన జటాయువు పోటీలో నెగ్గాలని తన అన్న సంపాతి కన్నా చాలా ఎక్కువ ఎత్తుకు ఎగిరాడు. కానీ అంత ఎత్తులో సూర్యుని వేడి చాలా ఎక్కువగా ఉంటుందనీ, దానివల్ల తన శరీరం కాలిపోతుందనీ అతడికి తెలియదు. ఇది చూసిన సంపాతి వేగంగా వెళ్ళి జటాయువుకు తన



రెక్కలు అడ్డుపెట్టి వేడి తగలకుండా కాపాడాడు. దానితో జటాయువు క్షేమంగా తిరిగివచ్చాడు. కానీ సంపాతి రెక్కలు కాలిపోయి దక్షిణ సముద్రతీరంలోని కొండలలో పడిపోయాడు. అప్పటి నుంచీ సంపాతి అక్కడే ఉన్నాడు. హనుమంతుడు సీతను వెతుకుతూ వెళ్ళినప్పుడు లంకలో సీత ఉన్నదని చెప్పినవాడు సంపాతే. అలా చెప్పగానే అతడికి మళ్ళీ రెక్కలు మొలిచి, ఎగిరి వెళ్ళిపోయాడని పురాణకథనం.

ఇక జటాయువు దండకారణ్యంలోని చిత్రకూటం అనే ప్రాంతంలో నివసించే వాడు. రావణాసురుడు సీతను అపహరించుకుని వెళ్ళేటప్పుడు, ఒక చెట్టు మీద కూర్చున్న జటాయువును చూసి, తనను రక్షించమని సీత ఆర్తనాదాలు చేసింది. అది విన్న జటాయువు సీతను కాపాడడం కోసం రావణాసురునితో యుద్ధానికి దిగాడు. రావణుణ్ణి ఇంచుమించు ఓడించినంత పని చేశాడు. కానీ ముసలితనం వలన రావణుని పరాక్రమం ముందు నిలువలేకపోయాడు. చివరికి రావణుడు జటాయువు రెండు రెక్కలనూ, కాళ్ళనూ నరికివేశాడు. జటాయువు నేలకూలాడు.

సీతను వెతుకుతూ రామలక్ష్మణులు జటాయువు కూలిపోయిన ప్రాంతానికి వచ్చారు. అక్కడ ఒక యుద్ధం జరిగిన ఆనవాళ్ళు వారికి కనిపించాయి. నెత్తుటి మడుగులో ఒక పర్వతంలాగా పడివున్న జటాయువును చూసి రాముడు, “వీడు మాయారూపంలో ఉన్న రాక్షసుడు. వీడే సీతను తినివేసి ఉంటాడు,” అని జటాయువును చంపడానికి ధనుస్సు ఎక్కుపెట్టాడు.

అది విన్న జటాయువు హీనస్వరంతో ఇలా పలికాడు: “ఓ రామా! నేను జటాయువును. నీ తండ్రి దశరథుడి మిత్రుణ్ణి. మీరు లేని సమయం చూసి రావణుడు సీతను ఎత్తుకుపోతుండగా నేను చూశాను. అతడితో యుద్ధం చేశాను. అతని రథసారధిని, రథానికి కట్టిన కంచర గాడిదలను నేనే చంపాను. అయితే వృద్ధుణ్ణి కావడంతో యుద్ధంలో త్వరగా అలసిపోయాను. నా రెక్కలు నరికివేసి ఆ దుర్మార్గుడు సీతను తీసుకుని ఆకాశమార్గాన పారిపోయాడు.”

ఆ మాటలు విన్న రామునికి కన్నీళ్ళు ఆగలేదు. చేతిలోని ధనుస్సు జారిపడింది. పరుగున వెళ్ళి ఆ రాబందును జాగ్రత్తగా లేవనెత్తాడు. ప్రేమతో అతని శరీరమంతా నిమిరాడు. సీతను ఎత్తుకుపోయినవాడి వివరాలను ఎంతో అనునయంగా అతణ్ణి అడిగాడు. ఆ వివరాలు చెపుతూనే జటాయువు రాముని చేతులలో మరణించాడు.

శ్రీరాముడు ఎంతో దుఃఖించాడు. “నా కోసం మరణించిన ఈ పక్షికి నేనే దహన సంస్కారాలు చేస్తాను. ఇతడు దశరథ మహారాజుకు స్నేహితుడు కాబట్టి ఇతడు నాకు తండ్రితో సమానమైనవాడు,” అని పలికి జటాయువుకు అంతిమ సంస్కారాలను యథావిధిగా చేశాడు. శ్రీరాముడు తన తండ్రి దశరథుడికే అంతిమ

సంస్కారాలు చేయలేకపోయాడు కానీ జటాయువుకు చేశాడు. ఆ విధంగా జటాయువు ఎంతో అదృష్టవంతుడు.

స్నేహితుని కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, సహాయం చేయడానికి ప్రయత్నించడమనే ఉదాత్తగుణాన్ని జటాయువు నుంచి నేర్చుకోవాలి. అంతేకాక తన తండ్రి స్నేహితుణ్ణి తండ్రితో సమానంగా చూడడం అనే సుగుణాన్ని మనం రాముడిలో చూడవచ్చు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 8. రామాయణంలోని భరతుడు


రామాయణంలోని భరతుడు దశరథుని మూడవ కుమారుడు. అతని తల్లి కైకేయి. పెద్ద అన్న రాముడంటే అతనికి అమితమైన గౌరవం, ప్రేమ. అతని నిష్కల్మషమైన భ్రాతృభక్తి మనందరికీ ఆదర్శనీయం.

వివాహం తర్వాత భరతుణ్ణి తన తల్లి పుట్టిల్లు అయిన కేకయదేశానికి పంపించారు. దశరథుడికి ఆ సమయంలోనే రామునికి పట్టాభిషేకం చేయాలన్న ఆలోచన కలిగింది. శ్రీరామపట్టాభిషేకాన్ని దశరథుడు ప్రకటించాడు. కానీ, భరతుని తల్లి కైకేయికి ఈ ఆలోచన రుచించలేదు. ఆమె తన బిడ్డ రాజు కావాలని కోరుకుంది. కుయుక్తితో, రాముని పట్టాభిషేకానికి అడ్డుపడింది. పూర్వమెప్పుడో తనకు ఇవ్వబడిన రెండు వరాలను ఇప్పుడు తీర్చవలసిందిగా దశరథుణ్ణి కోరింది. వాటిలో మొదటి కోరిక ప్రకారం, రాముడు 14 సంవత్సరాలు అరణ్యవాసం చేయాలి. రెండవ కోరిక ప్రకారం భరతుడికి పట్టాభిషేకం జరగాలి. ఇది విన్న శ్రీరాముడు ఏమీ చలించలేదు. ఆడిన మాట తప్పకపోవడం, పితృవాక్య పరిపాలనం, రాజ్యసింహాసనం కంటే కూడా ఎంతో ముఖ్యమని అతడికి చక్కగా తెలుసు. దశరథుడే తనతో అడవికి పొమ్మని నేరుగా చెప్పకపోయినప్పటికీ, తన తండ్రికి అసత్యదోషం అంటకూడదన్న ఉన్నతమైన భావనతో అడవికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. ఒక ఆదర్శవంతురాలైన భార్యగా సీతకూడా రాముడితోపాటు అడవులకు ప్రయాణమయింది. అక్కడ ఎదురుకాబోయే కష్టాలకు ఆమె భయపడ లేదు. ఎప్పుడూ రామునితో కలసివుండే లక్ష్మణుడు కూడా రాముడి వెంట అడవికి వెళ్ళాడు. రాముడి వియోగాన్ని భరించలేని దశరథుడు మరణించాడు.

ఈ విషయాలేవీ భరతుడికి తెలియవు. వసిష్ఠుడు పంపిన కబురుతో తన తమ్ముడు శతృఘ్నునితో కలిసి భరతుడు తిరిగివచ్చాడు. తాత పంపిన కానుకలు తల్లికి అందించి భక్తితో నమస్కరించి, కుశలప్రశ్నలు అయ్యాక, “అమ్మా! నగరం అంతా కళాకాంతీ లేకుండా శూన్యంగా ఉంది. ప్రజలందరూ దుఃఖిస్తున్నారు. కారణం ఏమిటి?” అని అడిగాడు. తల్లి ద్వారా జరిగిన విషయం తెలియగానే

భరతుడు మూర్ఛపోయాడు. కాసేపటికి తేరుకుని తల్లితో, "రాక్షసీ! ఎంత పని చేశావు? ఇటువంటి వరాలు అడగడానికి నీకు నోరెలా వచ్చింది? అన్న రాముడు నార బట్టలు కట్టుకుని అడవిలో నానాకష్టాలూ పడుతుంటే, నేను ఇక్కడ రాజ్యాభిషేకం ఎలా చేయించుకోను? అన్నకు నా ముఖం ఎలా చూపగలను? నాకేది ఇష్టమో నీకు తెలిసి కూడా ఇలా ఎందుకు ప్రవర్తించావు?" అని దూషించాడు. రాముని తల్లి కౌసల్య, లక్ష్మణుని తల్లి సుమిత్రల పాదాల వద్దకు చేరి ఎంతో రోదించాడు.

తండ్రి దహనసంస్కారాలు పూర్తి అయ్యాక, వసిష్ఠుడు భరతుణ్ణి పట్టాభిషేకానికి తయారుకమ్మన్నాడు. భరతుడు, "మునివరా! అటువంటి మాటలను నేను వినలేను. పుణ్యమూర్తి శ్రీరాముణ్ణి ప్రార్థించి వెనుకకు తీసుకువస్తాను. ఆయన రాకపోతే నేను కూడా అక్కడే ఉండి పోతాను," అని పలికి శత్రుఘ్నుణ్ణి, ముగ్గురు తల్లులను వెంట తీసుకుని అడవికి బయలుదేరాడు. అతని వెంట సైన్యం, నగర పౌరులందరూ బయలుదేరారు.



సైన్యసమేతంగా వస్తున్న భరతుణ్ణి లక్ష్మణుడు దూరం నుంచే గమనించాడు. అన్నతో, "అన్నా! మనం ప్రాణాలతో ఉండడం చూడలేని భరతుడు మనల్ని చంపడానికి సైన్యంతో సహా వస్తున్నాడు. వారితో పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఈసారి వీణ్ణి వదిలిపెట్టను!" అన్నాడు. ఆ మాటలు విన్న రాముడు, "లక్ష్మణా! నా తమ్ముడివై ఉండి కూడా ఇటువంటి మాటలు ఎలా పలుకగలుగుతున్నావు? భరతుడు ఉత్తముడు. కలలో కూడా మనకు హాని తల పెట్టడు. మనల్ని అయోధ్యకు తీసుకువెళ్ళడానికే అతడు వస్తున్నాడు" అని అన్నాడు. శ్రీరాముని విశాలహృదయాన్ని అర్థం చేసుకున్న లక్ష్మణుడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

సైన్యాన్ని దూరంగా నిలిపి, శత్రుఘ్నునితో కలిసి, తన తల్లులను వెంటపెట్టుకుని భరతుడు రామలక్ష్మణులున్న పర్ణశాలకు వచ్చి వారికి ప్రణామం చేశాడు. రాముడు వనవాసానికి వచ్చిన తర్వాత జరిగిన విషయాలన్నీ భరతుడు రాముడితో చెప్పాడు. అందరి సమక్షంలో భరతుడు, "అన్నా! నా తల్లి చేసిన పాపానికి నా మీద కోపం చూపించవద్దు. రాజ్యాన్ని పాలించే అర్హత నాకు లేదు. దయచేసి నీవు అయోధ్యకు తిరిగిరా! లేకపోతే నేను ఇక్కడే ప్రాణాలు విడుస్తాను" అని ప్రార్థించాడు. రాముడు, "ఇది ఏమిటి భరతా! మన వంశాచారాలు పాటించకుండా మాట్లాడుతున్నావు. నా వంటివాడే తండ్రి మాట వినకపోతే, ప్రజలకు ఆదర్శంగా ఎవరు నిలుస్తారు? నేను ఇట్టే వనవాసం పూర్తి చేసుకుని తిరిగి వస్తాను. నీవు అయోధ్యవాసుల సంక్షేమాన్ని చూడు!" అని సమాధానం చెప్పాడు.

చివరకు భరతుడు తనకు బదులు రాముని పాదుకలకు పట్టాభిషేకం చేసి, రాముడు తిరిగి వచ్చేవరకు మాత్రమే పరిపాలించడానికి ఒప్పుకున్నాడు. త్రికరణశుద్ధిగా ఆ మాటను నిలబెట్టుకున్నాడు. రాజ్యభోగాలు అనుభవించే అవకాశం ఉన్నా, అన్నింటినీ వదలుకుని అన్నగారిలా తాను కూడా నార బట్టలు కట్టుకుని, కటికనేల మీద నిద్రిస్తూ నిరాడంబరమైన జీవితం గడిపాడు.

రాముడు రావణుణ్ణి సంహరించి పదునాలుగేళ్ళ తరువాత తిరిగి అయోధ్యకు వచ్చేటప్పుడు భరతుడికి తాను రావడం ఇష్టమోకాదో కనిపెట్టమని చెప్పి తనకంటే ముందుగా హనుమంతుణ్ణి పంపాడు. హనుమంతుడు భరతుణ్ణి కలుసుకుని, అతడి వైఖరిని నిశితంగా పరిశీలించి, తిరిగివెళ్ళి రాముడితో, "ప్రభూ! భరతుడు మీకోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాడు! అతడిలో రాజ్యం తనకే కావాలన్న కోరిక అణువంతైనా లేదు!" అని చెప్పాడు. శ్రీరాముడు ఇది విని ఎంతో సంతోషించాడు. అందువలనే "భరతో మహాత్మా" అని అంటారు. రాముడి తమ్ముడైన భరతుడు ప్రపంచానికే ఆదర్శప్రాయుడు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 9. శిబి చక్రవర్తి

శిబి చక్రవర్తి మహాదాతగా పేరు పొందినవాడు. అంతేకాక తనను శరణువేడిన వారిని రక్షించడానికి ఎంత కష్టాన్నైనా ఓర్చుకునేవాడు. అందువలన ఆర్తత్రాణ పరాయణుడుగా ఖ్యాతి గడించాడు. ఒకనాడు శిబి తన రాజదర్బారులో కూర్చొని ఉండగా ఒక పావురం గడగడ వణుకుతూ అతివేగంగా వచ్చి, అతణ్ణి శరణు కోరింది. ఆ పావురం మనుష్యులలా మాట్లాడుతూ, "రాజా! శరణు, శరణు! ఒక డేగ నా వెంటపడి తరుముతోంది. నా ప్రాణాలు కాపాడు" అని వేడుకుంది. మానవభాషలో ఆ పక్షి మాట్లాడడం చూసి అతడు ఆశ్చర్యపోయాడు. "ఇది మామూలు పక్షి కాదు. ఎంతో దీనంగా వేడుకుంటోంది. ఎట్టి పరిస్థితులలోనైనా సరే దీనిని రక్షించాలి" అని తలపోసి, ఆ పక్షికి అభయం ఇచ్చాడు.

ఇంతలో ఆ పావురాన్ని వెంటాడుతున్న డేగ వచ్చి, అది కూడా మానవులలా మాట్లాడుతూ, "రాజా! నిన్ను శరణు వేడిన ఆ పావురం నా ఆహారం. దానిని నాకు ఇవ్వు. నా నోటి వద్ద ఆహారానికి అడ్డు తగలడం నీవంటి వానికి తగని పని" అని పలికింది. అప్పుడు ఆ చక్రవర్తి తాను ఒక పెద్ద ధర్మసంకటంలో చిక్కుకున్నట్టు గ్రహించాడు. ప్రాణభీతితో వచ్చిన శరణార్థికి అభయం ఇవ్వకపోతే దేశంలో క్షామం ఏర్పడుతుంది. అలాగని ఆ డేగ నోటి ముందు ఆహారాన్ని తాను కాదనకూడదు. కాబట్టి శిబి ఒక క్షణం ఆలోచించి, "ఓ పక్షిరాజా! ఈ పావురం కంటే బలమైన ఆహారాన్ని నా సేవకులు వండి నీకు సమర్పిస్తారు. నీకు మంచి నివసించే చోటు కూడా కల్పిస్తాను. ఈ పావురాన్ని విడిచిపెట్టు" అని పలికాడు.

కానీ ఆ డేగ సామాన్యమైనది కాదు. "రాజా! నేను వేరే ఆహారాన్ని ఇమ్మని కోరలేదు. పావురం కంటే రుచికరమైన ఆహారం మరి లేదు. కాబట్టి ప్రకృతి నాకు ఇచ్చిన ఆహారానికి నీవు అడ్డు రాకు!" అని పలికింది. శిబి బ్రతిమాలుతూ, "మా వద్ద ఎంతో బలమైన ఓషధులతో కూడిన రుచికరమైన ఆహారాలు అనేకం ఉన్నాయి. పైగా శరణు వేడినవారిని రక్షించడం రాజు యొక్క కర్తవ్యం. అందువలన వాటిని తీసుకుని ఈ పావురాన్ని వదలిపెట్టు" అన్నాడు. అప్పుడు ఆ డేగ, "ఓ రాజా! ఆ పావురం బరువుకు సమానమైన మాంసాన్ని నీ తొడ నుంచి కోసి ఇవ్వు. అప్పుడు నీ కర్తవ్యం, నా అభీష్టం రెండూ నెరవేరుతాయి" అని అంది. శిబి సంతోషంగా అంగీకరించాడు.


వెంటనే ఒక త్రాసు తెప్పించాడు. దాని ఒక పళ్ళెంలో పావురాన్ని ఉంచి, రెండవ పళ్ళెంలో తన తొడ కోసి కొంత మాంసం వేశాడు. చిత్రం! ఆ పావురమే ఎక్కువ బరువు ఉంది. ఆ రాజు మరింత మాంసం వేశాడు. అయినా పావురం తూగలేదు. అతడు తన వివిధ అవయవాల నుంచి మళ్ళీ మళ్ళీ మాంసం కోసి

వేసినా అదే పరిస్థితి. చివరకు శిబి చక్రవర్తి తానే ఆ పళ్ళెంలో కూర్చున్నాడు.

వెంటనే ఆ పావురం, డేగ తమ తమ నిజరూపాలలో ప్రత్యక్షం అయ్యారు. ఆ పావురం అగ్నిదేవుడు. ఆ డేగ ఇంద్రుడు. అతణ్ణి పరీక్షించడానికే తాము వచ్చామని వారు అతడితో చెప్పి, అతడి దాతృత్వాన్ని, దీక్షను ఎంతగానో కొనియాడారు. అతని శరీరం పూర్వరూపాన్ని పొందేలా చేసి, “ఓ రాజా! సూర్యచంద్రులు నిలచివున్నంత వరకూ నీ కీర్తి శాశ్వతంగా నిలచివుంటుంది. నీకు అమరత్వాన్ని ప్రసాదిస్తున్నాము” అని దీవించి అంతర్ధానమయ్యారు. ఆ విధంగా శిబి చక్రవర్తి త్యాగబుద్ధికి, దాతృత్వానికి పరాకాష్టగా నిలిచాడు.

ఉపనిషత్తులలో ఈ విధంగా చెప్పబడింది: “న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః” – “సంతానం వలన కానీ, ధనం వలన కానీ మోక్షం కలుగదు. కేవలం త్యాగం ద్వారా మాత్రమే మోక్షం అంటే అమృతత్వాన్ని పొందగలము.” తన రాజ్యంలోని ప్రజల సుఖశాంతుల కోసం బ్రతికుండగానే తన శరీరంలోని మాంసాన్ని కోసి ఇచ్చి, అపైన తన ప్రాణాలనే త్యాగం చేయడానికి సిద్ధపడిన శిబి చక్రవర్తి త్యాగబుద్ధి మనందరికీ ఆదర్శం.

✦ ✦ ✦



## 10. సావిత్రి

సావిత్రి కథను వివేకానంద స్వామి ఒక ఉపన్యాసంలో వివరించారు. దాన్ని ఇప్పుడు తెలుసుకుందాము.

ఒకానొక కాలంలో అశ్వపతి అనే రాజు ఉండేవాడు. అతడికి ఒక కుమార్తె ఉండేది. ఆమె చాలా మంచి నడవడి కలిగినది. చాలా అందమైనది. సవిత్రుడికి అంటే సూర్యుడికి ప్రార్థన చేయగా పుట్టింది కాబట్టి ఆమెకు సావిత్రి అని పేరు పెట్టాడు. ఆమె అన్ని విద్యలలోనూ ఆరితేరి, అన్ని శాస్త్రాలనూ చక్కగా చదివింది. అంత పండితురాలు లోకంలో లేదన్న పేరును కూడా పొందింది. ఆ కాలంలో రాజకుమార్తెలు చాలా స్వతంత్రంగా ఉండేవారు. వారికి నచ్చిన వారిని భర్తగా వారే వరించేవారు. సావిత్రి యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత ఆమె తండ్రి ఆమెతో, 'అమ్మా! నీకు యుక్తవయస్సు వచ్చింది. నీకు నచ్చిన భర్తను నీవే ఎన్నుకో!' అని చెప్పాడు. సావిత్రి ఇందుకు ఒప్పుకుని, బంగారు రథాన్ని ఎక్కి బయలుదేరింది. ఆమెతోపాటు వృద్ధులైన తన మంత్రుల్ని రాజు తోడుగా పంపించాడు. వారితో కలసి ఆమె అనేక దేశాలు తిరిగింది. అనేకమంది రాకుమారుల్ని చూసింది. కానీ వారిలో ఎవరూ ఆమె హృదయాన్ని గెలుచుకోలేకపోయారు.

చరిత్రకందని ఆ కాలంలో, జంతువుల కోసం ప్రత్యేకించిన కొన్ని ఆశ్రమాలు అరణ్యాలలో ఉండేవి. అక్కడ మునులు, ఋషులు ఉంటూ, ప్రశాంతంగా తపస్సు చేసుకునేవారు. అక్కడ ఏ జంతువునూ వేటాడనిచ్చేవారు కాదు. అక్కడి జంతువులకు మనుష్యులంటే భయమే ఉండేది కాదు. చివరికి సరస్సులలో చేపలు కూడా అక్కడి మునుల చేతులలో నుంచి ఆహారం తీసుకునేవి. వేల సంవత్సరాలపాటు ఆ ప్రదేశాలలో ఎవరూ జంతువులను చంపలేదు. ఋషులు కాగోరినవారు సర్వాన్నీ త్యజించి, అక్కడికి వెళ్ళి ఆ జింకల, పక్షుల మధ్యన ఆ ఆశ్రమ వాతావరణంలో తపస్సు చేసుకునేవారు. వారు మాత్రమే కాక, సాంసారిక జీవితం గడిపినవారు కూడా, అటువంటి జీవితం మీద విరక్తి పుట్టిన తర్వాత అడవులలోని ఆ ఆశ్రమాలకు చేరుకుని, అక్కడి ఋషుల సాంగత్యంలో పారమార్థిక జీవితం గడుపుతూ, ధ్యానం చేస్తూ తమ శేషజీవితాన్ని గడిపేవారు.

ఇక మనం కథలో ముందుకు సాగితే, ద్యుమత్సేనుడనే ఒక రాజు ఆ కాలంలో శత్రువుల చేతిలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. వృద్ధాప్యం వలన తన కంటిచూపును కూడా పోగొట్టుకుని, చివరకు ఒక అడవిలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడ తన వార్ధక్యజీవితాన్ని గడపసాగాడు. కటిక పేదరికంలో ఉన్నా, తన రాణితోనూ, కుమారుడితోనూ కఠినమైన తపస్సు చేస్తూ కాలం గడుపుతున్నాడు. అతడి కుమారుడి పేరు సత్యవంతుడు. సత్యవంతుడు

సౌశీల్యవంతుడూ, మహాబలవంతుడూ అయినా తన తల్లిదండ్రుల బాగోగులు చూస్తూ వారితోనే ఉంటున్నాడు.

అనేక రాజ్యాలు పర్యటిస్తూ, అనేక రాజదర్బారులను చూస్తూ, సావిత్రి ఈ ఆశ్రమానికి వచ్చింది. ఎంత గొప్ప చక్రవర్తి అయినా ఒక ఆశ్రమం పక్కనుంచి వెడుతూవుంటే, అక్కడ ఆగి అందులోని ఋషులకు నమస్కరించనిదే వెళ్ళేవారు కాదు. అలా చేయడాన్ని ఎంతో తమ కర్తవ్యంగా భావించేవారు. ఆ ఆశ్రమాలలోని సాధువులను అంత గౌరవంగా చూసేవారు ఆ రోజులలో. భారతదేశంలోని అతి గొప్ప మహారాజు కూడా, అడవులలో కందమూలాలు తింటూ, నారబట్టలు కట్టుకుని జీవించిన ఏదోవొక గొప్ప ఋషి యొక్క సంతతికి చెందిన వాణ్ణి అని తన గురించి చెప్పుకోవడానికి ఎంతో గర్విస్తాడు. మనందరమూ ఆ మహర్షుల సంతతికి చెందినవారమే! మన దేశంలో ఆధ్యాత్మికతకూ, మతానికీ అటువంటి గౌరవాన్ని ఇస్తారు! ఒకవేళ గుర్రం మీద సవారీ చేస్తూ పోతున్నప్పుడు ఒక మహర్షి ఎదురైతే, గుర్రం దిగి, నడుస్తూ ఆయనకు ఎదురేగి, నమస్కరిస్తారు. రథంలో ప్రయాణిస్తున్నట్లైతే, ఆ రథాన్నీ, ధనుర్బాణాలనూ, కవచాన్నీ ఆశ్రమం బయట విడిచిపెట్టి లోపలకు వెళ్ళాలి. ఏ సైనికుడైనా సరే, ఒక సైనికుడిలా కాక, ఒక పారమార్థికుడిలాగా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా లోనికి ప్రవేశించవలసిందే.

సావిత్రి ఈ ఆశ్రమానికి వచ్చి అక్కడ సత్యవంతుణ్ణి చూసింది. ఆమెకు అతడు నచ్చాడు. ఎన్నో రాజ్యాలూ, ప్రాంతాలూ తిరిగినా, ఏ రాకుమారుడూ ఆమెను



ఆకర్షించలేకపోయాడు కానీ, ఈ ఆశ్రమంలోని ద్యుమత్సేనుడి కొడుకైన సత్యవంతుడు ఆమె హృదయాన్ని గెలుచుకున్నాడు.

సావిత్రి తన తండ్రిని తిరిగి చేరుకున్నప్పుడు ఆయన, "అమ్మా సావిత్రీ! నీకు నచ్చినవాడు ఎవరైనా కనిపించారా?" అని అడిగాడు. సావిత్రి సిగ్గుపడుతూ, "అవును తండ్రీ!" అని సమాధానం చెప్పింది. "ఆ రాకుమారుడి పేరేమిటి? ఏ రాజ్యపీఠాన్ని అధిష్ఠించబోతున్నాడు?" అని ఆయన అడిగాడు. "అతడు రాజ్యభ్రష్టుడైన ద్యుమత్సేనుడి కుమారుడు. అతడికి ఏ రాజ్యమూ లేదు. అడవిలోని ఆశ్రమంలో నివసిస్తూ, కందమూలాలూ, శాకాలూ సేకరిస్తూ, తల్లిదండ్రులను సేవిస్తూ అడవిలోనే ఉంటాడు" అని సావిత్రి సమాధానమిచ్చింది.

ఇది విని అశ్వపతి నారద మహర్షిని సంప్రదించాడు. ఆయన "వరుడు అన్ని విధాలా సౌశీల్యవంతుడు, మహాపరాక్రమవంతుడే కానీ చాలా దురదృష్టజాతకుడు" అన్నాడు. అది విని ఆశ్చర్యపోయిన ఆ రాజు ఎందుకో వివరించమన్నాడు. నారద మహర్షి, 'ఆ యువకుడు మహాబలవంతుడు, శీలవంతుడే కానీ, పన్నెండు నెలలలో మరణిస్తాడు' అని చెప్పాడు. ఇది విని రాజు నిర్ఘాంతపోయాడు. అతడు సావిత్రితో, 'అమ్మా! ఆ యువకుడు పన్నెండు నెలలలో మరణిస్తాడట. నీకు వైధవ్యం ప్రాప్తిస్తుంది. కొంచెం ఆలోచించు! నువ్వు అటువంటి దురదృష్టజాతకుణ్ణి, అల్పాయుష్కుణ్ణి పెళ్ళి చేసుకోవడం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు!" అన్నాడు. దీనికి సమాధానంగా సావిత్రి, "నాన్నా! అవన్నీ మీరు మనస్సులో పెట్టుకోకండి. నన్ను వేరొకరిని పెళ్ళి చేసుకోమనీ, తద్వారా నా శీలాన్ని త్యజించమనీ అడగకండి. ఒక కన్య జీవితంలో ఒకసారే వరిస్తుంది. ఆపైన ఎప్పటికీ తన మనస్సులో వేరొకరిని తలచదు" అని పలికింది. ఇలా ఎప్పుడైతే సావిత్రి తన దృఢనిశ్చయాన్ని తెలియజెప్పిందో అశ్వపతి ఆమె వివాహానికి సమ్మతించాడు. అలా సావిత్రి వివాహం సత్యవంతుడితో జరిగింది. ఇక సావిత్రి తన రాజభవనాన్ని వదిలి, అడవిలోని ఆశ్రమానికి వెడుతున్నందుకు ఏమాత్రం విచారించకుండా, ఏ విధమైన అరమరికలనూ చూపకుండా, తన భర్త వద్దకు వెళ్ళింది. అక్కడే ఉంటూ, తన అత్తమామలకు సేవ చెయ్యసాగింది.

సావిత్రికి సత్యవంతుడు సరిగ్గా ఏ రోజున చనిపోతాడో తెలుసు. కానీ ఆ విషయాన్ని ఆమె వారెవరితోనూ చెప్పలేదు. సత్యవంతుడు రోజూ అడవికి వెళ్ళి కందమూలాలూ, పూలూ, పళ్ళూ, వంటచెరకూ సేకరించి ఆశ్రమానికి తెచ్చేవాడు. సావిత్రి వంటచేయడమే కాక, వృద్ధులైన అత్తమామలకు సహాయపడేది. అలా రోజులు గడచిపోతూ ఉండగా ఆ దుర్దినం దగ్గరపడింది. ఆ రోజుకు ఇంకా మూడు రోజులుండనగా, ఆమె ఆ చివరి మూడు రోజులూ ఉపవాసం, జాగరణ

చేపట్టింది. గొప్ప వ్యాకులతతో ప్రార్థన చేసింది. చివరకు అన్నాళ్ళుగా భయపడుతున్న రోజు రానే వచ్చింది. తెల్లవారింది. ఆ రోజు సత్యవంతుణ్ణి వదిలి సావిత్రి ఉండలేకపోయింది. ఆ రోజు తాను కూడా అడవికి వెళ్ళడానికి అత్తమామల అనుమతి తీసుకుని, అతడితో కలసి అడవికి వెళ్ళింది. వారు అడవిలో నడుస్తూ ఉండగా, హఠాత్తుగా, అతడికి తన తల తిరుగుతున్నట్టూ, తన కాళ్ళూచేతులూ పట్టుతప్పుతున్నట్టూ అనిపించింది. తడబడుతున్న మాటలతో, "సావిత్రీ! నాకు మత్తుగా ఉంది. నిద్ర ఆవహిస్తోంది. కాసేపు ఇక్కడ, నీ ప్రక్కనే విశ్రమిస్తాను!" అన్నాడు. సావిత్రి భయంతో వణికిపోతూ, "ప్రియతమా! ఇలా నా ఒడిలో తలపెట్టుకుని విశ్రమించు!" అని చెప్పింది. జ్వరంతో కాలిపోతున్న తన తలను సావిత్రి ఒడిలో ఉంచి, ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి, సత్యవంతుడు ప్రాణాలు వదిలేశాడు. కన్నీరు ధారాపాతంగా కారుతూ ఉండగా, సావిత్రి సత్యవంతుడి భౌతికకాయాన్ని పట్టుకుని ఆ అడవిలో అలాగే కూర్చుంది. యమభటులు సత్యవంతుడి ఆత్మను తీసుకుపోవడానికి వచ్చారు. కానీ భర్త తలను తన ఒడిలో పెట్టుకుని కూర్చుని ఉన్న సావిత్రి దరిదాపులకు కూడా వారు రాలేకపోయారు.




ఆమె చుట్టూ అగ్ని ఒక వలయంలా మండుతున్నట్టు వారికి కనిపించింది. వారు తిరిగి యముడి దగ్గరకు పారిపోయి, తాము సత్యవంతుడి ఆత్మను ఎందుకు తేలేకపోయామో వివరించారు.

అప్పుడు మృత్యుదేవత అయిన యమధర్మరాజు తానే స్వయంగా దిగివచ్చాడు. ఈ భూమి మీద మరణించిన వారిలో అతడు మొదటివాడు. ఆ విధంగా అతడు ఈ భూమి మీద మరణించిన వారందరికీ దేవత అయ్యాడు. మనిషి చనిపోయిన తర్వాత అతణ్ణి శిక్షించాలో, లేక సన్మానించాలో అతడు నిర్ణయిస్తాడు. యమభటులు చేయలేని పనికోసం సాక్షాత్తూ యమధర్మరాజే దిగిరావలసివచ్చింది. మరణానికి అధిపతి అతడే కాబట్టి ఆ అగ్నివలయంలోనికి ప్రవేశించగలిగాడు. అతడు సావిత్రి వద్దకు వచ్చి, 'సాధ్వీ! ఈ శవాన్ని వదిలిపెట్టు. శరీరాన్ని ధరించిన వారందరూ ఏదోవొకనాటికి చనిపోవాలని నీకు తెలుసు కదా!" అన్నాడు. ఆ మాటలు విని సావిత్రి పక్కకు తొలగింది. యముడు సత్యవంతుడి ఆత్మను శరీరంలో నుంచి లాగివేసి, తనతోపాటు తీసుకుపోసాగాడు. అయితే ఆమె వదలకుండా అతణ్ణి అనుసరించసాగింది. కొంతదూరం పోయాక ఆమె కాలి అడుగుల క్రింద ఎండుటాకులు నలుగుతున్న శబ్దం యముడికి వినిపించింది. అతడు వెనుకకు తిరిగి, 'అమ్మా, సావిత్రీ! నన్ను ఎందుకు అనుసరించి వస్తున్నావు? పుట్టినవాడు గిట్టకమానడని నీకు తెలియదా!" అన్నాడు. సావిత్రి, "తండ్రీ! నేను నిన్ను అనుసరించడం లేదు. మరణం తప్పనిసరి అయినట్టే, ఒక స్త్రీ తాను ప్రేమించినవాణ్ణి అనుసరించకుండా ఉండలేదన్నది కూడా విధి నియమమే కదా! పరస్పరం ప్రేమించుకునే స్త్రీపురుషులను ఆ మరణమనే నియమం కూడా విడదీయలేదు కదా! కాబట్టి నా నిమిత్తం లేకుండానే నా శరీరం సత్యవంతుణ్ణి అనుసరిస్తోంది" అని చెప్పింది.

గడ్డిపరక అంత స్వార్థం కూడా లేని ఆమె ప్రేమ, కర్తవ్యనిష్ఠ, ఆ విపత్కర పరిస్థితులలో, ఆమెకు అటువంటి అద్భుతమైన స్థైర్యాన్నీ, శక్తినీ ఇచ్చాయి. బొందితో యమధర్మరాజును అనుసరించి పోగలిగే శక్తి ఆమెకున్న పవిత్రత వలన ఆమెకు కలిగింది.

అప్పుడు యముడు, "అమ్మా! నీ పతి ప్రాణాలు తప్ప ఏదైనా వరం కోరుకో!" అన్నాడు. సావిత్రి, "తండ్రీ! మీరు వరం ఇవ్వదలచుకుంటే, నా మామగారి గుడ్డితనాన్ని తొలగించి, ఆయనకు సంతోషాన్ని కలిగించండి!" అని కోరింది. యముడు, "అమ్మా! నీవు చాలా పవిత్రమైన కోరిక కోరావు. కర్తవ్యనిష్ఠతో నీవు కోరిన నిస్వార్థమైన కోరికకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. నీ కోరిక తీరగలదు!" అని వరమిచ్చి, తిరిగి యముడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. దుర్గమమైన

అడవి మార్గాలలోకి తన ప్రయాణాన్ని మళ్ళించి, చాలా దూరం నడిచాడు. అయితే అతడికి మళ్ళీ సావిత్రి అడుగుల సవ్వడి వినపడింది. అతడు వెనుకకు తిరిగి, "సావిత్రీ! ఇంకా నన్ను అనుసరిస్తున్నావా?" అని అడిగాడు. "అవును తండ్రీ! అలా రాకుండా ఉండాలనుకున్నా నాకు సాధ్యం కావడం లేదు. నా మనస్సు నా భర్తనే కోరుతోంది. నా శరీరం నా మనస్సునే అనుసరిస్తోంది. అతడి ఆత్మలోనే నా ఆత్మ కూడా ఉంది. అందుచేత మీరు ఆత్మను తీసుకుపోతే దాని శరీరం కూడా దాన్ని అనుసరించవలసిందే కదా?" అని సావిత్రి యమధర్మరాజుతో బదులు చెప్పింది. అది విని యముడు, "కుమారీ! నీ మాటలకు నేనెంతో సంతోషించాను. నీవు ఎంతో న్యాయమైన మాటలు పలికావు. నీకు ఇంకొక వరం ఇస్తాను. నీ పతి ప్రాణాలు తప్ప వేరేదైనా కోరుకో!" అన్నాడు.



సావిత్రి, "యమధర్మరాజా! మీరు మరొక వరాన్ని అనుగ్రహించడానికి ఇష్టపడితే, నా మామగారు పోగొట్టుకున్న సంపదలనూ, రాజ్యాన్నీ తిరిగి చేకూరేలా చెయ్యండి!" అని కోరింది. యముడు, "తల్లీ! ఈ వరం కూడా ఇస్తున్నాను. ఇక ఇంటికి మరలిపో! ప్రాణంతో ఉన్న మానవమాత్రుడెవరూ యమలోకానికి వెళ్ళలేడు!" అన్నాడు.

మళ్ళీ యముడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. అయితే వినయంతోనూ, విశ్వాసంతోనూ, స్థైర్యంతోనూ అలరారుతున్న సావిత్రి, విగతజీవుడైన తన భర్త ఆత్మను అనుసరించడాన్ని ఆపలేదు. యముడు మళ్ళీ వెనుకకు తిరిగి, "సావిత్రీ! నిరాశతో, సంతాపంతో నీవు నన్ను అనుసరించి వస్తున్నావు. కానీ దానివల్ల ప్రయోజనం లేదు. ఇక మరలిపో!" అని చెప్పాడు. "మీరు నా భర్తను ఎక్కడికి తీసుకుపోతే అక్కడికి నేను రాక తప్పదు!" అని సావిత్రి జవాబిచ్చింది. అప్పుడు యముడు, "నీ భర్త పాపాత్ముడై, నరకానికి పోవాలనుకో. అప్పుడు కూడా నువ్వు నీ భర్తను అనుసరించిపోగలవా?" అని ప్రశ్నించాడు. సావిత్రి దృఢమైన స్వరంతో, "చావులోనూ, బ్రతుకులోనూ, స్వర్గమైనా, నరకమైనా, నా భర్త ఎక్కడకు పోతే నేను అక్కడికి అతణ్ణి సంతోషంగా అనుసరించి వస్తాను" అని పలికింది. యముడు, "అమ్మా! నీవు పలికిన పలుకులు మంగళప్రదమైనవి. నీకు మరొక వరమిస్తాను. కోరుకో!" అన్నాడు. సావిత్రి, "మీరు మరొకసారి అనుమతిస్తున్నారు కనుక కోరుతున్నాను. నా మామగారి రాజవంశం అంతం కాకుండా, సత్యవంతుడి పుత్రులు రాజ్యమేలేలా వరమివ్వండి!" అని కోరింది. ఇది విని యమధర్మరాజు చిరునవ్వు నవ్వాడు. "కుమారీ! నీ కోరిక నెరవేరుతుంది. నీ భర్త ప్రాణాలను తిరిగి ఇస్తున్నాను, తీసుకో! సత్యవంతుడు తిరిగి జీవించి, పుత్రవంతుడవుతాడు. నీ పుత్రులు కాలక్రమంలో మహారాజులు కాగలరు! ప్రేమ మరణాన్నే జయించింది. మునుపెన్నడూ, ఈ భూమి మీద పుట్టిన ఏ స్త్రీ అయినా, నీలాగా ప్రేమించలేదు. అచంచలమైన ప్రేమకు, మృత్యుదేవతనైన నేను కూడా ఎదురు నిలబడలేనన్న సత్యానికి నీవే ఋజువు!" అంటూ సావిత్రిని వేనోళ్ళ పొగిడాడు.

పురుషులకు కానీ, స్త్రీలకు కానీ శీలమనేది మనస్సుకు సంబంధించినదే. పురాణకథలలో మనం చూసే గొప్పవారి చరిత్రలన్నింటిలోనూ వారు తమ మనస్సును ఒకసారి ఒకరికే సమర్పించారు. స్త్రీలలో కానీ, పురుషులలో కానీ, అనేకమందిని కోరే మనస్సు ఎప్పటికీ పవిత్రతను సాధించలేదు. అటువంటి మనస్సును కలిగివున్న వారిని వారి మనస్సే దుర్భరమైన బాధలలో ముంచి, మనశ్శాంతి లేకుండా చేయడమే కాక, కుటుంబాన్నీ, సమాజాన్నీ విచ్ఛిన్నం

చేస్తుంది. తల్లిదండ్రులలో కనిపించే పవిత్రత వారి బిడ్డలను సత్పురుషులుగానూ, విశ్వానికి మేలు చేసేవారిగానూ తీర్చిదిద్దుతుంది.

వివేకానంద స్వామి భారతదేశానికి ఎవరు ఆదర్శమో వివరిస్తూ, "ఓ భారతదేశమా! నీ స్త్రీజాతికి ఆదర్శం సీత, సావిత్రి, దమయంతి అని మర్చిపోవద్దు. నీవు ఆరాధించే దేవుడు, సన్న్యాసులకే సన్న్యాసి, అన్ని అనుబంధాలనూ విడిచిపెట్టిన త్యాగి, ఉమాపతి అయిన శంకరుడని మరచిపోవద్దు. నీ వివాహం, నీ సంపదలు, నీ జీవితం ఇంద్రియసుఖాల కోసం కాదని, నీవొక్కడివే సుఖపడడం కోసం కాదని మరచిపోవద్దు. జగన్మాత బలిపీఠం మీద బలిగా సమర్పించబడడానికే (అంటే సమాజానికి సేవచేయడం కోసమే) నీవు పుట్టావని మరచిపోవద్దు" అని చెప్పారు. ఆయన సావిత్రి కథను చెప్పడం ముగించి, చివరకు ఇలా చెప్పారు. "ఇదీ సావిత్రి కథ! భారతదేశంలోని ప్రతి బాలిక తాను కూడా సావిత్రిలాగా ఎదగాలని ఆకాంక్షించాలి. సావిత్రి ప్రేమ ముందు మరణం కూడా ఓడిపోయింది. అటువంటి మహత్తరమైన ప్రేమ చేత యముణ్ణే జయించి, ఆమె తన భర్త ప్రాణాలను తిరిగి పొందగలిగింది. మహాభారతంలో ఇటువంటి అందమైన కథలు ఎన్నో ఉన్నాయి."

మనిషి ఇంద్రియసుఖాల కోసం వెంపర్లాడకుండా, సత్–శీలంతో జీవించడం ద్వారా సమాజం నాలుగుకాలాలపాటు మనగలుగుతుంది. 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నానుడి మనందరకూ తెలుసు. దానికి అర్థం మనిషి తన స్వసుఖాలను లెక్కచేయకుండా, అవినీతికి పాల్పడకుండా, సమాజానికి సేవచేయడాన్నే తన ధర్మంగా భావించి, తన జీవితంలో దాన్ని ఆచరించి చూపించినప్పుడు అది తిరిగి ఆ మనిషినే రక్షిస్తుంది అని అర్థం.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦


## 11. దమయంతి

వేల సంవత్సరాల క్రితం నిషధ అనే రాజ్యాన్ని నలుడు పరిపాలించేవాడు. అతడు ప్రజారంజకుడైన పరిపాలకుడు కావడంతో ప్రజలు కూడా అతణ్ణి ఎంతగానో ప్రేమించేవారు. అతడి తండ్రి వృద్ధుడైపోయి, అడవికి వెళ్ళి తపస్సు చేసుకోసాగాడు. నలుడికి పుష్కరుడు అనే ఒక దాయాది ఉండేవాడు. అతడు కపటి. ఒకరోజు అతడు నలుడి దగ్గరకు వచ్చి, తాను పట్టణవాసంతో విసిగిపోయాననీ, దేశాలు తిరిగి రావాలనుకుంటున్నాననీ చెప్పి వెళ్ళిపోయాడు.

రాజ్యపాలన అంతా సవ్యంగానే సాగుతున్నా, కొంత కాలం నుంచి నలుడు అంతరంగంలో ఏదో తెలియని బాధతో మథనపడుతున్నాడు. అతడి దుఃఖానికి కారణం ఏమిటో ఎవరికీ తెలియదు. అలా రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు ఒంటరిగా విహరిస్తూ నలుడు ఒక సరస్సు వద్దకు వచ్చి, అందులోని హంసలను చూశాడు. "ఈ సరస్సు ఎంత రమణీయంగా ఉంది. ఇంత అందమైన హంసలను ఎప్పుడూ చూడలేదు" అనుకున్నాడు. వాటిలో ముఖ్యంగా ఒక హంస బంగారువర్ణంలో మెరిసిపోతూ కనిపించింది. నలుడు నెమ్మదిగా, చప్పుడు చేయకుండా వెనుకనుంచి వెళ్ళి ఆ హంసను పట్టుకున్నాడు. అతడు దానితో, "భయపడకు! నీకు నేనేమీ హాని తలపెట్టను. నిన్ను నా రాజభవనంలో ఉంచి, నీకు మంచి ఆహారాన్ని ఇస్తాను" అని అన్నాడు. అయితే అది మామూలు హంస కాదు. అది తన తోటి హంసలతో, "మిత్రులారా! భయపడకండి. నేను పూర్వజన్మలో ఇచ్చిన మాట ప్రకారం కొన్ని రోజులు ఈ రాజుతో వెళ్ళకతప్పదు. నా పని పూర్తి కాగానే మళ్ళీ వచ్చి మిమ్మల్ని చేరతాను" అని పలికి రాజుతో పాటు అతడి రాజప్రాసాదానికి చేరింది. ఒకరోజు నలుడు దిగులుగా ఉండడం చూసి ఆ హంస, "ఓ రాజా! నీవు ఎందుకు దిగులుగా ఉన్నావు?" అని అడిగింది. నలుడు, "నేను కొన్ని నెలలుగా విరహం వలన దుఃఖంగా ఉంటున్నాను. ఒకసారి నారదమహర్షి నాతో దమయంతి అనే రాజకుమారి గురించి చెప్పారు. ఆమె కుందనపురపు రాజు అయిన భీముని పుత్రిక. ఆమె మహా విద్వాంసురాలు. ఆయన నాతో ఆమె గురించి చెప్పినప్పటినుంచీ నేను వివాహమాడితే ఆమెనే వివాహమాడాలని నిశ్చయించుకున్నాను" అని చెప్పాడు. ఇది విన్న మరుక్షణం ఆ బంగారు హంస గాలిలోకి ఎగిరిపోతూ, "ఓ రాజా! నీ బాధ అందుగురించేనా? ఆ విషయం నేను చూసుకుంటాను! ఇక నిశ్చింతగా ఉండు. నేనొక వారంలో తిరిగి వస్తాను. ఇక వివాహానికి ఏర్పాట్లు చేసుకో!" అని చెప్పింది.

అలా ఆకాశంలోకి ఎగిరిన ఆ హంస కుందనపురాన్ని చేరింది. అక్కడ రాజుగారి తోటలో చేరి, దమయంతికి వినపడేలా 'నల! నల!' అని అరవ సాగింది.

దమయంతి ఆ అందమైన హంసను చూసి ముచ్చటపడి, దానిని పట్టుకోవాలని వెంబడించింది. అది అందకుండా కొంత దూరం పోయి, చివరకు అక్కడ దమయంతికి చిక్కింది. దమయంతి ఆ హంసతో మాట్లాడుతూ, “నీవు ‘నల, నల’ అంటున్నావు కదా! అతడు ఎవరు?” అని ప్రశ్నించింది. ఆ హంస నలుడి గుణగణాలను కొనియాడింది. అది విని, “నలుడు నిజంగానే చాలా మంచి వ్యక్తి అయివుంటాడు. నేను వివాహమాడితే అతణ్ణే వివాహమాడతాను!” అని దమయంతి పలికింది. ఇది విని ఆ బంగారు రాయంచ తిరిగి నలుడి వద్దకు వచ్చి, ‘మిత్రమా! నేను ఇచ్చిన మాటను నెరవేర్చాను. దమయంతి నిన్ను మాత్రమే పెళ్ళాడతానని నిశ్చయించుకుంది” అని చెప్పి తిరిగి తన మిత్రుల దగ్గరకు వెళ్ళిపోయింది.




అచిరకాలంలోనే నలుణ్ణి దమయంతీ స్వయంవరానికి ఆహ్వానించారు. అన్ని దేశాలనుంచి రాకుమారులు వచ్చారు. కానీ దమయంతి తన మనస్సులో నలుణ్ణి మాత్రమే కోరింది. అతడికే వరమాలను వేసింది. నలుడు ఆమెను వివాహమాడి, తన రాజ్యానికి తెచ్చాడు. నిషధ దేశప్రజలు తమ రాజు యొక్క దుఃఖం తీరిందని సంతోషించారు. మంచికాలం క్షణంలో గడచిపోతుంది. చూస్తూవుండగానే పన్నెండు సంవత్సరాలు గడిచాయి. వారికి ఒక కుమార్తె, కుమారుడు కలిగారు.

ఒకరోజు హఠాత్తుగా కపటి అయిన పుష్కరుడు తిరిగి వచ్చాడు. "నేను అరణ్యవాసంతో విసిగిపోయాను. తిరిగి పట్టణవాసం చేయదలచుకున్నాను" అని చెప్పాడు. నలుడు అతణ్ణి సంతోషంగా ఆహ్వానించి, అతడి కోసం ఒక భవనాన్ని కూడా నిర్మించి ఇచ్చాడు. కానీ పుష్కరుడు నలుడి రాజ్యాన్ని అపహరించాలనుకున్నాడు. నలుడు, పుష్కరుడు తరచూ జూదమాడుతూ ఉండేవారు. నలుడు ఓడిపోతూ ఉండేవాడు. ఒక రోజున పుష్కరుడు, "ఇప్పుడు ఆఖరుసారిగా పాచికలు వేద్దాము. ఓడిన వారు మూడు సంవత్సరాలు అరణ్యవాసం చెయ్యాలి. గెలిచిన వారు సింహాసనాన్ని ఎక్కుతారు" అన్నాడు. అందుకు అంగీకరించి జూదం ఆడిన నలుడు ఓడిపోయాడు.

ఇచ్చిన మాట ప్రకారం నలుడు రాజ్యాన్ని వదిలి అడవికి బయలుదేరాడు. దమయంతి పిల్లలను తన తండ్రి వద్దకు పంపి, నలుడితో కలసి తాను కూడా అరణ్యానికి వెళ్ళింది. వారిద్దరూ ఆహారపానీయాల కోసం వెతుకుతూ అడవిలో సంచరిస్తున్న సమయంలో, వారికి కొన్ని పక్షులు కనిపించాయి. వాటిని పట్టుకుంటే ఆకలి తీరుతుందని భావించి, నలుడు తన పంచెను విప్పి వాటి మీద వేశాడు. కానీ చిత్రంగా, ఆ పక్షులు కలసికట్టుగా ఎగిరి, ఆ పంచెను కూడా తమతోపాటు తీసుకుపోయాయి. నలుడికి ఇక కట్టుకోవడానికి ఏ వస్త్రమూ లేదు. ఈ పరిణామాలకు విస్తుబోయిన నలుడు విచారిస్తూ ఉంటే దమయంతి, "ఓ ప్రభూ! విధివశాన కలుగుతున్న పరిణామాలకు విచారించి ప్రయోజనం లేదు!" అని ఓదార్చింది. నలుడు, "నేను నీ గురించే దిగులు పడుతున్నాను. నావల్ల నీవు కూడా ఇలా అగచాట్లపాలు కావలసివచ్చిందే అని బాధపడుతున్నాను" అని అన్నాడు. ఆమెను పుట్టింటికి పంపినట్టయితే ఆమె కష్టపడకుండా ఉంటుందని అతడు భావించాడు. అందువలన కుందనపురం వైపు ఆమెను తీసుకువెళ్ళాడు. అలా ఆ అడవిలో కొంతదూరం వెళ్ళాక వారికి ఒక మార్గం కనిపించింది. నలుడు, దమయంతికి ఆ మార్గాన్ని చూపుతూ, "ఈ మార్గంలో మీ నాన్నగారి రాజ్యానికి చేరవచ్చు. నీవు వెళ్ళి మీ నాన్నగారి ఇంటిలో ఉండు! ఈ మూడేళ్ళ అరణ్యవాసం తరువాత నేను వచ్చి నిన్ను తీసుకువెడతాను" అన్నాడు. కానీ

దమయంతి దృఢనిశ్చయంతో, "నిన్ను ఇక్కడ ఒంటరిగా విడిచి నేను వెళ్ళను" అని చెప్పింది. ఆ రాత్రికి వారు దమయంతి చీరను నేలమీద పరచి దాని మీద పడుకున్నారు. నలుడు తెల్లవారక ముందే నిద్రలేచి, దమయంతి చీరలో కొంత భాగాన్ని చింపి, తాను కట్టుకుని, నిశ్శబ్దంగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.



నలుడు అలా చాలాదూరం నడచి వెళ్ళాక, అకస్మాత్తుగా అతడికి "రక్షించండి! రక్షించండి!" అన్న అరుపులు వినిపించాయి. అతడు అవి వినిపించిన చోటికి పరుగు పరుగున వెళ్ళాడు. అక్కడ ఒక నాగదేవత మంటల్లో చిక్కుకుని కనిపించాడు. నలుడు ఆ మంటలలోకి దూకి, అతణ్ణి రక్షించాడు. ఆ నాగదేవత అందుకు సంతోషించి, "నీవు నా ప్రాణాలు కాపాడావు. దానికి ప్రతిగా నీకు ఒక వరాన్ని ఇస్తాను. పది అడుగులు ముందుకు నడువు!" అన్నాడు. నలుడు అలా ముందుకు నడువగానే, ఆ నాగదేవత అతణ్ణి కురూపిగా, ఎవరూ గుర్తుపట్టలేనట్టుగా మార్చి వేశాడు. ఇది చూసి నలుడు కలవరపడి, "ఇదేమిటి? నన్ను ఇలా చేశారు?" అని అడిగాడు. నాగదేవత చిరునవ్వు నవ్వుతూ, "దీనివల్ల నీకే

ఉపయోగం. నిన్ను ఎవరూ గుర్తుపట్టకుండా ఉంటారు. ఇక నుంచీ నీవు బాహుకుడనే పేరుతో సంచరించు. అయోధ్యకు రాజైన ఋతుపర్ణుడు పాచికలు ఆడడంలో దిట్ట. నీవు అతడి దగ్గరకు వెళితే అతడి నుంచి పాచికలు ఆడడంలోని మెళకువలు నేర్చుకోవచ్చు. ఈ దేవతావస్త్రాన్ని తీసుకో! నీ నిజరూపాన్ని పొందాలనుకున్నప్పుడు దీన్ని ధరించు!" అని చెప్పి మాయమైపోయాడు. నలుడు అతడి సలహా మేరకు అయోధ్యానగరానికి సాగిపోయాడు. నలుడికి వంట చేయడం చక్కగా వచ్చును కనుక, వంటమనిషిగా ఆ రాజు కొలువులో చేరాడు.

మహాభారతంలో భీముడు కూడా అజ్ఞాతవాససమయంలో విరాటరాజు కొలువులో వలలుడు అనే పేరుతో వంటవాడిగా చేరాడు. వీరిరువురూ వంట చేయడంలో అద్భుతమైన నేర్పుగలవారు కాబట్టే 'నలభీమపాకం' అనే జాతీయం ఏర్పడింది.

ఈ లోపల దమయంతి మేలుకుని చుట్టూ చూస్తే నలుడు కనిపించలేదు. ఆమె నలుడి కోసం ఏడుస్తూ అడవి అంతా గాలించసాగింది. అక్కడి పక్షులనూ, జంతువులనూ, "నలుణ్ణి చూశారా?" అంటూ అడిగింది. అలా ఆమె అడవిలో తిరుగుతూ ఉంటే, ఒక పెద్ద కొండచిలువ ఆమె కాళ్ళకు చుట్టుకుని ఆమెను చంపబోయింది. ఇంతలో ఎక్కడ నుంచో ఒక వేటగాడి బాణం వచ్చి కొండచిలువ తలలో దిగబడి, అది చచ్చిపోయింది. కానీ ఆ వేటగాడు, "ఇంత అందంగా ఉన్న నీవు ఎవరు? అప్సరసవా? గంధర్వకన్యవా? నన్ను వివాహం చేసుకో?" అంటూ దమయంతిని వెంబడించసాగాడు. దమయంతి, "ఓరీ పాపాత్ముడా! నన్ను ఆ కొండచిలువ చంపినా సరిపోయేది! ఎక్కడున్నావో అక్కడే నిలబడు! ఒక్క అడుగు ముందుకు వేసినా భస్మమైపోతావు!" అని ఆ వేటగాణ్ణి హెచ్చరించింది. కానీ వాడు ఆమె హెచ్చరికను చెవినపెట్టలేదు. దానితో దమయంతి అతణ్ణి శపించింది. వాడు అక్కడికక్కడే భస్మమైపోయాడు.

దమయంతి నీరసంతో కుంటుతూ, నెమ్మదిగా ఒక నది ఒడ్డుకు చేరింది. అక్కడ కొందరు వ్యాపారులు కనిపించారు. వారిని నలుడు ఎక్కడైనా కనిపించాడా అని దమయంతి అడిగింది. వారికి నలుడు ఎవరో తెలియలేదు. చేసేదిలేక, ఆ రాత్రికి అక్కడే వారితోపాటు విశ్రమించింది. ఆ రాత్రి ఒక పెద్ద ఏనుగుల గుంపు వచ్చి, ఆ వర్తకులు తీసుకుపోతున్న సామానును పూర్తిగా ధ్వంసం చేశాయి. వారు, "మనం తీసుకుపోతున్న విలువైన సామాను అంతా నాశనమయింది. ఈ స్త్రీ వచ్చిన తర్వాతనే మనకు ఈ దురదృష్టం కలిగింది. ఈమెను తరిమి కొట్టండిరా!" అంటూ దమయంతిని తరిమివేశారు. దమయంతి తన ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పారిపోయి విప్రపురం అనే రాజ్యాన్ని చేరింది. కానీ అన్నాళ్ళుగా అడవిలో తిరుగుతూ, కట్టుబొట్టు చెదిరిపోయి ఉండడంతో, ఆ ఊరిలో పిల్లలు

ఆమెను పిచ్చిదనుకుని గేలిచేయసాగారు. అయితే ఆ దేశపు రాణి భానుమతి ఆమెను చూసి, తన చెలికత్తెలతో, "ఆమె చూడబోతే మంచి వంశానికి చెందిన మనిషిలాగా కనిపిస్తోంది. ఆమెను పిలవండి!" అని దమయంతిని పిలిపించి, తనకు అలంకారం చేసేందుకు పనిమనిషిగా నియమించింది. దమయంతి తన వివరాలను వెల్లడించకుండా, ఆ పనికి ఒప్పుకుంది. అందువలన, ఆ రాణికి దమయంతి ఎవరో తెలియలేదు.

ఇలా ఉండగా, ఒకరోజు కుందనపురపు మంత్రి విప్రపురానికి వచ్చాడు. అతడు దమయంతిని గుర్తుపట్టి, "అమ్మా! మేము నీ కోసం అన్నిచోట్లా గాలిస్తున్నాము. నిన్ను కుందనపురానికి తీసుకుపోతాను. నాతో రా అమ్మా!" అని ఆమెను కుందనపురానికి చేర్చాడు. అక్కడ ఆమె పిల్లలు కొంత పెద్దవారై ఆడుకుంటూ కనిపించారు. వారిని చూసి కొంత సంతోషం కలిగినా, నలుడు లేకపోవడం ఆమెకు పూర్తి సంతోషాన్ని కలిగించలేకపోయింది. ఇన్ని కష్టాలు ఎదురవుతున్నా ఆమె మనస్సు నలుడి మీదనే లగ్నమయి ఉంది. రాజవైభోగాలన్నీ ఎదురుగానే ఉన్నా ఆమె వాటిని అనుభవించలేదు. అంతేకాక, వేరొకరి గురించి పొరపాటున కూడా ఆలోచించలేదు. దమయంతి ప్రేమలో స్వార్థానికీ, కల్మషానికీ తావు లేదు. రానురాను నలుడు తనకు తోడుగా లేకపోవడం దమయంతి హృదయాన్ని పిండివేయసాగింది. నిద్రాహారాలు కూడా ఆమెకు సహించడం లేదు.

నలుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవడానికి దమయంతి ఒక ఉపాయం ఆలోచించింది. తాను వేసే పొడుపు కథలకు నలుడు మాత్రమే జవాబు చెప్పగలడని ఆమెకు తెలుసు. అందుచేత ఆమె ఒక పొడుపుకథను ఒక మంత్రికి చెప్పి, దానిని విప్పగలవారు ఎక్కడున్నారో తెలుసుకోమని పంపించింది. ఆ మంత్రి అన్ని దేశాలూ తిరుగుతూ, చివరికి అయోధ్యకు చేరి అక్కడ రాజుగారి ఆస్థానంలో ఈ పొడుపు కథను చెప్పాడు. "ఒక రాజు పారిపోయాడు. అతడి మాణిక్యం మట్టిలోపడి ఉండిపోయింది. రాజు ఎందుకు పారిపోయాడో మాణిక్యం చెప్పలేక పోయింది" అన్నదే ఆ పొడుపు కథ సారాంశం. దీనిని ఆ రాజుగారి ఆస్థానంలో ఎవరూ విప్పిచెప్పలేకపోయారు. బాహుకుడన్న మారుపేరుతో ఉన్న నలుడు లేచి నిలబడి, "మహారాజా! నన్ను ఈ పొడుపుకథను విప్పడానికి అనుమతించండి. 'రాజ్యాన్ని పోగొట్టుకున్న రాజు, మాణిక్యాన్ని ఉంచుకోలేడు కదా!' " అని విప్పి చెప్పాడు. ఇది విని సభికులందరూ ఎంతో సంతోషించారు. భీముని మంత్రి తిరిగిపోయి, దమయంతితో, "అమ్మా! ఈ పొడుపుకథను విప్పగలవాడు అయోధ్యలో ఉన్నాడు. అయితే అతడు చాలా కురూపి. అతడు నలుడు కాగల అవకాశం లేదు" అని విన్నవించాడు. కానీ దమయంతి, ఈ పొడుపు కథను

విప్పిన వాడు ఖచ్చితంగా నలుడే అయివుంటాడని నిశ్చయించుకుని తన తండ్రి చేత తనకు మరొకసారి స్వయంవరం జరగబోతున్నట్టు చాటింపు వేయించింది. కుందనపురపు మంత్రి అయోధ్య వెళ్ళి ఈ చాటింపును వినిపించాడు. ఇది విని, దమయంతి ఇలా ఎందుకు చేస్తున్నదా అనుకుని నలుడు ఆశ్చర్యపోయాడు.

ఋతుపర్ణుడు కూడా ఆ స్వయంవరాన్ని చూడడానికి వెళ్ళాలనుకున్నాడు. కానీ మరునాడే స్వయంవరం జరుగబోతున్నదని తెలిసి అంత దూరం, అంత త్వరగా వెళ్ళడం ఎలాగా అని విచారించసాగాడు. కానీ బాహుకుడు అతడికి ధైర్యం చెపుతూ, 'రాజా! నాకు అశ్వహృదయం అనే విద్య తెలుసు. దాని ద్వారా నేను గుర్రాలు పూన్చిన రథాన్ని వాయువేగంతో నడిపి, మిమ్మల్ని రేపటికల్లా కుందన పురానికి చేర్చగలను" అని చెప్పాడు. వారిద్దరూ కలసి రథంలో ఎక్కి బయలు దేరారు. రథం గాలిలో ఎగురుతున్నట్టుగా నడుస్తోంది. ఆ వేగంలో ఋతుపర్ణుడి అంగవస్త్రం ఎగిరిపోయింది. ఋతుపర్ణుడు ఇది చూసి, "బాహుకా! ఇంత వేగంగా గుర్రాలను నడపడం అనితరసాధ్యం. నాకు కూడా ఈ అశ్వహృదయమనే విద్యను నేర్పించు. నాకు తెలిసిన అక్షహృదయం అనే (పాచికల ఆటలో మర్మాల) విద్యను నీకు నేర్పుతాను" అన్నాడు. వారిద్దరూ కుందనపురం చేరే లోపలే తమ విద్యలను ఒకరికి ఒకరు నేర్పుకున్నారు. మరునాటికల్లా వారు కుందనపురం చేరుకున్నారు.

కుందనపురంలో బాహుకుడు తన పిల్లలను చూశాడు. వారి దగ్గరకు వెళ్ళి వారిని ప్రేమతో హత్తుకున్నాడు. ఇది చూసి, దమయంతి వచ్చి నలుణ్ణి పలుకరించింది. "నీవు వస్తావని నాకు తెలుసు! ఎందుకంటే ఆ పొడుపుకథను విప్పగలవాడివి నీవొక్కడివే. అంతేకాక ఒక్కరోజులోనే అంతదూరం నుంచి ఇక్కడకు రథాన్ని నడపగల శక్తి నీకు మాత్రమే ఉంది!" అని చిరునవ్వుతో చెప్పింది. నలుడు సంతోషించి, "మరి నీకు మళ్ళీ స్వయంవరం ప్రకటించారెందుకు?" అని ప్రశ్నించాడు. దమయంతి నవ్వుతూ, "అది నిన్ను ఇక్కడికి రప్పించేందుకు ఒక సాకు మాత్రమే!" అని చెప్పింది. నలుడు తన దగ్గర ఉన్న దివ్యవస్త్రాన్ని ధరించి తన పూర్వరూపాన్ని పొందాడు. నలదమయంతులు తిరిగి రాజభవనానికి వెళ్ళారు. వారిని చూసి ప్రజలు ఎంతో సంతోషించారు. ఋతుపర్ణుడు కూడా మారువేషంలో అన్ని రోజులుగా తనతో ఉన్నది నలుడేనని తెలుసుకుని సంతోషించాడు. నలుడు మూడు సంవత్సరాల అరణ్యవాసాన్ని పూర్తి చేసినట్టు పుష్కరుడితో చెప్పి, తిరిగి అతణ్ణి పాచికలాటకు పిలిచి, ఈసారి అతణ్ణి చిత్తుగా ఓడించాడు. ఆ తర్వాత నలదమయంతులు చిరకాలం ప్రజారంజకంగా రాజ్యపాలన చేశారు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 12. కచుడు

భారతీయధర్మం చిరపురాతనమైనది, నిత్యనూతనమైనది. ఈ ధర్మానికి వేద, వేదాంతాల తర్వాత రామాయణ, భారత, భాగవతాది పురాణగ్రంథాలే ముఖ్యభూమికలు. ఈ పురాణాది గ్రంథాలలోని ధర్మానికి సత్యమే స్వభావంగా భాసిస్తుంది. ఇప్పుడు ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం తృతీయాశ్వాసంలోని యయాతి మహారాజు చరిత్రలో కచ-దేవయానుల వృత్తాంతాన్ని పరిశీలిద్దాం.

సంపదల పంపకాల విషయంలో అన్నదమ్ములైన దేవదానవులకు మాటిమాటికీ యుద్ధాలు జరిగేవి. దేవతల రాజు ఇంద్రుడు, గురువు బృహస్పతి. రాక్షసరాజు వృషపర్వుడు, గురువు శుక్రాచార్యుడు. ఈ యుద్ధంలో మరణించిన రాక్షసులను శుక్రాచార్యుడు మృతసంజీవని చేత బ్రతికిస్తున్నాడు. ఆ విద్య తమవద్ద లేని కారణంగా దేవతల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతూ ఉంది. రాక్షసుల సంఖ్య స్థిరంగా నిలుస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న దేవతలు, శుక్రుడి నుంచి ఆ విద్యను తేగలవాడు బృహస్పతి కుమారుడైన కచుడని గుర్తించి తమ సమస్యను అతడికి చెప్పుకున్నారు. దేవతలు, "నీకు నీతినియమాలు, వ్రతనిష్ఠ పుట్టుకతోటే అలవడ్డాయి. కనుక నీకు తప్పక కార్యసిద్ధి కలుగుతుంది" అంటూ, శుక్రుడి ఇంటిలో ఎలా ప్రవర్తించాలో మెళకువలు నేర్పి, కచుణ్ణి ఆశీర్వదించి పంపారు.

కాలం ఏదైనా, మనఃస్పర్థలకు, తగాదాలకు మూలం సంపదలే. సంపద రక్తసంబంధీకులను కూడా విడదీస్తుంది. అంతవరకూ స్నేహంగా ఒకదానినొకటి నాకుకుంటున్న కుక్కలు నాలుగు విస్తరాకులు పడగానే ఎలా కొట్టుకుంటాయో మనందరమూ చూస్తూనే ఉంటాము. కాబట్టి అన్ని అనర్థాలకూ మూలం ధనమే. తమలోని లోపాన్ని వివేచన ద్వారా గుర్తించగలిగిన విజ్ఞులు దేవతలు. విద్య మీద ఆసక్తి, గురువు మీద భక్తి, నియమనిష్ఠల మీద ప్రసక్తి, తమవారి మీద అనురక్తి, కార్యసాధనలో యుక్తి కలవాడైన కచుణ్ణి ఎంపిక చేయడంలోనే దేవతల విజ్ఞత వ్యక్తమవుతుంది.

కచుడు శుక్రుని వద్దకు వెళ్ళి, "నేను బృహస్పతి కుమారుణ్ణి. నా పేరు కచుడు. నియమనిష్ఠలు కలవాణ్ణైన నేను మీకు శుశ్రూష చేయడానికి వచ్చాను. నన్ను శిష్యుడిగా స్వీకరించండి" అని ప్రార్థించాడు. కచుడిలోని సౌకుమార్యం, వినయం, మెత్తదనంతో కూడిన మాటలు, తియ్యదనంతో నిండిన భావాలు, నియమనిష్ఠలతో ప్రకాశిస్తున్న ముఖం శుక్రునికి కనిపించాయి. "ఇతడు శిష్యత్వానికి తగినవాడు" అని భావించి కచుని కోరికను మన్నించాడు.

ఈ ఘటనలో కచుని సౌశీల్యం కనిపిస్తుంది. కచుడు శత్రుకూటమిలోకి వెళ్ళాలి. వారు సామాన్యులు కారు. ఎటువంటి హింసాత్మక చర్యలకైనా వెనుకాడని

రాక్షసులు. మృతసంజీవనీ విద్య రాక్షసులకు మాత్రమే మేలు చేస్తున్న రహస్యమైన విద్య. దానిని పొందడం ప్రయాసతో కూడినదే కాక అసాధ్యమైనది కూడానూ. అటువంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల ప్రవర్తన కచునికి మాత్రమే ఉన్నదని దేవతలు గుర్తించారు. శిష్యునిగా చేసుకోవడానికి తగిన యోగ్యత, అర్హత కచునిలో ఉన్నాయని శుక్రుడు గమనించి శిక్షణకు స్వీకరించాడు. అంతేకాక, "కచుడికి బోధిస్తే, అతడి తండ్రి బృహస్పతికి పూజ చేసినట్టే" అని బృహస్పతి పట్ల తనకున్న గౌరవభావంతో తలపోశాడు. శుక్రుడు, బృహస్పతి వరుసగా రాక్షసులకు, దేవతలకు గురువులు. కచుడు శత్రుకూటమికి చెందినవాడైనా, అతడిలోని ఉన్నతత్వాన్ని గుర్తించి, గౌరవించగల స్థిరచిత్తుడు శుక్రుడు.

కచుడు గురుశుశ్రూషాకౌశలంతో శుక్రుడికి ఆత్మీయుడైన శిష్యుడు అయ్యాడు. అంతేకాక వినయవిధేయతలతో మెలగుతున్న అతని ప్రవర్తనను చూసి గురుపుత్రిక అయిన దేవయానికి కూడా అతడంటే ఇష్టం ఏర్పడింది. గురు కటాక్షమే కాక గురుపుత్రి ప్రేమ కూడా అతడికి లభించాయి. ఇది చూసిన రాక్షసులలో అతడిపట్ల స్పర్థ, అసూయ, ఈర్ష్య, ద్వేషం, క్రోధం పాదుకొన్నాయి. 'శ్రుతి మించి రాగాన పడినట్లు', వారిలోని రాక్షసభావాలు కార్యరూపం దాల్చాయి. ఒకనాడు దానవులు అడవిలో ఒంటరిగా ఉన్న కచుణ్ణి పట్టుకుని చంపి, చెట్టుకు కట్టివేసి వెళ్ళిపోయారు. హోమధేనువులు ఇంటికి తిరిగి వచ్చాయి కానీ కచుడు రాలేదు. ఇది గమనించిన దేవయాని తండ్రి వద్దకు వెళ్ళి తన ఆవేదనను వెళ్ళగక్కింది. కుమార్తె మీద ఉన్న ప్రేమ వలన, అతని హృదయం జాలితో నిండిపోయింది. శుక్రుడు తన దివ్యదృష్టితో కచుడి స్థితిని తెలుసుకుని, మృతసంజీవనితో కచుణ్ణి బ్రతికించి ఇంటికి తెప్పించాడు.

కాలం గడుస్తోంది. గురువు యొక్క మంత్రశక్తితో పునర్జీవితులు అవుతున్న రాక్షసులలో అధికారమదం పెరిగిపోయింది. వారు కచుణ్ణి చంపడానికి మరొక అవకాశం ఎప్పుడు వస్తుందా అని వేచిచూడసాగారు. ఒకరోజు దేవయాని కోసం పూలు తేవడానికి అడవికి వెళ్ళిన కచుణ్ణి వారు చంపి, అతడి శరీరాన్ని కాల్చి బూడిద చేసి, ఆ బూడిదను మద్యంలో కలిపి తీసుకువచ్చి, దానిని గురువుచేత త్రాగించారు. శుక్రునికి మద్యపానం ఒక బలహీనత. కాబట్టి వారు మద్యాన్ని తేగానే ముందూవెనుకా ఆలోచించకుండా దాన్ని తాగి మత్తులోకి జారిపోయాడు. ఆ రాత్రి కచుడు ఇంటికి తిరిగి రాలేదని దేవయాని గుర్తించి మళ్ళీ తండ్రి దగ్గరకు పోయి మొరపెట్టుకుంది. శుక్రుడు దేవయానితో, "ఎందుకు దుఃఖిస్తావు? మృతసంజీవని గొప్పతనాన్ని గుర్తించని రాక్షసులు గర్వంతో కచుణ్ణి చంపారు. కచుడు మరణించినా ఉత్తమలోకాలకు పోతాడులే!" అంటూ ఓదార్చాడు. కానీ

దేవయాని కచుడి గుణాలను, రూపాన్ని, అతడు చేసిన మంచి పనులనూ కీర్తించి, కచుడు లేకుండా అన్నం తినడానికి నిరాకరించి, ఏడుస్తూ కూర్చుంది. దీనిని భరించలేని శుక్రాచార్యుడు యోగదృష్టితో లోకాలన్నీ వెతికి, చివరకు జరిగిన పొరపాటును తెలుసుకున్నాడు. కచుడు తన పొట్టలోనే ఉన్నట్లు గుర్తించాడు.

**మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్**
**పరఁగఁ బెక్కుసేసి పడయఁబడిన**
**యట్టి యెరుక జనుల కాక్షణ మాత్రన**
**చెఱుచు మద్యసేవ సేయ నగునె?**



అనేక జన్మలలో చేసుకున్న పుణ్యకార్యాల ఫలితంగా ఎంతో జ్ఞానాన్ని పొందుతాము. అంతటి జ్ఞానం కూడా మద్యపానంవల్ల ఒక్క క్షణంలో నశించిపోతుంది. పరిస్థితులతో కలతపడిన శుక్రుడు, "నేటి నుంచి ప్రజలు ఎవరైనా మద్యం సేవిస్తే పాపాన్ని పొంది పతనమైపోతారు!" అని శపించి, "సురాపానం మహాపాతకం" అని ప్రకటించాడు.

ఒకసారి గురువు కచుణ్ణి బ్రతికించాడు కదా, మరొకసారి కూడా బ్రతికించగలడు అని ఆలోచించలేని అల్పజ్ఞానులు రాక్షసులు. తండ్రి వంటి గురువుచేత మద్యాన్ని త్రాగించడమే ఘోరమైన పాపమైతే, దానికి కచుడి చితాభస్మాన్ని కలిపి త్రాగించిన మూర్ఖులు వారు. గురువుపట్ల ఇంతటి అపచారాన్ని చేసినవారు ఎంతటి దోషులో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

శుక్రాచార్యుడు మంత్రద్రష్ట, తపస్వి, మహా విద్వాంసుడు. కానీ అతడిలో రెండు బలహీనతలు కనిపిస్తాయి. అవి మద్యానికి బానిస కావడం, కుమార్తెపట్ల హద్దులులేని ప్రేమను పెంచుకోవడం. ఈ రెండూ గురువుగా అతడు నిర్వహించాల్సిన విధికి ప్రతిబంధకాలై నిలిచాయి. మద్యపానం చేసినవాడు నాశనమవుతాడని శపించాడు; కానీ కూతురి మీద మమకారాన్ని చంపుకోలేకపోయాడు. బలీయమైన ఆ మమకారం వల్ల తన పొట్టలోని కచుణ్ణి బ్రతికించాడు. శుక్రుడి పొట్టలోని బూడిద సంజీవనీ మంత్రంతో శరీరంగా ఏర్పడి, దానికి జీవం, బలం చేకూరాయి. "గురువర్యా! మీ పొట్టలో నుంచి బయటకు వచ్చే మార్గాన్ని తెలపండి?" అని కచుడు శుక్రుణ్ణి కోరాడు.

ఇప్పుడు ఆచార్యుడైన శుక్రుడి ముందు ఆకాశమంత ప్రశ్న నిలబడింది. కచుడు తన పొట్ట చీల్చుకుని బయటకు వస్తే తాను మరణిస్తాడు. తనను బ్రతికించడం కోసం ఎవరైనా ఒకరికి మృతసంజీవనీ విద్యను నేర్పాలి. అయితే ఎవరికి నేర్పాలి అన్నదే ఆ ప్రశ్న. తన రాజైన వృషపర్వుడు, అతని సైన్యంలోని రాక్షసవీరులు, ఎంతోకాలంగా తన దగ్గరే విద్యార్జన చేస్తున్న శిష్యసమూహం, తాను అమితంగా ప్రేమించే దేవయాని, ఇంకా తనకు ఆత్మీయులు అయిన వారు ఎందరో ఉన్నారు. వీరందరిలో ఎవరికి ఆ విద్యను నేర్పాలో తేల్చుకోలేక ఆ గురువు సందిగ్ధంలో పడిపోయాడు.

మరొకవైపు కచుడు శత్రుకూటమి నుంచి వచ్చినవాడు. ప్రత్యేకించి ఈ విద్యను పొందడానికి ఎప్పుడు అదును దొరుకుతుందా అని ఎదురు చూస్తున్న వాడు. కచునికి నేర్పితే దేవతలకు లాభం, దానవులకు నష్టం, కష్టం. తనవాళ్ళకి నేర్పితే చనిపోయిన తనను తప్పక బ్రతికించగలరు. ఎంత కాదనుకున్నా తన కుమార్తెకయినా చెప్పాలి. తనను బ్రతికించగలదన్న నమ్మకం కుమార్తె మీదే

ఉంటుంది కదా! ఏ విధంగా చూసినా కచుణ్ణి నమ్మడమనేది అసాధ్యంగా తోస్తుంది. అయినాసరే, శుక్రుడు తన వారినందరినీ త్రోసిపుచ్చి, పొట్టలోని కచునికే మృతసంజీవనీ మంత్రాన్ని బోధించాడు.

ధర్మం తెలిసిన ఆచార్యులు ఎవరయినా బోధనలో ఈ నీతినే పాటిస్తారు. ఎక్కడయినా, ఎప్పుడయినా, ఏ విద్య అయినా సమాజానికి మేలు చెయ్యాలి. దాని ఫలితం సమాజానికి కీడు తేకూడదు. మృతసంజీవనీ విద్య ద్వారా లోకానికి గొప్ప మేలు కలుగవచ్చు, లేదా గొప్ప కీడు కూడా కలుగవచ్చు. ఈ విద్యను సక్రమంగా వినియోగిస్తారన్న నమ్మకం తన రాజ్యంలోని వారెవరి మీదా శుక్రాచార్యునికి లేదు. తన కుమార్తె దేవయాని కూడా భావోద్వేగాలకు బానిస. ఇవన్నీ పరిగణించిన శుక్రాచార్యుడు శత్రుపుత్రుడైన కచుణ్ణే విశ్వసించి, అతడికే ఆ రహస్యమైన మంత్రాన్ని చెప్పాడు. కచుడు శుక్రుని కడుపులో నుంచి వెలికివచ్చిన వెంటనే గురువును బ్రతికించి ఆ నమ్మకాన్ని నిలబెట్టాడు. ఏ విద్య అయితే కచుడికి దక్కకూడదని రాక్షసులు భావించారో ఆ విద్య వారి ఈర్ష్య కారణంగానే కచుడికి దక్కింది. రాక్షసులు చేసిన అనాలోచితమైన పని వారికే చేటు తెచ్చింది. ఎవరయినా ముందుచూపు లేకుండా పనిచేస్తే ఫలితం ఇలాగే ఉంటుంది. విద్యను పొందిన కచుడు తన ఇంటికి వెళ్ళడానికి గురువు అనుమతిని పొంది ఆ వార్తను దేవయానికి చెప్పాడు. అప్పుడు దేవయాని, "నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీవు బ్రహ్మచారివి. నేను కన్యను. నేను నిన్ను ప్రేమించడం వలన మానసికంగా మన వివాహం జరిగినట్టే లెక్క. అందువల్ల నా తండ్రి నుంచి పొందిన విద్యతోపాటు నన్ను కూడా స్వీకరించి, వివాహమాడి సంతోషపెట్టు!" అని కోరింది. ఈ మాటలు విని కచుడు ఎంతో కలత చెందాడు. అతడు ఏనాడూ దేవయానిని ఆ దృష్టితో చూడలేదు. "ఓ దేవయానీ! నీవు లోకం నిందించే కోరిక కోరుతున్నావు. ఇంతకాలంగానూ, నిన్ను నా సహోదరిగానే భావించాను. నీవు ఇలాంటి కోరిక కోరవచ్చునా?" అన్నాడు.

**గురులకు శిష్యులు పుత్రులు**
**పరమార్థము లోకధర్మపదమిది దీనిం ।**
**బరికింపక యీ పలుకులు**
**తరుణీ! గురుపుత్రి! నీకుఁ దగునే పలుకన్ ॥**

కచుడు దేవయానితో, "నేను నిన్ను చెల్లెలిగా భావిస్తున్నాను. గురువులకు శిష్యులు కొడుకులతో సమానం. ఇదే ఉత్తమమైన లోకధర్మం. లోకమంతా అనుసరించవలసిన సత్యమార్గం. ధర్మజ్ఞుడైన ఆచార్యుడి కుమార్తెవైన నీవు సరియైన విధంగా ఆలోచించలేకపోతున్నావు. ఇది నీకు సరి కాదు" అని చెప్పి

తనదారిన తాను వెళ్ళబోయాడు. అప్పుడు దేవయాని ఆగ్రహించి, "నీవు పొందిన విద్య నీకు పని చెయ్యదు!" అని శపించింది. కచుడు అందుకు ప్రతిగా, "నీవు అధర్మం తలపెట్టావు కాబట్టి నిన్ను ఏ బ్రాహ్మణుడూ వివాహమాడడు!" అని శాపం ఇచ్చి దేవలోకానికి తిరిగి వెళ్ళిపోయాడు. అక్కడ తాను నేర్చుకున్న మృతసంజీవనీ మంత్రాన్ని యోగ్యులైన దేవతలకు ఉపదేశించి, తన వారికి మేలు చేశాడు.

దేవయాని కచుని రూపాన్ని, గుణగణాలనూ, నడవడినీ తండ్రివద్ద కీర్తించింది. కచునితో ఆమెకు గల చనువు ఆమెలో అనురాగాన్ని పెంచింది. దానివల్లనే ఆమె కచుణ్ణి రెండుసార్లు బ్రతికింపజేసింది. ఇలా అయినప్పటికీ, కచుడి విద్యాభ్యాసం పూర్తి అయ్యేవరకూ అతడికి తన కోరికను చెప్పలేదు. బ్రహ్మచారులు విద్యాభ్యాసానంతరమే వివాహానికి అర్హులు. అందుకనే ఆ సమయం వరకూ దేవయాని ఆగింది. అయితే తండ్రి చేసిన మితిమీరిన గారాబం వల్ల పెంకిగా తయారయ్యింది. కనిపించని అహంకారం ఆమెలో జీవం పోసుకుంది. 'తాను తలచిన పని ఏదైనా జరుగుతుంది!' అనే భావన ఆమె గడుసుదనానికి జీవిక. అందువల్ల లోకవిరుద్ధమైన కోరిక కోరింది. ఉత్తముడైన కచుడు ఆమె కోరికను తిరస్కరించడానికి కొన్ని ధర్మసూత్రాలను చెప్పాడు. ఎవరికైనా గురుపుత్రి సోదరే అవుతుంది. ఆమె తానుగా వలచివచ్చినా సరే ఆమెను కోరడం లోకసమ్మతం కాదు.

గురుశిష్యులకు మధ్య ఏ బలహీనతలూ లేని సంబంధం ఉండాలి. అప్పుడే శిష్యుడు చక్కగా విద్య నేర్చుకోగలుగుతాడు. గురువు చక్కగా బోధించగలుగుతాడు. అలా కానట్టయితే గురుశిష్యులకు వారివారి కర్తవ్యాల మీద సరైన ఏకాగ్రత కలుగదు. కాబట్టి శిష్యులు గురువులకు కుమారులుగా ఉండడమే సత్యపథం. దీనిని కాదన్నవారు తప్పక ఇబ్బందులకు గురవుతారు. కన్నతండ్రి, పోషకుడు, రక్షకుడు అనే ముగ్గురూ స్త్రీకి గురువులు కాగా, ఉపనయనం చేసిన వాడు, వేదాలు చెప్పినవాడు పురుషులకు గురువులు అవుతారు. ఈ నీతినే కచుడు దేవయానికి చెప్పాడు. అంతేకాక, రెండవసారి తన రూపం, జీవం, బలం, జన్మ శుక్రుని ఉదరంలో జరిగాయి కాబట్టి భౌతికంగానూ, శాస్త్రరీత్యానూ కూడా వారిద్దరి సంబంధం సహోదర సంబంధమే.


విద్యాబోధనలో యోగ్యుడైన శిష్యుణ్ణి ఎంపిక చేసుకున్న శుక్రాచార్యుడు ఉన్నతుడైన గురువు. యోగ్యత ద్వారా విద్యోపదేశానికి అర్హత పొందిన కచుడు ఉత్తమ శిష్యుడు. కాబట్టే ధర్మం, సత్యం పట్ల స్థిరబుద్ధి కలిగిన కచుడి విద్య లోకాలన్నింటికీ మహోపకారం చేసింది.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# 13. మదాలస

పూర్వం శత్రుజిత్తు అనే రాజు ఉండేవాడు. అతడికి ఋతధ్వజుడు అనే కుమారుడు జన్మించాడు. వివేకంలోనూ, విక్రమంలోనూ, సౌందర్యంలోనూ ఆ రాకుమారుడు సాటిలేని మేటి అనిపించుకున్నాడు. అతడు మదాలస అనే స్త్రీని వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా గొప్ప పండితురాలు మాత్రమే కాక, ఆత్మజ్ఞానం కూడా పొందినది.

కొంతకాలానికి వారికి ఒక కొడుకు కలిగాడు. అతడికి విక్రాంతుడు అని పేరు పెట్టారు. మదాలస ఆ బిడ్డను ఊయలలో పడుకోబెట్టి, "శుద్ధోఽసి, బుద్ధోఽసి, నిరంజనోఽసి – నీవు శుద్ధుడివి, పవిత్రుడివి, ఆత్మజ్ఞానివి, నిరంజనుడివి, నిర్వికారుడివి, ఆత్మస్వరూపుడివి! నీకు పేరు లేదు. ఈ పేరు కల్పితం మాత్రమే. నీవు ఈ పంచభూతాలతో తయారైన శరీరానివి కావు. దీనికీ నీకు ఎలాంటి సంబంధమూ లేదు. నీవు సంసారమనే మాయకు అతీతుడివి.



నీ దేహం భౌతికమైన పదార్థాలతో తయారయింది కాబట్టి, అది ఏదోవొకనాటికి నశించి, పంచభూతాలలో కలసిపోక మానదు. ఈ దేహమనేది ఆత్మమీద కప్పిన వస్త్రం లాంటిది. మంచిచెడు కర్మల వల్లనే ఈ దేహం నీకు కలిగింది. తండ్రి, కొడుకు, తల్లి, భార్య, ఇది నాది, ఇది నాది కాదు అని భౌతికమైన వస్తువిషయాలను గురించి ప్రేలాపనలు చేసి ప్రయోజనం లేదు. అందరూ ఏదోవొక రోజు నిన్ను విడిచిపెట్టి పోయేవారే! ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలకు అర్థం లేదు. రక్తం, మాంసం, అస్థిపంజరం మొదలైన పదార్థాలతో కూడుకున్న శరీరం మీద అపేక్ష ఎందుకు? ధర్మాధర్మాలను విడిచిపెట్టు. వేటిని ఉపయోగించుకోవడం ద్వారా వాటిని విడిచిపెడతావో వాటిని కూడా విడిచిపెట్టు!" అని జోలపాడసాగింది. ఈ విధంగా ఆత్మతత్త్వాన్ని బోధించే పాటలు పాడుతూ, మదాలస తన మొదటి కొడుకును పెంచి పెద్దచేసింది. పెరిగేకొద్దీ వాడికి వైరాగ్యం, పారమార్థిక జిజ్ఞాస అలవడ్డాయి. వాడు రాజ్యపు బాధ్యతలు చేపట్టకుండా, పరివ్రాజకుడై దేశాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

మదాలసకు రెండవ కొడుకు కలిగాడు. వాడికి సుబాహువు అని పేరు పెట్టారు. వాడికి కూడా ఆమె ఇదే విధమైన ఉపదేశం చేసింది. వాడు కూడా అన్నలాగా పారమార్థిక జ్ఞానాన్ని సొంతం చేసుకున్నాడు. దానితో పాటు లౌకికజ్ఞానంలో కూడా నిష్ణాతుడయ్యాడు. సాంసారిక భోగాలు తాత్కాలికమైనవి అని గ్రహించి, వాటిని త్యజించి ఒక సన్యాసిగా మారి వనాలకు సాగిపోయాడు.

మదాలసకు మూడవ కొడుకు కలిగాడు. వాడికి అరిమర్దనుడు అని పేరు పెట్టారు. వాడికి కూడా ఆమె ఇదే విధమైన ఉపదేశం చేసింది. వాడు కూడా అన్నలలాగా పారమార్థిక అభిలాషతో అరణ్యాలకు వెళ్ళిపోయాడు. అయితే ఈ ముగ్గురూ రాజ్యభారాన్ని వహించకుండా వెళ్ళిపోవడం చూసిన ఋతధ్వజుడు ఎంతో చింతించాడు. కనీసం నాలుగవవాడినైనా రాజ్యాధికారం చేపట్టేలా తయారు చెయ్యమని మదాలసను కోరాడు.

నాలుగవ కొడుకుకు అలర్కుడు అనే పేరు పెట్టారు. మదాలస వాడికి, "నాయనా! మంచిపనులతో నీ తండ్రికి సంతోషాన్ని కలిగించు! ఈ జన్మలోనూ, తరువాతి జన్మలలోనూ మంచి ఫలితాలను ఇచ్చే కర్మమార్గాన్ని అనుసరించు. నీవు ఈ భూమండలం మొత్తాన్ని ఏకచ్ఛత్రాధిపతివై పరిపాలిస్తావు. పరోపకారాన్నే నిరంతరం మనస్సులో ఉంచుకొని పరిపాలన చెయ్యి. పరస్త్రీల మీదకు మనస్సును పోనివ్వకు. నిరంతరం భగవన్నామ స్మరణ చెయ్యి. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను జయించు. కష్టాలలో ఉన్న ప్రజలను కాపాడు. అన్నదానాలను, ఇతర సత్కర్మలనూ చేసి సాధువులనూ, పేదలనూ, ఆశ్రితులనూ సంతోషపెట్టు.

సాధువులను సంరక్షించడం కోసం నీ ప్రాణాలను అర్పించడానికి నిరంతరం సిద్ధంగా ఉండు. ఇదే పరమార్థం. ఈ విధంగా జీవించి నీ జన్మను సఫలం చేసుకో!" అని ప్రౌఢత్వంలో ఉన్నప్పుడు ఉద్బోధించింది.

మరికొంత పెద్దవాడయ్యాక అతడికి రాజధర్మాన్ని బోధించింది. "రాజు అయిన వాడు ప్రజలకు అయిష్టం కాని పద్ధతులను అనుసరించాలి. సప్తవ్యసనాలనూ (ఏడు రకాల చెడు అలవాట్లు – జూదం, స్త్రీవ్యామోహం, మద్యపానం, వేట, దుబారాఖర్చు, కఠినంగా మాట్లాడడం, అవసరానికి మించి దండించడం) వదిలి పెట్టాలి. శత్రువుల నుండి ఆత్మరక్షణ చేసుకోగలిగి ఉండాలి. తన మంత్రులలో దుష్టుడెవరో, మంచివాడెవరో తెలుసుకుని మసలుకోవాలి. కామక్రోధాలకు రాజు వశుడు కాకూడదు. షాడ్గుణ్యాలని పిలవబడే సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధం, ఆశ్రయం అనే ఆరు ఉపాయాలను తెలుసుకుని మసలుకోవాలి. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు! ముందు సొంత రాజ్యంలో ఉన్న తనవారిని వశం చేసుకున్న తర్వాత శత్రువుల మీదకు దండెత్తాలి. లేకపోతే తనవారి వల్లనే తనకు ప్రమాదం కలుగవచ్చు. రాజు తాను చేసే సంక్షేమకార్యక్రమాలతో ప్రజలను సంతోషపెట్టాలి. సూర్యుడు భూమి నుంచి జలాన్ని పీల్చుకున్నట్టు సూక్ష్మోపాయంతో, ప్రజలను బాధించకుండా, పన్నులను రాబట్టుకోవాలి. యమధర్మరాజులాగా భేదబుద్ధి లేకుండా అందరినీ సమానంగా చూడాలి" అని మదాలస అలర్కుడికి రాజధర్మాన్ని బోధించింది. ఆ విధంగానే అలర్కుడు ప్రజారంజకమైన పాలనచేసే రాజుగా ఎదిగాడు. క్రమంగా వివాహం చేసుకుని కొడుకులను కన్నాడు.

చిన్నతనంలో విద్య నేర్పేటప్పుడు ముందుగా, మనిషికి మంచి నడవడి గురించి బోధించి శీలవంతునిగా తీర్చిదిద్దాలి. ఆ తరువాత రకరకాల నైపుణ్యాలను నేర్చుకోవచ్చు. ముందుగా శీలాన్ని అలవరచుకోకపోతే నైపుణ్యాలలో ఎంత ప్రావీణ్యత కలిగినా అది తనకు, లోకానికి ఉపయోగపడదు. అటువంటివాడు తన మనస్సును అదుపులో ఉంచుకోలేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతాడు. అవినీతికి లొంగిపోయి, దుర్మార్గానికి వెనుకాడక, సమాజానికి ప్రమాదకరంగా తయారవుతాడు. మదాలస బోధించిన విద్యలో మనం ప్రముఖంగా చూసే విషయం శీలనిర్మాణమే. ఆ తర్వాతే అతడికి రాజనీతి బోధించింది.

మనిషి తన మనుమల్ని చూసిన తర్వాత ప్రాపంచికమైన ఆలోచనలు మాని, వానప్రస్థ ఆశ్రమంలో ప్రవేశించి, భగవంతుడి గురించిన చింతన చెయ్యాలని శాస్త్రాలు బోధిస్తున్నాయి. అదే విధంగా మదాలసాఋతధ్వజులు రాజ్యాన్ని అలర్కుడికి అప్పగించి అడవికి బయలుదేరారు. వెళ్ళే ముందు, మదాలస

అలర్కుడితో, "నాయనా! గృహస్థాశ్రమంలో ఉండి రాజ్యపాలన చేసేటప్పుడు నీకు అనేక కష్టాలు కలుగవచ్చు. అహంకార, మమకారాలతో ఉండేవాడికి కష్టాలు కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇదుగో ఈ ఉంగరాన్ని తీసుకో. దీనిలోని రాయి క్రింద ఒక శాసనాన్ని వ్రాసిపెట్టాను. నీకు కష్టకాలం దాపురించినప్పుడు దీన్ని తీసి చదువుకో!" అని చెప్పి వెళ్ళిపోయింది.

అలర్కుడు ప్రజారంజకంగా రాజ్యపాలన చేస్తూ, ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకుంటూ ఉండగా అనేక సంవత్సరాలు గడచిపోయాయి. అతడి పుత్రులు రాజ్యపాలన చేయగలిగిన వయస్సుగలవారైనప్పటికీ అలర్కుడికి రాజ్యభోగాల మీద కోరిక తీరలేదు. ఇంకాయింకా రాజ్యపరిపాలన కొనసాగించాడు. ఇలా తన తమ్ముడు విషయసుఖాలకు దాసుడైపోయాడన్న విషయం అడవిలోని సుబాహుడికి తెలిసింది. అతడు కాశీరాజు దగ్గరకు వెళ్ళి, తన తమ్ముడు తన రాజ్యభాగం ఇవ్వలేదని చెప్పి అతడిచేత అలర్కుడి మీదకు దండయాత్ర చేయించాడు. కాశీరాజు యుక్తితో అలర్కుణ్ణి ఓడించాడు. దీనితో అలర్కుడు దుఃఖంలో మునిగిపోయాడు. తాను అన్నివిధాలా చక్కగానే పాలన చేసినా, ఎందుకు పరిస్థితులు అలా పరిణమించాయో అతడికి అర్థం కాలేదు. అప్పుడు హఠాత్తుగా తల్లి ఇచ్చిన ఉంగరం గుర్తుకువచ్చి, దాన్ని తెరిచి చదివాడు. దానిలో ఇలా వ్రాసి ఉంది.

**సంగః సర్వాత్మనా త్యాజ్యః న చేత్త్యక్తుం న శక్యతే ।**
**స సద్భిః సహ కర్తవ్యః సతాం సంగో హి భేషజమ్ ॥**
**కామః సర్వాత్మనా హేయః హాతుం చేచ్ఛక్యతే న సః ।**
**ముముక్షాం ప్రతి తత్కార్యం నైవ తస్యాన్య భేషజమ్ ॥**

అన్ని విధాలా సంగాన్ని (అంటే అన్నివిధాలా అహంకార మమకారాలనూ, వాటితో కలిగే అనుబంధాలనూ) త్యజించడమే మేలు. కానీ అలా సంగాన్ని విడిచిపెట్టడం కుదరకపోతే సజ్జనులయిన వారితోనే సాంగత్యం చెయ్యాలి. సత్సాంగత్యమే అన్ని బాధలనూ నివారించగల పరమౌషధం.

అన్ని విధాలా కామాన్ని (కోరికను) వదిలిపెట్టాలి. అలా వదలలేకపోతే మోక్షం మీదకు ఆ కోరికను మరల్చాలి. అన్నిటికన్నా ఉన్నతమైన కోరిక మోక్షాన్ని కోరుకోవడమే (అంటే భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవాలని అపేక్షించడమే). కాబట్టి, మోక్షం మీద కాంక్ష తప్ప, మనకు కలిగే గొంతెమ్మ కోరికలకు వేరే విరుగుడు లేదు.

అలర్కుడికి ఇది చదవగానే జ్ఞానోదయమైంది. తన కళ్ళు తెరిపించడానికే పరిస్థితులు ఈ విధంగా పరిణమించాయని అతడు అర్థం చేసుకున్నాడు. ఇది ఇలా ఉండగా, సుబాహుడు తనకు ఆ రాజ్యం అవసరం లేదనీ, అలర్కుడికి

బుద్ధిచెప్పడానికే తాను అలా నాటకమాడాననీ కాశీరాజుకు తన పథకాన్ని వివరించాడు. కాశీరాజు ఎంతో సంతోషించి, అలర్కుణ్ణి గౌరవమర్యాదలతో చూడడమే గాక, తనకు కూడా జ్ఞానబోధ చెయ్యమని సుబాహుణ్ణి వేడుకున్నాడు. అలర్కుడు తన కుమారుడికి పట్టాభిషేకం చేసి తాను తపస్సు చేసుకోవడానికి అడవులకు తరలిపోయాడు. అక్కడ యోగసిద్ధిని సాధించి, దుఃఖమయమైన ప్రపంచాన్ని గురించీ, తాను యోగసిద్ధి ద్వారా పొందిన దుఃఖాలకు అతీతమైన స్థితినీ పోలుస్తూ ఇలా చెప్పాడు.

**అహో! కష్టం యదస్మాభిః**
**పూర్వం రాజ్య మనుష్ఠితమ్ ।**
**ఇతి పశ్చాన్మయా జ్ఞాతం**
**యోగాన్నాస్తి పరం సుఖమ్ ॥**

"ఔరా! రాజ్యపాలన కాలంలో నేను పొందిన కష్టం అంతాయింతా కాదు. ఇప్పుడు యోగాభ్యాసంతో నా స్వస్వరూపాన్ని గుర్తించాను. నాలో ఆత్మ ఉన్నదని తెలుసుకోవడం కంటే పరమసుఖం మరొకటి లేదని తెలుసుకున్నాను."

మదాలస అలా ఎందుకు చేసింది? ఎందుకంటే: నిస్వార్థగుణమనే పునాది మీద కట్టబడిన భవనమే మానవసమాజం. ఏ జాతిలో ఈ సద్గుణం ఎంతగా పెంపొందితే ఆ జాతి అంత అభివృద్ధిని సాధిస్తుంది. ఈ గుణాన్ని మన పిల్లలకు ఎంత చక్కగా నేర్పితే ఆ సమాజం అంత చక్కగా మనగలుగుతుంది. ఈ బాధ్యత ప్రధానంగా తల్లిదండ్రుల మీదే ఉంటుంది. అహంకారమమకారాలను వదులుకోలేని మామూలు మనుష్యులలాగా, ప్రాపంచికమైన ఆలోచనలతో తన కుమారులు కూడా ప్రాపంచికులుగా తయారవ్వాలని మదాలస కోరలేదు. యోగమార్గాన్నే ఎంచుకుంది. అటువంటి విభిన్నమైన మార్గాన్ని చేపట్టినప్పుడు తాను కానీ, తన బిడ్డలు కానీ కష్టాలను ఎదుర్కోవలసివస్తుందని భయపడలేదు. తన పుత్రులకు అత్యున్నతమైన వైరాగ్యాన్ని నేర్పడం ద్వారా వారిని సమాజానికి మార్గదర్శకులుగా తయారుచేసింది. వారిని చూసి ఇతరులు ఎంతోకొంత వైరాగ్యాన్ని తమ జీవితాలలో కూడా చూపడం వల్ల సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. తల్లిదండ్రులు చేయదగ్గ అత్యున్నతమైన త్యాగం ఇదే.

భగవద్గీతలో చెప్పినట్టు,

**'యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ (గీత 3:21)**

సమాజంలో అత్యున్నతస్థాయిలో ఉన్నవారు ఏమేమి చేస్తారో దానినే మిగిలిన వారందరూ ఆదర్శంగా తీసుకుంటారు. వారు చూపించిన విలువలనే

ప్రమాణాలుగా తీసుకుని వాటినే అనుసరిస్తారు.

వివేకానంద స్వామి మదాలస కథను ఉటంకించి, దాని ద్వారా పిల్లలకు ఆత్మజ్ఞానాన్ని ఎందుకు బోధించాలో తెలుసుకోవచ్చునని వివరించారు. “నాకే కనుక ఒక పిల్లవాడు ఉండివుంటే నేను వాడికి పుట్టుక నుంచే, ‘నీవు పరిశుద్ధమైన ఆత్మస్వరూపుడివి!’ అని బోధిస్తాను. మన పురాణాలలోని ఆ అందమైన కథలో మదాలస తన పిల్లవాణ్ణి ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపుతూ, ‘నీవు శుద్ధుడివి, ఆత్మజ్ఞానివి, నిరంజనుడివి, పాపరహితుడివి, అనంతుడివి, మహాత్ముడివి’ అని జోలపాడుతుంది. అలా చేయడంలోని ఆంతర్యం ఏమిటి? అందులో చాలా గొప్ప ఆంతర్యం ఉంది! మిమ్మల్ని మీరు గొప్పవారిగా భావించుకుంటే నిజంగానే మీరు గొప్పవారుగా తయారవుతారు.”

ఆత్మవిశ్వాసం గురించి ఆయన ఇంకా ఇలా బోధించారు: “ప్రపంచమంతా తిరిగి సాధించిన అనుభవం ఏమిటని ప్రశ్నిస్తే, నేను చెప్పేది ఇదే. వారు (ఆంగ్లేయులు) మతప్రచారసభలలో ‘అందరూ పాపులే!’ అని బోధిస్తూ ఉండడం మీరు చూసి ఉంటారు. కానీ వారు నిజంగా తాము పాపులమని అనుకోరు. వారే కనుక అలా అనుకున్నట్టయితే మధ్య ఆఫ్రికాలోని ఆదిమజాతుల కన్నా ఈనాడు హీనంగా ఉండేవారు. తాము సర్వశక్తిమంతులమనే వారు భావిస్తూ ఉంటారు. అందుకు వారిని దేవుడు ఆశీర్వదించుగాక! పైపెచ్చు, ప్రతి ఆంగ్లేయుడూ తాను పుట్టుకతోనే ఈ ప్రపంచాన్ని ఏలడానికి పుట్టాననుకుంటాడు. నేను గొప్పవాణ్ణనీ, దేన్నైనా సాధించగలననీ అనుకుంటాడు. కాబట్టి, ఇంగ్లండులోనే కాక ప్రపంచంలోని ప్రతిదేశంలోనూ, ప్రతి ఒక్కరిలోనూ దైవత్వం అనేది సజీవంగా, తనను తాను వ్యక్తీకరించుకుంటూనే ఉంది. అయితే ప్రస్తుతం (భారతదేశంలో) మనకు ఆ ఆత్మవిశ్వాసం లేదు. ఆంగ్లేయుల కంటే మనకు తక్కువ ఆత్మవిశ్వాసం ఉందని నేనంటే మీరు నమ్ముతారా? ఇవి నేను సూటిగా చెపుతున్న మాటలు. మీకు నచ్చకపోయినా సరే, నేను ఈ మాటలు చెప్పక తప్పదు. అలా చెప్పకుండా ఉండలేకపోతున్నాను! ఆంగ్లేయ స్త్రీపురుషులే కనుక మనదేశపు ఆదర్శాలను చేపడితే, తమ దేశస్థులు తమను ఎంత ఎగతాళి చేస్తున్నా లెక్కచేయకుండా, ఉన్మాదులలాగా, మన మతాన్ని మనకే బోధిస్తారు! మిమ్మల్నే అటువంటి పని చేయమంటే మీలో ఎందరు చేయగలరు? అలా మీరు ఎందుకు చేయకూడదు? మీకు ఆ ఆత్మవిశ్వాసాన్ని గురించి తెలియదా? తెలుసు! వారికన్నా మీకు ఎక్కువే తెలుసు!! మీకు అవసరమైన దానికన్నా ఎక్కువే తెలివితేటలు ఉన్నాయి – అదే మీతో వచ్చిన కష్టం! మనం ఆత్మస్వరూపులమని మన మతం అనునిత్యం ఘోషిస్తున్నా, మనకు దాని మీద నిజంగా నమ్మకం లేదు. అందుచేతనే మనం ఇలా

దిగజారిపోయాము. ఇలా ఎందుకు జరుగుతోంది? ఎందుకంటే, మీ రక్తం నీరులా పలుచగా ఉంది. మీ మెదడు నిస్సత్తువతో నిండిపోయి, జావకారిపోయే ఆలోచనల ఊబిలో కూరుకుపోయి ఉంది. మీ శరీరం బలహీనంగా ఉంది. ముందు మీరు మీ శరీరంలో మార్పు తీసుకురావాలి. శారీరిక బలహీనతే ఈ దిగజారుడుతనానికి కారణం తప్ప మరొకటి కాదు. సంస్కరణల గురించి, ఆదర్శాల గురించి మీరు వందల ఏళ్ళుగా మాట్లాడుతున్నారు కానీ ఆచరణలో పెట్టడానికి వచ్చేసరికి మీలో ఒక్కరూ కంటికి కనపడరు. మరి ఇందుకు కారణం ఏమిటో మీకు తెలియదా? మీకు చాలా బాగా తెలుసు! దానికి కారణం బలహీనత! మీ శరీరం బలహీనంగా ఉంది. మీ మనస్సు బలహీనంగా ఉంది. మీమీద మీకు విశ్వాసం లేదు!"

ఈ సమస్యకు పరిష్కారాన్ని ఆయన ఎంతో చక్కగా వివరించారు:

"అయితే ఇప్పుడు కావలసినదేమిటి? నేను చెప్పేది వినండి! మనకు కావలసింది బలం! బలం!! బలం!!! మరి మనకు బలాన్నిచ్చేదెవరు? ఉపనిషత్తులలో చెప్పిన సత్యాన్ని గుర్తించడమే మనం చేయవలసిన మొదటి పని. అదే మనకు బలాన్నిస్తుంది. 'నేను ఆత్మను' అని విశ్వసించండి! 'ఖడ్గం ఛేదించలేనిదీ, బాణం చీల్చలేనిదీ, అగ్ని దహించలేనిదీ, వాయువు ఎండబెట్టలేనిదీ అయిన ఆత్మను నేను! సర్వశక్తిమంతుణ్ణి, సర్వజ్ఞుణ్ణి నేను!' అని విశ్వసించండి. ఈ మాటల్నే జపించండి. మనకు బలాన్ని ఇచ్చి, రక్షించే మాటలు అవే! మనం బలహీనులమని పొరపాటుగానైనా పలకకండి. మనం ఏమైనా చేయగలం, అన్నీ సాధించగలం! మనం చేయలేనిది ఏమైనా ఉందా? మనం ఏదైనా చేయగలం! మనందరిలోనూ ఆ మహత్తరమైన ఆత్మ ఉంది. దాన్ని విశ్వసిద్దాం. నచికేతుడు చూపిన ఆత్మశ్రద్ధను మనం చూపాలి. (ఆత్మశ్రద్ధ అంటే ఆత్మవిశ్వాసం అని కూడా చెప్పుకోవచ్చు.) తన తండ్రి యాగం చేస్తున్న సందర్భంలో అటువంటి శ్రద్ధ నచికేతుడికి కలిగింది. ఆహా! అటువంటి శ్రద్ధ మనలో ప్రతి ఒక్కరికీ కలగాలన్నదే నా కోరిక. మీలో ప్రతి ఒక్కరూ ఈ ప్రపంచాన్నే కదిలించగల మేధాశక్తితోనూ, ఆత్మశక్తితోనూ, అనంతశక్తిసంపన్నుడైన పరమేశ్వరునిలాగా తయారుకావాలని నేను అభిలషిస్తున్నాను. ఉపనిషత్తులలో నుంచి అటువంటి శక్తి మనకు లభిస్తుంది, అటువంటి ఆత్మవిశ్వాసం మనకు లభిస్తుంది."

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 14. శుకమహర్షి

వివేకానంద స్వామి చెప్పిన శుకమహర్షి కథను ఇప్పుడు తెలుసుకుందాము.

పూర్వకాలం భారతదేశంలో వ్యాసుడనే గొప్ప ఋషి ఉండేవాడు. ఆయన వేదాంతసూత్రాలను రచించినవాడిగానూ, గొప్ప సాధుపురుషుడిగానూ ప్రఖ్యాతి పొందాడు. అతడి తండ్రి పరాశరుడు యోగసిద్ధిని సాధించాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. అతడి తాత అయిన శక్తి మహర్షి విఫలమయ్యాడు. అతడి ముత్తాత అయిన వసిష్ఠుడు కూడా విఫలమయ్యాడు. వ్యాసుడు కూడా పరిపూర్ణమైన యోగస్థితిని సాధించలేకపోయాడు. కానీ అతడి కొడుకైన శుకుడు మాత్రం పుట్టుకతోటే యోగసిద్ధుడై పుట్టాడు. వ్యాసుడు అతడికి ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. తర్వాత, అతడు మరింత పరిపక్వత సాధించాలని, జనకుడి సభకు పంపించాడు.

జనకుడు మహారాజు. అతణ్ణి 'జనకవిదేహుడు' అని పిలిచేవారు. 'విదేహ' అంటే దేహం లేనివాడు అని అర్థం. జనకుడు మహారాజే అయినప్పటికీ అతడు తనకొక దేహం ఉన్నదన్న విషయాన్ని పూర్తిగా మరచిపోయాడు. అతడు నిరంతరం తాను ఆత్మస్వరూపుణ్ణి అని భావించేవాడు. జనకుడు అంతటి గొప్ప ఆత్మజ్ఞాని కనుకనే ఆత్మజ్ఞానాన్ని నేర్చుకోవడం కోసం వ్యాసుడు అతడి దగ్గరకు శుకుణ్ణి పంపాడు.

జనక మహారాజుకు వ్యాసపుత్రుడు తన దగ్గరకు వస్తున్నాడని ముందే తెలుసు. అందుచేత అతడు తగిన ఏర్పాట్లను ముందుగానే చేసి ఉంచాడు. ఇక యువకుడైన శుకుడు జనకుడి కోటకు వచ్చినప్పుడు అక్కడి ద్వారపాలకులు అతణ్ణి ఏ మాత్రం పట్టించుకోలేదు. అతడు కూర్చునేందుకు ఒక పీట మాత్రం ఇచ్చారు. శుకుడు మూడు పగళ్ళు, మూడు రాత్రులు అక్కడే కూర్చున్నాడు. అతణ్ణి ఎవరూ పలకరించలేదు. నువ్వు ఎవరు అని కానీ, ఎందుకు వచ్చావని కానీ ఎవరూ వాకబు చెయ్యలేదు. అతడు విశ్వవిఖ్యాతుడైన వ్యాసమహర్షి కుమారుడు. దేశమంతా అతడి తండ్రిని ఎంతగానో గౌరవిస్తుంది. పైగా శుకుడే చాలా గొప్పవాడన్న పేరును అప్పటికే సంపాదించాడు. అయినా సరే, ఆ భవనానికి కావలి కాస్తున్న ఆ మొరటు మనుష్యులు అతణ్ణి పట్టించుకోలేదు. ఇక మూడు రోజులు గడిచిన తర్వాత ఒక్కసారిగా జనకుడి మంత్రులూ, ఉన్నతాధికారులూ శుకుడి ముందు సాగిలపడి, గొప్ప గౌరవమర్యాదలతో లోపలికి తీసుకుపోయారు. అతణ్ణి అంతఃపురపు అత్యంత విలాసవంతమైన గదుల లోపలికి తీసుకువెళ్ళి, పరిమళద్రవ్యాలతోనూ, పన్నీటితోనూ స్నానాలు చేయించి, పట్టుపీతాంబరాలు

కట్టబెట్టించి ఎనిమిది రోజులపాటు అటువంటి రాజవైభోగాలలో ఓలలాడించారు. అయితే మహాశాంతంగా ఉన్న శుకుడి ముఖంలో చిన్న తేడా కూడా కనిపించలేదు. రాజవైభోగాలు అనుభవిస్తున్నప్పుడు అతడి ముఖం ఎంత ప్రసన్నంగా ఉందో, కోటగుమ్మం దగ్గర తనను ఎవరూ పట్టించుకోనప్పుడు కూడా అంతే ప్రసన్నంగా ఉంది. ఆ తర్వాత అతణ్ణి రాజసభలోకి తీసుకువచ్చారు. జనక మహారాజు సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. అక్కడ సంగీతవాయిద్యాలతో వీనులవిందైన సంగీతం వినవస్తోంది. నాట్యగత్తెలు నాట్యం చేస్తున్నారు. ఇంకా రకరకాల వినోదాలు సాగిపోతున్నాయి. అతణ్ణి పరీక్షించే నిమిత్తం, జనక మహారాజు అతడికి అంచుల వరకూ పాలతో నిండిన ఒక చిన్న పాత్రను ఇచ్చి, ఆ రాజదర్బారులో ఏడుసార్లు సభచుట్టూ తిరిగి రమ్మన్నాడు. ఆ యువకుడి ఏకాగ్రతను చెదరగొట్టే ఆ సంగీతనాట్యాల మధ్య నుంచి నడుస్తూ, ఏమాత్రం తొట్రుపడకుండా, ఏడుసార్లు ఆ సభను చుట్టివచ్చాడు. ఆ పాత్రనుంచి ఒక్క పాలచుక్కకూడా నేలమీద పడలేదు. అతడు తనంతట తానుగా కోరితే తప్ప, ఆ యువకుడి మనస్సును ఈ ప్రపంచంలోని ఏ వస్తువూ ఆకర్షించలేదు అని ఋజువయింది. అతడు ఆ పాత్రను విజయవంతంగా తిరిగి తనవద్దకు తెచ్చినప్పుడు జనకుడు అతడితో, "నాయనా! నీవు ఆత్మజ్ఞానివి! మీ తండ్రి నీకు బోధించిన దానినీ, నీవు అనుభవపూర్వకంగా తెలుసుకున్న దానినీ, నేను మరొకసారి ఏకరువు పెట్టగలను అంతే! అంతకు మించి నీకు చెప్పేదేమీ లేదు. నీకు సత్యం బోధపడింది. ఇక నీవు ఇంటికి వెళ్ళవచ్చు!" అని చెప్పి దీవించి పంపాడు.

వివేకానంద స్వామి ఇలా అన్నారు: "సనాతన ధర్మం ఆధ్యాత్మిక సాధనలోనూ,



అభివృద్ధిలోనూ అన్ని స్థాయులలో ఉన్నవారికీ తగిన విధంగా ఉంటుంది. దానిలో అన్నిరకాల ఆదర్శాలూ వాటి పరిపూర్ణ స్థితిలో ప్రదర్శించబడ్డాయి. శాంతభావాన్ని చూపడంలో వసిష్ఠుడు, భక్తిభావానికి శ్రీకృష్ణుడు, కర్తవ్యనిష్ఠకు సీతారాములు, బుద్ధిశక్తికి శుకమహర్షి ఉదాహరణలుగా కనిపిస్తారు. వీరందరి వ్యక్తిత్వాలనూ అధ్యయనం చెయ్యండి. మీకు ఏది సరిపోతుందనుకుంటే దాన్ని అనుసరించండి" అని చెప్పారు.

శుకుడు పుట్టుకతోటే సన్న్యాసి అయ్యాడు. అతడిలో మనం అత్యున్నతస్థాయిలో వైరాగ్యాన్ని చూడవచ్చు. కానీ మనదేశంలో ఈనాడు వైరాగ్యాన్ని అటువంటి గౌరవ భావంతో చూడడం లేదు. దీన్ని గురించి వివేకానంద స్వామి, "హతవిధీ! ఏ భూమి మీద వైరాగ్యం మూర్తీభవించిన శుకమహర్షి జన్మించాడో అదే దేశంలో వైరాగ్యాన్ని పిచ్చితనంగానూ, పాపంగానూ కించపరచి చూస్తున్నారే!" అని బాధపడ్డారు.

వైరాగ్యమంటే ఏమిటో వివేకానంద స్వామి ఇలా వివరించారు: "ముందుగా మీలో ఉన్న స్వార్థమనే ఆ అర్రులుచాచే స్వభావాన్ని నాశనం చెయ్యండి. దాన్ని అరికట్టేశక్తి మీకు కలిగినప్పుడు, దాన్ని అణిచి ఉంచి, మీ మనస్సును స్వార్థమార్గాలలోకి పోకుండా ఆపండి. అప్పుడు మీరు ఈ ప్రపంచంలో ఎంత కావాలంటే అంత పనిచెయ్యవచ్చు. అప్పుడు అందరితో కలవండి, ఎక్కడకు కావాలంటే అక్కడకు వెళ్ళండి – మీలో ఎటువంటి చెడుతనం కలుగదు. తామరాకు నీటిలోనే ఉన్నా నీరు దాన్ని తాకలేదు, తడపలేదు. మీలోని స్వార్థాన్ని అదుపుచేసినప్పుడు మీరు కూడా ఈ ప్రపంచంలో అలా ఉండగలుగుతారు. దీనినే 'వైరాగ్యం' అంటారు. వైరాగ్యం లేకుండా ఎటువంటి యోగం సాధ్యం కాదు. అన్ని యోగాలకూ వైరాగ్యమే పునాది. వైరాగ్యం అంటే బాహ్యంగా శరీరంతో చేసేదేదీ కాదు. వైరాగ్యం అంతా మనస్సులో ఉండేదే. 'నేను–నాది' అనే సంకెళ్ళు అన్నీ మనస్సులోనే ఉంటాయి. శరీరంతోనూ, ఇంద్రియాలు కోరుకునే వస్తువులతోనూ మనకు సంబంధం లేకపోతే, మనం ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా, వైరాగ్యంతో ఉన్నట్టే లెక్క."

ఇంకా, "శుకమహర్షి ఆదర్శవంతుడైన పరమహంస. మనుష్యులలో అఖండ సచ్చిదానందసాగరంలోని నీరును దోసిలిపట్టి త్రాగగలిగిన వాడు అతడొక్కడే. అధికశాతం సాధకులు ఆ సాగరపు తరంగఘోషను వినడంతోనే ప్రాణాలు విడుస్తారు. చాలా కొద్దిమంది మాత్రమే దానిని కళ్ళతో చూడగలుగుతారు. ఇంకా కొద్దిమంది మాత్రమే దాని జలాలను రుచిచూడగలుగుతారు. కానీ శుకమహర్షి ఒక్కడే దానిని దోసిలిపట్టి త్రాగగలిగాడు" అని శుకమహర్షిని కీర్తించారు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 15. శకుంతల

వివేకానంద స్వామి భారతదేశానికి ఆ పేరు ఎలా వచ్చిందో వివరిస్తూ, “ఈ జాతి భరతుడనే రాజు యొక్క సంతతి. ఆ భరతుడు శకుంతలకూ, దుష్యంతుడికీ పుట్టిన కొడుకు. అందుచేత ఇది భారతదేశమయింది” అని వివరించారు.

మనం ఇంతకు ముందు విశ్వామిత్రుడి కథలో ఎలా మేనక అతణ్ణి సమ్మోహింపజేసిందో చదివాము. వారికి పుట్టిన కుమార్తె పేరు శకుంతల. మేనక తాను తిరిగి దేవలోకానికి వెళ్ళబోయే ముందు తనకు పుట్టిన ఆడపిల్లను తెచ్చి కణ్వమహర్షి ఆశ్రమంలో విడిచి,



వెళ్ళిపోయింది. ఆ పసిబిడ్డ చుట్టూ శకుంత పక్షులు ఎగురుతూ సవ్వడి చేయసాగాయి. ఈ సవ్వడికి కణ్వమహర్షికి తపోభంగమై లేచి ఆ పసిబిడ్డను చూశాడు. ఆయన ఆ పసిబిడ్డను తన చేతులలోకి తీసుకుని, "ఈ బిడ్డను నేను పెంచుతాను. ఈమెకు శకుంతల అని నామకరణం చేస్తాను" అనుకున్నాడు. ఆ బిడ్డ క్రమంగా పెరుగుతూ ఆశ్రమంలోని మొక్కలను, జంతువులను మచ్చిక చేసి పెంచసాగింది. కాలక్రమంలో శకుంతల ఒక అందమైన యువతిగా ఎదిగి, అన్ని విద్యలూ నేర్చి, విద్వాంసురాలిగా, సత్-శీలాన్ని కలిగిన యువతిగా పేరుతెచ్చుకుంది.


ఒకనాడు యువకుడైన హస్తినాపురపు రాజు దుష్యంతుడు వేటాడుతూ కణ్వమహర్షి ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ అతడు ధనుర్బాణాలను విడిచిపెట్టి, ఆశ్రమంలోనికి వెళ్ళాడు. అతడు ఆశ్రమంలోనికి వెళ్ళేసరికి అక్కడ కణ్వుడు లేడు. శకుంతల తన చెలికత్తెలతో కనిపించింది. అతడు ఆ దేశానికి రాజు అని తెలుసుకుని, వారు అతణ్ణి ఆహ్వానించి, అతిథి సత్కారాలు చేశారు. దుష్యంతుడు, శకుంతల తమ మనస్సులలో ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఆ సమయంలో కొందరు ఆశ్రమవాసులు అక్కడికి వచ్చి, కొందరు రాక్షసులు తమ జపతపాలకు భంగం కలిగిస్తున్నారనీ, వారిని చంపమనీ కోరారు. దుష్యంతుడు వారందరినీ సంహరించాడు. శకుంతల, దుష్యంతుడు ఒకరినొకరు ఇష్టపడుతున్నట్టు వెల్లడి చేశారు. దుష్యంతుడు శకుంతలను గాంధర్వపద్ధతిలో వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు గడిచాక, హస్తినాపురం నుంచి ఒక వార్తాహరుడు వచ్చి రాజధానిలో దుష్యంతుడికి అత్యవసరమైన పని ఉందని పిలిచాడు. దుష్యంతుడు వెళ్ళిపోతూ, తన రాజముద్రికను శకుంతలకు ఇచ్చి, తాను మళ్ళీ వచ్చి శకుంతలను తీసుకువెడతానని వాగ్దానం చేశాడు.

శకుంతల అలా దుష్యంతుడి ఊహలలో కాలం గడుపసాగింది. ఒకరోజు దూర్వాసమహాముని ఆ ఆశ్రమానికి భిక్షకోసం వచ్చాడు. తన ప్రియసఖుణ్ణి స్మరిస్తూ, పరధ్యానంగా ఉన్న శకుంతల అతణ్ణి గమనించలేదు. అతడు కోపించి, "ఎవరిని గురించి నీవు ఆలోచిస్తూ, నన్ను నిర్లక్ష్యం చేశావో అతడు నిన్ను మరచిపోతాడు!" అని శపించాడు. ఇంతలో చెలికత్తెలు ఈ విపత్తును గమనించి, దూర్వాసుడి పాదాల మీద పడి, "స్వామీ! కణ్వమహర్షి ఆశ్రమంలో లేరు. శకుంతలను క్షమించండి. ఆమె ఎప్పుడూ ఏ అపచారమూ చెయ్యలేదు" అని వేడుకున్నారు. దూర్వాసుడు శాంతించి, "నా శాపానికి తిరుగులేదు. కానీ ఎప్పుడైతే అతడు తాను శకుంతలకు ఇచ్చిన వస్తువును చూస్తాడో అప్పుడు అతడికి శకుంతల గుర్తుకు వస్తుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి కణ్వుడు తిరిగివచ్చి జరిగిన విషయాలు తెలుసుకున్నాడు. అదే సమయంలో ఆకాశవాణి, 'ఓ మహర్షీ! శకుంతల తనకు తగిన భర్తనే ఎంచుకుంది. ఆమెకు పుట్టబోయే బిడ్డ లోకానికే వన్నె తెచ్చే మహాచక్రవర్తి అవుతాడు!" అని పలికింది. ఇది విని కణ్వ మహర్షి ఎంతో సంతోషించాడు. కానీ వివాహం తర్వాత ఆడబిడ్డను అత్తారింటికి పంపాలి కదా! అందువలన శకుంతలను తోడ్కొని తీసుకుపోవడానికి దుష్యంతుడు ఎవరినైనా పంపుతాడని ఆతురతతో ఎదురు చూడసాగాడు. కానీ శాపం వలన శకుంతలను మరిచిపోయిన దుష్యంతుడు, ఆమెను తీసుకువెళ్ళడానికి ఎవరినీ పంపలేదు. కొంతకాలం ఎదురు చూసిన తర్వాత, ఇక కణ్వుడే శకుంతలను హస్తినాపురానికి పంపాలని నిశ్చయించాడు. ఆమెకు కొందరు ఆశ్రమవాసులను తోడుగా పంపాడు. శకుంతల తాను పెంచిన మొక్కలనూ, జంతువులనూ వదిలి వెళ్ళడానికి ఎంతో బాధపడింది.

వారు హస్తినాపురానికి వెళుతూ, మధ్యలో గంగానదిని చూశారు. వారు గంగానదిలో స్నానం చేసి తిరిగి ప్రయాణమయ్యారు. వారు హస్తినాపురానికి చేరి, దుష్యంతుని సభలో ప్రవేశించారు. వారు శకుంతలను దుష్యంతునికి చూపి, "మహారాజా! మేము కణ్వమహర్షి ఆశ్రమం నుంచి వచ్చాము. ఈమె నీ భార్య అయిన శకుంతల. త్వరలో తల్లి కాబోతోంది కూడా. ఈమెను చేపట్టమని కణ్వమహర్షి మా ద్వారా మీకు కబురు పంపించారు" అని చెప్పారు. కానీ దుష్యంతుడు ఆమెను గుర్తుపట్టక, ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. వారు ఏమి చెయ్యాలో పాలుపోక ఆలోచిస్తూ ఉండగా, శకుంతల అతడు తనకిచ్చిన రాజముద్రికను చూపుదామని తన చేతివైపు చూసుకుంది. అయితే అక్కడ ఆ ఉంగరం లేదు. శకుంతల వచ్చే త్రోవలో గంగానదిని దాటుతుండగా ఆ రాజముద్రిక కలిగిన ఉంగరం నీటిలో జారి పడిపోవడం శకుంతల గమనించలేదు. దీనితో మరింత కలవరపడిన శకుంతల తన మేలిముసుగును తొలగించింది. అయినా రాజు ఆమెను గుర్తుపట్టలేదు. శకుంతల తామిద్దరూ అడవిలో కలసివున్నప్పుడు జరిగిన రకరకాల సంఘటనలను గుర్తుచేసినా దుష్యంతుడికి అవేమీ గుర్తురాలేదు. కాలక్రమేణా రాజుకు పాత విషయాలు జ్ఞాపకం వస్తాయన్న నమ్మకంతో, శకుంతలతో వచ్చిన ఆశ్రమవాసులు ఆమెను అక్కడే వదిలి వెళ్ళిపోయారు. శకుంతల కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఉండగా, దుష్యంతుడి రాజగురువు ఆమెను తన ఇంటిలో ఉంచుతానని దుష్యంతుడితో చెప్పి, ఆమెను తనతో తీసుకుపోసాగాడు. ఇంతలో అకస్మాత్తుగా ఆకాశం నుంచి శకుంతల తల్లి అయిన మేనక దిగివచ్చి శకుంతలను తనతోపాటు తీసుకుపోయింది.

దుష్యంతుడు తనకు ఏమీ గుర్తు రానందుకు అపరాధభావంతో నొచ్చుకున్నాడు. ఎవరో ఒక స్త్రీ వచ్చి నేనే నీ భార్యనని అనడమూ, తాను ఆమెను తిరస్కరించవలసిరావడమూ దుష్యంతుడికి చాలా బాధ కలిగించాయి. ఇటువంటి సంఘటనలవల్ల దేశానికి రాజు అయిన తన మీద ప్రజలకు ఎటువంటి అభిప్రాయం కలుగుతుందోనని బెంగపడ్డాడు. కొద్దిసేపటికి రాజభటులు ఒక జాలరిని పట్టి తీసుకువచ్చి, అతడిమీద రాజముద్రికను అమ్ముతున్నాడన్న అభియోగాన్ని మోపారు. అతడు తనకేమీ తెలియదనీ, ఆ రాజముద్రిక తనకు ఒక చేప పొట్టలో దొరికిందనీ చెప్పి, దాన్ని దుష్యంతుడికి



సమర్పించాడు. ఆ రాజముద్రికను చూడగానే దుష్యంతుడికి ఒక్కసారిగా అన్నీ గుర్తుకువచ్చాయి. శకుంతలను కలుసుకోవాలనీ, చేసిన తప్పును సరిదిద్దుకోవాలనీ ఎంతో తహతహలాడాడు. అయితే అదే సమయానికి రాజగురువు అక్కడకు వచ్చి, శకుంతలను ఎవరో అప్సరస వచ్చి తనతో ఆకాశమార్గంలో తీసుకుపోయిందని చెప్పాడు. దీనితో దుష్యంతుడు దుఃఖసాగరంలో మునిగిపోయాడు. శకుంతల గురించే ఆలోచిస్తూ, ఆమె చిత్రపటాన్ని చిత్రించి, దానినే చూస్తూ కాలం గడుపసాగాడు.

ఇంతలో ఒకనాడు ఇంద్రుడి రథసారథి అయిన మాతలి వచ్చి, దానవులతో జరుగుతున్న యుద్ధంలో దేవతలకు సహాయపడమని ఇంద్రుడు అర్థిస్తున్నట్లు దుష్యంతుడికి చెప్పాడు. దుష్యంతుడు ఆ యుద్ధంలో రాక్షసులను ఓడించడానికి దేవతలకు ఎంతో సహాయపడ్డాడు. తిరిగివచ్చేటప్పుడు మాతలి దేవేంద్రుని ఆదేశం మేరకు నర్మగర్భంగా అతణ్ణి ఒక అద్భుతమైన ప్రదేశంలో దించి, వెళ్ళిపోయాడు. అది మరీచముని ఆశ్రమం. దుష్యంతుడికి అక్కడ ఒక పిల్లవాడు కనిపించాడు. వాడు సింహాలను పట్టుకుని, లొంగదీసి, వాటి నోటిలోని పళ్ళను లెక్కబెడుతున్నాడు. దుష్యంతుడు ఆ పిల్లవాడి దగ్గరకు వెళ్ళి అతణ్ణి పలకరించాడు. ఆ పిల్లవాడు తన తండ్రి దుష్యంతుడనీ, తన తల్లి శకుంతల అనీ దుష్యంతుడితో చెప్పాడు. ఇంతలో శకుంతల కూడా అక్కడకు వచ్చి, దుష్యంతుణ్ణి చూసి ఎంతో సంతోషించింది. దుష్యంతుడి ఆనందానికి మేర లేదు. ఆ పిల్లవాడికి భరతుడని పేరు పెట్టారు. మరీచముని అనుమతితో దుష్యంతుడు శకుంతలనూ, భరతుణ్ణీ తీసుకుని హస్తినాపురానికి తిరిగివెళ్ళి చిరకాలం ప్రజారంజకంగా పరిపాలన చేశాడు. అతడి తరువాత భరతుడు రాజు అయి, ఎల్లకాలాలకూ ఆదర్శంగా నిలిచివుండేలా రాజ్యం ఏలాడు. అతడి పేరు మీదే మన ఉపఖండానికి 'భరతఖండం' అని పేరు వచ్చింది.

శకుంతల కథను "అభిజ్ఞాన శాకుంతలమ్" అనే పేరుతో కాళిదాస మహాకవి సంస్కృతంలో రచించాడు. వివేకానంద స్వామి మనదేశపు ప్రాచీన గ్రంథాల గొప్పతనాన్ని వివరిస్తూ, "మన సంస్కృత నాటకాలను చదివారా? కాళిదాసు రచించిన శాకుంతలాన్ని చదవండి! ఆపైన టెన్నిసన్ వ్రాసిన 'ప్రిన్సెస్' నుంచి మనం నేర్చుకోగలిగినదేమైనా ఉందేమో చెప్పండి?" అన్నారు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 16. భీష్ముడు

వివేకానంద స్వామి చెప్పిన కథలను శిష్యులు ఎంతో ఆసక్తితో వినేవారు. వారిలో ఒకరైన సోదరి నివేదిత ఈ కథలను 'ఉయ్యాల కథలు' (క్రేడిల్ టేల్స్ ఆఫ్ హిందూయిజమ్) అన్న పేరుతో రచించారు. వాటిలో భీష్ముడి గురించి చెప్పిన కథను ఇప్పుడు మనం చదువుదాము.

అది అతి పురాతనమైన కాలం. పాండవ, కౌరవ రాజకుమారుల వంటి ధీరులు ఈ భరతవర్షంలో పుట్టి ధీరోదాత్తమైన కార్యాలను సాధించిన కాలం అది. వారిరువురికీ పెద్ద అయినవాడు భీష్ముడు. అతణ్ణి పితామహుడు అని వారు పిలిచేవారు. అతణ్ణి ఎంతో గౌరవంగా చూసేవారు, ప్రేమించేవారు. అతడు రాజు కాదు, కానీ రాజసింహాసనాన్ని అధిరోహించడానికి కావలసిన అన్ని అర్హతలతోనూ పుట్టాడు. అయితే, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, ఇష్టపూర్వకంగా సింహాసనాన్ని కాలదన్ని, ఇతరులను రాజులుగా గద్దెనెక్కించాడు. అంతేకాక రాజ్యసంక్షేమం కోసం వారిని అన్ని విధాల రక్షిస్తూ, వారికి దారి చూపాడు. అల్లకల్లోల పరిస్థితులతో నిండివున్న మహాభారతకథాకాలంలోని అన్ని ఘట్టాలలోనూ అతడి పాత్ర మహోన్నతంగా కనిపిస్తుంది.

భీష్ముడు హస్తినాపుర సామ్రాజ్యానికి మహారాజయిన శంతనుడికీ, గంగాదేవికీ పుట్టిన సంతానం. గంగాదేవి పుత్రుడు కాబట్టి అతణ్ణి గాంగేయుడని పిలిచేవారు. అతడు మహాపరాక్రమవంతుడిగా ఎదిగాడు. అంతేకాక అతడు సద్గుణ సంపన్నుడు. ఒక్కగానొక్క కొడుకు. రాజసింహాసనాన్ని అధిష్ఠించడానికి అన్ని విధాలా తగినవాడు. కానీ ఆ సమయంలో ఒక విచిత్రం జరిగింది. దేశాన్ని పర్యటిస్తున్న శంతనుడు ఒక యువతిని చూసి మోహించాడు. ఆమె చాలా గుణవంతురాలు, బుద్ధిమంతురాలు, సౌందర్యవతి. కానీ ఒక మత్స్యకారుడి కుమార్తె. శంతనుడు తమ వివాహానికి సమ్మతించమని ఆమె తండ్రిని అర్థించాడు.

ఆ జాలరి, చాలా మర్యాదస్తుడే కాక, ఎంతో ఆత్మాభిమానం కలవాడు. తన కూతురు తమ హోదాకు తగినవాణ్ణి కాకుండా ఎవరినో చేసుకుంటే సుఖపడదని అతడు భావించాడు. ఆమె కనుక అలా రాజును వివాహమాడితే లేనిపోని అవమానాలను ఎదుర్కోవలసి వస్తుందని అతడి ఉద్దేశ్యం. ఆమె నిజంగానే ఒక రాజభవనంలో, అన్ని విలాసాలతో జీవిస్తుంది. కానీ ఆ భవనంలో ఆమె హోదా ఏమిటి? ఆమెను ఎవరూ మహారాణిగా పరిగణించరు. ఆమె కుమారులను కలలో కూడా రాజ్యాధికారానికి పరిగణించరు. గాంగేయుడికి బదులు తన కుమార్తెకు పుట్టిన బిడ్డను రాజుగా చేసే అవకాశం ఉంటేనే ఆమెను మహారాజుకు భార్యగా పంపడం శ్రేయస్కరం. కానీ గాంగేయుడు రాజు కాకుండా ఉండడమనేది జరగని

పని. ఇవన్నీ ఆలోచించిన తర్వాత తన కుమార్తెను ఆ మహారాజుకు భార్యగా పంపడం కుదరదని ఆ మత్స్యకారుడు నిశ్చయించాడు. రాజుగారి అభ్యర్థనను త్రోసిపుచ్చాడు. అతని హృదయంలోని ధైర్యాన్ని గమనించండి. ఈ మహాభారతం ధీరుల చరిత్ర. చూడండి! ఇందులో మనకు కనిపించే వ్యక్తులందరూ ధీరులే!

శంతనుడి దృష్టిలో గాంగేయుణ్ణి రాజుగా చేయకుండా ఉండడమనేది అసలు ఊహించలేని విషయం. ఆ జాలరి తన పట్టువిడువడని స్పష్టమైన తర్వాత, శంతనుడు హతాశుడై తిరిగి తన రాజధానికి వెళ్ళిపోయాడు. కానీ ఆ అందమైన అమ్మాయిని మర్చిపోవడం అతడికి సాధ్యం కాలేదు. అతడి మనస్సు మనస్సులో లేదని అతణ్ణి చూసిన వారందరూ కనిపెట్టగలుగుతున్నారు. గాంగేయుడు కూడా ఇది కనిపెట్టాడు. దానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని వాకబు చేయడం మొదలుపెట్టాడు. చివరికి శంతనుడి మంత్రులలో ఒకడు జరిగిన విషయాన్నీ, శంతనుడి మనోవ్యథకు కారణాన్నీ తెలిపాడు. అంతే! దాని పర్యవసానం ఊహించలేనిది! ఈ సంగతి విన్న మరుక్షణమే గాంగేయుడు తన రథాన్ని సిద్ధం చేయించి, అప్పటికప్పుడే ఆ మత్స్యకారుడి ఇంటికి బయలుదేరి వెళ్ళాడు. అక్కడికి చేరగానే ముందు జాగ్రత్తగా తన తండ్రితో పెళ్ళికి ఒప్పుకోకపోవడానికి తాను విన్న షరతు కాకుండా వేరే ఇంకేవైనా షరతులు ఉన్నాయా అని వాకబు చేశాడు. కానీ ఆ జాలరి వేరే షరతులు ఏమీ లేవని చెప్పాడు. అతడి కుమార్తె భవిష్యత్తులో కాబోయే రాజుకు తల్లి అవుతుందని హామీ ఇస్తే కనుక ఈ వివాహానికి తనకు ఎటువంటి అభ్యంతరం ఉండబోదని అతడు గాంగేయుడితో చెప్పాడు.

"అయితే ఈ విషయాన్ని చాలా సులభంగా పరిష్కరించవచ్చు. రాజసింహాసనానికి వారసుణ్ణి నేనే కనుక, నా హక్కును వదులుకుంటున్నట్టు ఈ క్షణమే మనఃపూర్వకంగా ప్రకటిస్తున్నాను. నీ కుమార్తె అయిన సత్యవతికి కలిగే కుమారులే రాజసింహాసనాన్ని అధిష్ఠించేలా చూస్తానని ప్రకటిస్తున్నాను. హస్తినాపుర సామ్రాజ్యాన్ని నాలో శక్తిసామర్థ్యాలున్నంతవరకూ కాపాడుతాను" అని గాంగేయుడు ప్రతిజ్ఞ చేశాడు.

అయితే, ఆ జాలరి, "అయ్యా! తమరు ఇలా మాట ఇవ్వడం చాలా సులభమే. ఈ మాటను నిలబెట్టుకోవడం కూడా మీకు కష్టం కాకపోవచ్చు. మీ మంచితనం మీద నాకు నమ్మకం ఉంది. కానీ మీరు ఏదోఒక రోజు వివాహం చేసుకుంటారు కదా, అప్పుడు మీకు కలిగే సంతానం మాటేమిటి? మీరు సింహాసనాన్ని వదులుకోవడానికి ఇష్టపడినంత మాత్రాన మీ కుమారులు కూడా అలాగే చేస్తారన్న నమ్మకం ఏముంది? వారు సింహాసనం కావాలనుకుంటే ఏమి జరుగుతుంది?" అని ప్రశ్నించాడు.

గాంగేయుడు ఆ మత్స్యకారుడి మాటలలోని నిజాన్ని చూశాడు. తన తండ్రి సుఖం కన్నా తాను ఈ ప్రపంచంలో కోరేది మరేదీ లేదని దృఢంగా నిశ్చయించుకున్నాడు. మరొక ప్రతిజ్ఞ చేయడానికి సిద్ధపడ్డాడు. "అయ్యా! నేను ఇంకొక ప్రతిజ్ఞ చేస్తున్నాను. నేను నా జీవితంలో వివాహం చేసుకోను. నేను వివాహం చేసుకోను కనుక రాజసింహాసనాన్ని కోరేవాడెవడూ నా వలన పుట్టబోడు!" అని భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు. "ఇక మీ కుమార్తెను మా తండ్రిగారి దగ్గరకు తీసుకుపోవడానికి మీకు సమ్మతమేనా?" అని ప్రశ్నించాడు. ఇది విని అతడు ఆ వివాహానికి అంగీకరించాడు. సత్యవతిని మేలిముసుగుతో తీసుకువచ్చారు. గాంగేయుడు తన తల్లికి నమస్కరించినట్టే ఆమెకూ నమస్కరించాడు. ఆమెను తన రథంలోకి ఎక్కించి, తానే రథసారథిగా పగ్గాలు చేతబూని నేరుగా రాజభవనానికి ఆమెను తీసుకుపోయాడు.


సత్యవతిని చూసిన శంతనుడు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. తాను ఏ కుమారుడి యొక్క భవిష్యత్తు కోసం ఏ వధువును వదులుకున్నాడో, ఆ కుమారుడే ఆ వధువును వెంటబెట్టుకుని తన వద్దకు తీసుకువచ్చాడు. ఆమె అక్కడికి ఎలా వచ్చిందో, ఆమెను తీసుకురావడం కోసం గాంగేయుడు ఏమి చేశాడో తెలుసుకుని శంతనుడు దిమ్మెరపోయాడు. తన కుమారుడి స్వార్థరాహిత్యాన్ని చూసి అవాక్కయ్యాడు. తేరుకుని, "నాయనా! ఈనాటి నుంచి నీ పేరు భీష్ముడుగా లోకప్రసిద్ధమవుతుంది. నీవు ఎంతకాలం జీవించదలచుకుంటే అంతకాలం జీవిస్తావు. చివరికి యమధర్మరాజు కూడా నీవు అనుమతించకుండా నీ దరిదాపులకు రాలేడు!" అని దీవించాడు. భీష్ముడు అంటే భీషణమైనవాడు అని అర్థం. తల్లిదండ్రుల దీవెనలు మన తలరాతను మార్చగలవు, తీర్చిదిద్దగలవు. అలా భీష్ముడు అనేక తరాలు మారినా జీవించే ఉండి, చివరకు తన మునిమనుమలతో యుద్ధం చేశాడు. కురుక్షేత్ర సంగ్రామంలో పాండవయోధులను గడగడలాడించి, చివరకు అంపశయ్య మీదకు చేరిన తర్వాత కూడా తనకు నచ్చినంతకాలం బ్రతికేవున్నాడు. తల్లిదండ్రుల దీవెనలకు ఉన్న బలం ఎంత గొప్పదో ఈ కథ మనకు తెలియజెపుతుంది.

తన తండ్రి సుఖమే తన సుఖంగా భావించి, అందుకోసం తన సుఖాన్ని పూర్తిగా త్యజించిన గాంగేయుడు చేసిన భీషణమైన ప్రతిజ్ఞ మానవజాతి చరిత్రలో ప్రతిజ్ఞలకే ప్రతిజ్ఞగా మిగిలిపోయింది.

చేయాలనుకున్న పనిని గురించి ప్రతిజ్ఞచేయడమే కాక జీవితమంతా దానిని నిలబెట్టడంలో భీష్ముడు గొప్ప పట్టుదలను చూపాడు. సాధారణంగా మనం

జీవితంలో అవసరమున్నా, లేకపోయినా రకరకాల విషయాలను కోరుతూ ఉంటాము. అలా కోరుకున్నవి మనకు లభించనందువల్ల మనకు ఎంతో అన్యాయం జరిగిందని బాధపడిపోతూ ఉంటాము. కానీ భీష్ముడిలా ప్రతిన పూని, పనిచేసేవాడికి సాధ్యం కానిదేముంది? తన ప్రతిజ్ఞకు కట్టుబడి, జీవితమంతా కఠోరమైన బ్రహ్మచర్యాన్ని భీష్ముడు పాటించాడు. దానివల్ల అతడికి ఎటువంటి గొప్ప శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు కలిగాయో మనం అతడి జీవితకథలో స్పష్టంగా చూడవచ్చు.

ఇక ఆ రోజు నుండీ భీష్ముడు సగం రాకుమారుడిగానూ, సగం సన్న్యాసిగానూ జీవించసాగాడు. రాజకుమారులకు తగ్గట్టుగా ఘనకార్యాలను ఎన్నో సాధించినా,



ఏదీ తన స్వార్థం కోసం చెయ్యలేదు. అన్నీ తన రాజసింహాసనం యొక్క క్షేమం కోసం, తన రాజ్యపు క్షేమం కోసం చేశాడు. తన సోదరులను సింహాసనాధిపతులను చేసి, వారికి రక్షణ కలిగించే బాధ్యతను తాను చేపట్టాడు. సత్యవతికి శంతనుడివల్ల ఇద్దరు కొడుకులు కలిగారు. వారికి చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అని పేర్లు పెట్టారు. వారికి యౌవనం రాకుండానే శంతనుడు కన్నుమూశాడు.

సత్యవతి ఆజ్ఞానుసారం చిత్రాంగదుణ్ణి రాజును చేసి, భీష్ముడు తానే రాజ్యవ్యవహారాలు చూస్తున్నాడు. చిత్రాంగదుడికి యుక్తవయస్సు వచ్చింది. ఆ రోజులలో చిత్రాంగదుడనే పేరుగల గంధర్వుడు ఒకడు వచ్చి, “నా పేరే పెట్టుకున్నావు కాబట్టి నాతో యుద్ధంచేసి గెలుపొందావా సరే, లేకపోతే నీ పేరు

మార్చుకో!" అని యుద్ధానికి పిలిచాడు. చిత్రాంగదుడు కోరమీసం మెలితిప్పి యుద్ధానికి దిగి, ఓడిపోయి నేలకూలాడు.

సత్యవతి ఇదంతా చూసి, భీష్ముణ్ణి పిలిచి, "నాయనా! నీవు వివాహం చేసుకో. మా నాన్నకు నీవు ఇచ్చిన ప్రమాణం నుంచి విడుదల చేస్తున్నాను. లేకపోతే వంశానికి ఇక అంకురాలు మిగిలేలా లేరు!" అని ఎంతగానో నచ్చ చెప్పింది. కానీ భీష్ముడు అందుకు ఒప్పుకోలేదు.

విచిత్రవీర్యుణ్ణి రాజును చేశాడు. విచిత్రవీర్యుడికి వయస్సు రాగానే భీష్ముడు కాశీరాజు పుత్రికల స్వయంవరానికి వెళ్ళి అక్కడకు చేరిన రాజులనందరినీ ఓడించి, అతడి కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికలను బలవంతంగా తీసుకువచ్చి, విచిత్రవీర్యుడికి ఇచ్చి వివాహం చేయబోయాడు. అయితే వారిలో పెద్ద కుమార్తె తాను సాళ్వరాజును గురించి విన్నాననీ, అతడికే తన హృదయాన్ని అర్పించాననీ చెప్పడంతో ఆమెను ఆ దేశానికి పంపి, అంబిక, అంబాలికలను విచిత్రవీర్యుడికి ఇచ్చి వివాహం చేశాడు. అయితే విచిత్రవీర్యుడు ఏడు సంవత్సరాలపాటు ఆ భార్యలిద్దరితో అతిగా కామోపభోగాలనుభవించడంతో క్షయవ్యాధి సోకి మరణించాడు. అతడికి బిడ్డలు కూడా కలుగలేదు. భీష్ముడికి వెన్ను విరిగినట్టయింది. సత్యవతి పుత్రశోకంలోనూ, వంశం అక్కడితో ఆగిపోతుందన్న బాధలోనూ మునిగిపోయింది.

ఇది ఇలా ఉండగా, మునుపు స్వయంవర సమయంలో జరిగిన యుద్ధంలో అంబ వరించిన సాళ్వుడు కూడా భీష్ముడి చేతిలో ఓడిపోయాడు. ఈ పరాజయాన్ని మనస్సులో పెట్టుకుని సాళ్వరాజు తన దగ్గరకు వచ్చిన అంబను స్వీకరించలేదు. తాను ప్రేమించిన వాడే తనను తిరస్కరించడంతో అతణ్ణి ఏమీ అనలేక, తిరిగి భీష్ముడి దగ్గరకు వచ్చి తనను వివాహమాడమని కోరింది. కానీ భీష్ముడు అందుకు అంగీకరించలేదు. ఇక ఆమెకు ఏమి చెయ్యాలో పాలుపోక, ఈ పరిస్థితి భీష్ముడి వలననే దాపురించిందని అంబ భావించి, భీష్ముడిపై పగతీర్చుకునే శక్తిని సాధించాలని తపస్సుకు పూనుకుంది. ఎంతో తపస్సు చేసిన తర్వాత ఆమె ద్రుపదుడి కుమార్తెగా శిఖండి అనే పేరుతో పుట్టింది. ఆమె ఆడపిల్లగా ఎదిగినా ధనుర్విద్యలన్నీ నేర్చుకుని భీష్ముణ్ణి చంపడానికి సిద్ధం కాసాగింది. కానీ భీష్ముడు స్త్రీలతో యుద్ధం చేయడు. అందుచేత ఆమె ఒక అరణ్యంలో తనకు తటస్థపడిన ఒక యక్షుడికి తన స్త్రీ దేహాన్ని ఇచ్చి, అతడి పురుషదేహాన్ని తాను పొంది, భీష్ముణ్ణి కడతేర్చే అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడసాగింది. అయినా భీష్ముడి దృష్టిలో శిఖండి ఇప్పటికీ స్త్రీయే. కాబట్టి స్త్రీ అయిన శిఖండి మీద భీష్ముడు బాణప్రయోగం చేయడు.

ఈ లోపల సత్యవతి మళ్ళీ భీష్మణ్ణి వంశాన్ని నిలబెట్టమని కోరింది. అతడితో, "నాయనా! గాంగేయా! విచిత్రవీర్యుడికి నీవు అన్నవే కాబట్టి అతడి భార్యల ద్వారానైనా నీవు సంతానాన్ని పొంది, వంశాన్ని ఉద్ధరించి, ఈ వంశపు కీర్తిప్రతిష్ఠలనూ, పరలోకగతులనూ కాపాడు!" అని కోరింది. కానీ భీష్ముడు తన మనస్సు మార్చుకోలేదు. సత్యవతితో, "అమ్మా! నా ప్రతిజ్ఞ నీకు తెలుసు. ఏ ప్రలోభంతోనూ నేను రాజ్యాధికారాన్ని కానీ, ఏ స్త్రీని గానీ నా మనస్సులోకి రానివ్వను" అన్నాడు. జీవితం అనేది ముఖ్యం కాదు, ఆదర్శం, ఆత్మగౌరవం అన్నిటికన్నా ముఖ్యం. జీవితం ఏదోవొక రోజు అంతమయిపోతుంది కానీ మనం నిలబెట్టిన ఆదర్శం ఎల్లకాలం మనతోనే ఉంటుంది. పునర్జన్మలతో శరీరాలు మారిపోయినా మనం చేపట్టిన ఆదర్శం, మనం చేసిన పుణ్యం, పాపం మనల్ని అంటిపెట్టుకుని, జన్మల తరబడి మన వెంట వస్తూనే ఉంటాయి. "ప్రాణ్ జాయే పర్ వచన్ న జాయ్" ("ప్రాణం పోయినా ఫర్వాలేదు కానీ ఇచ్చిన మాట పోకూడదు") అనే సామెత ఉంది కదా. కాబట్టి జీవితంలో మనం చేపట్టిన ఆదర్శం విషయంలో ఎట్టి పరిస్థితులలోనూ రాజీ పడకుండా, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడమే అన్నిటికన్నా ముఖ్యమైన కర్తవ్యంగా పరిగణించాలి.

భీష్ముడు ఇలా నిరాకరించడంతో సత్యవతి వ్యాసుణ్ణి తలచుకుంది. వ్యాసుడు సత్యవతి మొదటి కొడుకు. యుక్తవయస్సులో ఉన్న సత్యవతిని పరాశర మహర్షి మోహించి ఆమె కన్యాత్వం చెడకుండా వరమిచ్చి, ఆమె ద్వారా వ్యాసుణ్ణి కన్నాడు. వ్యాసుడు పుట్టుకతోనే మహాద్భుత శక్తి సంపన్నుడు. అతడు పుడుతూనే పెద్దవాడై, తల్లి సత్యవతికి నమస్కరించి, "అమ్మా! నేను తపస్సు చేయడానికి వెడుతున్నాను. నీవు తలచుకున్నప్పుడు నీ దగ్గరికి వస్తాను" అని వెళ్ళిపోయాడు. ఇప్పుడు సత్యవతి తలచుకోవడంతోనే అతడు ప్రత్యక్షమయ్యాడు. సత్యవతి కోరిక మేరకు అతడి ద్వారా అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, అంబిక దాసికి విదురుడు కలిగారు. ధృతరాష్ట్రుడు, పాండురాజు మహాబలసంపన్నులే అయినా వారిలో ధృతరాష్ట్రుడు గుడ్డివాడుగానూ, పాండురాజు పాండురోగిగానూ తయారయ్యారు. విదురుడు రాజనీతిలో ఆరితేరాడు. భీష్ముడు మరొకసారి తన పుత్రులు కానివారికి విద్య నేర్పడంలోనూ, తాను పాలించని రాజ్యాన్ని సంరక్షించడంలోనూ నిమగ్నమయ్యాడు.

ధృతరాష్ట్రుడికి గాంధారదేశపు రాకుమార్తె అయిన గాంధారిని తెచ్చి వివాహం చేశాడు. గాంధారి తన భర్త గుడ్డివాడని తెలుసుకుని తాను కూడా కళ్ళకు గంతలు కట్టుకుని జీవితాంతం గుడ్డిదానిగానే ఉండిపోతానని శపథం చేసింది. ఈ ఆధునికయుగంలో గాంధారి చేసిన పని మనకు అర్థరహితమైనదిగా కనిపించినా,

తాను వివాహమాడబోయే మనిషితో తాను సమానంగా ఉండాలన్న కోరికతో, తన భర్త కంటిచూపుతో ఆనందాన్ని పొందలేడు కాబట్టి తాను కూడా దాన్ని త్యజించాలని ఆమె భావించింది. ఆమె పట్టిన శపథం ఆమె జీవితకథను చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసింది కదా. అటువంటి పట్టుదలను అలవరచుకుంటే ఎంత బాగుంటుందో ఆలోచించండి!

పాండురాజుకు కుంతిభోజుని కుమార్తె అయిన కుంతీదేవిని, మద్రదేశపు రాకుమార్తె మాద్రిని ఇచ్చి వివాహం చేశాడు. ధృతరాష్ట్రుడికి దుర్యోధనాదులు నూరుమంది, పాండురాజుకు పాండవులు ఐదుగురు సంతానం కలిగారు. దుర్యోధనుడు లోభి, అసూయాపరుడు కావడంతో, చిన్ననాటి నుంచీ బలవంతులుగానూ, అన్నింటిలోనూ తమకన్నా మిన్నగానూ ఎదిగిన పాండవుల్ని అన్ని విషయాలలోనూ ఓడించాలనీ, వీలయితే మట్టుబెట్టాలనీ ప్రయత్నించేవాడు. పాండవులు ఇంద్రప్రస్థం అనే నగరాన్ని నిర్మించి అక్కడనుంచి పరిపాలన చేయడం సాగించారు. కానీ వారి ఐశ్వర్యాన్ని చూసి కన్నుకుట్టిన దుర్యోధనుడు వారిని మాయాజూదంలో ఓడించి వనవాసానికి పంపించాడు. జూదంలో వారు పెట్టుకున్న నియమం ప్రకారం ఓడినవారు పన్నెండు సంవత్సరాలు వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయాలి. ఒకవేళ అజ్ఞాతవాసం చేస్తున్నవారిని ఎవరైనా గుర్తిస్తే తిరిగి పన్నెండేళ్ళు వనవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం చేయాలి. వనవాసం పన్నెండు సంవత్సరాలూ పూర్తిచేసి, ఆపైన ఒక సంవత్సరం అజ్ఞాతవాసాన్ని గడపడానికి, పాండవులు విరాటరాజు కొలువులో మారువేషాలతో చేరారు. అక్కడ విజయవంతంగా అజ్ఞాతవాసాన్ని పూర్తిచేసి తిరిగి తమ రాజ్యాన్ని తమకు అప్పగించమని కోరారు. దుర్యోధనుడు అందుకు ఒప్పుకోకపోవడంతో యుద్ధం అనివార్యమయింది. శ్రీకృష్ణుడు యుద్ధాన్ని నివారించడానికి చేసిన రాయబారం కూడా ఫలించలేదు.

దుర్యోధనుడి దుర్బుద్ధి వల్లనే తర్వాత కురుక్షేత్రయుద్ధం దాపురించింది కానీ అందులో శ్రీకృష్ణుడి దోషం కానీ, పాండవుల దోషం కానీ లేవు అన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. ఈ విషయాన్ని భీష్ముడు అనేకసార్లు దుర్యోధనుడితో చెప్పి తన పద్ధతి మార్చుకోమని హెచ్చరించినా అతడు చెవినిపెట్టలేదు. యుద్ధమూ, బంధునాశమూ తప్పవని తేలిపోవడంతో అన్ని దేశాల రాజులూ యుద్ధానికి సిద్ధమై, కౌరవ, పాండవ పక్షాలుగా చీలిపోయారు.

కురుక్షేత్రంలో పద్దెనిమిది రోజులపాటు ఘోరమైన యుద్ధం జరిగింది. భీష్ముడు తాను హస్తినాపురానికి రక్షణ కల్పిస్తానని తన ప్రతిజ్ఞలో చెప్పాడు కదా. అందుచేత ఇప్పుడు అతడు కౌరవుల పక్షం వహించి, సర్వసైన్యాధ్యక్షుడిగా వ్యవహరించవలసి

వచ్చింది. అప్పటివరకూ భారతదేశం కనీవినీ ఎరుగనంత పెద్ద సైన్యాలు ఒకదానినొకటి ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాయి. ఒకవైపు దుర్యోధనుడికి బాసటగా భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు మొదలైనవారు, మరొకవైపు పాండవులకు తోడుగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, విరాటుడు మొదలైనవారు చేరారు.

యుద్ధం మొదలైంది. భీష్ముడు తొమ్మిది రోజులపాటు భీషణమైన యుద్ధం చేశాడు. కార్చిచ్చు అడవిని బూడిద చేసినట్టు పాండవసైన్యాలను పెద్దసంఖ్యలో మట్టుబెట్టాడు. భీష్ముడి కంటే నాలుగు తరాలు చిన్నవాళ్ళైన యోధులు కూడా ఆయన ముందు నిలువలేకపోయారు. ఎదుటనున్నది తన బంధువులే అయినా భీష్ముడు యుద్ధమే తన విధి అని భావించి వారిని సంహరించాడు. మనం జీవితంలో దీనినుంచి ఒక పాఠం నేర్చుకోవాలి. చేసే పని ఇష్టం లేనిదే అయినా, అంతకు ముందు దానిని నివారించాలని అన్నివిధాలా ప్రయత్నించినా, ఒకసారి మొదలయ్యాక సగంసగం పనిచెయ్యడం అనేది కూడదు. అన్యమనస్కంగా పని చేయడం అనే చెడు లక్షణం భీష్ముడు మొదలైన మహాభారత యోధులలో మనకు ఏమాత్రం కనిపించదు. అదే విధంగా మన జీవితంలో కూడా ఒకసారి ఏదైనా పని మొదలుపెట్టిన తర్వాత దానికి పూర్తిగా మనస్సును అంకితం చేయడం అత్యవసరం.

అలనాటి ఈ కురుక్షేత్రయుద్ధాన్ని ధర్మయుద్ధం అంటారు. అంటే యుద్ధం చేసేవాడు ఎదురుగా వచ్చి పోరాడతాడే కానీ, చాటుగా దొంగదెబ్బ తీయడు. పైగా భీష్ముడు, అర్జునుడు లాంటి యోధులు ఎవరిని కొడుతున్నారో వారి పేరుచెప్పి, బాణం విడిచి, వాణ్ణి సంహరించేవారు. గాయపడి స్పృహలో లేనివాణ్ణి, అలసిపోయినవాణ్ణి, నిరాయుధుడిగా నిలబడ్డవాణ్ణి, మరొకరితో యుద్ధంచేస్తున్న వారిని ఈ యుద్ధంలో సంహరించకూడదని నియమం పెట్టుకున్నారు. అంతేకాక, ఒకవేళ శత్రువు కనుక మనసు మార్చుకుంటే, అతడు శరణుకోరడానికి తగినంత సమయం, అవకాశం ఎప్పుడూ ఉంటాయన్నమాట. ఆ ధర్మయుద్ధంలో రాత్రివేళ యుద్ధం చేసేవారు కాదు. అటువంటి విరామసమయంలో శత్రుసైన్యాలవారు ఒకరినొకరు కలుసుకుని మాట్లాడుకునే వారు. అయితే మరునాడు యుద్ధంలో వారే ఒకరినొకరు చంపుకోవలసివస్తే క్షణమైనా పునరాలోచించేవారు కాదు. ఇటువంటి యుద్ధం చేయాలంటే ఎంత గుండె ధైర్యం కావాలో, ఎంత ఆత్మస్థైర్యం కావాలో ఆలోచించండి. మరణమంటే ఒక చొక్కాను విడిచి మరొక చొక్కాను ధరించడమే అన్న భారతీయ ధోరణి అప్పటివారి సహజప్రవృత్తిగా ఉండేదని చెప్పవచ్చు. ఆ స్థితికి మనం మళ్ళీ చేరుకోవాలనీ, అటువంటి ధీరోదాత్తత ఈనాడు తిరిగి కావాలనీ, వివేకానంద స్వామి పదేపదే చెప్పారు కదా!

మూడవరోజు యుద్ధంలో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. భీష్మణ్ణి అర్జునుడు నిరోధించలేకుండా ఉన్నాడు. దానికి కారణం అతడికి భీష్ముడి మీదున్న గౌరవం. అయితే, “ఇలా జరిగితే మన సైన్యాలు అతిత్వరలో అంతరించిపోతాయి” అని శ్రీకృష్ణుడు కోపంగా పలికి, “నీవు చేయలేకుండా ఉన్నావు కాబట్టి ఈ వృద్ధవీరుణ్ణి నేనే చంపుతాను!” అంటూ రథం మీదనుంచి క్రిందికి దూకి తన చక్రం తీసుకుని ముందుకు నడవసాగాడు. శ్రీకృష్ణుడు ఈ కురుక్షేత్రయుద్ధంలో తానుగా ఆయుధం పట్టననీ, కేవలం అర్జునుడికి సారథిగా ఉంటాననీ ముందుగానే ప్రతిజ్ఞ చేసిన విషయం మనకు తెలుసు. కానీ భీష్ముడి పట్ల తనకున్న అభిమానం వల్ల అర్జునుడు అతణ్ణి వదిలిపెడుతున్నాడని శ్రీకృష్ణుడు గ్రహించాడు. అతడికి తగిన విధంగా బుద్ధి చెప్పడానికి తానే చక్రం చేపట్టి ముందుకురికాడు. ఇది చూసి భీష్ముడు భయపడడానికి బదులు, “ఓ నీరజనయనా! శ్రీకృష్ణా! రా! రా! నీ చేతిలో చావడం కంటే అదృష్టం ఏముంటుంది? నా ప్రాణాలను నీకు ఇప్పుడే అర్పిస్తాను. నీ చేతిలో చావడం వల్ల నా పేరు ముల్లోకాలలోనూ శాశ్వతంగా నిలిచిపోతుంది!” అని ధనుర్బాణాలు విడిచిపెట్టి, రథం దిగి, చేతులు జోడించి మోకాళ్ళ మీద నిలబడ్డాడు. అయితే అర్జునుడు ఇది చూసి చాలా బాధపడ్డాడు. అతడు శ్రీకృష్ణుడి వద్దకు పరుగెత్తిపోయి, “బావా! కొంచెం ఓపికపట్టు! నేను ఎటువంటి రాగద్వేషాలూ లేకుండా యుద్ధం చేస్తానని మాట ఇస్తున్నాను!” అని బ్రతిమాలాడు. దీనితో శ్రీకృష్ణుడు శాంతించి మళ్ళీ పగ్గాలు పట్టాడు. ఇదే రకమైన సన్నివేశం తొమ్మిదవనాడు కూడా కనిపించింది. ఇటువంటి సంఘటనల ద్వారా భీష్ముడి గొప్పతనం ఏమిటో మనం తెలుసుకోవచ్చు. ఈ సంఘటన తర్వాత అర్జునుడు పౌరుషాన్ని తెచ్చుకుని ఘోరంగా యుద్ధం చేశాడు. అయినప్పటికీ భీష్ముడి వల్ల పాండవసేనలకు అపారమైన నష్టం కలుగుతూనే ఉంది.

అలా యుద్ధం చేస్తున్న భీష్మణ్ణి చూసి, పాండవులకు ఏమి చెయ్యాలో తోచలేదు. చివరకు, తనను సంహరించడం ఎలాగో చెప్పమని భీష్మణ్ణే కోరారు. “తాతా! తొమ్మిది రోజులుగా నిన్ను నిరోధించడానికి మేము చేసిన ప్రయత్నాలన్నీ వమ్ము అయ్యాయి. నువ్వు కౌరవపక్షాన నిలబడినంతకాలం మేము ఈ యుద్ధాన్ని నెగ్గలేము. కాబట్టి మేము నిన్ను గెలవాలంటే ఏమి చెయ్యాలో నువ్వే చెప్పు!” అని కోరారు.

భీష్ముడు వారిని చూసి చిరునవ్వు నవ్వాడు. తనకు అంతిమఘడియలు దగ్గరపడ్డాయని గ్రహించాడు. తనకు తన తండ్రి ఇచ్చిన వరం ప్రకారం తన చావు తన చేతిలోనే ఉందని అతడికి తెలుసు. అనేక తరాలు మారినా తాను ఇన్నాళ్ళుగా జీవించే ఉన్నాడు. ఏనాడూ తన బాధ్యతను వదిలిపెట్టిపోవాలని అనుకోలేదు. ఈ

సంఘటనకు ముందే కనుక తన ఇచ్ఛామరణాన్ని కోరుకున్నట్టయితే అది బాధ్యతారాహిత్యమే అయ్యేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. దుర్మార్గులయిన కౌరవులు ఓడిపోవాలన్నా, సన్మార్గులయిన పాండవులు గెలవాలన్నా తాను తప్పుకోకతప్పదు. ఇన్నాళ్ళుగా హస్తినాపుర సామ్రాజ్య సంరక్షణను తన కర్తవ్యంగా భావిస్తూ వస్తున్నాడు. దాని కోసమే యుద్ధంలోకి దిగాడు. కానీ ఆ సామ్రాజ్యం సరైన పాలకుల చేతులలోకి వెళ్ళాలంటే, తన ప్రస్తుత కర్తవ్యమైన ఈ యుద్ధం నుంచి తప్పుకోకతప్పదు మరి! జీవితంలో అంతవరకూ ఏది తన కర్తవ్యంగా కనిపించిందో అదే తన తక్షణకర్తవ్యానికి అడ్డుగా నిలుస్తోంది. సామ్రాజ్య సంరక్షణ కోసం అతడు తీసుకున్న భీష్మప్రతిజ్ఞ సరైన రీతిలో నెరవేరాలంటే, ఇప్పుడు తాను ప్రపంచం నుంచీ తప్పుకోవడం వల్ల మాత్రమే కుదురుతుందని అతడికి స్పష్టమయింది. తన బాధ్యత తీరిందనీ, తాను విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమయిందనీ అతడు గ్రహించాడు. పాండవులతో ఇలా చెప్పాడు:

“నాయనలారా! నేను యుద్ధంలో నిలబడినంత కాలం మీరు కౌరవుల్ని గెలవలేరు. అంతేకాక, ధనుర్బాణాలు నా చేతిలో ఉన్నంతకాలం ఎవరూ నన్ను నేలకూల్చలేరు. అయితే నేను కొన్ని పరిస్థితులలో అస్త్రసన్యాసం చేస్తాను. భయపడినవారి మీద, గాయాలవలన, రోగం వలన బలహీనపడినవారి మీద, నన్ను శరణుకోరినవారి మీద, స్త్రీలుగా పుట్టినవారి మీద నేను బాణాలు ప్రయోగించను. కాబట్టి అటువంటి వారెవరైనా నాకు యుద్ధంలో ఎదురుపడితే, అప్పుడు మీరు నన్ను ఓడించగలుగుతారు” అని చెప్పాడు.

ఇది వినగానే పాండవులకు శిఖండి గుర్తుకు వచ్చాడు. నిజానికి భీష్ముడు కూడా శిఖండిని మనస్సులో ఉంచుకునే మాట్లాడుతున్నాడు. కాబట్టి, మర్నాడు అంటే పదవరోజు, శిఖండిని పక్కన ఉంచుకుని అర్జునుడు యుద్ధం చెయ్యాలని నిశ్చయించబడింది. ఒక్కసారిగా అర్జునుడి మనస్సు బాధతో నిండిపోయింది. తాను పసివాడిగా ఉన్నప్పుడు భీష్ముడి కాళ్ళ దగ్గర ఆడుకుంటూ, భీష్ముణ్ణి, “నాన్నా!” అని పిలిచినప్పుడు, భీష్ముడు, “నాన్న కాదురా! నీ నాన్నకు నాన్నని!” అని ఎంతో ప్రేమగా చెప్పిన మాటలు అతడికి గుర్తుకువచ్చాయి. అలా తనను అల్లారు ముద్దుగా పెంచినవాణ్ణి బాణాలతో కొట్టి సంహరించడం ఎంతవరకూ సమంజసమని ఆలోచిస్తూ అర్జునుడు కళ్ళలో నీరు నింపుకున్నాడు. అయితే అప్పుడు భీష్ముడే ఒక సైనికుడిగా అర్జునుడికి అతడి కర్తవ్యాన్ని గుర్తుచేసి, తాను రేపు చేయవలసిన పనిని ప్రతిఫలాపేక్ష లేకుండా చేయమని ఉద్బోధించాడు.

పదవరోజు యుద్ధం మొదలైంది. భీష్ముడు ఎప్పటిలాగే చండప్రతాపంతో యుద్ధం చేయడం మొదలుపెట్టాడు. క్షణానికి ఒకడిచొప్పున శత్రుసైనికులను మట్టుబెడుతున్నాడు. తన మరణరహస్యం తన శత్రువులకు చెప్పానన్న ఆందోళన కానీ, భయం కానీ అతడి ముఖంలో ఏమాత్రం కనపడడంలేదు. అనుకున్న ప్రకారం, అర్జునుడు తన తెల్లని గుర్రాలు పూన్చిన రథంతో శిఖండిని తన పక్కన నిలబెట్టుకుని, భీష్ముడు యుద్ధరంగంలో ఎటువైపు వెడితే అటువైపుకు వస్తూ, ఆయనను ఎదుర్కోసాగాడు. కానీ శిఖండి కనపడగానే భీష్ముడు నవ్వుతూ తప్పుకుని పోసాగాడు. ఆడదానిగా పుట్టిన ఒక మనిషి మీద బాణప్రయోగం చెయ్యనని చెప్పాడు కదా! అది తనకు చిన్నతనమని అతడి ఉద్దేశ్యం. అర్జునుడు భీష్ముడి మీదకు అనేక బాణాలను గుప్పించసాగాడు. అవి ఆయన శరీరమంతా దిగబడుతున్నాయి. అర్జునుడు ఎదురుగా కనిపించినప్పుడు, భీష్ముడు కూడా అతణ్ణి తన బాణాలతో ఎదుర్కొన్నాడు. కానీ పుంఖానుపుంఖాలుగా వెలువడిన అర్జునుడి బాణాలు ఆయన శరీరం కనపడకుండా కప్పివేశాయి. చివరకు ఆయన శరీరం బాణాల గుచ్ఛంలా కనిపించసాగింది. సూర్యాస్తమయం దగ్గర పడుతూ ఉంటే అర్జునుడు చెవిదాకా లాగివదిలిన బాణం ఆయన గుండెలో దిగబడింది. ఆయన రథం మీద నుంచి క్రిందకు పడిపోయాడు. ఆయన శరీరానికి గుచ్చుకున్న బాణాలే ఆయనకు శయ్యలాగా ఏర్పడ్డాయి. అయినా సరే, మృత్యువు ఆయన దరిదాపులకు కూడా రాలేదు. ఎందుకంటే తాను కోరుకున్నప్పుడు మాత్రమే తనకు మరణం లభించగలదన్న దీవెన ఆయనకు ఉంది కదా. చనిపోబోయే ముందు కొంతకాలం భగవచ్చింతనలో గడపాలని ఆయన నిశ్చయించుకున్నాడు. అది దక్షిణాయణం కాబట్టి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకూ ప్రాణాలు నిలుపుకుని, ఆ శారీరిక వేదనను ఎంతో ఓరిమితో సహించాడు.

వైరిపక్షాల యుద్ధవీరులందరూ తమతమ ఆయుధాలు విడిచి ఆయన చుట్టూ చేరారు. ఆయనను అక్కడ నుంచి తీసుకుపోదామని అనుకున్నా ఆయన అందుకు అనుమతించలేదు. "వీరుడైన వాడి శరీరం ఎక్కడ నేలరాలుతుందో అదే అతడి శయ్య!" అని వారితో చెప్పి, "నాకు తల క్రింద ఏమీ లేదు. నాకు తలగడ ఏర్పాటు చెయ్యండి!" అన్నాడు. ఆయన శరీరంలో నాటుకున్న బాణాల వెనుక కొనలను ఆధారం చేసుకుని ఆయన శరీరం శయనించినా, ఆయన తలకు ఆధారం లేదు. కొందరు పరుగెత్తి తలగడలు తెచ్చారు. కానీ భీష్ముడు వద్దన్నాడు. తలవంచుకుని బాధతో కుమిలిపోతున్న అర్జునుణ్ణి చూసి, "నాయనా! అర్జునా!" అని పిలిచాడు. అర్జునుడు ఆయన మనస్సును అర్థం చేసుకుని మూడు బాణాలను భీష్ముడి తలవున్నచోట నేలలోకి దిగేలా విడిచాడు. అవి ఆ సాటిలేని యోధుడికి తలగడగా



అమరాయి. తన చుట్టూ ఒక కందకం తవ్వమనీ, మిగిలిన రోజులను ఏకాంతంగా భగవంతుని చింతనలో గడుపుతాననీ వారికి చెప్పాడు. దాహం వేసి, మళ్ళీ ఒకసారి అర్జునుడి కేసి చూశాడు. అర్జునుడు నేలలోకి వదిలిన బాణం నేలకు రంధ్రం చేసి, ఆయన నోటిలో పడేలా నీటి ధారను బయటకు తెచ్చింది. నేటికీ కురుక్షేత్రంలో ఆ ధార వలన ఏర్పడిన స్వచ్ఛమైన నీటితో తళతళలాడే నీటికొలనును మనం చూడవచ్చు.

ఆ తర్వాత ఎనిమిది రోజులపాటు ఘోరమైన యుద్ధం జరిగింది. చివరకు అధర్మం ఓడి, ధర్మం గెలిచింది. అంటే కౌరవులు ఓడిపోయి, పాండవులు నెగ్గారు. పాండవులు రాజ్యాధికారాన్ని చేపట్టారు. కొద్దిరోజుల తర్వాత శ్రీకృష్ణుడితో కలసి పాండవులు భీష్ముడి దగ్గరకు వచ్చారు. శ్రీకృష్ణుడు భీష్ముడితో, "తాతా! ధర్మరాజుకు రాజనీతిని బోధించు!" అని కోరాడు. ఆ పనిని తన విధ్యుక్తధర్మంగా భావిస్తూ, భీష్ముడు ధర్మరాజుకు రాజనీతిని బోధించాడు.

ఆ తర్వాత భీష్ముడు ఇంకా యాభై రోజులు జీవించి, ఉత్తరాయణం మొదలు కాగానే తన శరీరాన్ని విడిచి, పరబ్రహ్మంలో ఐక్యమయ్యాడు. ఆయన తన జీవితమంతా నిర్భయుడిగానూ, ఎవరి మీదా నిందమోపకుండానూ జీవించాడు. ఎలా జీవించాడో అలాగే మరణించాడు. ఎలా మరణించాడో అలా జీవించాడు. ఆయన జీవితం యావత్ ప్రపంచానికీ ఆదర్శప్రాయం.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 17. అభిమన్యుడు

మహాభారతంలోని యువవీరుల గురించి చెప్పుకోవాలంటే ప్రప్రథమంగా అభిమన్యుడి గురించే చెప్పుకోవాలి. అభిమన్యుడు అర్జునుడికీ, సుభద్రకూ పుట్టిన సంతానం. అతడు మహాపరాక్రమవంతుడు. అత్యంతలాఘవంగా బాణాలను ప్రయోగించగలిగిన వీరుడని పేరుతెచ్చుకున్నాడు. అంతేకాక సౌశీల్యంలోనూ, ధైర్యంలోనూ, తన తల్లిదండ్రులపట్ల భక్తిశ్రద్ధలలోనూ అతడికి అతడే సాటి.

పాండవులు పన్నెండు సంవత్సరాల అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం పూర్తిచేశారు. ఆ తర్వాత, భవిష్యత్ ప్రణాళిక గురించి చర్చించడానికి విరాటరాజ్యంలోని ఉపప్లావ్యం అనే చోట విడిది చేశారు. అక్కడికి వారి బంధువులు, స్నేహితులందరూ వచ్చి చేరారు. వారిలో శ్రీకృష్ణుడు, బలరాముడితో పాటు సుభద్ర, అభిమన్యుడు, మిగిలిన రాజులందరూ ఉన్నారు. అక్కడే అభిమన్యుడికీ, విరాట రాకుమారి ఉత్తరకూ వివాహం చేశారు. వారిద్దరికీ కలిగిన సంతానమే పరీక్షిత్తు.

విస్తృతంగా సాగిన చర్చల తర్వాత శ్రీకృష్ణుణ్ణి రాయబారిగా కౌరవుల వద్దకు పంపాలని పాండవులు నిర్ణయించారు. అయితే అన్ని రకాల రాయబారాలూ విఫలమై యుద్ధం, బంధునాశనం తప్పవని స్పష్టమైంది.

కురుక్షేత్రయుద్ధంలో మిగిలిన వారికన్నా కొట్టొచ్చినట్టు కనిపించే వారిలో అభిమన్యుడు ప్రముఖుడు. అతడి రథానికి ఉన్న జెండా మీద కర్ణికరవృక్షపు బొమ్మ చిత్రించి ఉండేది. అరివీరభయంకరుడై అభిమన్యుడు చేసిన యుద్ధంలో చివరికి భీష్ముడు, ద్రోణుడు కూడా దెబ్బతిన్నారు. మిగిలిన యోధులలో ఇంచుమించు అందరినీ అభిమన్యుడు ఓడించాడు.

మొదటిరోజు యుద్ధంలో భీష్ముడు కార్చిచ్చులా ఎక్కడకు వెళితే అక్కడ పాండవసైన్యాన్ని దహించాడు. ఇది చూసిన అభిమన్యుడు భీష్ముణ్ణి ఎదుర్కొన్నాడు. ఆ వంశంలో అందరికన్నా వృద్ధుడు, అందరికన్నా చిన్నవాడు తలపడిన తీరు దేవతలే నిలబడి చూసేలా చేసింది. భీష్ముణ్ణి ఎదుర్కోవడానికి ముందు రణరంగంలో అభిమన్యుడు వదిలిన ఒక బాణందెబ్బకు కృతవర్మ యుద్ధభూమినుంచి తప్పుకున్నాడు. శల్యుణ్ణి ఐదు బాణాలతో కొట్టాడు. దుర్ముఖుడి రథసారథి తల తెగగొట్టాడు. మరొకబాణంతో కృపాచార్యుడి విల్లు విరిచాడు. ఆపైన, భీష్ముడితో జరిగిన పోరులో భీష్ముణ్ణి తొమ్మిదిసార్లు కొట్టాడు. అభిమన్యుడి యుద్ధకౌశలాన్ని చూసి భీష్ముడు మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. “నీవు అర్జునుడికి తగిన పుత్రుడివి రా!” అని ఆశీర్వదించాడు. అప్పటికి కౌరవవీరులు అందరూ కలసి మూకుమ్మడిగా అభిమన్యుడి మీద దాడికి దిగారు. వారందరినీ

బాణాలతో కొట్టి, ఎక్కడివారిని అక్కడే నిలబెట్టాడు. అదే సమయంలో భీష్ముడు తన మీదకు విడుస్తున్న బాణాలను మధ్యలోనే త్రుంచివేశాడు. అతడు గురిపెట్టి వదిలిన బాణం తాటిచెట్టు బొమ్మతో అలరారుతున్న భీష్ముడి కేతనాన్ని పడగొట్టింది. భీష్ముడు అభిమన్యుడి శౌర్యాన్ని చూసి లోలోన ఎంతో ఆనందిస్తున్నా, తన శక్తిని పూర్తిగా ఉపయోగిస్తూ ఆ యువకుణ్ణి హింసించాడు. ఇది చూసి అనేకమంది పాండవవీరులు అభిమన్యుడికి తోడుగా వచ్చారు. అభిమన్యుడికి కొంత విశ్రాంతి దొరికింది. ఇదే విధంగా అభిమన్యుడు తాను యుద్ధంలో ఉద్యమించిన ప్రతిసారీ కౌరవులను లెక్కకుమిక్కిలిగా మట్టుబెట్టాడు.

భీష్ముడు అంపశయ్య మీదకు చేరిన తర్వాత ద్రోణుణ్ణి దుర్యోధనుడు సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించి, ధర్మరాజుని బందీగా పట్టుకోమని కోరాడు. అర్జునుడు యుద్ధరంగంలో ఉన్నంతసేపూ ధర్మరాజును పట్టుకోవడం కుదరదు కనుక అతణ్ణి యుద్ధరంగం నుంచి తొలగించడానికి వీలుగా కొందరు సంశప్తకులుగా తయారై అతణ్ణి సవాలు చేసి యుద్ధానికి పిలిచారు. సంశప్తకుడు అంటే ఎట్టి పరిస్థితులలోనూ యుద్ధంలోనుంచి మరలనని శపథం చేసి శత్రువుతో 'నువ్వో–నేనో' తేల్చుకునేవాడని అర్థం. అలా సవాలు చేసిన కొందరిని ఒకసారి అర్జునుడు ఓడించాడు. అయితే పదమూడవరోజు మళ్ళీ కొందరు సంశప్తకులు అర్జునుణ్ణి యుద్ధానికి పిలిచారు. ఇలా ఎవరైనా యుద్ధానికి సవాలు చేస్తే వెళ్ళకుండా ఉండడం క్షత్రియధర్మం కాదు. అందుచేత అర్జునుడు వారితో యుద్ధానికి వెళ్ళాడు. ఈ యుద్ధం అసలు యుద్ధానికి దక్షిణప్రాంతంలో, ఎవరూ కనీవినీ ఎరుగనంత ఘోరంగా జరిగింది.

అర్జునుడు ఆ యుద్ధానికి బయలుదేరగానే ద్రోణుడు కౌరవసైన్యాన్ని పద్మవ్యూహంలో నిలబెట్టాడు. ఈ వ్యూహం మిగిలిన వ్యూహాలకన్నా దుర్భేద్యంగా ఉంటుంది. అర్జునుడు లేని సమయం చూసి, ఈ వ్యూహం ద్వారా పాండవులను ఓడించి, ధర్మరాజును బందీగా పట్టుకోవడమే ద్రోణుడి అసలు ఉద్దేశ్యం. ఆ రోజు జరిగిన యుద్ధంలో భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, ఇంకా అనేకమంది పాండవ వీరులు ఎంత ప్రయత్నించినా ఆ వ్యూహాన్ని ఛేదించలేకపోయారు.

పద్మవ్యూహాన్ని ఛేదించడమనేదే ఒక ప్రత్యేకమైన యుద్ధవిద్య. ఆ వ్యూహంలోకి చొరబడడమే కాక అవసరమైతే ఎలా బయటపడాలో కూడా తెలిసివుండాలి. అది అందరికీ తెలియదు. భీష్ముడు, ద్రోణుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు – ఈ నలుగురు మహావీరులకు మాత్రమే ఆ విద్య తెలుసు. అయితే అభిమన్యుడు తన తండ్రి దగ్గర ఆ వ్యూహాన్ని ఛేదించి, లోపలికి ప్రవేశించడం తల్లి గర్భంలో ఉండగానే

నేర్చుకున్నాడు. కానీ దానిలోనుంచి ఎలా బయటపడాలో అభిమన్యుడికి నేర్చుకోవడం కుదరలేదు.

అభిమన్యుడు అప్పటికి వయసులో చిన్నవాడే అయినా గొప్ప సాహసవంతుడిగానూ, శూరుడుగానూ, మేధాసంపత్తిలో శ్రీకృష్ణుడితోనూ, అర్జునుడితోనూ పోల్చదగినవాడుగానూ పేరు తెచ్చుకున్నాడు. ధర్మరాజు అభిమన్యుణ్ణి దగ్గరకు పిలిచి, "నాయనా! ద్రోణాచార్యుడు మన సేనలను ఘోరంగా నష్టపరుస్తున్నాడు. అర్జునుడు సంశప్తకులతో యుద్ధం చేయడానికి వేరే చోటికి వెళ్ళాడు. అర్జునుడు లేనప్పుడు మనం పరాజయం పాలయితే అందరికన్నా అర్జునుడే ఎక్కువగా బాధపడతాడు. మేమెవరమూ ద్రోణుడు పన్నిన ఈ పద్మవ్యూహాన్ని ఛేదించలేకుండా ఉన్నాము. నీకు దీనిని ఛేదించే విద్య తెలుసు కనుక నువ్వు ఈ వ్యూహాన్ని ఛేదించి లోనికి దారితీస్తే మేమందరమూ నీ వెనుకనే లోపలికి జొరబడతాము" అని చెప్పాడు. భీముడు ధర్మరాజు చెప్పిన మాటను సమర్థిస్తూ, "నాతోపాటు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మొదలైన యోధులందరూ కూడా నీకు తోడుగా వస్తారు. మనమందరమూ కలిసి కౌరవసైన్యాన్ని మట్టుబెట్టవచ్చు" అని చెప్పాడు.

ఇది విని అభిమన్యుడు తన తండ్రినీ, శ్రీకృష్ణుణ్ణీ తలచుకున్నాడు. తన ప్రతాపాన్ని గుర్తుచేసుకున్నాడు. ధర్మరాజుతో, "తండ్రీ! నేను మహావీరులైన నా తండ్రినీ, మామనూ మెప్పిస్తాను. నా పరాక్రమం ఎలాంటిదో చూపుతాను!" అని ఉత్సాహంగా పలికాడు.

"నీ పరాక్రమం వర్ధిల్లుగాక!" అని ధర్మరాజు దీవించాడు. అభిమన్యుడు తన రథసారథి అయిన సుమిత్రుడితో, "రథాన్ని వేగంగా ద్రోణుడున్న చోటికి పోనివ్వు! అని ఆజ్ఞాపించాడు. సుమిత్రుడు అభిమన్యుడితో, "రాజకుమారా! నిన్ను దేవతలు సంరక్షించాలని నేను ప్రార్థిస్తున్నాను! ధర్మరాజు చిన్నవాడవైన నీ భుజస్కంధాల మీద మోయలేని బరువును మోపాడు. ద్రోణుడి వ్యూహాన్ని ఛేదించే ముందు ఒకటికిరెండుసార్లు ఆలోచించుకో! ద్రోణాచార్యుడు ధనుర్విద్యా నైపుణ్యంలోనే కాక యుద్ధవ్యూహాల రచనలో కూడా అపారమైన అనుభవం కలవాడు. నువ్వు అతడికి ఏ మాత్రం తీసిపోయినవాడివి కాదు కానీ అతడికున్న అనుభవం అపారమైనది" అని చెప్పాడు. అభిమన్యుడు చిరునవ్వు నవ్వి, "సుమిత్రా! నేను శ్రీకృష్ణుడికి మేనల్లుణ్ణి! అర్జునుడికి పుత్రుణ్ణి! ఇంతకంటే ఇంకేమి అర్హత కావాలి? ఈ శత్రువులెవ్వరికీ నాలో పదహారవవంతు శక్తి కూడా లేదు. ఇంకేమీ సందేహించకు! ద్రోణుడివైపు యుద్ధాన్ని నడుపు!" అని తొందరపెట్టాడు. అతడి వెన్నంటి పాండవయోధులందరూ రాసాగారు.

అందమైన, బలమైన గుర్రాలను పూన్చిన అభిమన్యుడి రథం వేగంగా రావడం చూడడంతోనే కౌరవులు బేజారైపోసాగారు. "అభిమన్యుడు వచ్చేస్తున్నాడు. వచ్చేస్తున్నాడు!" అన్న అరుపులు మిన్నుముట్టాయి. "ఇతడు అర్జునుడికన్నా బలవంతుడు!" అంటూ కౌరవసైన్యాలు పారిపోవడం మొదలుపెట్టాయి. కొదమసింహం ఏనుగుల గుంపును తరిమినట్టు అభిమన్యుడు కౌరవసైన్యం మీదకు ఉరికాడు. అభిమన్యుడి బాణాల దెబ్బకు కౌరవసైన్యం చిందరవందరైపోసాగింది. వ్యూహాన్ని ఎక్కడ దెబ్బతీస్తే అది చీలిపోతుందో తెలిసిన అభిమన్యుడు త్వరలోనే వ్యూహాన్ని చీల్చి లోపలకు దారిచేశాడు. ద్రోణుడు అన్నివిధాలా అభిమన్యుణ్ణి నిలువరించడానికి ప్రయత్నించినా ఏమీ లాభం లేకపోయింది. అభిమన్యుడు రథంతో లోపలికి ప్రవేశించగలిగాడు. అయితే మిగిలిన పాండవయోధులు లోనికి రాకుండా సింధురాజైన జయద్రథుడు (సైంధవుడు) అడ్డుపడి, విజయవంతంగా ఆ దారిని మూసివేసి, వ్యూహాన్ని కాపాడాడు. అప్పటికే లోపలికి చేరిన అభిమన్యుడు ఏకాకి అయ్యాడు. అక్కడ నుంచి అతడికి బయటపడే విధానం తెలియదు.

ఇక కౌరవులందరూ అతడి మీదకు మూకుమ్మడిగా దాడి చేశారు. అయితే పురుగులు కార్చిచ్చులో మాడిపోయినట్టు కౌరవసైన్యం నేలకూలసాగింది. హోమపీఠం మీద చెల్లాచెదరుగా పడిన దర్భలలాగా కౌరవసైనికుల శవాలు యుద్ధభూమి అంతటా చెల్లాచెదరుగా పడ్డాయి. ఎటుచూసినా ధనుస్సులు, బాణాలు, భల్లాలు, గొడ్డళ్ళు, గదలు, మనుష్యుల తలలతో పాటు కనిపిస్తున్నాయి. ఇది చూసి సహించలేని దుర్యోధనుడు తానే నేరుగా అభిమన్యుడి మీదకు యుద్ధానికి వచ్చాడు. అభిమన్యుడు అమితమైన ప్రతాపంతో అతణ్ణి నానారకాలుగా హింసించసాగాడు. ఇది చూసి ద్రోణుడు ఆందోళన చెంది, అనేకమంది యోధులను అభిమన్యుడి మీదకు పంపాడు. వారు అతికష్టం మీద దుర్యోధనుణ్ణి కాపాడారు. దుర్యోధనుడు తప్పించుకున్నాడన్న కోపంతో అభిమన్యుడు తన శక్తినంతా వారిమీద ప్రయోగించాడు. వారి కవచాల సందులలో బాణాలతో కొట్టి వారినందరినీ తీవ్రంగా బాధించడంతో వారందరూ చెల్లాచెదరై పారిపోయారు.

మళ్ళీ అనేకమంది కౌరవయోధులు ఒక్కసారిగా అభిమన్యుడి మీద దాడి చేశారు. ఒకరి మీద ఒకరు మాత్రమే దాడి చేయవలసిన ఆ ధర్మయుద్ధంలో సిగ్గు, మర్యాద విడిచి అన్ని వైపులనుంచీ అతణ్ణి చుట్టుముట్టి బాణాలతో కొట్టసాగారు. సముద్రపు అలలు అన్నివైపులనుంచీ ఢీకొడుతున్నప్పటికీ కదలని గండ్రశిలలాగా అభిమన్యుడు వారినందరినీ నిలువరించాడు. ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు, శకుని, శల్యుడు, ఇతర యోధులు తమతమ రథాలతో, అన్ని రకాల

ఆయుధాలతో అభిమన్యుడిమీద దాడి చేశారు. అయితే అభిమన్యుడి బాణాల దెబ్బకు చెల్లాచెదరైపోయారు. ఆపైన జరిగిన యుద్ధంలో అస్మాకుడనే యోధుణ్ణి అభిమన్యుడు మట్టుబెట్టాడు. కర్ణుడి కవచాన్ని పగులగొట్టడంతో అతడు పక్కకు తప్పుకున్నాడు. శల్యుడు అమితంగా గాయపడి, కదలలేని స్థితిలో రథంలోనే కూలబడ్డాడు. ఇది చూసి, శల్యుడి తమ్ముడు అమితమైన కోపంతో వచ్చి, అభిమన్యుడి చేతిలో నిహతుడయ్యాడు. ఆ విధంగా అసహాయశూరుడైన అభిమన్యుడు అనేకమంది కౌరవయోధులను మట్టికరిపించాడు. ఇది చూసి ద్రోణాచార్యుడి కళ్ళు ఆనందబాష్పాలతో నిండాయి. అతడు ప్రక్కనున్న కృపాచార్యుడితో, "కుర్రవాడైన ఈ అభిమన్యుడికి సాటిరాగల యోధుడు ఈ ప్రపంచంలో ఉన్నాడా!" అన్నాడు. ఇది విన్న దుర్యోధనుడు కోపాన్ని ఆపుకోలేక, "ద్రోణాచార్యా! మీకు అర్జునుడంటే పక్షపాతం. అందుకనే అభిమన్యుణ్ణి కూడా చూసీచూడనట్టు వదిలిపెడుతున్నారు! అతనితో పోరాడడానికి బదులు అతణ్ణే పొగుడుతున్నారు. మీరే తలచుకుంటే అతణ్ణి సంహరించడానికి ఎంతో సమయం పట్టదు కదా!" అన్నాడు.

ఇది చూసి కౌరవవీరులందరూ మరొకసారి అభిమన్యుడి మీదకు దండెత్తారు. ముందుగా దుశ్శాసనుడు, "ఈ మొండివాణ్ణి నేను చంపుతాను!" అంటూ తన రథాన్ని ముందుకు దూకించాడు. వారిద్దరూ తమ రథాలు చిత్రవిచిత్రగతులలో తిరుగుతూండగా, ఘోరమైన యుద్ధం చేశారు. అభిమన్యుడు విడిచిన బాణాలకు దుశ్శాసనుడు తన రథంలో స్పృహతప్పి పడిపోయాడు. అతడి రథసారథి అక్కడ నుంచి రథాన్ని తప్పించి దుశ్శాసనుణ్ణి రక్షించాడు. ఆపైన కర్ణుడు వచ్చి మరొకసారి యుద్ధానికి దిగాడు. కర్ణుడు విడిచిన బాణాలు అభిమన్యుణ్ణి ఎంతో బాధించాయి. అయితే అభిమన్యుడు ఒక వాడియైన బాణంతో కర్ణుడి విల్లును విరిచాడు. ఆపైన ఎంత వేగంగా, నేర్పుగా బాణాలు విడిచాడంటే కర్ణుడు వాటి ధాటికి తట్టుకోలేక తన తోటియోధులతో కలసి పారిపోయాడు. ఇది చూసి కౌరవసైన్యానికి గుండెజారిపోయింది. ఎవరికివారు పారిపోసాగారు. ద్రోణుడు ఎంత వారించినా ఎవరూ వినడం లేదు. ఇక ధైర్యంచేసి నిలబడ్డవారిని అభిమన్యుడు యమపురికి పంపాడు. నదులన్నీ సముద్రంలో లయమైపోయినట్టు, అతడి మీదకు వెళ్ళిన సైన్యాలు అదృశ్యమైపోయాయి.

కానీ ఇంత ఘోరమైన యుద్ధం పద్మవ్యూహం లోపల జరుగుతున్నా, పాండవవీరులెవ్వరూ ఆ వ్యూహాన్ని ఛేదించుకుని లోపలకు రాలేకపోయారు. వారు బయటనే యుద్ధం చేస్తూ ఉండవలసి వచ్చింది. ఇలా కౌరవసైన్యం నాశనమవ్వడం చూసి దుర్యోధనుడి పుత్రుడైన లక్ష్మణుడు అభిమన్యుడి మీదకు యుద్ధానికి వచ్చాడు. అది చూసి కౌరవసేనలు మళ్ళీ మరొకసారి అభిమన్యుడి

మీద దాడి చేశాయి. అయితే వారు విడిచిన బాణాలు పర్వతం మీద కురిసే వానలాగా అభిమన్యుణ్ణి ఏమీ చేయలేకపోయాయి. అభిమన్యుడు విడిచిన బాణం అప్పుడే కుబుసం విడిచిన త్రాచుపాములాగా వచ్చి లక్ష్మణుణ్ణి నేలకూల్చింది. ఆ యువకుడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఇది చూసి కౌరవసైన్యం దుఃఖంలో మునిగింది.

దుర్యోధనుడు పట్టలేని కోపంతో, "ఇక వీడికి కాలం మూడింది!" అని గర్జించాడు. దుర్యోధనుడితో పాటు ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, అశ్వత్థామ, బృహద్బలుడు, కృతవర్మ అనే ఆరుగురు కాకలుతీరిన యోధులు అభిమన్యుడి మీదకు ఏకకాలంలో దాడిచేశారు. ద్రోణుడు కర్ణుడితో, "ఈ యువకుడి కవచాన్ని పగులగొట్టడం సాధ్యమయ్యే పని కాదు! ముందు అతడి గుర్రాల పగ్గాలను తెగగొట్టు! ఆ తర్వాత వెనుక నుండి దాడి చెయ్యి!" అని చెప్పాడు. కర్ణుడు వెనుకనుండి దాడిచేసి అభిమన్యుడి విల్లును విరిచాడు. మిగిలినవారు అతడి రథసారథిని చంపి, గుర్రాలనూ, రథాన్నీ నాశనం చేశారు.

ఆ విధంగా రథాన్ని కోల్పోయిన అభిమన్యుడు కత్తి, డాలు తీసుకుని నేలమీదకు దిగాడు. కత్తి తిప్పుతూ తన మీదకు వస్తున్న వారందరినీ హతమార్చసాగాడు. యుద్ధంలో వెన్నుచూపని క్షత్రియధర్మం మూర్తీభవించిన ఆ యువకుడు నేలమీద నిలబడినట్టు కాక, గాలిలో ఎగురుతున్నట్టుగా కత్తి తిప్పుతున్నాడు. ద్రోణుడు వదిలిన బాణం అభిమన్యుడి కత్తిని విరిచింది. అభిమన్యుడు నేలమీదకు వంగి ఒక



రథచక్రాన్ని తీసుకుని దానిని గాలిలో గిరగిరా తిప్పుతూ, శత్రువులనందరినీ నిలబెట్టాడు. కానీ మూకుమ్మడిగా దాడి చేస్తున్న కౌరవవీరులు ఆ రథచక్రాన్ని కూడా విరిచారు. దుశ్శాసనుడి కొడుకు తన గద తీసుకుని అభిమన్యుడితో యుద్ధానికి దిగాడు. అభిమన్యుడు కూడా అతడితో తలపడ్డాడు. ఇద్దరూ ఘోరంగా యుద్ధం చేస్తూ, నేలమీద పడిపోయారు. అయితే ఈసారి అభిమన్యుడు పైకిలేచే లోపలే దుశ్శాసనుడి కొడుకు పైకి లేచి, గదతో మోది అభిమన్యుణ్ణి చంపేశాడు.

ఈ యుద్ధం ఎలా జరుగుతున్నదో ధృతరాష్ట్రుడికి వివరిస్తున్న సంజయుడు, "చిన్న కలువకొలనులో పెద్ద ఏనుగు దిగితే ఏ విధంగా ఆ కొలనును కల్లోలం చేస్తుందో ఆ విధంగా అభిమన్యుడు కౌరవసేనలను నాశనం చేశాడు. అటువంటి మహావీరుణ్ణి కౌరవులందరూ కలిసి, ఒక్కడి మీద అనేకులు మూకుమ్మడిగా దాడిచేసి అధర్మయుద్ధంలో చంపారు. అలా చంపిన తర్వాత ఆటవికులలాగా అతడి మృతదేహం చుట్టూ పైశాచికంగా నృత్యం చేశారు. ఆఖరికి మన సేనలోని మంచివారు కూడా బాధతో కన్నీరు పెట్టకుండా ఉండలేకపోయారు. చివరికి ఆకాశంలో ఎగురుతున్న రాబందుల అరుపులు కూడా, "ఘోరం, ఘోరం!" అన్నట్టు వినిపించాయి" అని చెప్పాడు. ఆ విధంగా నల్లని మబ్బుమీద మెరిసిన మెరుపులాగా మహాభారతంలో అద్భుతంగా ఒక వెలుగు వెలిగిన అభిమన్యుడి జీవితం ముగిసింది.

అభిమన్యుడు ఒక నిజమైన సైనికుడిలాగా ప్రవర్తించాడు. కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలిచాడు. ధర్మయుద్ధానికి కట్టుబడి, ఎటువంటి అధర్మానికీ పాల్పడకుండా యుద్ధం చేశాడు. తనకు నిర్దేశించిన పని ప్రమాదభరితమైనదని తెలిసినప్పటికీ దానిని చేయకుండా ఉండాలనుకోలేదు, చావుకు భయపడలేదు. తన చివరి రక్తపుబొట్టు వరకూ చేతికి దొరికిన ఆయుధంతో శత్రువులపై దాడి కొనసాగించాడు.

అక్బర్ పాదుషా మహాభారత కథ విన్న తర్వాత, దీనిలో ఎవరు మీకు నచ్చారని అడిగినపుడు, "ఏక్ బుడ్డా ఔర్ ఏక్ లడకా!" (ఒక వృద్ధుడు – ఒక బాలుడు!) అని చెప్పాడట. ఆ బుడ్డా–లడకాలు మరెవరో కాదు – ఆ వృద్ధుడే భీష్ముడు, ఆ బాలుడే అభిమన్యుడు!

సమాజంలో మనుష్యులందరూ అభిమన్యుణ్ణి ఆదర్శంగా తీసుకుని సైనికులలాగా ప్రవర్తించాలి. ఏ క్షణంలోనైనా సరే తమ ప్రాణం పోవచ్చునని తెలిసినప్పటికీ సైనికులు భయపడరు కదా! దేశ సరిహద్దులలో నిలిచిన సైనికులు భయపడి పారిపోతే దానివల్ల దేశప్రజలందరూ నష్టపోతారు. ఆ సైనికులు భయం లేకుండా పోరాడాలని మనం కోరుకుంటాము. కానీ ఈ నిర్భయత్వం ఒక్క



సైనికులకే పరిమితం కాకూడదు. దేశంలోని వారందరూ కూడా అటువంటి ప్రవర్తననే చూపించాలి. తాము చేసే పనిని భయం లేకుండా, ధర్మబద్ధంగా చెయ్యాలి. అవినీతికీ, ప్రలోభాలకూ లొంగిపోకూడదు. అందరూ అవినీతికి పాల్పడుతున్నారు కదా నేనెందుకు చేతులు కట్టుకుని కూర్చోవాలి అని మాట్లాడేవారు, దేశ సరిహద్దుల్లో ఉండే సైనికులు కూడా అదే మాట అనుకుంటే ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించాలి. మన బిడ్డలు జీవించబోయే ప్రపంచం మనం జీవించినదానికన్నా మెరుగ్గా ఉండాలని మనం కోరుకుంటాము. అయితే దాన్ని తీర్చిదిద్దేది మన ప్రస్తుత ప్రవర్తనే అని మనం మరచిపోకూడదు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 18. ద్రోణుడు - ద్రుపదుడు

వీరిద్దరూ మహాభారతంలో మనకు తారసపడే పాత్రలు. మనం జీవితంలో ద్వేషం, కోపం, కసి మొదలైనవాటిని పెంచుకుంటే అవి ఎలా మనకు హాని చేస్తాయో వీరి చరిత్ర ద్వారా చూడవచ్చు. ద్రోణుడు పాండవులకు, కౌరవులకు ధనుర్విద్య నేర్పిన గురువు. ద్రుపదుడు పాండవుల పట్టమహిషి ద్రౌపది తండ్రి.

భరద్వాజుడనే పేరుగల మహర్షికి పాంచాలుడనే రాజు స్నేహితుడు. ద్రోణుడు భరద్వాజుడి పుత్రుడు. ద్రుపదుడు పాంచాలరాజు కుమారుడు. ద్రుపదుడు, ద్రోణుడు సహవిద్యార్థులుగా భరద్వాజుడి వద్ద విద్యను అభ్యసించడంతో పాటు ప్రాణస్నేహితులయ్యారు కూడా. వారి మైత్రి ఎంత బలమైనదంటే, ద్రుపదుడు తాను రాజునయితే ద్రోణుడికి అర్ధరాజ్యం ఇస్తానని మాటిమాటికీ అంటూ ఉండేవాడు. వేదవేదాంగాలలో పండితుడైన తర్వాత ద్రోణుడు ధనుర్విద్యలో కూడా గొప్ప ప్రావీణ్యత సాధించాడు.

చదువు పూర్తయిన తర్వాత ఇద్దరు మిత్రులూ ఎవరి దోవన వారు వెళ్ళారు. ద్రోణుడు కృపాచార్యుడి చెల్లెలిని వివాహం చేసుకున్నాడు. వారికి అశ్వత్థామ అనే పుత్రుడు కలిగాడు. భార్యాపుత్రులంటే ద్రోణునికి విపరీతమైన మమకారం. అంతవరకూ సంపదలను ఏమాత్రం లెక్కచెయ్యని ద్రోణుడికి, కుటుంబాన్ని పోషించడం కోసం ధనం కావలసివచ్చింది. అంతేకాక, ద్రోణుడికి తన భార్యాబిడ్డలపట్ల ఉన్న మితిమీరిన అనురాగమే అతడికి జీవితంలో అనేక కష్టాలను కొనితెచ్చింది.

అదే సమయంలో పరశురాముడు గొప్పగొప్ప దానాలు చేస్తున్నాడని విని ద్రోణుడు ఆయన వద్దకు వెళ్ళాడు. అయితే అప్పటికే పరశురాముడు అన్నీ దానం చేసేసి, తపస్సు చేసుకోవడానికి అడవికి వెళ్ళబోతున్నాడు. అయితే ద్రోణుడికి ఏదో ఒకటి ఇవాలన్న కోరికతో పరశురాముడు, "నీకు ధనుర్విద్యలో నాకు తెలిసిన మెళకువలు, వివిధ అస్త్రాలను ప్రయోగించడం నేర్పుతాను. నేర్చుకో!" అని చెప్పాడు. ద్రోణుడు ఈ విద్యాదానాన్ని స్వీకరించడానికి సంతోషంతో అంగీకరించాడు. అప్పటికే అతడు గొప్ప విలుకాడు. ఇక పరశురాముడు నేర్పిన విద్యతో అసమానమైన ప్రతిభను కనపరచసాగాడు. అటువంటి గురువును ఏ రాజవంశపు వారైనా తమ బిడ్డలకు విలువిద్య నేర్పమని సంతోషంగా ఆహ్వానిస్తారు కదా!

ఈ లోపల ద్రుపదుడు పాంచాలరాజ్యానికి రాజు అయ్యాడు. ద్రోణుడుకి విలువిద్య అయితే దానంగా లభించింది కానీ ధనం లభించలేదు. అప్పుడు తన చిన్ననాటి మిత్రుడయిన ద్రుపదుడు గుర్తుకు వచ్చాడు. అతడితో తన చనువునూ, ఆప్యాయతనూ గుర్తుకు తెచ్చుకుని, అతడు తనకు అర్ధరాజ్యం ఇవ్వకపోయినా

కనీసం ఎంతోకొంత సహాయం చేస్తాడని భావించి ద్రోణుడు అతడి దగ్గరకు వెళ్ళాడు. అయితే ద్రోణుడికి అక్కడ తనతో కలసి చదువుకున్న సహవిద్యార్థి కాక, ఒక “మహారాజు” కనిపించాడు. ద్రోణుడు తనను తాను ద్రుపదుడికి చిన్ననాటి స్నేహితుడుగా పరిచయం చేసుకున్నప్పుడు, గర్వంతో కళ్ళు నెత్తికెక్కిన ద్రుపదుడు సంతోషించడానికి బదులు, “ఓ బ్రాహ్మణుడా! నన్ను స్నేహితుడని పలకరించడానికి నీకు ఎంత ధైర్యం? సింహాసనాన్ని అధిష్ఠించిన ఒక మహారాజుకీ, దేశదిమ్మరి అయిన నీవంటి బిచ్చగాడికీ పోలికెక్కడ? ఎప్పుడో కలిగిన పరిచయాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక మహారాజుకు స్నేహితుణ్ణని చెప్పుకోవడం ఎంత తెలివితక్కువతనం? స్నేహం అనేది సమ-ఉజ్జీల మధ్యనే ఉంటుందని నీకు తెలియదా? దేశాలు పట్టి తిరిగే బిచ్చగాడు ఒక మహారాజుకి ఎప్పటికీ స్నేహితుడు కాలేడు!” అని ద్రోణుణ్ణి ఛీత్కరించాడు.

దీనితో ద్రోణుడి హృదయం ముక్కలైంది. అమితమైన కోపం వచ్చింది. నిండుసభలో జరిగిన ఈ అవమానానికీ, చిన్ననాటి బాసలను తృణీకరించి నందుకూ ద్రుపదుడికి తగిన బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

అధికారం, ధనం, పేరుప్రఖ్యాతులూ మనిషి కళ్ళు మూసుకుపోయేలా చేస్తాయి. ద్రుపదుడే ఇందుకు ఉదాహరణ. ద్వేషం దానికి రెండురెట్లు ద్వేషాన్ని తెచ్చిపెడుతుందని వివేకానంద స్వామి చెప్పారు కదా! ద్రుపదుడు చూపిన ద్వేషానికి కారణం ఏదైనా అది ద్రోణుడిలో అంతకంత ద్వేషాన్ని రగిలించింది. చివరకు అది వారిద్దరి నాశనానికీ దారితీసింది. వారు తమ జీవితమంతా ఒకరినొకరు ఎలా నాశనం చెయ్యాలా అన్న ఆలోచనతోనే గడిపారు. అలా ఇతరుల నాశనం కోరే ఆలోచన, అలా ఆలోచించిన వారినే నాశనం చేస్తుందన్నది ఒక కఠోరమైన సత్యం!

ఇలా తిరస్కారానికి గురైన ద్రోణుడు, ద్రుపదుడి సామ్రాజ్యాన్ని వదలిపెట్టి హస్తినాపురానికి వెళ్ళి తన బావ అయిన కృపాచార్యుడి ఇంటిలో కొన్ని రోజులు ఉన్నాడు. ఒకరోజు హస్తినాపుర రాజకుమారులందరూ ఊరి శివార్లలో ఆడుకుంటున్నారు. వారి బంతి ఒక బావిలో పడిపోయింది. ఆ బంతిని పైకితీసే ప్రయత్నంలో ధర్మరాజు ఉంగరం కూడా అందులోనే పడిపోయింది. రాజకుమారులందరూ ఆ బావి చుట్టూచేరి చూడసాగారు. స్వచ్ఛమైన నీటిలో ఆ ఉంగరం మెరుస్తూ కనిపిస్తోంది. ఆ వస్తువులను ఎలా బయటికి తియ్యాలో రాజకుమారులకు అర్థం కాలేదు. వారి వెనుక నిలబడి, నల్లని శరీరఛాయ కలిగిన ఒక బ్రాహ్మణుడు చిరునవ్వు నవ్వుతూ ఉండడం వారు చూడలేదు.

"రాజకుమారులారా! భరతవంశంలో పుట్టిన ధీరులైన రాకుమారులు మీరు! ఆయుధాల ప్రయోగంలో నేర్పరి అయినవాడు ఎవడైనా ఈ పాటికి ఆ వస్తువుల్ని బయటకు తీసి ఉండేవాడే కదా. నన్ను వాటిని బయటకు తీసిపెట్టమంటారా?" అని ద్రోణుడు వారిని అడిగాడు.

యుధిష్ఠిరుడు నవ్వుతూ, "స్వామీ! మీరు కనుక ఆ బంతిని తీసి పెడితే, కృపాచార్యులవారి ఇంటిలో మీకు విందుభోజనం ఏర్పాటు చేయిస్తాను!" అన్నాడు. ద్రోణుడు ఒక గడ్డిపరకను తీసి సరిచేసి, ఏదో మంత్రం చదివి, దాన్ని ఆ బంతికేసి విసిరాడు. అది బంతిలో గుచ్చుకుంది. అలా చాలా గడ్డిపోచలను విసిరాడు. అవి ఒకదాని చివర ఒకటి గుచ్చుకుని ఒక తాడులా తయారయ్యాయి. వాటిని లాగి ద్రోణుడు బంతిని బయటకు తీశాడు.

ఇది చూసి ఆశ్చర్యంలో మునిగిపోయిన రాకుమారులు, "స్వామీ! ఆ ఉంగరాన్ని కూడా బయటకు తీయండి!" అని ద్రోణుణ్ణి కోరారు. ద్రోణుడు ఒక విల్లును తీసుకుని, బాణాన్ని నారికి సంధించి వదిలాడు. అది ఉంగరాన్ని తీసుకుని నీటిలోనుంచి బయటకు వచ్చిపడింది. ద్రోణుడు ఆ ఉంగరాన్ని తీసి చిరునవ్వుతో ధర్మరాజుకు అందించాడు.


ద్రోణుడు చేసిన ఈ అద్భుతకృత్యాలతో అబ్బురపడిన రాకుమారులు, "స్వామీ! మీకు నమస్కారాలు! మీరెవరు? మీకు మేము ఎలా సేవచేయగలం?" అని అడిగారు. ద్రోణుడు వారితో, "నాయనలారా! మీరు మీ తాతగారైన భీష్ముణ్ణి అడిగితే నేనెవరో తెలుస్తుంది!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాకుమారులందరూ పరుగెత్తిపోయి జరిగిన సంగతంతా భీష్ముడితో చెప్పారు. వారి వర్ణనలను బట్టి ఆ వచ్చినది ద్రోణుడని భీష్ముడు కనిపెట్టాడు. కౌరవపాండవులకు యుద్ధవిద్యలను నేర్పడానికి ఉత్తముడైన గురువు ద్రోణుడేనని భీష్ముడు నిర్ణయించి, అతణ్ణి ఎంతో మర్యాదగా పిలిపించి రాకుమారులకు యుద్ధవిద్యలను నేర్పే బాధ్యతను ఆయనకు అప్పగించాడు.

ఆయన శిష్యరికంలో కౌరవులు, పాండవులు అన్ని యుద్ధవిద్యలలో ఆరితేరారు. ద్రోణుడు వీరిని ఉపయోగించి చిరకాలంగా తన మనస్సులో రగులుతున్న పగను తీర్చుకోవాలనీ, ద్రుపదుడికి తగిన గుణపాఠం నేర్పాలనీ అనుకున్నాడు. ద్రోణుడు దుర్యోధనుణ్ణీ, కర్ణుణ్ణీ పిలిచి, తన గురుదక్షిణగా ద్రుపదుణ్ణి ఓడించి పట్టితెమ్మని పంపాడు. కానీ ద్రుపదుడు పరాక్రమంలో తక్కువవాడు కాదు. అందువలన వారు ద్రుపదుణ్ణి ఓడించలేకపోయారు. ద్రోణుడు అదే పనిమీద అర్జునుణ్ణి పంపాడు. అర్జునుడు ద్రుపదుణ్ణి ఓడించి, కట్టితెచ్చి, ద్రోణుడి ముందు పడవేశాడు. ద్రోణుడు ద్రుపదుడి కట్లు విప్పి, అతణ్ణి చూసి చిరునవ్వు నవ్వుతూ, "ఓ మహారాజా! నీకు

ప్రాణభయమేమీ లేదులే! మనం చిన్నతనంలో స్నేహితులమైనప్పటికీ నువ్వు అది మరచిపోయినట్టు నటించి, నన్ను అవమానించావు. ఒక రాజు మాత్రమే మరొకరాజుకు తగిన స్నేహితుడు కాగలడని అన్నావు కదా! నీ రాజ్యాన్ని చేజిక్కించుకున్నాను కాబట్టి ఇప్పుడు నేనూ మహారాజునే. అయినా ఇప్పటికీ నేను నీతో స్నేహాన్నే కోరుతున్నాను. అంతేకాక ఈ రాజ్యంలో నీకు అర్ధరాజ్యాన్ని ఇస్తున్నాను. దానితో మనమిద్దరమూ సమమవుతాము కాబట్టి ఇక మనం మళ్ళీ స్నేహితులు కావచ్చు" అని చెప్పాడు. ఆపైన ద్రుపదుణ్ణి విడుదల చేసి మర్యాదగా సాగనంపాడు.

ద్రుపదుడికి ఈ మాత్రం శాస్తి జరగాలనీ, దీనితో వారిద్దరి మధ్య వైరం తీరిపోతుందనీ ద్రోణుడు అనుకున్నాడు.



కానీ ప్రతీకారం తీర్చుకోవడం వల్ల ద్వేషం ఎన్నటికీ చల్లారదు. ద్వేషం అంటే రెండింతలు విషం అని అర్థం. దెబ్బతిన్న అహంకారం కన్నా బాధ కలిగించేది ఈ ప్రపంచంలో మరొకటి లేదు. అందువలన ద్రుపదుడి జీవితంలో ద్రోణుడి మీద పగతీర్చుకోవడమే అతిముఖ్యమైన లక్ష్యంగా తయారైంది. ద్రుపదుడు ఇందుకోసం గొప్ప తపస్సు చేసి, ఉపవాసాలుండి, ద్రోణుణ్ణి తునుమాడేందుకు ఒక కుమారుడు కావాలనీ, అర్జునుణ్ణి పెళ్ళాడే ఒక కుమార్తె కావాలనీ యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞఫలంగా ధృష్టద్యుమ్నుడు అనే కుమారుడూ, ద్రౌపది అనే కుమార్తె జన్మించారు. ద్రౌపదీ స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని అర్జునుడు ఛేదించాడు. అందువలన ద్రౌపది పంచ పాండవులకు భార్య అయింది.

పాండవులు మాయాజూదంలో ఓడిపోయి అడవికి వెళ్ళారు. పాండవులు అడవికి వెళ్ళవలసివచ్చినందుకు ప్రజలందరూ ఎంతో దుఃఖించి, కౌరవుల లోభం, అసూయల వల్లనే ఇలా జరిగిందని వారిని తిట్టిపోశారు. అదే సమయానికి నారదమహర్షి కూడా వచ్చి పదమూడు సంవత్సరాలు ముగియడంతోనే కౌరవుల అంతం తప్పదని హెచ్చరించి వెళ్ళిపోయాడు. ఇది విని దుర్యోధనాదులు భయపడి, ద్రోణుడి వద్దకు వచ్చి, తమను విడిచిపోవద్దని ప్రార్థించారు. ద్రోణుడు విషాదంగా నవ్వి, “జ్ఞానులైనవారు చెపుతున్నట్టు పాండవుల వైపే ధర్మం ఉందని నేను కూడా నమ్ముతున్నాను. కానీ ధృతరాష్ట్రుడి పుత్రులైన మీవైపు ఉండి పోరాడడమే నా కర్తవ్యం. ఎందుకంటే నేను మీ ఉప్పు తిన్నాను కనుక. నేను మీకోసం శక్తివంచన లేకుండా పోరాడతాను. కానీ విధి బలీయమైనది. పాండవులు కోపంతో లోలోన కుతకుతలాడుతున్నారు కాబట్టి వారు తిరిగివచ్చిన తర్వాత యుద్ధం ఎలాగూ తప్పదు. జయాపజయాలు దైవాధీనాలు. కోపం వల్ల ఎటువంటి చెడు ఫలితాలు కలుగుతాయో నాకన్నా ఎక్కువ తెలిసినవాడు మరొకడు ఉండడు. ఎందుకంటే నేను కోపం కొద్దీ ద్రుపదుణ్ణి పదవీచ్యుతుణ్ణి చేశాను. అతడు నన్ను చంపే శక్తిగల కొడుకు కోసం తపస్సు చేసి ధృష్టద్యుమ్నుణ్ణి కన్నాడు. వాడు ఇప్పుడు పాండవులకు బావ అయ్యాడు. చూడబోతే పరిస్థితులన్నీ విధిని అనుసరించి ఒకదానికొకటి తోడవుతూ, మీ నాశనానికి దారితీస్తున్నట్టు కనిపిస్తున్నాయి. మీరు చేస్తున్న తెలివితక్కువ పనులు కూడా అదే దిక్కుకు దారితీస్తున్నాయి. మీకు రోజులు దగ్గర పడ్డాయి. ఈ పదమూడు సంవత్సరాలలో మీరు చేసే పుణ్యకార్యాలు, దానధర్మాలు ఏమయినా ఉంటే త్వరగా చెయ్యండి. ఏది ఏమయినా, దుర్యోధనా! ధర్మరాజుతో మైత్రి చేసుకోమన్నదే నేను నీకిచ్చే సలహా. అయితే నా హితవు నీ చెవికెక్కదని నాకు బాగా తెలుసు!” అన్నాడు.

మహాభారతం చాలా పురాతనమైన కథ. సాధారణ మానవుల నైజం ఎలా ఉంటుందో ఇందులో మనం చూడవచ్చు. మరొకప్రక్క అత్యున్నతమైన పరిణతి సాధించిన మానవులు ఎలా ప్రవర్తిస్తారో కూడా మనం ఇందులో తెలుసుకోవచ్చు. ఆనాటికీ ఈనాటికీ మానవనైజంలో ఏ మార్పూ లేదు కాబట్టి మనం ఈ కథనుంచి నేర్చుకోవలసిన పాఠాలు చాలానే ఉన్నాయి. ఈనాటికీ క్రోధం అనేది మానవజాతిని పట్టి పీడిస్తూనే ఉన్నది. దానికి వయస్సుతోనూ, పరిస్థితులతోనూ సంబంధం లేదు. అది స్త్రీలా, పురుషులా అన్న తేడాను చూడదు. మనం ద్రోణుడు-ద్రుపదుడు కథను చదివి, కోపం వల్ల, పగ వల్ల కలిగే అనర్థాలను అర్థం చేసుకుని, మనకే ఎప్పుడైనా కోపం వచ్చినపుడు దీనిని గుర్తుకు తెచ్చుకుంటే, తెలివితక్కువతనంతో తప్పులూ, నేరాలూ చేయకుండా అది మనల్ని ఆపుతుంది.

చివరికి అందరూ ఊహించినట్టుగానే కురుక్షేత్రయుద్ధం మొదలైంది. ధర్మరాజు యుద్ధం మొదలు కాబోయే ముందు, భీష్మడి దగ్గరకూ, ద్రోణుడి దగ్గరకూ వెళ్ళి ఆశీర్వచనాలు అందుకున్నాడు. భీష్మద్రోణులు పాండవులకు విజయం కలగాలని ఆశీర్వదించారు. ద్రోణుడు, "నాయనా! ధర్మరాజా! కౌరవుల పట్ల అనివార్యమైన కర్తవ్యం నాకు ఉంది. ధనంకోసం అమ్ముడుపోయి, మా స్వలాభాలకే మేము బానిసలుగా మారాము. నేను కౌరవుల తరఫున యుద్ధం చేయక తప్పదు. కానీ విజయం మిమ్మల్నే వరిస్తుంది!" అని దీవించాడు.

యుద్ధం మొదలైంది. భీష్ముడు ఒకవైపున పాండవ సైన్యాన్ని నాశనం చేస్తుంటే అదే విధంగా ద్రోణుడు కూడా భీకరమైన యుద్ధం చేశాడు. పదవరోజు భీష్ముడు నేలకొరిగిన తర్వాత ద్రోణుణ్ణి సర్వసైన్యాధిపతిని చేశారు. ఐదు రోజులపాటు ద్రోణుడు సర్వసైన్యాధిపతిగా ఉన్నాడు. ఆ అయిదు రోజులలో అతడు ఊహకందని విధంగా పాండవసైన్యాలను హింసించి, మట్టుబెట్టాడు. ఆ యుద్ధంలో ద్రోణుడు ధర్మరాజును పట్టుకోవడానికి విఫలయత్నం చేశాడు. అలాగే పద్మవ్యూహం పన్ని అభిమన్యుడు అందులో చిక్కుకునేలా చేశాడు. మిగిలిన పాండవ యోధులు పద్మవ్యూహంలోనికి చొరబడకుండా జయద్రథుడు (సైంధవుడు) అడ్డుపడి అభిమన్యుడి మృతికి కారణమయ్యాడు. అలా చిక్కుబడిన అభిమన్యుణ్ణి అధర్మయుద్ధంలో చంపినవారిలో ద్రోణుడు కూడా ఉన్నాడు.

ద్రోణుడు కౌరవుల కొలువులో పని చేయడం వలననే, వారు అధర్మమార్గంలో నడుస్తున్నారని తెలిసినా అతడికి వారివైపునే యుద్ధం చేయక తప్పలేదు. ధర్మమార్గంలో నడవాలనుకునేవారికి ఎటువంటి బలహీనతలూ ఉండకూడదు. బలహీనతలే మన చేత అన్ని దుర్మార్గాలనూ చేయిస్తాయి. "బలమే జీవనము, బలహీనతయే మరణము" అని వివేకానంద స్వామి చెప్పారు కదా.

ద్రుపదుడు కూడా మహాభారతయుద్ధంలోనే ద్రోణుడి చేతిలో మరణించాడు. ద్రోణుణ్ణి నిరోధించడం ఎలాగని పాండవులు ఆలోచిస్తూ ఉంటే, ఆయనకు అమంగళకరంగా తోచిన విషయం చెవినబడితే అస్త్రసన్న్యాసం చేస్తాడని శ్రీకృష్ణుడు వారితో చెప్పాడు. యుద్ధంలో 'అశ్వత్థామ' అనే ఏనుగును భీముడు చంపినప్పుడు అందరూ 'అశ్వత్థామ హతః! (అశ్వత్థామ హతుడయ్యాడు!)' అంటూ పదేపదే కేకలు పెట్టసాగారు. ఇది విని ద్రోణుడికి తన ప్రియతముడైన కుమారుడే మరణించాడేమోనన్న అనుమానం కలిగింది. కానీ మహా పరాక్రమవంతుడైన తన కుమారుడు మరణించాడన్న వార్తను ఆయనకు నమ్మబుద్ధి కాలేదు. అయితే ద్రోణుడికి ధర్మరాజు యొక్క సత్యసంధత మీద అపారమైన నమ్మకం. అందువలన పాండవ పక్షపు యోధులు ధర్మరాజును 'అశ్వత్థామ హతః' అని బిగ్గరగా చెప్పమని వత్తిడి చేశారు. చేసేదిలేక ధర్మరాజు కూడా 'అశ్వత్థామ హతః' అని బిగ్గరగా ప్రకటించి, 'కుంజరః' అనే మాటను తర్వాత పలికాడు. ఆ రెండవమాట యుద్ధకోలాహలంలో ఎవరికీ వినిపించలేదు. ధర్మరాజు లాంటివాడు కూడా అదే మాట పలకడంతో ఆ విషయం నిజమేనని నమ్మిన ద్రోణుడు ధనుర్బాణాలు త్యజించి యుద్ధభూమిలోనే యోగముద్రలో కూర్చుని ప్రాణత్యాగానికి సిద్ధమయ్యాడు. కానీ అదే సమయానికి ధృష్టద్యుమ్నుడు కత్తి చేతపట్టి ద్రోణుడి తలను నరకడానికి ముందుకు ఉరికాడు. అందరూ వద్దువద్దు అని వారిస్తున్నా వినకుండా ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి తలను తెగనరికాడు. అలా ద్రోణద్రుపదుల జీవితాలు ముగిశాయి.

వారివారి జీవితకథలు ఎలా పరిణమించినా, ద్రోణుడు, ద్రుపదుడు అతి పరాక్రమవంతులే కాక ధర్మనిష్ఠ కలవారు. కానీ వారికున్న క్రోధం, పగ మొదలైన కొన్ని అవలక్షణాల వలన వారి పతనానికి వారే కారణమయ్యారు. ఇంతేకాక, ప్రాపంచికమైన కోరికలతో ఉంటూ పరిపూర్ణమైన ధార్మికజీవనం గడపాలంటే చాలా కష్టం. ఎక్కడోవొకచోట పొరపాటు జరుగుతుంది. అందుకనే పొరపాట్లు జరుగకుండా ఉండడం కోసం చాలా అప్రమత్తంగా ఉండాలి. తాము చేసే పనుల ఫలితాలను భగవంతుడికి అర్పితంగా చేయాలి. అలా చేసేవారే తక్కువ పొరపాట్లు చేస్తారన్న విషయం మనందరం గుర్తుంచుకోవాలి.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 19. వినాయక వ్రతకథ

వినాయకుడి వ్రతకథను మనం ప్రతి సంవత్సరం వినాయక చవితి రోజు చదివి, విని, ఆనందిస్తూ ఉంటాము. విజన్2020 కాలంలో కూడా ఈ పురాణాలలోని కథలు ఎందుకు అని విస్తుపోయేవారికి వినమ్రంగా తెలియజేసేదేమంటే వ్యక్తిత్వ వికాసానికి, విజయరహస్యాలకు విందు మన పురాణకథలు అని. "భారతదేశంలోని మనుష్యులు అన్ని పనులనూ ధర్మానుసారం చేస్తారు. వివాహం నుంచి దొంగతనం వరకూ అన్నింటినీ ధార్మికంగానే చేస్తారు!" అని వివేకానంద స్వామి చెప్పారు. కాబట్టి ధర్మార్థకామమోక్షాలతో పాటు వ్యక్తిత్వ వికాస సూక్ష్మాలను, విజయరహస్యాలను కూడా మతం ద్వారానే బోధించవచ్చని మన పండుగలు, ఆచారాలు తెలియజేస్తున్నాయి.

పూర్వం ఏనుగు తల, చర్మం గలిగిన గజాసురుడనే రాక్షసుడు ఒకడుండేవాడు. వాడు పరమేశ్వరుని గురించి ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై, "నాయనా! నీ తపస్సుకు మెచ్చాను. నీకేమి వరం కావాలో కోరుకో!" అన్నాడు. గజాసురుడు శివుణ్ణి స్తుతించి, "స్వామీ! నీవు ఎల్లప్పుడూ నా ఉదరంలోనే నివసించాలని నా కోరిక!" అని కోరుకున్నాడు. శివుడు వెంటనే అతడి ఉదరంలో ప్రవేశించి అక్కడే స్థిరంగా ఉండిపోయాడు.

గజాసురుడు రాక్షసుడైనా తాను కోరిన దాని కోసం ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపస్సు ద్వారా ఏది కోరాడో దాన్ని పొందగలిగాడు. కష్టేఫలీ! (కష్టంలోనే ఫలం ఉంటుంది!) శ్రమ చేసినవారెవరైనా దాని ఫలితాన్ని తప్పక పొందుతారు. నిజాయితీతో చేసిన ప్రయత్నాల వలన, కేవలం ప్రాపంచికమైన ఫలితాలే కాదు దైవసాక్షాత్కారాన్ని కూడా పొందవచ్చు. కానీ సమాజశ్రేయస్సును, పారమార్థికమైన పరిపూర్ణతను ఆశించి చేయని శ్రమ పతనాన్నీ, ముప్పునూ తెచ్చిపెడుతుందేకానీ ఉన్నతస్థితులను కలిగించదు. ఘోరతపాన్ని చేసిన రాక్షసుడు చివరకు పరమ శివుణ్ణి కైలాసంనుంచి రప్పించి తన ఉదరంలోనే కట్టడిచేసి ఆయన అనుగ్రహం వేరెవరికీ దక్కకుండా చేయాలని ప్రయత్నించాడు. అంటే కఠోరమైన శ్రమతో పనిచేయడం మంచిదే కానీ దానితోపాటు పనిచేయడం ఎలాగో, దేన్ని లక్ష్యంగా ఉంచుకుని పనిచెయ్యాలో తెలుసుకోవడం మరింత అవసరం. చేసే పనులు మానవుణ్ణి పరిపూర్ణతవైపు నడిపించేవిగా ఉండాలి కానీ, తాత్కాలికమైన సుఖాలను, పేరుప్రతిష్ఠలను మన ఆదర్శంగా పెట్టుకోకూడదు. అంటే మనం చేస్తున్న పనులు ఉన్నతమైన ఆశయాల కోసమేనా, అవి మన హృదయాన్ని పవిత్రంగా చేస్తున్నాయా, మానసిక ప్రశాంతతను, ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయా అనే విషయాలను బేరీజు వేసుకుంటూ పనిచేయడం ద్వారా కర్మలో మర్మాన్ని

అంటే పని చేయడంలోని రహస్యాన్ని తెలుకోగలుగుతాము. పనిచేయడమే మానవ జీవితపరమార్థం కాదు! కర్మల ఆచరణ ద్వారా హృదయంలోని కల్మషాలన్నింటినీ (అంటే చెడుకు దారితీసే భావనలన్నింటినీ) తొలగించుకుని, దాన్ని పవిత్రతతో నింపి, మనోనిగ్రహాన్ని అంటే మనస్సు పరిపరివిధాల పరిగెత్తకుండా నిరోధించడం నేర్చుకోవాలి. గజాసురుడు పరమశివుని పాదపద్మాల మీద కల్మషరహితమైన శుద్ధభక్తినో, లోకానికి హితం చేయమనో, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమనో కోరకుండా, పరమశివుని తన ఉదరంలో ఉండమని కోరడం ద్వారా తన ఉనికికే ముప్పు కొనితెచ్చుకున్నాడు.


శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన ఒక కథ భగవంతుణ్ణి మనం ఏం కోరుకోవాలో చక్కగా వివరిస్తుంది. ఆ కథలో, ఒక బాటసారి ఒక ఎడారిలో ప్రయాణిస్తూ పూర్తిగా అలసిపోయి, అదృష్టవశాత్తూ కల్పవృక్షం క్రిందకు చేరుతాడు. ఆ ఎడారిలో అటువంటివి లభిస్తాయా లేదా అని చూడకుండా మంచి మంచి రుచికరమైన ఆహారపానీయాదులను కోరుకుంటాడు. ఆ చెట్టు కల్పవృక్షం కాబట్టి ఆ కోరికలను క్షణాలలో తీర్చివేస్తుంది. తీరుతున్నాయి కదా అని, ఇంకా పెద్దపెద్ద కోరికలకు తెగబడి, చివరకు తన చపలత్వం వలన ఏదైనా పులి వచ్చి తనను చంపుతుందేమో అని అనుకుని, నిజంగానే పులివాత పడతాడు. (ఒక కథ చెపుతా విను! పేజీ 21)

ఇక తిరిగి కథలోకి వస్తే, కైలాసంలో భర్త కోసం ఎదురుచూస్తున్న పార్వతి ఆయన ఎంతకాలానికీ రాకపోవడంతో తీవ్రమనస్తాపానికి లోనై విష్ణువును ప్రార్థించింది. విష్ణువు దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించి, ఒక పథకాన్ని ఆలోచిస్తాడు. తాను గంగిరెద్దుల్ని ఆడించేవాడి వేషాన్ని ధరించి, శివుడి వాహనమైన నందికి గంగిరెద్దులాగా వేషం వేసి తన పరివారాన్ని మిగిలిన ఆటగాళ్ళుగా తయారుచేసి గజాసురుడి నగరానికి తరలివెళ్ళాడు. అక్కడ ఆటపాటలతో గజాసురుణ్ణి ముగ్ధుణ్ణి చేశాడు. పరమ శివభక్తుడైన గజాసురుడు సంతోషంతో, “నీకు ఏమి కావాలో కోరుకో! ఇస్తాను!” అని పలికాడు. అప్పుడు విష్ణువు అతడితో, “ఓ రాజా! ఇది శివుని వాహనమైన నంది! శివుణ్ణి వెతుకుతూ ఇక్కడికి వచ్చింది. కాబట్టి దానికి శివుణ్ణి ఇవ్వండి!” అని కోరాడు. దీనితో అలా వచ్చినవాడు మహావిష్ణువే అని గజాసురుడు తెలుసుకున్నాడు. తన ఉదరంలోని శివుడితో, “స్వామీ! నాకు రెండు కోరికలున్నాయి. తీర్చండి!” అని కోరాడు. శివుడు కోరుకోమన్నాడు. గజాసురుడు, “స్వామీ! నా శిరస్సును లోకపూజ్యమైనదిగా చెయ్యి! ఆపైన నా చర్మాన్ని నీవు ధరించాలి!” అని వేడుకున్నాడు. శివుడు ఆ వరాలు ఇస్తానన్నాడు. అప్పుడు నంది తన కొమ్ములతో గజాసురుడి ఉదరాన్ని

చీల్చివేశాడు. శివుడు బయటికి వచ్చాడు.

పరమశివుడు కైలాసానికి రానున్నాడని తెలుసుకున్న పార్వతి నలుగుపిండితో ఒక పిల్లవాని బొమ్మను చేసి, దానికి ప్రాణంపోసి, అతనిని తన ఇంటికి ద్వార పాలకుడిగా నియమించి, స్నానం చేయడానికి లోనికి వెళ్ళింది. ఆ బాలకుడికి తిరిగివచ్చిన పరమేశ్వరుడు ఎవరో తెలియలేదు. అందువల్ల లోనికి పోనివ్వకుండా అడ్డుకున్నాడు. దీనితో కోపగించిన శివుడు ఆ బాలకుడి శిరస్సును ఖండించి లోపలికి వెళ్ళాడు. పార్వతీదేవి భర్తకు ఎదురేగి, పూజ చేసి, ప్రియభాషణ లతో ముచ్చటిస్తూ ఉండగా ద్వారపాలకుడి విషయం ప్రస్తావనకు వచ్చింది. జరిగినది తెలుసుకుని పార్వతి కన్నీరుమున్నీరుగా విలపించి, తన బిడ్డను బ్రతికించమని ప్రార్థించింది. అప్పుడు శివుడు తాను తెచ్చిన గజాసురుడి శిరస్సును ఆ బాలకుడి మొండానికి అతికించి, అతడికి గజాననుడు అని నామకరణం చేశాడు. అతడు మహామేధాసంపన్నుడై పెరుగసాగాడు. కొంతకాలానికి పార్వతీపరమేశ్వరులకు కుమారస్వామి జన్మించాడు. ఇతడు మహాబలశాలి కావడం వలన పరమేశ్వరుడు అతణ్ణి దేవసేనానాయకుడిగా నియమించాడు.

ఇలా ఉండగా కార్యాలకు కలిగే విఘ్నాలను అంటే పనులకు వచ్చే అడ్డంకులను తొలగించే ఒక పద్ధతి గురించి దేవతలు ఆలోచించసాగారు. 'శ్రేయాంసి బహు విఘ్నాని' 'మంచి పనులకే హెచ్చు అడ్డంకులు' అని సామెత మనకు తెలుసు. పనులు చేయడానికి తలపెట్టినప్పుడు ఎదురయ్యే విఘ్నాలకు అధిదేవతగా ఒకరిని నియమిస్తే బాగుంటుందనీ, వారిని ముందుగానే



అర్చించడం ద్వారా ఆ విఘ్నాలను తొలగించుకోగలుగుతామనీ, వారు పరమేశ్వరుణ్ణి కోరారు. పరమేశ్వరుడు అందుకు సమ్మతించి, తన కుమారులలో ఒకరిని విఘ్ననాయకుడిగా నియమించాలని నిశ్చయించాడు. ఇది విన్న వెంటనే కుమారస్వామి ఆ పదవిని తనకు ఇవ్వమనీ, తన అన్నగారైన వినాయకుడు మరుగుజ్జువాడు, అసమర్థుడు కనుక తనకే అటువంటి పదవిని నిర్వహించగల సమర్థత ఉందనీ పరమశివుణ్ణి వేడుకున్నాడు.

ఇక్కడ మనం ఒక విషయాన్ని గమనించాలి. దేవతలు కూడా కోరికలకు లోబడినవారే. ఈ విషయాన్ని వివేకానంద స్వామి "మనిషి ఒక్కడే పరిపూర్ణత సాధించగలవాడనీ, చివరకు దేవతలకు కూడా ఆ శక్తి లేదనీ" చెప్పనే చెప్పారు. దేవతలు అప్పటికే చేసుకున్న మంచి పనులవల్ల ఒనగూరిన పుణ్యఫలాన్ని అనుభవిస్తూ ఉంటారే తప్ప తామున్న స్థితినుంచి ఉన్నతమైన స్థితిని పొందాలనుకోరు. ఏ ఉన్నతాశయమూ లేని మనుష్యులకు కూడా ఈ విషయమే వర్తిస్తుంది. ఉన్నతమైన ఆశయం లేకుండా మనం కోరుకునే గొంతెమ్మ కోరికల వలన పై కథలో కుమారస్వామి చేసినట్టు పోటీపడే తత్త్వం పెచ్చురిల్లుతుంది. పోటీతత్త్వం నుంచి అసూయ రూపుదాలుస్తుంది. అసూయ వల్ల వ్యక్తిత్వం పతనమవుతుంది. చివరకు వినాశమే జరుగుతుంది. సృష్టిలో కోరికలను, అహంకారాన్ని అధిగమించి అత్యున్నతమైన స్థాయులకి చేరగలవారు మానవులు ఒక్కరే కాబట్టి అటువంటి అసూయ దరిచేరకుండా మనం జాగ్రత్తపడాలి.

పదవి ఒకటి ప్రకటించబడగానే కుమారస్వామిలోని కోరిక పడగ విప్పింది. అంతేకాక, అది తన అన్నగారైన వినాయకుడితోనే పోటీ పడేటట్లు చేసింది. అంతటితో ఆగక అతణ్ణి మరుగుజ్జు, అసమర్థుడు అని తూలనాడే స్థితికి దిగజార్చింది. ఇది బానిసల లక్షణమే కానీ స్వతంత్రుల లక్షణం కాదు. సేవకుల లక్షణమే కానీ నాయకుల లక్షణం కాదు. "నీవు నాయకుడివి కాదలిస్తే ముందు ఏ దర్పాహంకారాలూ లేని సేవకుడిగా పనిచేయగలగడం నేర్చుకో!" అని వివేకానంద స్వామి చెప్పారు కదా. తన సోదరుడు నాయకుడైతే తాను తన సహకారాన్నంతా అందించినందున కుమారస్వామికి కలిగే నష్టమేమీ లేదు. కానీ మనసులో చెలరేగిన కోరిక, పదవీకాంక్ష తీరవు కదా! అలా అంతా నాకే కావాలని కోరేవారికి విజయం ప్రాప్తిస్తుందా? మరి మన కథ ఈ దృష్టాంతంలో నుంచి ఏమి నీతి చెపుతుందో చూద్దామా?

వారిద్దరికీ మధ్య ఎవరు ఆ పదవికి అర్హులో నిర్ణయించడానికి పరమశివుడు ఒక పోటీని ప్రకటించాడు. "ముల్లోకాలలోని పుణ్యనదులన్నింటిలో స్నానం చేసుకుని మీలో ఎవరు ముందుగా నా దగ్గరకి వస్తారో వారిని విఘ్నాధిపతిని చేస్తాను!"

అన్నాడు. దానికి వారిరువురూ సమ్మతించారు. పోటీకి షరతులు విన్న మరుక్షణం కుమారస్వామి తన నెమలి వాహనాన్ని ఎక్కి రివ్వుమని ఎగిరిపోయాడు. గజాననుడు తాను కూడా తన మూషికవాహనం మీద బయలుదేరబోయి, ఒక్క క్షణం ఆలోచించి, సకలతీర్థస్వరూపులు, ఆదిదంపతులు అయిన తన తల్లిదండ్రులను ఎదురుగా ఉంచుకొని ప్రపంచమంతా తిరిగి రావలసిన పని ఏమిటని అనుకున్నాడు. తన తండ్రి ఎందుకు ఆ పరీక్షను పెట్టాడో అతడికి అర్థమయిపోయింది. తమ్ముడిలాగా పరుగుతీయకుండా, జగతికే మాతాపితరులైన ఉమామహేశ్వరులకు సాగిలపడి భక్తితో నమస్కరించాడు. ఇది చూసిన పార్వతీపరమేశ్వరులు వినాయకుడి బుద్ధికుశలతకు ఎంతో సంతోషించి, అతణ్ణి దీవించారు. గజాననుడికి తల్లిదండ్రుల ఆశీర్వాదబలం చేతనే అన్ని తీర్థాలలోనూ స్నానం చేసిన పుణ్యం లభించింది. కుమారస్వామి చేరుకున్న ప్రతి పుణ్యతీర్థంలోనూ తనకన్నా ముందే వినాయకుడు పుణ్యస్నానం ముగించి వెడుతున్నట్టుగా కనిపించింది. చివరకు తల్లిదండ్రుల వద్దకు చేరిన కుమారస్వామి తనకంటే ముందే వినాయకుడు అక్కడకు చేరి ఉండడం చూసి తన ఓటమిని అంగీకరించాడు. అప్పుడు వినాయకుణ్ణి విఘ్నాలకు ఆధిపత్యాన్ని వహించవలసినదిగా శివుడు నియమించాడు.

కుమారస్వామి నెమలివాహనంతో వేగంగా వెళ్ళగలననుకున్నాడు. కానీ గజాననుడికి భగవంతుని మీద విశ్వాసంతోపాటు తన బుద్ధికుశలత మీద కూడా నమ్మకం ఉన్నది. "విశ్వాసం, విశ్వాసం! మీమీద మీకు విశ్వాసం! విశ్వాసం, భగవంతుడి మీద విశ్వాసం! ఇదే విజయరహస్యం!" అని వివేకానంద స్వామి చెప్పారు కదా! ముందు మన శక్తినంతటినీ వెచ్చించి ప్రయత్నించడం, ఆపై భగవంతుణ్ణి శరణువేడడం – ఇదే విజయాన్ని సాధించడంలోని రహస్యం. ఆఖరికి మనోవైజ్ఞానికపరంగా చూసినా భగవంతుని విశ్వసించడం మంచి ఆరోగ్యానికి దారితీస్తుంది. ఆస్తికులలోనే గుండెపోటు మొదలైన రోగాలు తక్కువ.

ఆ విధంగా గజాననుడు విఘ్నాధిపతి అయ్యాడు. అతడికి విఘ్నేశ్వరుడు, గణపతి అన్న పేర్లు వచ్చాయి. ప్రతి సంవత్సరం వినాయకుని జన్మతిథి అయిన భాద్రపద శుద్ధ చవితి రోజున అన్ని లోకాలవారూ అతడికి పూజలు చేసి నైవేద్యం పెట్టడం ఆనవాయితీ అయింది. ఒకసారి వినాయకచవితినాడు వినాయకుడు కుడుములు మితిమీరి భక్షించి, మరికొన్ని చేతబుచ్చుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చి, వారికి నమస్కారం చేయడానికి ప్రయత్నించి, పొట్ట ఎత్తుగా ఉండడంతో అలా చేయడం కుదరక, కష్టపడసాగాడు. అది చూసి శివుని శిరస్సు మీద ఉన్న చంద్రుడు నవ్వాడు. దానితో రోషం వచ్చిన వినాయకుడు, ఇంకా తీవ్రంగా

నమస్కరించడానికి ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయాసలో అతడి ఉదరంలో తీవ్రమైన నొప్పి కలిగి బాధపడసాగాడు. ఇది చూసిన పార్వతి చంద్రుణ్ణి కోపంతో చూస్తూ, "ఓరీ! అందమైనవాడివనే కదా నీకు ఈ అహంకారం! నీ ముఖం చూసిన వారికి నీలాపనిందలు కలుగుతాయి!" అని శపించింది. చెయ్యని పనికి నింద పడవలసి వస్తే దాన్ని నీలాపనింద అంటారు. అది విని అక్కడ చేరిన ఋషులు, దేవతలు, శివుని సేవకులైన ప్రమథులు, "అమ్మా! ఈ చంద్రుణ్ణి ప్రతిరోజూ అందరూ చూస్తూనే ఉంటారు. అటువంటి వాడికి ఇటువంటి శాపం ఇస్తే అమాయకులైన ప్రజలు నానాకష్టాలకూ గురికావలసి వస్తుంది. కాబట్టి ఈ శాపానికి పరిహారాన్ని సెలవియ్యండి!" అని వేడుకున్నారు. పార్వతి శాంతించి, తన శాప తీవ్రతను తగ్గించి, "నాయనా! ఎవరైతే గర్వాంధుడైన ఈ చంద్రుణ్ణి వినాయకచవితినాడు చూస్తారో వారికి నీలాపనిందలు తప్పవు!" అని చెప్పింది. ఆనాటి నుంచి జనులు వినాయకచవితినాడు చంద్రుణ్ణి చూడకుండా జాగ్రత్తపడుతూ కాలం గడుపసాగారు.

ఇక శమంతకమణి కథ. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు ఒక వినాయకచవితి రోజున, ఎవ్వరూ చంద్రుణ్ణి చూడవద్దని తన రాజధానిలో యథావిధిగా చాటింపు వేయించి, తాను కూడా ఆకాశం వంక చూడకుండా గోశాలకు వెళ్ళి పాలు పితుకుతూ, అనుకోకుండా పాలలో చంద్రుని ప్రతిబింబాన్ని చూశాడు. చూసిన వెంటనే తాను చేసిన తప్పిదాన్ని గ్రహించాడు. దానివలన తనకు నీలాపనింద రాబోతున్నదని నిశ్చయించుకుని, ఎటువంటి అపనింద రాబోతున్నదో అని వేచిచూడసాగాడు.

'యద్ధ్యాయతి తద్భవతి' అని పెద్దలు చెపుతారు. "దేన్ని గురించి మనం ఎప్పుడూ భయపడుతూ ఉంటామో అది తప్పక జరుగుతుంది" అని వివేకానంద స్వామి చెప్పారు. అంతేకాక, "మీరు దేన్ని గురించి ఆలోచిస్తున్నారన్న విషయం గురించి జాగ్రత్తగా ఉండండి! ఎల్లప్పుడూ నిర్భయులై ఉండండి!" అని ఆయన చెపుతూ ఉండేవారు. దీన్ని ఆచరణలో పెట్టడానికి శ్రీరామకృష్ణులు ఒక ఉపాయాన్ని కూడా చెప్పారు. "నేను భగవంతుడి భక్తుణ్ణి! భగవంతుణ్ణి శరణుజొచ్చినవాణ్ణి. నాకింక భయమేముంది?" అని భావించమని చెప్పారు. అటువంటి విశ్వాసం ద్వారా భయాన్ని దూరం చేసుకోవచ్చును. శ్రీకృష్ణుడు మింటివంక చూడనప్పటికీ చంద్రుణ్ణి చూడకుండా తప్పించుకోలేక పోయాడు కదా! కనుక భయం, శంక అనేవి ఎంతమాత్రం పనికిరావన్న సత్యాన్ని ఈ కథ మనకు చక్కగా బోధిస్తున్నది.

ఇలా చంద్రుణ్ణి చూసిన ఫలితంగా కొంతకాలానికి శ్రీకృష్ణుడికి నీలాపనింద

రానేవచ్చింది. సత్రాజిత్తు అనేవాడు సూర్యుణ్ణి అర్చించి శమంతకమణి అనే మణిని సంపాదించాడు. అది రోజుకు ఎనిమిది బారువుల బంగారాన్ని ఇస్తుంది! ఒకరోజు సత్రాజిత్తు దానిని ధరించి శ్రీకృష్ణుణ్ణి దర్శించడానికి వెళ్ళాడు. ఆస్థానంలోని మంత్రులు, ఉద్యోగులు ఆ మణిని శ్రీకృష్ణుడికి కనుక ఇస్తే దానివల్ల అనేక ప్రజాహితకార్యాలు జరుగుతాయని అతడికి చెప్పారు. కానీ అతడు వారి కోరికను తిరస్కరించి, అటువంటి మణిని ఏ పిచ్చివాడైనా సరే ఇతరులకు ఇవ్వడని చెప్పి వెళ్ళిపోయాడు. శ్రీకృష్ణుడే వారిచేత అలా అడిగించి ఉంటాడని అతడు అపోహపడ్డాడు. ఆ తర్వాత ఒక రోజు సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుడు ఆ మణిని మెడలో వేసుకుని వేటకు బయలుదేరాడు. ఒక సింహం అతడి మెడలో మెరుస్తున్న ఆ మణిని చూసింది. దానికి అది విచిత్రంగా తోచి, అతణ్ణి చంపి దానిని తీసుకుని పారిపోయింది. భల్లూకరాజయిన జాంబవంతుడు ఆ సింహాన్ని చూసి, దాన్ని చంపి, ఆ మణిని తీసుకుపోయి తన కుమార్తె అయిన జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చాడు.

జీవితంలో మనిషికి అన్నిటికన్నా ముఖ్యంగా కావలసినది మంచి స్వభావం, ఉన్నతమైన వ్యక్తిత్వమే కానీ నైపుణ్యాలూ, ఇతర విషయాలూ కావు. నైపుణ్యాలు ముఖ్యమే కానీ ఉన్నతమైన వ్యక్తిత్వం, నైతిక విలువలు లేనప్పుడు అవి ఆ మనిషికి మనశ్శాంతి లేకుండా చేసి అతడి జీవితాన్ని దుర్భరం చేస్తాయి, ఆపై నాశనం చేస్తాయి కూడా. అంతేకాక నైపుణ్యాలను పరోపకారం కోసం ఉపయోగించనప్పుడు, అవి లోకానికి శాపంగా పరిణమించవచ్చు కూడా! ఉదాహరణకు ఒక మనిషి గొప్పగా పాడవచ్చు లేదా గణితంలో మేధావి కావచ్చు. అది గొప్ప విషయమే. కానీ దానికన్నా ముఖ్యంగా అతడి వ్యక్తిత్వం మంచిదై వుండాలి. లేకపోతే అతడి నైపుణ్యం అతడికి మనశ్శాంతి లేకుండా చేస్తుంది; అతణ్ణి దిగజారిపోయేలా చేస్తుంది. అంతేకాక అతడి నైపుణ్యం వల్ల మానవాళికి మేలు కలుగదు సరికదా కీడు కూడా కలుగవచ్చు. ఇక కేవలం అతడి నైపుణ్యాన్ని చూసి అదే గొప్పతనమనుకునే ప్రజలు అతడి చెడు ప్రవర్తనను సరైనదే అనుకుని దాన్ని అనుసరించి ప్రవర్తిస్తే, దానివల్ల సమాజం సర్వనాశనమవుతుంది. కాబట్టి ఉన్నతమైన వ్యక్తిత్వమే అన్నిటికన్నా ముఖ్యం.

ఆ విధంగా జీవితంలో ఉన్నతమైన ఆశయాలు లేనివారు ఒకవేళ అద్భుతంగా శ్రమించి ఫలితాలు సాధించినా అలా కలిగే ఫలితాలు వారికే కాక, మిగిలినవారికి కూడా చేటు తెచ్చే విధంగానే ఉంటాయని ఈ కథ మనకు మరొకసారి తెలియజేస్తుంది. తన స్థాయికి ఇంకేమీ చాలవన్నట్లు సత్రాజిత్తు శమంతకమణిని సాధించాడు. దానిని పొందిన దగ్గర నుంచీ అతడికి దాని మీద వ్యామోహం

పట్టుకుంది. లోభం పెచ్చుమీరి, దాని నుంచి రోజురోజుకీ అంత పెద్దమొత్తంలో వచ్చిపడిపోతున్న బంగారాన్ని తాను ఏమీ చేసుకోలేనని తెలిసి కూడా దాన్ని మహారాజుకు ఇవ్వడానికి కుంచించుకుపోయాడు. ఇంతాచేసి, ఆ మణి అతని సోదరుణ్ణే మట్టుపెట్టింది. అయితే, అంతటితో కథ ముగిసిపోక, అతడు మరింత దిగజారి ప్రవర్తించేలా చేసింది.

తన సోదరుడు చనిపోయాడన్న వార్త తెలిసినపుడు, ఇంతకు ముందే తాను ఊహించినది నిజమైందని అపోహపడి, కృష్ణుడే శమంతకమణి కోసం తన తమ్ముణ్ణి చంపి, ఆ మణిని అపహరించాడని సత్రాజిత్తు దుష్ప్రచారం చేశాడు. ఈ మాట ఆనోటాయానోటా కృష్ణుడికి చేరింది. తన మీదకు నీలాపనింద ఈ విధంగా వచ్చిందని కృష్ణుడు గ్రహించాడు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవడానికి సైన్యసమేతంగా బయలుదేరి, అరణ్యమంతా గాలించాడు. అరణ్యంలో ఒకచోట ప్రసేనుడి కళేబరం, సింహపు కాలిజాడలు, ఆ సింహపు మృతదేహం, ఆ తర్వాత భల్లూకపు పాదముద్రలు కనిపించాయి. వాటిని అనుసరించి వారు ఆ భల్లూకం ఉండే గుహ ద్వారం దగ్గరికి చేరారు. కృష్ణుడు వారందరినీ అక్కడే ఉండమని చెప్పి, తాను లోపలికి వెళ్ళాడు.

ఈ కథ ద్వారా ఎంత అద్భుతమైన వ్యక్తిత్వవికాససూత్రాలను తెలుసుకోవచ్చునో ఈ ఒక్క సన్నివేశం ద్వారా ఇప్పుడు మనం చూద్దాము. అత్యంత బలశాలి, రాజ్యానికి అధిపతి అయిన శ్రీకృష్ణుడు తనమీద అన్యాయమైన ఆరోపణలు చేసి అపరాధిగా నిలిచిన సత్రాజిత్తును ఒక్క ఉదుటున సంహరించి ఉండవచ్చు. కానీ అలా చేయడానికి బదులు ఆయన మణి కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఎందుకు? ఎందుకంటే, వివేకవంతులైన వారు జీవితంలో సమస్యలతో పోరాడాలి కానీ వ్యక్తులతో కాదు. సత్రాజిత్తును సంహరిస్తే తన కోపం చల్లారుతుందేమో కానీ, తనమీద పడిన నింద తొలిగిపోతుందా? పోనేపోదు సరికదా, మరిన్ని నిందలు వచ్చి మీద పడతాయి. ఉదాహరణకు మణిని దొంగిలించినవాడు కనుకనే తన అడ్డు తొలగించుకోవడానికి సత్రాజిత్తును కూడా సంహరించాడన్న అపవాదు వస్తుంది. అందుకే కృష్ణుడు కోపాన్ని దరిజేరనీయకుండా మణిని వెదికే ప్రయత్నం మొదలుపెట్టాడు. "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష" అన్నారు కదా. ఇక రెండవ విషయమేమంటే, **"ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః"** – ఉద్యమించి పనిచేస్తేనే పనులు సాధించబడతాయి కానీ కాళ్ళుజాపుకుని కూర్చుని, ఊహాగానాలు చేస్తే పనులు సాధించబడవు అనే అద్భుతమైన విజయరహస్యాన్నీ, వ్యక్తిత్వవికాస సూత్రాన్నీ ఈ సన్నివేశం మనకు బోధిస్తున్నది.

భల్లూకపు పాదముద్రలను అనుసరించి వెళ్ళి, వారు ఒక గుహ యొక్క ద్వారం దగ్గరకు చేరారని చదివాము. ఆ గుహలో ఏమి ప్రమాదం పొంచివుందో వారికి తెలియదు. అందుచేత శ్రీకృష్ణుడు వారిని అక్కడే ఉండమని చెప్పి తాను ఒంటరిగా గుహలోకి వెళ్ళాడు.

ఇక్కడ శ్రీకృష్ణుడు చేసిన పనిలో మనం నేర్చుకోవలసిన పాఠం ఒకటి ఉంది. నలుగురి మేలు కోసం శ్రమించేవాడికి జీవితంలో ఏ కష్టకాలం దాపురించినా అందరి నుంచీ సానుభూతి, సహకారం లభిస్తాయి. అతడికి సహాయం చేయడానికి నిస్సంకోచంగా నలుగురూ ముందుకు వస్తారు. ఇటువంటి నిస్వార్థబుద్ధి ఉన్నట్లైతే ఎంతటి భయంకరమైన కష్టకాలాన్నైనా సమర్థంగా ఎదుర్కోవచ్చును. ఇది ఒక మరువరాని జీవితరహస్యం, తిరుగులేని వ్యక్తిత్వవికాస సూత్రం. శ్రీకృష్ణుడే దీన్ని నిరూపించి చూపాడు. నిజమైన నాయకత్వంలోని సూక్ష్మరహస్యం ఇది. కృష్ణుడు తనవారిని ఆగమని తానొక్కడే లోపలికి వెళ్ళాడన్న, ఈవొక్క విషయం కోసమైనా ఈ వినాయకవ్రత కథను మనం చదువవచ్చునేమోనని అనిపించకమానదు!

గుహ లోపల ప్రమాదం పొంచివుండవచ్చని ఊహించిన శ్రీకృష్ణుడు పరివారాన్ని అంతటినీ బయటనే ఉండమని, తాను తన ప్రాణాలనే పణంగా పెట్టి లోపలికి వెళ్ళాడే కానీ వారిని లోపలికి వెళ్ళమని చెప్పి, తాను చోద్యం చూడలేదు. ఉద్యమాలే జీవనగతి అన్నట్లుగా సాగుతున్న నేటి సమాజంలో ఏనాడైనా, ఏ నాయకుడైనా ఈ విధమైన ధీరత్వాన్ని చూపగా చూస్తున్నామా? ముందుగా తాను బలి అవ్వడానికి ఏ నాయకుడు ఈ రోజులలో సిద్ధంగా ఉన్నాడు? కానీ మనం పురాణాలలో ఇటువంటి వ్యక్తిత్వాలను అడుగడుక్కీ చూడవచ్చు. అటువంటి ధీరత్వం లోపించడమే ఈనాటి మన దౌర్భాగ్యానికి కారణం.

కృష్ణుడు ఆ గుహలోకి నిర్భయంగా ప్రవేశించాడు. ఆ గుహలో ఒక ఊయలలో ఒక బాలిక ఊగుతూ, ఆ మణితో ఆడుకుంటూ కనిపించింది. కృష్ణుణ్ణి చూసి ఆ బాలిక కేకలు వేయడంతో, ఆ గుహలోనే ఉన్న జాంబవంతుడు వచ్చి కృష్ణుడితో యుద్ధానికి దిగాడు. వారిద్దరూ ముష్టిఘాతాలతో మల్లయుద్ధం చేయసాగారు. జాంబవంతుడు తన భల్లూక స్వభావానికి తగినట్టు గోళ్ళతో రక్కుతూ, కోరలతో కొరుకుతూ యుద్ధం చేశాడు. ఇద్దరూ అక్కడ దొరికిన రాళ్ళతో కూడా యుద్ధం చేశారు. అలా రాత్రింబవళ్ళూ 28 రోజులపాటు యుద్ధం జరిగింది. చివరకు జాంబవంతుడు అలసిపోయి, ఇలా తనను ఓడించగలిగినవాడు మహాపరాక్రమ వంతుడైన శ్రీరాముడే అయివుండాలని గ్రహించాడు. రామావతారపు రోజులలో శ్రీరాముణ్ణి తాను వరంగా కోరుకున్న ద్వంద్వయుద్ధపు కోరిక ఇన్నాళ్ళకు తీరినందుకు ఎంతో సంతోషించాడు. శమంతకమణితో పాటు తన కుమార్తె

అయిన జాంబవతిని కూడా శ్రీకృష్ణుడికి ఇచ్చి వివాహం చేశాడు.

అద్భుతమైన బుద్ధికుశలత కలిగిన శ్రీకృష్ణుడు గుహలోకి ప్రవేశించేంతవరకూ ఎంత విజ్ఞతతో, ఔదార్యంతో, తెలివితేటలతో తనకు ఎదురైన సమస్యను ఎదుర్కొన్నాడో చూశాము. ఇక గుహలోకి ప్రవేశించిన తర్వాత శారీరిక దారుఢ్యంతో ఆ సమస్యను ఎదుర్కొన్నాడు. జాంబవంతునితో 28 రోజులపాటు యుద్ధం చేయవలసివచ్చినా కృష్ణుడు వెరువలేదు. అతడితో అలా పోరాడే శక్తి లేకపోతే చేసిన ప్రయత్నం అంతా వృథా అయ్యేదే కదా! కాబట్టి శారీరికబలం చాలాచాలా అవసరం. దాని అవసరం గురించి ఎంత చెప్పినా తక్కువే.

వివేకానంద స్వామి మన దేశప్రజలను ఉద్బోధిస్తూ అఖండమైన శారీరికబలం అవసరమని మాటిమాటికీ చెప్పేవారు. శారీరిక బలం లేకపోవడాన్ని నిరసిస్తూ ఆయన, "మన దేశప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో మూడవవంతు శారీరిక బలహీనతవల్ల కలుగుతున్నవే" అని చెప్పారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వాటిలో ఇమిడిన వజ్రకఠోరమైన మనస్సు మనకు కావాలి!" అని కూడా ఆయన చెప్పారు. కాబట్టి శారీరకంగా బలంగా, మానసికంగా అచంచలంగా, బుద్ధిపరంగా పదునుగా, ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉండడం అవసరం. ఇవన్నీ కలిసినప్పుడే ఒక పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది. శ్రీకృష్ణుడు శమంతకమణిని సాధించిన కథ పై లక్షణాలన్నింటినీ చక్కగా చూపిస్తుంది.

శ్రీకృష్ణుడు శమంతకమణితోపాటు జాంబవతిని కూడా తీసుకుని ద్వారకా పట్టణానికి చేరాడు. సత్రాజిత్తును పిలిచి ఆ మణిని అతడికే ఇచ్చాడు. సత్రాజిత్తు తన తప్పుకు క్షమాపణవేడి, ఆ మణిని అతడికే ఇవ్వడంతోపాటు తన కుమార్తె అయిన సత్యభామను కూడా శ్రీకృష్ణుడికి ఇచ్చి వివాహం చేశాడు. ప్రజలందరూ శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి, "స్వామీ! వినాయకచవితి రోజున చంద్రుణ్ణి చూడడంవల్ల మీకు ఇంత కష్టం వచ్చింది. మీరు సమర్థులు కాబట్టి మీమీద కలిగిన నిందను వదిలించుకోగలిగారు. మాబోటి సామాన్యుల సంగతేమిటి? మీరే మాకేదో దారి చూపండి!" అని ప్రార్థించారు. శ్రీకృష్ణుడు వారితో, "ఏదో రాబోతుందని ముందే ఊహించుకుని, క్లైబ్యంతో, హృదయదౌర్బల్యంతో భయపడకండి. భయమే అన్ని దుఃఖాలకూ మూలకారణం. ఈ వినాయకచవితి రోజు విఘ్నేశ్వరుడికి పూజచేసి, అక్షతలు తలమీద వేసుకోండి. మనోబలాన్ని ఇచ్చే ఈ వ్రతకథను చదవండి! అలా చేస్తే మీకు ఏ నిందలూ, ఆపదలూ కలుగవు!" అని అభయమిచ్చాడు. అప్పటి నుంచీ ఈ వినాయకుని కథను వినాయకచవితి పూజ తర్వాత శ్రవణం చేయడం మన సంప్రదాయంగా మారింది.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# ఉపనిషత్తులలోని కథలు

## కేన ఉపనిషత్తులోని కథ

## 20. ఉమాదేవి

ఒకానొక సమయంలో దేవతలకు, రాక్షసులకు భీషణమైన సమరం జరిగింది. దానిలో దేవతలు గెలిచారు. ఆ గెలుపుతో వారి గర్వానికి మేరలేక పోయింది. సర్వవ్యాపకమైన పరబ్రహ్మమే తమ విజయానికి కారణమన్న విషయాన్ని మరిచిపోయి, వారు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించసాగారు. అహంకారంతో విర్రవీగుతూ తమ గొప్పతనం వల్లనే ఆ విజయం లభించిందని భావించారు. రాక్షసులను చీల్చిచెండాడిన తమ పరాక్రమానికి ఇక ఎదురులేదనీ, తమకు తెలియని విద్య అంటూ ఏదీ లేదు కనుకనే తాము విజయం సాధించామనీ ఊహించుకుని, వారు మరింత అహంకరించి, మితిమీరి ప్రవర్తించసాగారు. కానీ వారి అధిపతి దేవేంద్రుడు మాత్రం, తన పరాక్రమానికి పరిమితులున్నాయని మరచిపోలేదు. అందువలన మిగిలినవారు ఎలా ఉన్నా, తాను మాత్రం అణకువగానే ప్రవర్తించసాగాడు.

పరబ్రహ్మం వారి గర్వాన్ని గమనించింది. వారి గర్వాన్ని పోగొట్టి వారిని సరైన మార్గంలో పెట్టడం కోసం, వారి ఎదుట ఒక విలక్షణమైన, అంతుచిక్కని రూపంలో ప్రత్యక్షమయింది. తమకు అన్నీ తెలుసని విర్రవీగుతున్న దేవతలకు ఆ రూపం ఏమిటో అర్థం కాలేదు. వారికి భయం, ఆశ్చర్యం - రెండూ ఒకేసారి కలిగాయి. "ఇదేమిటి? మనకు తెలియని రూపం ఏదో ఎదుట నిలిచిందే?" అని వారు ఆశ్చర్యపోయారు. "ఈ రూపం యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏమయివుండవచ్చు?" అన్న ప్రశ్న వారిని వేధించసాగింది. చాలా తర్జనభర్జనలు చేసి, చివరికి వారు అగ్నిదేవుణ్ణి ఆ రూపం ఏమిటో తెలుసుకోమని పంపారు.

అగ్నిదేవుడు అందుకు ఒప్పుకుని, ఆ రూపం దగ్గరకు వచ్చాడు. ఒక భూతంలా ఉన్న ఆ రూపం "ఎవరు నువ్వు?" అని ప్రశాంత, గంభీర స్వరంతో ప్రశ్నించింది.

"నేను అగ్నిదేవుణ్ణి! నా వల్లనే సర్వప్రాణి కోటికి ఆహారం లభిస్తోంది," అని అగ్ని సమాధానం చెప్పాడు.

"అలా అయితే నీవు ఏమి చేయగలవో, నీ శక్తిసామర్థ్యాలు ఏపాటివో నాకు వివరించు!" అని రూపం ప్రశ్నించింది.

"భూతలం మీది ప్రతి వస్తువునూ భస్మీపటలం చేయగల శక్తి నాకుంది!" అని అగ్నిదేవుడు దర్పంతో పలికాడు.

అప్పుడు ఆ రూపం ఒక గడ్డిపరకను అగ్ని ముందు ఉంచి, 'దీన్ని దగ్ధం చేయగలవేమో ప్రయత్నించు!' అని సవాలు చేసింది.

అగ్నిదేవుడు తన శాయశక్తులా ప్రయత్నించినా ఆ గడ్డిపరకను కాల్చలేకపోయాడు. చివరకు ఓటమిని ఒప్పుకుని, ఆ రూపం ఏమిటో అర్థం కాలేదని మిగిలిన దేవతల వద్దకు వెళ్ళి చెప్పాడు.

ఊహించని పరిణామానికి దిగ్భ్రమచెందిన దేవతలు, వాయుదేవుణ్ణి సమీపించి ఆ రూపం వివరాలు తెలుసుకోమని అర్థించారు. అగ్ని చేయలేని పనిని తాను చేయగలుగుతున్నందుకు పొంగిపోతూ, అతడు ఉత్సాహంతో ఆ రూపాన్ని సమీపించాడు. ఆ రూపం, "ఎవరు నువ్వు?" అని మళ్ళీ ప్రశ్నించింది. "నేను వాయుదేవుణ్ణి. నా వల్లనే సమస్త ప్రాణికోటి అంటే మానవులు, జంతువులు, ఇతర జీవులు, చివరకు దేవతలు కూడా జీవించి ఉన్నారు" అని గొప్పలు చెప్పాడు.

"అలా అయితే నీ శక్తిసామర్థ్యాలు ఏమిటో వివరించు!" అని రూపం ప్రశ్నించింది. "భూమి మీద ఉన్న ఏ వస్తువునైనా నేను ఎగరగొట్టగలను. అంతేకాదు, ధ్వంసం చేయగలను" అని వాయుదేవుడు సమాధానం చెప్పాడు.

ఆ రూపం వాయుదేవుడి ముందు కూడా ఒక గడ్డిపరకను ఉంచి, దాన్ని కదల్చమని సవాలు చేసింది. వాయుదేవుడు తన సర్వశక్తులూ ఒడ్డి ప్రయత్నించినా ఆ గడ్డిపరకను కదపలేకపోయాడు. చివరకు అతడు కూడా తన ఓటమిని ఒప్పుకుని ఆ రూపం ఏమిటో బోధపడలేదని మిగిలిన దేవతల వద్దకు వెళ్ళి చెప్పాడు.

దేవతల ఆశ్చర్యానికి అంతులేదు. వారు ఆ రూపంలో చాలా పెద్ద రహస్యం దాగి ఉందని గ్రహించారు. అందరూ కలిసి దేవేంద్రుడి వద్దకు వెళ్ళి ఆ రూపం ఏమిటో తెలుసుకోమని అర్థించారు.

దేవేంద్రుడు అందుకు సమ్మతించి వారినందరినీ వెంటబెట్టుకుని ఆ రూపం వద్దకు వెళ్ళాడు. కానీ విచిత్రంగా ఆ రూపం అదృశ్యం అయిపోయి, అక్కడ ఒక అత్యంత సౌందర్యరాశి అయిన స్త్రీమూర్తి ప్రత్యక్షం అయింది. ఆమె హిమవంతుడి కుమార్తె హైమవతి. ఆమెను పార్వతి లేదా ఉమాదేవి అని కూడా పిలుస్తారు.

"అమ్మా! మమ్మల్నందరినీ కలవరపెట్టిన ఆ రూపం ఏమిటి?" అని దేవేంద్రుడు ఆ తల్లిని అడిగాడు. "అదే పరబ్రహ్మం!" అని ఆమె సమాధానం చెప్పింది.

"దేవేంద్రా! తమ అల్పబుద్ధి వలన నీ అనుచరులైన ఇతర దేవతలు ఆ విలక్షణరూపం యొక్క నిజస్వరూపాన్ని అర్థం చేసుకోలేకపోయారు. అదృశ్యం అయిపోయిన ఆ అపూర్వశక్తి పరబ్రహ్మం తప్ప వేరొకటి కాదు. ఆ బ్రహ్మతత్త్వమే మీమీ శరీరాలలో, వ్యక్తిత్వాలలో శక్తినీ, ధైర్యాన్నీ, పరాక్రమాన్నీ నింపి యుద్ధంలో గెలిచేలా చేసింది. కాబట్టి ముల్లోకాలలోని జీవకోటికి, దేవతలకు, రాక్షసులకు,



అంతేకాక ప్రాణంలేని గ్రహనక్షత్రాలకు సైతం ఆధారభూతమూ, వాటివాటి జీవితాలకు పరమార్థమూ అయిన పరబ్రహ్మాన్ని గుర్తెరిగి మసలుకోండి. మీ అహంకారాన్ని తగ్గించుకుని, ఆ బ్రహ్మజ్ఞానంతో మీరు సదా వర్ధిల్లుదురు గాక!" అని ఆశీర్వదించింది.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## ప్రశ్న ఉపనిషత్తులోని కథ

## 21. పిప్పలాద మహర్షి వివరించిన సృష్టి రహస్యం

సుకేశుడు, సత్యకాముడు, సౌర్యయాని, కౌసల్యుడు, వైదర్భి, కబంధి అనే ఆరుగురు ఋషి కుమారులకు బ్రహ్మజ్ఞానాన్ని పొందాలన్న ఉత్సుకత కలిగింది. ఒక మంచి గురువు కోసం వారు చేసిన అన్వేషణ ఫలించి పిప్పలాద మహర్షిని చేరుకున్నారు. బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్న ఆ మహర్షి ముఖాన్ని చూడగానే వారి మనస్సులలో గౌరవం ఉప్పొంగింది. సమిధలు, దర్భలు, ఫలపుష్పాలు తీసుకుని ఆయన వద్దకు వెళ్ళి వినమ్రతతో నమస్కరించారు. వారిని చూసి ఆయన ఎంతో ఆదరంగా, 'మీరు వచ్చిన పని ఏమిటి?' అని ప్రశ్నించాడు. విషయం తెలుసుకున్న మహర్షి, ఒక సంవత్సరం పాటు తన ఆశ్రమంలో ఉంటూ, ఇంద్రియనిగ్రహంతో, బ్రహ్మచర్యాన్ని నిష్ఠగా పాటిస్తూ, గురుసేవ చేయమని వారికి చెప్పాడు. సంవత్సర కాలం ఇట్టే గడచిపోయింది.

ఒకనాడు పిప్పలాదుడు వారిని పిలిచి "మీమీ సందేహాలను ఏమాత్రం బెరుకు లేకుండా అడగండి, వాటికి సమాధానాలు చెప్పడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని అన్నాడు. "గురుదేవా! ఈ కనిపించే జగత్తు అంతా ఎక్కడ నుంచి ఉద్భవించింది?" అని కబంధి మొదటి ప్రశ్న వేశాడు.

సమాధానంగా, "బ్రహ్మదేవునికి సృష్టి చేయాలన్న సంకల్పం కలిగింది. ఆ సంకల్పసిద్ధి కోసం ఆయన ఎంతో తపస్సు చేశాడు. ఆ తపస్సు నుంచి శక్తి, ద్రవ్యం (ఎనర్జీ అండ్ మేటర్) అనే రెండు ధాతువులు పుట్టాయి. వాటి కలయికతో మనం చూస్తున్న ప్రపంచం అంతా ఉద్భవించింది" అని పిప్పలాదుడు చెప్పాడు. "అంతేకాదు ఎవరైతే శ్రద్ధతో, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ తపస్సు చేస్తారో వారికి ఈ సృష్టి వెనుక ఉన్న సత్యం గోచరిస్తుంది," అని విపులీకరించాడు.

తర్వాత రెండవ శిష్యుడు వైదర్భి, "గురుదేవా! బ్రహ్మదేవుని వలన సృష్టి ప్రారంభం అయిందని మీరు సెలవిచ్చారు. ఈ సృష్టిలో పరాకాష్ఠను అందుకున్నది ప్రాణి. మరి ప్రాణికి ఏది ఆధారంగా నిలుస్తోంది?" అని ప్రశ్నించాడు.

పిప్పలాదుడు, "నాయనా! ఈ ప్రశ్నకు సమాధానం రకరకాలుగా చెపుతారు. పంచభూతాలైన నీరు, నేల, నింగి, నిప్పు, గాలి అని కొందరు; జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అని కొందరు; మనోబుద్ధ్యహంకారచిత్తాలతో కూడిన మనస్సే అని కొందరు చెపుతారు. నిజానికి ఇవన్నీ కలిసి ప్రాణుల శరీరాలను నిలబెట్టి, అంతా సజావుగా సాగేటట్లు చూస్తున్నాయి. కానీ వీటన్నింటికంటే మిన్న అయినది ప్రాణం. అది వీటన్నిటి వెనుక ఉంటూ సర్వాన్నీ నడిపిస్తోంది. ఒకసారి తక్కిన

ఇంద్రియాలన్నీ మా వల్లనే శరీరం నడుస్తోందని అహంకరించాయట. అప్పుడు ప్రాణం నా వల్లనే మీరందరూ మనుగడ సాగిస్తున్నారని తెలియజెప్పింది. వాటికి అర్థం కాలేదు. ఇంద్రియాలకు ఆ విషయాన్ని స్పష్టం చేయడం కోసం ప్రాణం కొద్దిసేపు బయటకు వెళ్ళిందట. అంతే! ఇంద్రియాలన్నీ ఏమాత్రం కదలలేనిస్థితిలో పడిపోయాయి. ప్రాణం తిరిగి వచ్చినప్పుడు మాత్రమే అవి మామూలు స్థితికి రాగలిగాయట! తేనె పట్టులోని రాణి-ఈగ లాగా ఈ దేహానికి ప్రాణమే ఆధారం. ముల్లోకాలలో నివసించే ప్రతి జీవీ ఈ ప్రాణం అధీనంలో ఉన్నదే. ఒక తల్లి తన పిల్లలను కాపాడినట్లు, ఆ శక్తి మనల్ని కాపాడుగాక!" అని సమాధానం చెప్పాడు.

అప్పుడు కౌసల్యుడు, "మరి గురుదేవా! ఈ ప్రాణం ఎక్కడి నుంచి ఉద్భవించింది? అది శరీరంలోకి ఎలా ప్రవేశిస్తోంది? శరీరానికి అంటిపెట్టుకుని ఎలా ఉండగలుగుతోంది? మళ్ళీ బయటకు ఎందుకు పోతోంది?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"కుమారా! నీ ప్రశ్న ద్వారా ఎంతో గంభీరమైన ఆధ్యాత్మికతత్త్వపు లోతులకు చేరుకోవాలని ప్రయత్నిస్తున్నావు. నీకు పరబ్రహ్మం పట్ల అపారమైన శ్రద్ధాభక్తులు ఉన్నాయి కాబట్టి, నీకు అర్థమయ్యే రీతిలో చెప్పడానికి ప్రయత్నిస్తాను, విను!" అని ఇలా చెప్పాడు.

"పరబ్రహ్మంలో అంశ అయిన ఆత్మ నుంచి ప్రాణం పుడుతున్నది. మనిషిని నీడ వెన్నంటి ఉన్నట్లే, ఆత్మను ప్రాణం వెన్నంటి ఉంటుంది. శరీరంలోని అన్ని అంగాలలోనూ ప్రాణం వ్యాపించి ఉన్నది. హృదయంలో ఆత్మ నివసిస్తున్నంత కాలం, ప్రాణం శరీరంలో ఉంటుంది. ఆత్మ శరీరాన్ని విడిచిపోవాలని నిశ్చయించుకుంటే, ప్రాణం కూడా శరీరాన్ని విడిచిపోవడానికి సిద్ధమవుతుంది. ప్రాణం ఉన్నంతవరకూ మాత్రమే మనలో చైతన్యం ఉంటుంది. జీవితపు చిట్టచివరి క్షణాలలో మనం ఏ ఆలోచన చేస్తామో, ఆ ఆలోచనే శరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్న ప్రాణంతో జతగూడుతుంది. ఆ తర్వాత ఆ చిట్టచివరి ఆలోచనకు తగినట్టుగా అదే ఆత్మ పునర్జన్మ ద్వారా మరో శరీరాన్ని ధరిస్తుంది," అని వివరించాడు.

తరువాతి ప్రశ్నను సౌర్యయాని వేశాడు: "స్వామీ! జీవించివున్న ప్రాణి జాగ్రదవస్థలో ఉన్నప్పుడు, దానిలో మేలుకుని ఉండేది ఎవరు? అది సుషుప్తి అవస్థలో గాఢనిద్ర పోతున్నప్పుడు అమితానందాన్ని అనుభవించేది ఎవరు? మరి స్వప్నావస్థలో కలలు కనేది ఎవరు? మనకు ఎదురయ్యే సుఖదుఃఖాలను అనుభవించేది ఎవరు?"

శిష్యుల సందేహాలను నివృత్తి చేయడం అంటే పిప్పలాదునికి ఎంతో సంతోషం. కాబట్టి ఎంతో ఆదరంగా ఆ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పాడు: "సూర్యుడు ఉదయించినప్పుడు అతని కిరణాలు అన్ని వైపులకూ ప్రసరిస్తాయి. అలాగే మనిషి మేల్కొన్నప్పుడు అతని మనస్సులో దాగివున్న చైతన్యం కూడా మేలుకుని, బాహ్యప్రపంచంతో సంపర్కంలోకి వస్తుంది. సుషుప్తి అవస్థలో సుఖంగా నిద్రిస్తున్న జీవిలోని చైతన్యం నిద్రాణమవుతుంది. అందువలన ఆ జీవి చూడడం, వినడం, మాట్లాడడం వంటి పనులను చేయలేదు. ఆ సమయంలో ఆత్మశక్తి మాత్రమే మేల్కొని ఉండి, జీవి ప్రాణంతో ఉండేటట్లు చేస్తుంది. ఈ సుషుప్తి అవస్థలో ఆ ఆత్మశక్తే మనల్ని పరబ్రహ్మానికి దగ్గరగా తీసుకుని వెడుతుంది."

"ఇక స్వప్నావస్థ – పడుకుని ఉన్నా పూర్తిగా నిద్రపట్టని స్థితిలోని వ్యక్తి కలల ద్వారా తన కోరికలను తీర్చుకుంటాడు. ఒక్కొక్కసారి ఎన్నడూ కనీవినీ ఎరగని విషయాలు కూడా కలలో కనిపించవచ్చు. లేదా జాగ్రదవస్థలోని విషయాలే మరలా ప్రత్యక్షం కావచ్చు. ఈ అవస్థలో చైతన్యం నిద్రాణంగా ఉన్నా, ప్రాణశక్తి, ఆత్మశక్తి మేలుకుని ఉంటాయి."

"ఇంతకు పూర్వం చెప్పుకున్న సుషుప్తి అవస్థ గురించి మళ్ళీ చెప్పుకుందాము. జీవి ఈ అవస్థకు చేరుకున్నప్పుడు, పక్షులు చెట్ల మీద తాము కట్టుకున్న గూళ్ళలోకి ఎలా ముడుచుకుని ప్రవేశిస్తాయో, అదే విధంగా జీవి యొక్క సర్వశక్తులు, చైతన్యంతో సహా ఆత్మలో ప్రవేశిస్తాయి. చూచేదీ – చూడబడేదీ, వినేదీ – వినబడేదీ మొదలైనవన్నీ ఏకం అయిపోతాయి. అదే మహాచైతన్యస్థితి. అదే ఆత్మ. కానీ నిద్రావస్థలో లేదా సుషుప్తి అవస్థలో మనకు కలిగే ఈ స్థితి నిజమైన ఆత్మానుభూతి కాదు. సాధన ద్వారా కలిగే ఆత్మానుభూతి గాఢనిద్రలో కలిగే అనుభూతి కన్నా వేరుగా ఉంటుంది. గాఢనిద్రలో నుంచి మేల్కొన్న మనిషి మునుపటిలాగానే ఉంటాడు. కానీ ఆత్మానుభూతిని పొందిన వ్యక్తి పూర్తిగా మారిపోతాడు. ఆ ఆత్మానుభూతిలో ఎటువంటి నీడలూ లేని ప్రకాశవంతమైన నిశ్చలచైతన్యాన్ని సాధకుడు సాక్షాత్కరించుకుంటాడు. అలా ఆ ఆత్మను చేరుకున్నవాడు శాశ్వతమైన ఆనందాన్ని పొందుతాడు."

ఇప్పుడు సహజంగానే ఆత్మానందాన్ని పొందడం ఎలా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. కాబట్టి ఇంకో శిష్యుడైన సత్యకాముడు, "గురుదేవా! మరి ఆ ఆత్మను చేరుకోవడం ఎలా? నేను ఓంకారోపాసన ద్వారా ఆత్మసాక్షాత్కారం లభిస్తుందని విన్నాను. ఆ ఉపాసన గురించి సవిస్తరంగా బోధించండి" అని అర్థించాడు.

పిప్పలాదుడు, "నాయనా! 'అ', 'ఉ', 'మ' అక్షరాల కలయిక వలన 'ఓం'కారం రూపొందింది. దీనిలో మొదటి అక్షరాన్ని మాత్రమే జపించేవారు ప్రాపంచిక

జీవనంలో జయం పొందుతారు. మరణం తర్వాత వారికి మళ్ళీ మనుష్యజన్మ లభిస్తుంది. కానీ వారికి ఉన్నతమైన ఆత్మసాక్షాత్కారం మాత్రం లభించదు. మొదటి రెండు అక్షరాల సంయోగమైన 'ఓ'ను మాత్రమే జపించే వారికి యజ్ఞయాగాదుల వలన లభించే పుణ్యఫలాలు దక్కుతాయి. ఆ పుణ్యఫలాల వలన, వారికి మరణించిన తర్వాత స్వర్గలోక సుఖాలు ప్రాపిస్తాయి. కానీ ఆ పుణ్యఫలాలు క్షీణించాక, మళ్ళీ మనుష్యలోకానికి తిరిగి రాక తప్పదు. కానీ ఆ మూడు అక్షరాల కలయిక అయిన 'ఓం'కారాన్ని తదేకనిష్ఠతో జపించేవారికి ఆత్మసాక్షాత్కారం అవుతుంది. వారు ఆధ్యాత్మికమార్గంలో ఎటువంటి ఫలాపేక్ష లేకుండా సాగిపోయి, కుబుసం విడిచిన పాములాగా శరీరం నుంచి విముక్తి పొందుతారు. కాబట్టి విజ్ఞానవంతులైన వారందరూ ఈ మార్గాన్నే ఎంచుకుంటారు" అని జవాబిచ్చాడు.

ఇక ఆఖరుగా సుకేశుడు ప్రశ్న వేశాడు. ఇదే ప్రశ్నను హిరణ్యనాభుడనే రాజకుమారుడు అంతకు పూర్వం ఒకసారి సుకేశుణ్ణి అడిగాడు. కానీ సుకేశుడు సమాధానం చెప్పలేకపోయాడు. అందువలన గురువుగారిని అడగడానికి అదే ప్రశ్నను అతడు ఎంచుకున్నాడు. "షోడశకళాప్రపూర్ణుడు అంటే ఎవరు?" అన్నదే ఆ ప్రశ్న.

ఆ ప్రశ్న విన్న గురువర్యుడు, "నాయనా! ఆ మాటకు అర్థం పరబ్రహ్మమే. ఈ శరీరంలోనే ఆ పరబ్రహ్మం నివసిస్తున్నాడు. పరబ్రహ్మం మొదట ప్రాణాన్ని సృష్టించాడు. దాని నుంచి పంచభూతాలనూ, శ్రద్ధనూ, ఇంద్రియాలనూ, మనస్సునూ, ఆహారాన్నీ సృష్టించాడు. ఆహారం నుంచి బలాన్నీ, తపస్సునూ, వేదమంత్రాలనూ, యజ్ఞాలనూ, సర్వలోకాలనూ తయారుచేశాడు. తర్వాత వివిధ నామరూపాలుగల ప్రాణికోటిని సృష్టించాడు. వీటినన్నింటినీ కలిపి షోడశకళలు అని అంటారు. ఇవన్నీ కూడా ఆయన లేకపోతే పరిపూర్ణం కావు కాబట్టి ఆయనకు షోడశకళాప్రపూర్ణుడని పేరు వచ్చింది. నదులన్నీ సాగరాన్ని చేరుకున్నట్లు, ఈ ప్రాణికోటి అంతా చివరకు తమతమ నామరూపాలను పోగొట్టుకుని, ఆ పరబ్రహ్మంలో లీనం కావలసిందే. చిట్టచివరకు మిగిలేది ఆ పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మాన్ని మించింది మరేదీ లేదు" అని వివరించాడు.

ఈ విధంగా ఆ శిష్యుల సందేహాలు తీరాయి. వారు గురువు వద్ద సెలవు తీసుకుని తమ మార్గాన సాగిపోయారు.

+ + + + + + +

## ఛాందోగ్య ఉపనిషత్తులోని కథలు

### 22. సత్యకామ జాబాల

ఒకానొక కాలంలో సత్యకాముడనే బాలుడున్నాడు. సత్యకాముడంటే సత్యాన్నే కోరేవాడని అర్థం. తన తోటి పిల్లలందరూ గురువు వద్దకు వెళ్ళి విద్యాభ్యాసం చేయడం చూచి తాను కూడా వారిలాగే విద్య నేర్వాలనుకున్నాడు. వారి గోత్రం, పుట్టుపూర్వోత్తరాలను గురువు కనుక్కోవడం చూచి, తాను కూడా తన వివరాలు తెలుసుకుందామని తన తల్లి వద్దకు వచ్చాడు.

నిజానికి, అతని తండ్రి ఎవరో ఆమెకు తెలియదు. అందువలన ఆ తల్లి సందిగ్ధంలో పడింది. అయినా తేరుకుని, సత్యవాక్యమే శుభాన్ని తేగలదన్న దృఢవిశ్వాసంతో, "నాయనా! మన గోత్రం ఏమిటో నాకు తెలియదు. యౌవనంలో ఉన్నప్పుడు దాసీగా పని చేస్తూ అనేకచోట్ల తిరిగాను. అప్పుడు నీవు జన్మించావు. నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం సత్యం. నా పేరు జాబాల. నీ పేరు సత్యకామ. గురువర్యులు ప్రశ్నిస్తే, 'నా పేరు సత్యకామ జాబాల!' అని సమాధానం చెప్పు" అని పలికింది.

ఈ సమాధానంతో సంతృప్తి చెందిన సత్యకాముడు గౌతమమహర్షి వద్దకు వెళ్ళాడు. ఆయన వివరాలు అడగగానే, "స్వామీ! నా గోత్రం ఏమిటో నాకు తెలియదు. ఈ వివరాలు చెప్పమని బయలుదేరబోయే ముందు నా తల్లిని ప్రశ్నించాను. కానీ నా తల్లి, 'నాయనా! అవన్నీ నాకు తెలియదు. యౌవనంలో ఉన్నప్పుడు దాసీగా పనిచేస్తూ అనేకచోట్ల తిరిగాను. అప్పుడు నీవు జన్మించావు. నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం సత్యం. నా పేరు జాబాల. నీ పేరు సత్యకామ. గురువర్యులు ప్రశ్నిస్తే, నేను 'సత్యకామ జాబాల'నని సమాధానం చెప్పు' అని నాతో చెప్పింది. నా తల్లి చెప్పిన సమాధానాన్ని యథాతథంగా మీకు నివేదిస్తున్నాను" అని బదులు చెప్పాడు. ఈ సమాధానం విన్న గౌతమమహర్షి చాలా అబ్బురపడ్డాడు. బ్రాహ్మణత్వపు లక్షణాలు కలవారు మాత్రమే తమ గురించిన ఇటువంటి కఠోరమైన, అవమానకరమైన సత్యాన్ని ఏమాత్రం జంకకుండా చెప్పగలరని ఆయనకు తెలుసు. (ఏ మనిషిలో నేను, నాది అనే ప్రాపంచికత లేశమైనా ఉండదో, సత్యపూరితమైన జ్ఞానం నిండుగా ఉంటుందో అతడే అసలైన బ్రాహ్మణుడని, అదే అసలైన బ్రాహ్మణత్వమని వివేకానంద స్వామి బోధించారు.) సత్యకాముడి సత్యసంధతకు, ధీరోదాత్తతకు ఆయన ఎంతో సంతోషించి, "నాయనా, సత్యకామా! సమిధలు (కట్టెపుల్లలు) ఏరి తీసుకుని రా! నీకు బ్రహ్మచర్య దీక్ష ఇచ్చి, ఉపదేశం చేస్తాను. సత్యమార్గంలో నడిచేవారందరూ

బ్రహ్మజ్ఞానార్జనకు అర్హులే!” అన్నాడు. తర్వాత ఆ మహర్షి యథావిధిగా హోమం చేసి, అతనికి బ్రహ్మచర్య దీక్షను ఇచ్చి, తన ఆశ్రమంలోనే అతణ్ణి ఉండమన్నాడు.

కొన్నాళ్ళు గడిచాక గౌతముడు అతణ్ణి పిలిచి, చిక్కిపోయిన నాలుగువందల ఆవులను, ఆంబోతులను అతడికి అప్పగించి, “నాయనా, సత్యకామా! వీటిని అడవికి తోలుకుపోయి జాగ్రత్తగా కాపాడు. ఈ పశువుల మంద వెయ్యికి చేరుకున్నాక మాత్రమే నీవు ఆశ్రమానికి తిరిగిరావాలి సుమా!” అని ఆజ్ఞాపించాడు.

ప్రాచీనభారతంలో కొన్ని విచిత్రమైన బోధనాపద్ధతులు ఉండేవి. గురువు చెప్పిన పని ఎంత కష్టమైనదైనా చేసి, ఆయనను మెప్పించడం గురుసేవలో ఒక భాగం. ఎందుకంటే శిష్యుడి నుంచి ఏమీ ఆశించని గౌతముడి లాంటి గురువు ఏది చెప్పినా అది శిష్యుడి మంచికే. అందులో తప్పక ఏదో మంచి దాగివుంటుంది. అందుచేత, గురువు ఆశీస్సులను తీసుకుని, సత్యకాముడు సంతోషంగా ఆ పశువులను తోలుకుంటూ అడవికి వెళ్ళాడు. గురువు తనకు బ్రహ్మజ్ఞానాన్ని బోధించడంలో భాగంగానే తనకు ఈ పనిని అప్పజెప్పారని సత్యకాముడు భావించాడు.

వాటిని మేపుతూ అడవిలోనే కాలం గడపసాగాడు. అతని హృదయం మాత్రం సత్యసాక్షాత్కారం కోసం వెతుకుతూనే ఉంది. ఈ సృష్టిలో ఏది సత్యం, ఏది అసత్యం అని అతడు నిరంతరం తీవ్రమైన యోచన చేయసాగాడు. అటువంటి ధ్యానం వల్ల అతని బుద్ధి సూక్ష్మగ్రాహ్యతను సంపాదించింది. అటువంటి తీవ్రమైన జిజ్ఞాస వల్ల, ఆ అడవిలో కనిపించే ప్రతి సుందర దృశ్యం అతనికి అంతోయింతో నేర్పుతూనే ఉంది. ఎంతో ఆప్యాయతను చూపించే ఆ ఆవులు, ఆంబోతులు, గుసగుసలాడే చెట్ల ఆకుల గలగలలు, పక్షుల కిలకిలారావాలు, పరవళ్ళు తొక్కే సెలయేళ్ళ బిరబిరలు, వెలుగులు వెదజల్లే సూర్యచంద్రులు, మిణుకుమిణుకుమంటూ పలకరించే తారలు, గ్రహాలు అతనికి అనుక్షణం ఏదోవొక సందేశాన్ని ఇవ్వసాగాయి. అలా రోజులు గడుస్తున్న కొద్దీ అతడి మనస్సు మరింత గొప్ప ఏకాగ్రతనూ, సూక్ష్మబుద్ధినీ సాధించింది.

పశువుల మంద సంఖ్య క్రమంగా పెరగసాగింది. ఒకరోజు ఉదయం మందలోని ఆంబోతు అతని ముందుకు వచ్చి, “మా సంఖ్య వేయి దాటింది. మమ్మల్ని ఇంక మీ గురువు దగ్గరకు తోలుకుపోవచ్చు. సత్యకామా! బ్రహ్మతత్త్వానికి నాలుగు పాదాలు ఉన్నాయి. మొదటి పాదాన్ని నేను నీకు ఉపదేశిస్తాను” అని అంది. సత్యకాముడు అది ఏమిటో చెప్పమన్నాడు. ఆ ఆంబోతు, “ఈ విశ్వంలోని నాలుగు దిక్కులు బ్రహ్మతత్త్వంలో ఒక భాగం. ఇక ఆ బ్రహ్మతత్త్వం గురించిన రెండవ పాదాన్ని అగ్నిదేవుడు నీకు ఉపదేశిస్తాడు” అని వివరించింది.

సత్యకాముడు ఆ వెయ్యి ఆవులను తోలుకుంటూ, మహర్షి ఆశ్రమానికి ప్రయాణం కట్టాడు. ప్రయాణం చేస్తుండగా, సాయంకాలం అయింది. అతడు ఆ

మందను అక్కడ నిలిపి, అగ్నిని రగిల్చి, ఆ జ్వాలకు ఎదురుగా కూర్చున్నాడు. అప్పుడు, ఆ జ్వాలలోనుంచి అగ్నిదేవుడు ప్రత్యక్షమై, ఇలా పలికాడు: "బ్రహ్మతత్త్వానికి సంబంధించిన రెండవ పాదాన్ని నేను నీకు వివరిస్తాను. భూమి, ఆకాశం, సముద్రాలు – ఇవన్నీ కూడా బ్రహ్మంలో అంతర్భాగాలే అని గ్రహించు. తర్వాత ఒక హంస వచ్చి నీకు మూడవ పాదాన్ని వివరిస్తుంది." (పాత నిబంధన గ్రంథంలో కూడా సామ్యుయేల్ ఇదే విధంగా విచిత్రమైన కంఠస్వరాన్ని వినడాన్ని గురించిన కథ ఒకటి ఉంది.)

సత్యకాముడు తన ప్రయాణాన్ని మరింత ముందుకు సాగించాడు. మరునాడు సాయంత్రం కూడా అగ్ని ముందు కూర్చొని ఉన్నప్పుడు, ఒక హంస ఎగిరివచ్చి అతనికి సమీపంగా వ్రాలింది. ఆ హంస, "కుమారా! బ్రహ్మతత్త్వంలో మూడవ పాదాన్ని నేను ఉపదేశిస్తాను. ఈ జ్వలిస్తున్న అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు – ఇవన్నీ బ్రహ్మంలో భాగాలేనని గ్రహించు. మరొక పాదాన్ని 'మద్గు' అనే నీటిపక్షి నీకు తెలియపరుస్తుంది," అని పలికి, ఆ హంస తన దారిన వెళ్ళిపోయింది.

సత్యకాముడు మరింత ముందుకు సాగి, మరునాడు సాయంత్రం మళ్ళీ అగ్నిని రాజేసి అతడు దానికి అభిముఖంగా కూర్చున్నాడు. అప్పుడు వచ్చిన నీటిపక్షి ఇలా పలికింది: "బిడ్డా! బ్రహ్మతత్త్వానికి సంబంధించిన చివరి పాదాన్ని వివరిస్తాను. ప్రాణం బ్రహ్మం. దృష్టి బ్రహ్మం. శ్రవణం బ్రహ్మం. మనస్సు బ్రహ్మం. ఇవన్నీ బ్రహ్మతత్త్వంలో భాగాలేనని అర్థం చేసుకో!" ఇలా చెప్పిన నీటిపక్షి అదృశ్యం అయిపోయింది. సత్యకాముడు అప్పటి వరకూ చెప్పబడిన ఉపదేశాలను మననం చేస్తూనే ఉన్నాడు. ఒక్కొక్క ఉపదేశం మననం చేస్తున్న కొద్దీ, అతని ముఖంలో బ్రహ్మవర్చస్సు పెరగసాగింది.

ఈ బ్రహ్మవర్చస్సు పెరగడం అంటే ఏమిటి? సాధారణమైన మనుష్యుల ముఖాలలో ఇది కనిపించదు. ఎవరు బ్రహ్మజ్ఞానాన్ని పొందే మార్గంలో ముందుకు పయనిస్తున్నారో వారి ముఖంలో మాత్రమే ఇది కనిపిస్తుంది. మామూలు మనుష్యులు అన్నింటిలో పరబ్రహ్మాన్ని చూడరు. కాబట్టి అన్నింటినీ వేరువేరుగా చూస్తూ కొన్నింటిని మంచివనీ, కొన్నింటిని చెడ్డవనీ, కొన్నింటిని తనవనీ, కొన్నింటిని పరాయివనీ వర్గీకరిస్తూ, ఇష్టాయిష్టాలకూ, తరతమభేదాలకూ లోనవ్వడం వల్ల దుఃఖాలలోనూ, ఆందోళనలలోనూ పడిపోతారు. అందుచేతనే వారి ముఖాలలో ఎటువంటి తేజస్సు కనిపించదు. కానీ ఎప్పుడైతే మనిషి సర్వచరాచర జగత్తులోనూ ఆ పరబ్రహ్మాన్ని చూడడం నేర్చుకుంటాడో అప్పుడు అతడి మనస్సులో గొప్ప చిత్తశాంతి కలుగుతుంది. ఆ శాంతత వల్ల అతడికి విషయాలు మరింత స్పష్టంగా అర్థమవుతాయి. అదే అతణ్ణి క్రమంగా



బ్రహ్మసాక్షాత్కారం వైపు నడుపుతుంది. ఇలా పరిణతి సాధిస్తున్న మనిషి ముఖంలో గొప్ప ప్రసన్నత, పవిత్రత, ఆత్మసంతృప్తి, బ్రహ్మవర్చస్సు కనిపిస్తాయి.

చివరకు బ్రహ్మతేజంతో వెలిగిపోతున్న దేహంతో సత్యకామ జాబాల గురువు ఆశ్రమాన్ని ప్రవేశించాడు. గురువుకు గౌరవంగా నమస్కరించి వినయంగా నిలబడ్డాడు. సత్యకాముని ముఖం చూడగానే అతనికి బ్రహ్మజ్ఞానం కలిగిందని గౌతమునికి అర్థమయింది. "సత్యకామా! నీ ముఖం బ్రహ్మజ్ఞానంతో ప్రకాశవంతంగా వెలిగిపోతోంది. నీకు బ్రహ్మతత్త్వాన్ని గురించి ఎవరు ఉపదేశించారు?" అని ప్రశ్నించాడు.

సత్యకాముడు, "స్వామీ! మానవేతరులైన వృషభం, అగ్ని, హంస, నీటిపక్షి నాకు బ్రహ్మజ్ఞానాన్ని బోధించాయి. కానీ గురుముఖంగా నేర్చుకోని విద్య ఫలించదని అంటారు. అందుచేత మీరు దయచేసి, నాకు బ్రహ్మవిద్యను మరలా ప్రసాదించండి" అని వేడుకున్నాడు. అప్పుడు గౌతముడు తనకు తెలిసిన బ్రహ్మజ్ఞానాన్ని మొత్తం సంతోషంగా అతనికి ఉపదేశించాడు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 23. ఆ ఆత్మే నీవు! (తత్త్వమసి!)

ఉద్దాలక మహర్షి కుమారుడైన శ్వేతకేతువుకు పన్నెండు సంవత్సరాలు నిండాక, "శ్వేతకేతూ! నీవు గురువుల వద్దకు వెళ్ళి అధ్యయనం చేయవలసిన సమయం వచ్చింది. ఆత్మజ్ఞానం లేనివారు మన వంశంలో ఎవరూ లేరు. కాబట్టి నీవు కూడా గురువులను ఆశ్రయించి జ్ఞానసముపార్జన చేసి తిరిగి రా!" అని అన్నాడు.

మన పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఉద్దాలకుడు చెప్పినట్టు మన పూర్వీకులు ఏమి గొప్పపనులు సాధించారో తెలుసుకుంటే దానివల్ల మనకు కూడా గొప్పపనులు చేయాలన్న కోరిక, పట్టుదల కలుగుతాయి. భారతీయ ఋషులే మన పూర్వీకులు. వారి గొప్పతనం ఆచంద్రతారార్కంగా నిలిచి ఉంటుంది. వారు మానవజీవితానికి ఆదర్శం ఏమిటో, దాన్ని ఎలా సాధించాలో చక్కగా వివరించారు. మనం కూడా వారి అడుగుజాడలలో నడవాలి.

తండ్రి ఆజ్ఞ ప్రకారం శ్వేతకేతువు ఒక గురువును ఆశ్రయించి పన్నెండు సంవత్సరాలు వేదాధ్యయనం చేశాడు. శ్వేతకేతువు ఆ సమయంలో, తాను చెవుల ద్వారా విన్నది, నోటితో వల్లెవేసినది, మనస్సుతో అర్థం చేసుకున్నది మాత్రమే జ్ఞానం అనుకున్నాడు. అందువలన అధ్యయనం పూర్తి అయిందనీ, ఇక తాను సర్వజ్ఞుణ్ణనీ అనుకోసాగాడు. తనకు అంతా తెలిసిపోయిందన్న గర్వంతో, దర్పంతో ఇంటికి తిరిగివచ్చాడు. అతనిలోని గర్వాన్ని, ఆ గర్వం మిగిలివుండడం వల్ల తొలగిపోని అతని అవివేకాన్ని తండ్రి గుర్తించాడు.

అతడు శ్వేతకేతువును తన దగ్గరకు పిలిచి, "నాయనా! ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి అతీతమైనది ఏమైనా ఉందా అనీ, దానిని తెలుసుకునే పద్ధతులు ఏమిటనీ మీ గురువులను ఎన్నడైనా ప్రశ్నించావా?" అని అడిగాడు. శ్వేతకేతువుకు అటువంటి జ్ఞానం ఒకటి ఉంటుందని ఏమాత్రం తెలియదు. అతడికి ఏమి చెప్పాలో పాలుపోలేదు. తాను తెలుసుకోవలసింది ఇంకా ఉందని శ్వేతకేతువుకు అప్పుడు మొదటిసారిగా తెలిసివచ్చింది.

తన తండ్రినే ఆ జ్ఞానాన్ని గురించి వివరించమని అడిగాడు. "నదులు వేర్వేరు చోట్ల పుట్టినా చివరకు సముద్రాన్ని చేరుకుంటాయి. సూర్యరశ్మి వలన ఆ నీరు ఆవిరిగా మారి, మేఘంగా మారుతుంది. ఆ మేఘం వర్షించడం వలన నదులు ఏర్పడుతున్నాయి. ఆ నదులే మనకు ప్రాణభిక్ష పెడుతున్నాయి. మళ్ళీ ఈ నీరు సముద్రానికి చేరుకున్నాక, అంతా కలసిపోవడం వలన, ఇది ఫలానా నది నీరు అని చెప్పలేము. ఇదే విధంగా జీవరాశులు పరమాత్మ నుంచి ఉద్భవించి చివరకు పరమాత్మనే చేరుతాయి. ఆ పరమాత్మ మనందరిలో ఆత్మ రూపంలో ఉంది.

కాబట్టే మనల్ని జీవాత్మలు అంటారు. నీలోనూ ఆత్మ ఉంది కాబట్టి, ఆ పరమాత్మే నీవు (తత్త్వమసి)!" అని తండ్రి వివరించాడు.

శ్వేతకేతువు, "నాకు ఆ ఆత్మ గురించి మరింత వివరించండి" అని కోరాడు. తండ్రి అతణ్ణి ఒక మర్రికాయను తెమ్మని చెప్పాడు.

శ్వేతకేతువు, "ఇదిగో తెచ్చానండీ" అని తెచ్చిచూపాడు.

తండ్రి, "దాన్ని పగలగొట్టు!" అన్నాడు.

"ఆఁ! పగలగొట్టాను."

"ఏమి కనిపిస్తోంది?"

"చిన్న చిన్న గింజలు కనిపిస్తున్నాయండీ!"

"ఒక గింజను తీసుకుని పగలగొట్టు!"

ఆ గింజను కూడా పగలగొట్టాడు. శ్వేతకేతువు తండ్రి చెప్పినట్లే చేస్తున్నాడు కానీ, తండ్రి అలా ఎందుకు చేయిస్తున్నాడో అర్థంకాక లోలోపలే ఆశ్చర్యపోయాడు.

"ఏమి కనిపిస్తోంది?" తండ్రి తిరిగి ప్రశ్నించాడు.

"ఏమీ కనిపించడం లేదు!" అని సమాధానం చెప్పాడు.

తండ్రి మళ్ళీ వివరించడం మొదలుపెట్టాడు. "'నీవు చివరిగా 'ఏమీ కనిపించడం లేదు!' అని సమాధానమిచ్చావు. అంటే ఏమిటి? అన్ని ఆకులతో, కొమ్మలతో, కాయలతో ఉన్న అంత పెద్ద మర్రిచెట్టు శూన్యంలో నుంచి పుట్టుకు రాదు కదా! ఆ చెట్టు పుట్టుకురావడానికి కారణమైనదీ, నీ కళ్ళకు కనిపించనంత సూక్ష్మమైనదీ ఏదో ఉండివుండాలి కదా! శక్తి రూపంలో దానిలో దాగివున్న ఆత్మయే ఈ విధంగా జరిపిస్తోంది. మనలో ఉన్న ఆత్మ కూడా ఇదే విధంగా కంటికి కనిపించకుండా సూక్ష్మరూపంలో దాగి ఉంది. దానినే ఆత్మశక్తి అని కూడా చెప్పుకోవచ్చు. కంటికి కనిపించనంత మాత్రాన అది లేదని చెప్పవద్దు. నీలో కూడా ఆత్మ ఉంది కాబట్టి 'తత్త్వమసి! శ్వేతకేతూ!' (ఓ శ్వేతకేతూ! ఆ ఆత్మే నీవు!)"

శ్వేతకేతువు ఆశ్చర్యం నుంచి తేరుకున్నాడు. విషయం అర్థం చేసుకున్నాడు. ఇంతలో తండ్రి కాస్త ఉప్పునూ, నీటినీ తీసుకురమ్మన్నాడు. శ్వేతకేతువు తీసుకువచ్చాడు. ఆ ఉప్పును నీటిలో వేసి కరిగించి, ఆపైన ఆ నీటి రుచి ఎలావుందో చెప్పమని శ్వేతకేతువును అడిగాడు. తండ్రి చెప్పదలుచుకున్న విషయం మీద తీవ్రంగా ఆలోచిస్తున్న శ్వేతకేతువు ఆ నీళ్ళు ఉప్పగా ఉన్నాయని సమాధానం చెప్పాడు. "ఇప్పుడు ఆ ఉప్పు ఈ నీటిలో ఎక్కడ ఉందో చెప్పగలవా?" అని తండ్రి ప్రశ్నించాడు. విషయం అర్థం అయిన శ్వేతకేతువు "నీటిమొత్తంలో ఉప్పు వ్యాపించి ఉంది" అని సమాధానం చెప్పాడు.

"ఇప్పుడు ఆత్మ యొక్క సర్వవ్యాపకత్వం నీకు ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది కదా! ఆ ఉప్పు ఈ నీటిలో కరిగిపోయి, మొత్తం నీరంతా వ్యాపించి ఉన్నట్లు, సృష్టిలోని అన్ని వస్తువులలోనూ ఆత్మ వ్యాపించి ఉందని అర్థం చేసుకో! నీలోనూ ఆత్మ ఉంది కాబట్టి 'తత్త్వమసి! శ్వేతకేతూ!' (ఓ శ్వేతకేతూ! ఆ ఆత్మే నీవు!)" అని తండ్రి వివరించాడు.

ఇప్పుడు శ్వేతకేతువు ఒక అడుగు ముందుకు వేసి, "నాన్నగారూ! మీరు చెప్పిన ఉపమానాలతో నాకు విషయం అర్థం అయింది. ఆత్మను తెలుసుకోవడం సులభమేనని అనిపిస్తోంది. కానీ ఆ ఆత్మ నిజంగా మన అనుభవంలోకి వస్తుందా? అసలు ఆత్మానుభూతిని పొందడం ఎలా?" అని ప్రశ్నించాడు.

ఉద్దాలక మహర్షి ఇలా వివరించాడు: "ఓ శ్వేతకేతూ! ఆత్మానుభవానికి మార్గం ఎలా ఉంటుందో కూడా ఒక ఉపమానంతోనే చెపుతాను. ఒక మనిషి, కాళ్ళూచేతులూ కట్టివేసి, కళ్ళకు గంతలు కట్టి అరణ్యంలో వదలివేశారనుకో! అప్పుడు అతడు ఏం చేస్తాడు? కదలలేక, దారి కానరాక గిలగిలా కొట్టుకుంటాడు. సహాయం కోసం ఎలుగెత్తి అర్థిస్తాడు. ఎవరో తప్పక వస్తారు. కళ్ళ గంతలు తీసి త్రోవ చూపెడతారు. ఆ త్రోవలో ప్రయాణిస్తూ, మధ్యమధ్యలో దారి కనుక్కుంటూ అతడు తన స్వగృహానికి చేరుకుంటాడు. అలాగే అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న మనం ఆత్మ కావాలన్న తపనతో ప్రయాస పడాలి. అలా చేస్తే సహాయం తప్పక లభిస్తుంది. అది ఎలాగైనా రావచ్చు, ఎక్కడ నుంచైనా రావచ్చు. అటువంటి సహాయం లభించాక మనకు చూపబడిన త్రోవలో పట్టువదలకుండా ప్రయాణించాలి. అప్పుడే గమ్యానికి చేరుకోగలం!"

ఈ విధంగా ఉద్దాలకుడు ఆత్మ అంటే ఎక్కడో ఆకాశంలో లేదనీ, మనలోనే ఉన్నదనీ, మన నిజతత్త్వం ఆత్మతత్త్వమేననీ చిన్న చిన్న ఉదాహరణలతో వివరించాడు. ఉద్దాలకుడు చెప్పిన ఈ 'తత్త్వమసి' (తత్-త్వం-అసి అంటే అదే-నీవు-అయివున్నావు) అనే వాక్యాన్నే వేదాంత పరిభాషలో మహావాక్యంగా పరిగణిస్తారు.


+ + + + + + +

## 24. ఆహారమే మనస్సుగా మారుతుంది

ఉద్దాలక మహర్షి తన బోధనను కొనసాగిస్తూ, కుమారుడైన శ్వేతకేతువుకి ఆహారం ఏ విధంగా మనస్సుగా మారుతుందో ప్రయోగపూర్వకంగా నిరూపించిన వైనాన్ని మనం ఈ కథలో చదువవచ్చు. ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఇలా వివరించాడు.

"కుమారా! పెరుగును చిలికినప్పుడు దానిలోని సూక్ష్మమైన పదార్థం పైకి లేచి వెన్నగా ఏర్పడుతుంది. అదే విధంగా, మనం తిన్న ఆహారంలోని సూక్ష్మాతిసూక్ష్మమైన అంశం పరిణామం చెంది మనస్సుగా ఏర్పడుతుంది. నాయనా! ఆ విధంగా, మనస్సు ఆహారం చేత, ప్రాణం నీటి చేత, వాక్కు అగ్ని చేత ఏర్పడతాయి".

కుమారుడైన శ్వేతకేతువు ఇలా అన్నాడు: "మహాత్మా! దయచేసి నాకు ఇంకా బోధించండి!"



"అయితే విను! ఒక మనిషిలో పదహారు భాగాలుంటాయి. పదిహేను రోజులు (ఎటువంటి ఆహారం) తినవద్దు. కానీ నీకు కావలసినంత నీరు త్రాగు. ప్రాణం నీటి వలన కలుగుతుంది కాబట్టి నీరు త్రాగుతూ ఉంటే ప్రాణం పోదు."

తండ్రి ఆజ్ఞ మేరకు శ్వేతకేతువు పదిహేను రోజులు ఏ ఆహారం తినకుండా ఉన్నాడు. ఆ తర్వాత తన తండ్రి వద్దకు వచ్చి, "తండ్రీ! నన్ను ఏమి వల్లించమంటారు?" అన్నాడు.

ఉద్దాలకుడు: "ఋక్, యజుర్, సామ వేదాలను వల్లించు!"

శ్వేతకేతువు: "అవి నాకు గుర్తుకు రావడం లేదు" (అతడు వేదాలను జ్ఞాపకం చేసుకోలేకపోయాడు).

ఉద్దాలకుడు: "కుమారా! బ్రహ్మాండమైన అగ్ని మండిపోగా మిగిలిపోయిన మిణుగురు పురుగు పరిమాణం కలిగిన నిప్పుకణిక ఎక్కువగా జ్వలించే శక్తిని కలిగి ఉండదు. అదే విధంగా నీలోని పదహారు భాగాలలో మిగిలిన ఒక భాగంవల్ల నీకు వేదాలు గుర్తుకు రావు. ఇప్పుడు ఆహారం తీసుకుని ఏమి జరుగుతుందో చూడు! అప్పుడు నేను చెప్పినది నీకు అర్థం అవుతుంది."

శ్వేతకేతువు ఆహారం తీసుకుని తిరిగి తండ్రి వద్దకు వచ్చాడు. అప్పుడు అతడికి అన్నీ చక్కగా గుర్తుకువచ్చాయి. తండ్రి ఏది అడిగినా వల్లించగలిగాడు.

ఉద్దాలకుడు: "కుమారా! బ్రహ్మాండమైన అగ్ని మండిపోగా మిగిలిన మిణుగురు పురుగు పరిమాణం కలిగిన నిప్పుకణికను, మళ్ళీ గడ్డివేసి ఏ విధంగా మండించవచ్చో, అలా నీలోని పదహారు భాగాలలో మిగిలిన ఒక భాగాన్ని, ఆహారాన్ని అందించడం ద్వారా తిరిగి జ్వలింపజేయవచ్చు. అందువల్లనే నీవు వేదాలను జ్ఞాపకం చేసుకోగలిగావు. కాబట్టి, కుమారా! మనస్సు ఆహారం నుంచి, ప్రాణం నీటి నుంచి, వాక్కు అగ్ని నుంచి ఏర్పడతాయి."

అప్పుడు శ్వేతకేతువుకు తండ్రి చెప్పినది అర్థమయింది.

ఈ విధంగా ఉపనిషత్తుల కాలంలోనే మన పూర్వీకులు విషయాలను శాస్త్రబద్ధంగా, (సైంటిఫిక్‌గా) ప్రయోగం ద్వారా పరీక్షించి తెలుసుకున్నారు. అవే ప్రయోగాలను మళ్ళీమళ్ళీ చేసినా అవే ఫలితాలను తిరిగి రాబట్టవచ్చునని కూడా వారు మనకు తెలియజెప్పారు. ఆ విధంగా మన సనాతన ధర్మం ఆధునికశాస్త్ర విజ్ఞానానికి భయపడదు. ఆధునికశాస్త్ర విజ్ఞానంలో వచ్చే నూతనమైన ఆవిష్కరణలు మన ధర్మాన్ని మరింత బలోపేతం చేస్తాయే కానీ దానిని నాశనం చేయలేవు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 25. బ్రహ్మచారి కథ

ఒక ఆశ్రమంలో ఇద్దరు ఋషి కుమారులు ఉండేవారు. వారి పేర్లు శౌనకుడు, అభిప్రతారి. వారు వాయుదేవుణ్ణి పూజించేవారు. ఒకరోజు మధ్యాహ్నం వారు భోజనం చేయబోయే ముందు ఎవరో వాకిలి బయట నిలబడి ఆహారం కావాలని భిక్ష అడగడం వినిపించింది. వారు మారు ఆలోచించకుండా అతణ్ణి పొమ్మన్నారు.



నిజానికి అలా ఆహారం కావాలని కోరింది ఒక బ్రహ్మచారి. అతడికి చిన్నవయసులోనే బ్రహ్మజ్ఞానం అబ్బింది. ఈ విధంగా పొమ్మని చెప్పించుకోవడం అతనికేమీ కొత్త కాదు. కానీ వారు ఋషి కుమారులై ఉండీ అలా అనడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. వారికి ఒక గుణపాఠం నేర్పాలని అతడు అనుకున్నాడు.

అందువలన "మీరు ఏ దేవుణ్ణి ఉపాసిస్తూ ఉంటారు?" అని ఆ ఋషిపుత్రులను అడిగాడు. "మేము వాయుదేవుణ్ణి ఉపాసిస్తాము. ఆయనకు మరో పేరు ప్రాణం!"

అని వారు గర్వంగా సమాధానం చెప్పారు. అప్పుడు బ్రహ్మచారి ఇలా వివరించడం మొదలుపెట్టాడు: "ఓ మహర్షులారా! ఈ ప్రపంచం యావత్తూ ప్రాణం వలనే రూపు దాల్చిందనీ, తిరిగి ప్రాణంలోనే లయం అవుతుందనీ మీకు తెలుసనుకుంటాను. కాబట్టి ఈ చరాచర సృష్టి అంతా ప్రాణస్వరూపమని మీరు ఒప్పుకుంటున్నారు! అవునా?"

"అవును. మాకు ఈ విషయం తెలుసు. ఈ విశ్వమంతా ప్రాణంతో నిండివుందని భేషుగ్గా తెలుసు. మాకు తెలిసిన విషయాన్నే నీవు మళ్ళీ చెపుతున్నావే!" అని వారు అసహనంగా జవాబిచ్చారు. "మరి మీరు ఇప్పుడు వండిన భోజనాన్ని ముందుగా ఎవరికి నివేదించి స్వీకరిస్తారు?" అని ప్రశ్నించాడు. "మేము ఆరాధించే వాయుదేవుడికే నివేదిస్తాము" అని వారు బదులు పలికారు.

అది విని ఆ బ్రహ్మచారి, "ఈ విశ్వం అంతా ప్రాణంతో నిండివుందని ఇంతకు పూర్వమే మీరు ఒప్పుకున్నారు. ఆ ప్రాణం కోసమే మీరు నైవేద్యాన్ని తయారుచేశారు. నాలో ప్రాణం ఉంది కాబట్టి, ఈ విశ్వంలో నేను కూడా ఒక భాగమే. ఈ ఆకలితో ఉన్న బ్రహ్మచారి రూపంలో కూడా ఆ ప్రాణమే మిమ్మల్ని భిక్ష అడుగుతోంది కదా!" అన్నాడు.

ఋషి పుత్రులు, "ఈ వివరణ చాలా బాగుంది. నీవు చెప్పింది ముమ్మాటికీ సత్యం!" అని మెచ్చుకున్నారు. "మరి నాకు భిక్ష ఇవ్వకుండా పొమ్మనడమంటే, నాలోని ప్రాణాన్ని, అంటే వాయుదేవుణ్ణి పొమ్మనడమేగా!" అని ఆ బ్రహ్మచారి ఎత్తిపొడిచాడు.

ఆ ఋషిపుత్రులకు జ్ఞానోదయమయింది. సాదరంగా ఆ బ్రహ్మచారిని లోనికి ఆహ్వానించి అతనితో నైవేద్యాన్ని పంచుకున్నారు.

ఈ సృష్టి అంతా భగవంతునితో నిండివుంది. మనం ఈ విషయాన్ని అనుక్షణం గుర్తుపెట్టుకుని మసలుకోవాలి. తోటివారికి సహాయపడడం ద్వారా మనం ఆ పరబ్రహ్మానికే సేవ చేస్తున్నాము. అంతేకాక తోటివారికి సేవ చేయడం ద్వారా మనకు మనమే సేవ చేసుకుంటున్నాము కూడా!

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 26. బండి తోలే మహాత్ముడు

ప్రాచీన కాలంలో జానశ్రుతి అనే రాజు ఉండేవాడు. అతడు ఎంతో దయామయుడని పేరు తెచ్చుకున్నాడు. దానధర్మాలు చేయడంలో అతనికి అతడే సాటి. ఎన్నో అన్నసత్రాలు, విశ్రాంతిగృహాలు నడిపేవాడు. వాటికి వచ్చిన అన్నార్తులు తృప్తిగా తిని, విశ్రమించేవారు. ఇలా చాలా రోజులు గడిచాయి. ఆ మహారాజు ఈ పనులను చేయడాన్నే ఒక ఘనకార్యంగా భావించడం ప్రారంభించాడు. దానితో అతనిలో అహంకారం, గర్వం పడగెత్తాయి. తనంతవాడు మరి ప్రపంచంలో లేడని భావించసాగాడు.



ఒకరోజు ఆ మహారాజు రాత్రివేళ, చల్లని వెన్నెలలో తన ఆకాశహర్మ్యం పైకప్పు మీద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అప్పుడు ఆకాశంలో ఒక హంసల గుంపు ఎగురుతూ వెళ్ళడం చూశాడు. అతడికి పక్షుల భాష వచ్చు. అందువలన, అవి దగ్గరగా వచ్చినపుడు వాటి సంభాషణను కుతూహలంగా వినసాగాడు. ఒక హంస మిగిలినవాటితో, "జానశ్రుతి హర్మ్యానికి అంత దగ్గరగా ఎగరవద్దు. అతడి కీర్తిప్రతిష్ఠల ప్రకాశానికి మాడి భస్మం అయిపోగలరు జాగ్రత్త!" అని అంది. ఇది విని జానశ్రుతి ఎంతో పొంగిపోయాడు.

ఇంకో హంస పకపకా నవ్వి, "ఎందుకలా భయపడతావు? మనం ఎప్పుడూ ఆకాశంలో విహరించేవాళ్ళం. ఈ లోకం తీరు ఇతరుల కన్నా మనకే బాగా తెలుసు. బండి తోలుకునే రైక్వునితో పోలిస్తే జానశ్రుతి గొప్పతనం ఏపాటిది? ఈ

జానశ్రుతి చేసే దానధర్మాల వెనుక ఏముందో మీకు తెలియదా? అతడి కీర్తికాంక్షే వాటి వెనుకనున్న కారణం అని మరిచిపోవద్దు! కానీ రైక్వుడు ఎటువంటివాడో గమనించారా? అతడు తానున్నచోటే ఉంటూ కర్తవ్యనిష్ఠతో అన్నీ సాధించగలిగాడు. అతడికి గతాన్ని గురించిన చింత లేదు. భవిష్యత్తును గురించిన ఆరాటం అసలే లేదు. ఆత్మానుభవంతో విలసిల్లుతున్న రైక్వుడికీ, ఈ జానశ్రుతికీ పోలికెక్కడ?" అని ఎదురు ప్రశ్నించింది. మిగిలిన హంసలన్నీ ఆ హంసతో ఏకీభవించాయి. ఇది విని మహారాజు మనస్సు చివుక్కుమంది. ఆ హంసలు ఎగురుతూ, కనుమరుగైపోయాయి.

కానీ ఈ హంసల సంభాషణ విన్న జానశ్రుతి అహం దెబ్బతింది. కీర్తిప్రతిష్ఠల కంటే గొప్పదైన ఆ ఆత్మానుభవాన్ని తాను కూడా పొందాలనుకున్నాడు. ఇక ఆ రాత్రి నిద్రపట్టలేదు. రైక్వుడి గురించిన ఆలోచనలతోనే రాత్రి గడిచిపోయింది. తెల్లవారు ఝామున వైతాళికులు, వందిమాగధులు వచ్చి ఆ మహారాజును స్తుతించడం ప్రారంభించారు. "ఓ మహారాజా! తమరిని మించిన దాతలెవరున్నారు ఈ లోకంలో? మీ కీర్తి నలుదిశలా వ్యాపించింది... తూర్పున సూర్యుడు ఉదయించాడు... దేశం నాలుగుమూలల నుంచీ దానాలందుకోవడానికి అనేక మంది జనులు తరలివస్తున్నారు... మేలుకోండి!" అని సుప్రభాతం పలికారు.


కానీ ఈ మేలుకొలుపును వినడానికి మహారాజు సిద్ధంగా లేడు. ఆ భట్రాజుల పొగడ్తలు చెవులకు తూట్లు పొడుస్తున్నట్టుగా అతడికి వినిపించాయి. వారినందరినీ బయటకు పొమ్మన్నాడు. మహామంత్రి కోసం ఆజ్ఞాపించాడు. అతడు రాగానే, "నా కంటే గొప్పవాడు ఈ ప్రపంచంలో ఒకడున్నాడు. అతడి పేరు రైక్వుడు. అతడు బండి తోలుకుంటూ జీవిస్తాడని విన్నాను. ఆ మహానుభావుడు ఎక్కడున్నా సరే మీరు వెతికి తీసుకురావాలి. అతణ్ణి చూసేవరకూ నాకు సంతృప్తి లేదు" అని అన్నాడు.

ఆ రోజంతా రైక్వుని కోసం రాజభటులు గాలించారు. కానీ అతడి ఆచూకీ కనిపెట్టలేకపోయారు. మహారాజు వ్యాకులత రెట్టింపయింది. అతడు తన సైన్యం మొత్తాన్ని ఈ పనికి ఉపయోగించమని ఆజ్ఞాపించాడు. సామ్రాజ్యం అంతటా గ్రామగ్రామాలలో అన్వేషణ సాగింది. చివరకు ఒక మారుమూల గ్రామంలో అతడి జాడ తెలిసింది. ఒక రాజభటుడు బండి క్రింద కూర్చునివున్న అతణ్ణి, "మహాత్మా! తమరేనా బండి తోలే రైక్వుడంటే?" అని అడిగాడు. దానికి రైక్వుడు, "ఆc! అవును నేనే" అని సమాధానం చెప్పాడు. అతడి కళ్ళలో కనిపించే ప్రశాంతతను ఆ రాజభటుడు సైతం చూడగలిగాడు. వెంటనే మహారాజుకు కబురందించాడు.

జానశ్రుతి తానే స్వయంగా రైక్వుణ్ణి కలుసుకోవడానికి బయలుదేరాడు. రైక్వుడికి ఇవ్వడానికి ఎన్నో కానుకలను సిద్ధం చేసుకుని రాజపరివారంతో సహా రైక్వుడున్న గ్రామానికి చేరుకున్నాడు. రాజు తన పరివారంతో రావడం చూసి రైక్వుడు మొదట చకితుడయ్యాడు. ఆ రాజు ఎందుకు వచ్చాడో అర్థం చేసుకున్నాడు. ఆత్మానుభూతిని పొంది పరమసుఖాన్ని సొంతం చేసుకోవడం కోసమే వచ్చాడని గ్రహించాడు.

రైక్వుణ్ణి చూడగానే అతడు ఒక మహాత్ముడని మహారాజుకు అర్థం అయిపోయింది. అందువలన మహారాజు రైక్వుడికి వినమ్రంగా నమస్కరించి, తాను తెచ్చిన కానుకలను స్వీకరించమని వేడుకున్నాడు. ఆనందానికి మార్గం చూపే ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమని అర్థించాడు. కానీ రైక్వుడు ఆ బహుమతులను తీసుకోవడానికి ఒప్పుకోలేదు. “ఓయీ! నువ్వు అమూల్యమని అనుకుంటున్న ఈ కానుకలతో ఆత్మజ్ఞానాన్ని కొనడానికి ప్రయత్నించకు. అది అమ్ముడుపోయే వస్తువు కానే కాదు. ఈ కానుకలేవీ నాకు అవసరం లేదు. ఇవేమీ లేకుండానే నేను సుఖంగా కాలం గడుపుతున్నాను. దయచేసి వచ్చినదారినే తిరిగివెళ్ళు!” అని మందలించాడు.

ఈ మందలింపుతో మహారాజు ఎంతో నొచ్చుకున్నాడు. కానీ ఆ మహానుభావుణ్ణి మరింతగా అర్థించడం ఇష్టంలేక తిరిగి వచ్చేశాడు. తిరిగి వచ్చాడే కానీ మనస్సులో ఆ రైక్వుడే నిండిపోయి ఉన్నాడు. భౌతిక సంపదలకు లొంగని మహోన్నతమైన అతని మానసికస్థితిని తాను కూడా పొందాలని ఉవ్విళ్ళూరాడు. రైక్వుడి పట్ల మరింత గౌరవం, ప్రేమ అతని మనస్సులో జనించాయి. ఇది ఇలా ఉండగా,



ఆవేదనతో నిండినవారు ఎందరో రైక్వుడి వద్దకు వెళ్ళి ప్రశాంతతను పొందుతున్నట్లు తన వేగుల ద్వారా విన్నాడు. మహారాజులో రైక్వుడి పట్ల హృదయపూర్వకమైన ఆరాధనాభావం ఉదయించింది. మరొకప్రక్క తనకు ఆత్మజ్ఞానం లభించలేదన్న అసంతృప్తి పెరిగిపోతున్నది.

చివరకు ఒకరోజు జానశ్రుతి మళ్ళీ రైక్వుడి దగ్గరకు ప్రయాణం కట్టాడు. అయితే ఈసారి ఇదివరకటి ఆడంబరం లేకుండా, ఆరాధనాభావంతో, ఎంతో నమ్రతతో అతడి వద్దకు వెళ్ళి చేతులు జోడించి నిలబడ్డాడు. తనకు ఆత్మబోధ చేయమని ప్రార్థించాడు. రైక్వుడు మహారాజు హృదయంలో వచ్చిన పరివర్తనను పసికట్టాడు. ఇప్పుడు ఆత్మజ్ఞానాన్ని పొందడానికి కావలసిన అర్హత అతడికి కలిగిందని సంతోషించి, ఆ మహారాజును తన శిష్యునిగా స్వీకరించాడు.

"ఓ రాజా! ఆత్మను అనేకమంది అనేక విధాలుగా భావించి ఆరాధిస్తారు. ఆ ఆత్మ ఒకరిచేత సృష్టించబడిన తత్త్వం కానే కాదు. సర్వసృష్టికీ అదే మూలకారణం. అదే అన్నిటికీ ఆధారం. సర్వసృష్టికీ గమ్యం కూడా అదే!" అని ఆత్మ గురించి వివరించాడు.

ఇంకా, "నీవు చేసే దానాలను చూసి గర్వపడకు. ఆ గర్వం ఎంత అవివేకమో తెలుసుకో! దానాలు చేయాలి, నిజమే. కానీ నా వలనే ఇదంతా జరుగుతున్నదన్న దర్పంతో మాత్రం చేయకూడదు. ఈ దర్పం అహంకారానికీ, అహంకారం సర్వనాశనానికీ దారితీస్తాయి. కీర్తికాంక్షతో కాకుండా, సర్వవ్యాపి అయిన పరమాత్మ నాకు అందించిన దానినే మరలా ఇంకొకరికి ఇస్తున్నానన్న భావంతో దానాలు చేయి. వాటిని నీ కర్తవ్యంగా భావించి, ఆరాధనాభావంతో చేయి. తద్వారా నీకు సంతృప్తి లభిస్తుంది, ఆత్మజ్ఞానం కలుగుతుంది!" అని మరింత విపులంగా వివరించాడు.

మహారాజు ఈ ఉపదేశవాక్యాలు విని ఆనందపరవశుడయ్యాడు. (తాను బోధించే విషయాలను రైక్వుడు స్వయంగా ఆచరిస్తున్నాడు కనుకనే అవి వింటున్న వారి హృదయంలో చక్కగా నాటుకుంటున్నాయని మనం తెలుసుకోవాలి.) రైక్వుడు చెప్పిన విధంగా మహారాజు కూడా సాధనచేసి ఆత్మజ్ఞానాన్ని పొందాడు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 27. దేవేంద్రుడు - విరోచనుడు

పూర్వకాలంలో ప్రజాపతి (అంటే బ్రహ్మదేవుడు) దేవదానవులను సమావేశ పరచి, ఆత్మను గురించి వివరించాడు. "ఆత్మకు పుట్టుక, చావు, ముసలితనం, వ్యాధి మొదలైన సాంసారిక బాధలు లేవు. అంగవైకల్యాలు, ఆకలిదప్పులు వంటి లోటుపాట్లు ఏమాత్రం లేవు. అది స్వయంప్రకాశకమూ, అఖండానందమయమూ, జ్ఞానస్వరూపమూ అయినది. ఆ ఆత్మను తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో, ఆర్తితో అన్వేషించినవాడు, ఆత్మను తప్పక పొందుతాడు. అప్పుడు సకల చరాచర సృష్టిలో ఆ ఆత్మను చూడగలుగుతాడు. అతని అన్ని కోరికలూ తొలగిపోయి, నైష్కర్మ్యసిద్ధిని (అంటే కోరికలే లేని స్థితిని) పొంది పరమానందాన్ని అనుభవిస్తాడు," అని ఆత్మసాక్షాత్కారం పొందినవారి స్థితిని గురించి ప్రకటించాడు. కానీ వారందరిలో దేవతల అధిపతి దేవేంద్రుడు, రాక్షసుల రాజు విరోచనుడు మాత్రమే ఆ ఆత్మసాక్షాత్కారం అన్న విషయాన్ని గురించి నిజమైన ఆతురతను కనపరిచారు.

ఆత్మను తెలుసుకోవడానికి గురువు యొక్క అవసరం ఎంతైనా ఉందని వారికి తెలుసు. ఆ రోజులలోని ఆనవాయితీ ప్రకారం వారు కొన్ని కట్టెల్ని ప్రోగు చేసుకుని, భక్తిప్రపత్తులతో ప్రజాపతిని సమీపించారు. ప్రజాపతి వారిని ఆదరించి ముప్పైరెండు సంవత్సరాలపాటు బ్రహ్మచర్యదీక్షతో సేవలు చేయాలని సూచించాడు. అందుకు వారు సమ్మతించి ఎంతో నిష్ఠతో ప్రజాపతిని సేవించారు.

తాను విధించిన కాలపరిమితి అయిపోయాక, ప్రజాపతి "వత్సలారా! మీరు ఏమి కోరి నా వద్దకు వచ్చారు?" అని ప్రశ్నించాడు. వెంటనే వారిద్దరూ, "హే భగవాన్! తమరు ఆత్మ గురించి చెప్పిన విషయాలను విన్నాము. ఆ ఆత్మను పొందాలని ఉవ్విళ్ళూరుతున్నాము. మా మీద దయవుంచి ఆ ఆత్మను చేరే విధానాన్ని తెలియజేయమని అర్థిస్తున్నాము" అని పలికారు.

ఒక క్లిష్టమైన విషయాన్ని బోధించడానికి ముందు, సులువైన విషయాలతో ప్రారంభించి క్రమక్రమంగా ఆ క్లిష్టమైన విషయాన్ని వివరించడాన్ని 'అరుంధతీ న్యాయం' అంటారు. ప్రజాపతి ఈ న్యాయాన్ని అనుసరించి వారికి బోధించాలని తలచాడు. అందువలన ముందు సులభమైన విషయాలను బోధించడం మొదలుపెట్టాడు. "మనుష్యుల కనుపాపలలో కనిపించే ప్రతిబింబమే ఆత్మ. ఆ ఆత్మ లక్షణాలు నిర్భయత్వం, అమరత్వం. అదే పరబ్రహ్మం" అని చెప్పాడు.

"మరి నీటిలో కనిపించే ప్రతిబింబం, అద్దంలో కనిపించే ప్రతిరూపం కూడా బ్రహ్మమేనా?" అని వారు ప్రశ్నించారు. ప్రజాపతి, "మీరు చెప్పినవాటిలో ప్రతిఫలించే పురుషుడు, నేను మొదట చెప్పిన పురుషుడు ఒకరే. కాబట్టి ఒకసారి

నీటిలోనూ, ఒకసారి అద్దంలోనూ మీమీ రూపాలు చూసుకుని, మీ అనుభవాలను నాకు వివరించండి” అని పలికాడు.

అలా చేశాక వారు, “స్వామీ! మా శరీరాలే నీటిలోనూ, అద్దంలోనూ మాకు కనిపించాయి” అని చెప్పారు. “నాయనలారా! మీరు చక్కగా స్నానం చేసి, మీ శరీరాలను చక్కగా శుభ్రపరుచుకుని, మంచి వస్త్రాలను ధరించి మరలా చూడండి” అని ప్రజాపతి అన్నాడు. వారు అలాగేనని ప్రజాపతి వద్ద సెలవు తీసుకుని, మరు నాడు తిరిగివచ్చారు. “స్వామీ! చక్కటి వస్త్రాలతో ఉన్న మా పరిశుభ్రమైన శరీరాలే కనిపించాయి” అని తమ అనుభవాన్ని వివరించారు. “భయం, చావు మొదలైనవి అంటలేని ఆ ఆత్మనే మీరు చూశారు. అదే పరబ్రహ్మం” అని వివరించాడు.

వారు ఆత్మ అంటే తెలిసిపోయిందని ఎంతో సంతోషిస్తూ తిరుగు ప్రయాణమయ్యారు. అలా వెళ్ళిపోతున్న వారిని చూసి, ప్రజాపతి, “అయ్యో! వీరు విషయం అర్థం చేసుకోకుండా వెళ్ళిపోతున్నారే! శరీరమే ఆత్మ అనుకునేవారు పతనం కావడం ఖాయం” అని జాలిపడ్డాడు.

విరోచనుడికి ఈ కొత్త సిద్ధాంతం ఎంతో నచ్చింది. అసుర జాతి మొత్తానికీ ఈ సిద్ధాంతాన్నే బోధించాడు. వారందరూ కూడా దానితోనే తృప్తిపడుతూ అజ్ఞానంలో ఉండిపోయారు.

కానీ దేవేంద్రుడికి మాత్రం, తాను నేర్చుకున్న దానిలో ఏదో లోపం ఉందనిపించింది. “అందమైన వస్త్రాలతో సింగారించుకుంటే అందంగానూ, ముసలివాడు చూసుకుంటే ముడుతలు పడిన చర్మంతోనూ, వంగిన శరీరంతోనూ, కుంటివాడు చూసుకుంటే కుంటితనంతోనూ మన ప్రతిబింబం కనిపిస్తుంది! మరి ఆత్మకు ఈ లోపాలు లేనేలేవని చెప్పారు కదా! కాబట్టి ఈ శరీరం ఆత్మ కానేరదు!” అనుకుంటూ, ఈ సందేహాన్ని నివృత్తి చేసుకోవడం కోసం ప్రజాపతి వద్దకు తిరిగివచ్చి వినయంగా నిలబడ్డాడు.

ప్రజాపతి, “దేవేంద్రా! విరోచనుడితో కలసి వెళ్ళిపోయావుగా! మరలా ఎందుకు వచ్చావు?” అని ప్రశ్నించాడు. దేవేంద్రుడు, “శరీరమే ఆత్మ అన్న సిద్ధాంతం సరైనదిగా అనిపించడం లేదు. శరీరం క్షణభంగురమైనది. అంతేకాక జన్మ–మృత్యు–జరా–వ్యాధి అనే (పుట్టుక, చావు, ముసలితనం, అనారోగ్యం అనే) దోషాలతో కూడుకున్నది. దోషాలున్నది ఏదీ ఆత్మ కానేరదు కదా. కాబట్టి మీరు దయతో నాకు సరైన ఆత్మజ్ఞానాన్ని బోధించండి” అని వేడుకున్నాడు. దేవేంద్రుడి ఆసక్తి చూసి ప్రజాపతి ఆనందించాడు. అయినా తన ఆనందాన్ని పైకి కనిపించనీయకుండా, మరలా ముప్పైరెండు ఏళ్ళు బ్రహ్మచర్యం, సేవ చేయమని ఆదేశించాడు. దేవేంద్రుడు మారుమాట్లాడకుండా ఆ ఆజ్ఞను పాటించాడు.

ఆ సమయం కూడా అయిపోయిన తర్వాత, “మనం నిద్రిస్తున్నప్పుడు కలలలో స్వేచ్ఛగా విహరిస్తూ కనిపించే మన చైతన్యస్వరూపమే ఆత్మ” అని ప్రజాపతి బోధించాడు. ఈ సమాధానంతో తృప్తిపడి దేవేంద్రుడు వెనుకకు మరలాడు.

కానీ తిరిగివెడుతుండగానే మరలా సందేహం కలిగింది. “మనుష్యులు ఒకొక్కసారి తాము దుఃఖిస్తున్నట్లు లేదా ఎవరో తమను పీడిస్తున్నట్లు కలలు కంటారు కదా! మరి కలలలో కనిపించే మన చైతన్యస్వరూపం ఆత్మ ఎలా అవుతుంది? ఆత్మ దుఃఖాలకు, బాధలకు అతీతమైనది కదా! కాబట్టి స్వప్నావస్థలోని చైతన్యం ఆత్మ కానేరదు” అని అనుకున్నాడు. ఇలా ఆలోచిస్తున్నకొద్దీ, ఆత్మ అంటే తెలుసుకోవాలన్న జిజ్ఞాస అతడిలో రెట్టింపు అయింది. అందువలన ప్రజాపతి వద్దకు మళ్ళీ వచ్చి తన సందేహాలను వెలిబుచ్చాడు. ఇందుకు తగిన అర్హత సాధించడానికి మరి కొన్ని సంవత్సరాలు బ్రహ్మచర్యం, సేవ చేయమని బ్రహ్మ ఆజ్ఞాపించాడు.

ఈసారి ప్రజాపతి “గాఢ సుషుప్తిలో మనం అనుభవించే ఆనందమే ఆత్మ” అని కొత్త నిర్వచనాన్ని చెప్పాడు. దేవేంద్రుడు సంతృప్తి పడి దేవలోకానికి తిరిగివెళ్ళాడు. కానీ అనేక శంకలు అతడి మనస్సులో మళ్ళీ పుట్టుకువచ్చాయి. “గాఢనిద్రలో మనం ఎవరో మనకు తెలియదు కదా! మరి ఆత్మ కూడా తనను తాను తెలుసుకోలేని అజ్ఞానస్థితిలో ఉంటుందా? ఆపైన ఆ గాఢనిద్ర కూడా కొంతసేపటికి చెదిరిపోతుంది కాబట్టి అది కూడా శాశ్వతమైనది కానేరదు. మరి స్వయంప్రకాశకమైన ఆ ఆత్మ ఇటువంటి అంధకారబంధురమూ, అశాశ్వతమూ అయిన స్థితిలో ఎందుకుంటుంది? ఖచ్చితంగా ఈ విషయం తెలుసుకోవలసిందే!” అని అనుకున్నాడు. మళ్ళీ ప్రజాపతి వద్దకే వచ్చాడు. ఈసారి ప్రజాపతి ఐదేళ్ళు బ్రహ్మచర్యం, గురుసేవ చేయమన్నాడు.

ఐదేళ్ళ తర్వాత ప్రజాపతి ఆత్మజ్ఞానాన్ని దేవేంద్రునికి సమగ్రంగా వివరించాడు: “దేవేంద్రా! నీవు చూపిన ఆసక్తి, జిజ్ఞాస ప్రశంసనీయం. నీవు నిజంగా ఆత్మానుభవం పొందడానికి అర్హుడవు. మన శరీరాలు అశాశ్వతమైనవి. అందులో సందేహం లేదు. అందువలన మృత్యుఘడియలు సమీపించినపుడు, మనలోని ఆత్మ మన శరీరాలను వదలి కొత్త శరీరధారణకు సమాయత్తం అవుతుంది. విచ్ఛిన్నమయ్యే మన శరీరాలు అవిచ్ఛిన్నమైన ఆత్మకు తాత్కాలికమైన నివాసాలను ఇస్తున్నాయి. ఈ క్షణభంగురమైన శరీరంలో నివసిస్తున్నంత కాలం ఆత్మకు సుఖదుఃఖాలు కలిగినట్లూ, గుణదోషాలు అంటినట్లూ, వాటన్నింటి వలన అది సతమతమవుతున్నట్లూ అనిపిస్తుంది. ఇదంతా శరీరం మెలకువగా ఉన్నప్పటి స్థితి. మన కలలలో కూడా ఇలాంటి స్థితిగతులే కొనసాగుతుంటాయి. కాకపోతే

శరీరానికి ఉండే భౌతికమైన పరిమితులు అక్కడ ఉండవు. శరీరం కదలక మెదలక పడివుంటుంది. కానీ మనస్సు మాత్రం చురుకుగా ఉంటుంది. అది పరిపరి విధాల పరుగులు తీస్తూ ఉంటుంది. కాబట్టి మామూలు స్థితిలో మనకున్న మానసికమైన పరిమితులే స్వప్నావస్థలో కూడా కొనసాగుతాయని చెప్పుకోవచ్చు. సుషుప్తిలో లేదా గాఢనిద్రలో శరీరంతోపాటు మనస్సు యొక్క ఎరుక కూడా ఉండదు. కొంత ఆనందం ఉంటుంది కానీ అది కూడా తాత్కాలికమే కాబట్టి, ఆ సుషుప్తి అవస్థకు ఆవల ఉన్నదే ఆనందమయమైన ఆత్మ అని తెలుసుకో. ఆత్మ మీదనే మనస్సును లగ్నం చెయ్యి! అనుక్షణమూ ఆ ఆత్మానందాన్ని అనుభవించాలని ఆతురపడు! పట్టువదలకుండా పరిశ్రమిస్తే ఆ ఆత్మసాక్షాత్కారంలోని పరమానందపు పెన్నిధిని పొందగలవు!”

మనిషి ఈ దేహం కాదనీ, ఆత్మయేననీ చెప్పే భావాన్ని వివేకానంద స్వామి ఈ క్రింది విధంగా వివరించారు:

“మనిషి యొక్క కోరికల ప్రపంచం అతి విశాలమైనది. అదే అతడి అనంతత్వానికి సూచిక. అతడు స్వతహాగా అనంతుడు కాబట్టి, అతడి కోరికలు కూడా అనంతంగానే ఉంటాయి. ఆ కోరికలు కూడా అనంతంగా తీరినప్పుడు మాత్రమే అతడు తృప్తి చెందుతాడు. అటువంటప్పుడు, మనిషిని తృప్తి పరచగలిగేది ఏది? బంగారం కాదు. భోగాలు కావు. అందచందాలు కావు. ఆ అనంతమే (ఆత్మయే) అతణ్ణి తృప్తి పరచగలదు. ఆ అనంతం మరెవరో కాదు. అతడే! ఇది తెలుసుకున్నప్పుడే విముక్తి పొందుతాడు. మనకు ఆ అనంతత్వం అందకపోవడానికి భయం, కోరిక అనేవి రెండే అసలు కారణాలు. వాటిని ఎవరు సృష్టిస్తారు? మనమే!

‘నేను!’ అని నేను పలికినప్పుడు, నాలోని ఆత్మను మనస్సులో ఉంచుకుని మాట్లాడుతున్నాను. మీరు మీ కళ్ళు మూసుకుని మీలోని ‘నేను’ గురించి ఆలోచిస్తే, ఏమి ఊహిస్తారు? మీ శరీరంగానీ, మీ మానసిక ప్రవృత్తిగానీ గుర్తుకొస్తోందా? అలా అయితే మీలోని నిజమైన ‘నేను’ని మీరింకా గ్రహించలేదు. మీరు ‘నేను’ అనుకోగానే ఈ విశాలవిశ్వం, ఆ అనంతమైన పరబ్రహ్మం జ్ఞాపకానికి వచ్చే కాలం వస్తుంది. అంటే అప్పటికి మీ స్వస్వరూపం మీకు అవగతం అయినట్లే. అప్పుడు మీరు అనంతులనీ, ఆత్మస్వరూపులనీ గ్రహిస్తారు. అదే నిజం. మీరు భౌతికమైన వస్తువులు కాదు, మీరే ఆ పరమాత్మ!”

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## బృహదారణ్యక ఉపనిషత్తులోని కథలు

### 28. యాజ్ఞవల్క్యుడు - గార్గి

జనక మహారాజు విదేహ సామ్రాజ్యాన్ని పరిపాలించే రోజులలో ఒక మహాయజ్ఞాన్ని తలపెట్టాడు. ఆ యజ్ఞం కోసం పండితులను, ఆధ్యాత్మికవేత్తలను అన్ని దేశాల నుంచి రప్పించాడు. సాధారణ ప్రజానీకాన్ని వేధించే ఆధ్యాత్మిక సమస్యలను ఆ పండితుల చేత కూలంకషంగా చర్చింపజేసి, తగిన పరిష్కారాలను కనుగొనాలనీ, వాటిని జనబాహుళ్యానికి తెలియజెయ్యాలనీ ఆశించాడు. అందుకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లూ చేశాడు. చర్చలలో అత్యున్నతమైన పరిష్కారాలను సూచించిన వారికి బహుమతిగా ఇవ్వడానికి వేయి మంచి పాడి ఆవులను సైతం సిద్ధం చేశాడు. వాటి కొమ్ములకు బంగారు నాణాలను వ్రేలాడదీయించాడు.

చర్చలలో పాల్గొనేవారిని ఉద్దేశించి, "ఈ చర్చలలో తమను తాము అత్యున్నతులుగా నిరూపించుకున్నవారు, ఈ వేయి పశువులను నిరభ్యంతరంగా తీసుకుపోవచ్చు!" అని ప్రకటించాడు.

బహుమతి విలువైనదే. కానీ వాటిని పొందేంత అర్హత తమకు ఉన్నదా లేదా అని వచ్చినవారు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కానీ వారిలో ఉన్న యాజ్ఞవల్క్య మహర్షి మాత్రం ఏ సందేహం చూపకుండా ఆ పశువులను తమ ఆశ్రమానికి తోలుకుపొమ్మని తన శిష్యులకు ఆజ్ఞ ఇచ్చాడు. ఆ మహర్షిని గురించి తెలియనివారు ఇది చూసి ఆశ్చర్యపోయారు. ఆయన గురించి తెలిసినవారు



నిరాశపడ్డారు. ఎందుకంటే ఇప్పుడు విజయం సాధించాలంటే యాజ్ఞవల్క్యుని కంటే ఉన్నతమైన వారిగా తమను తాము నిరూపించుకోవాలి. అది తమ శక్తికి మించిన పని అని వారికి తెలుసు.

జనక మహారాజు ఆస్థానంలోని ప్రధాన పురోహితుడయిన అశ్వలుడు యాజ్ఞవల్క్యునితో వాదించడానికి సిద్ధపడ్డాడు. యాజ్ఞవల్క్యుణ్ణి బ్రహ్మతత్త్వమంటే ఏమిటో వివరించమని అడిగాడు. యాజ్ఞవల్క్యుడు ఏమీ తెలియనట్లు, "అది ఏమిటో నాకు తెలియదు. అయినా ఆ తత్త్వానికి నేను వినయంగా వంగి నమస్కరిస్తాను. నేను ఒక బీద బ్రాహ్మణుణ్ణి. నాకు ఈ ఆవులు చాలా అవసరం," అని సమాధానం చెప్పాడు. నిజానికి ఆ మహర్షి సమాధానంలో బ్రహ్మతత్త్వాన్ని ఇలా వాదోపవాదాల ద్వారా నిరూపించడం కుదరదు అన్న సత్యం దాగివుంది. ఆ మహర్షి ఎంతో చమత్కారంగా, ఆ విషయం పరోక్షంగా స్ఫురించేలా సమాధానం చెప్పాడని అందరికీ అర్థం అయింది.

అయితే ఈ సమాధానంతో ఆ పురోహితుడి అహం దెబ్బతిన్నది. "అలా అయితే ఏయే మంత్రాలను, ఏయే సమయాలలో చదవాలి? ఆయా మంత్రాల అధిష్ఠాన దేవతలు ఎవరు? అన్నీ సవివరంగా చెప్పండి" అని అడిగాడు. యాజ్ఞవల్క్యుడు అవలీలగా ఆయా మంత్రాలు, దేవతలు, యజ్ఞాల గురించి వివరించాడు. చివరకు అశ్వలుడు ఓటమిని అంగీకరించాడు. తర్వాత మరికొందరు వాదిద్దామని సాహసించారు కానీ ఆ మహర్షి ముందు నిలువలేక పోయారు.

ఒకరు, "మహర్షీ! ఆత్మ అంటే ఏమిటి?" అని ప్రశ్నించారు. మహర్షి, "నాయనా! అది మాటల ద్వారా తెలుసుకోగలిగిన విషయం కాదు. దానికి ఆది, మధ్యం, అంతం అంటూ లేవు. అది సర్వవ్యాపి. దాని గురించి తదేకంగా ఏకనిష్ఠతో సాధన చేసినవారికి మాత్రమే అది అవగతం అవుతుంది," అని సమాధానం చెప్పాడు.

చివరకు గార్గి అనే స్త్రీ వాదన చేద్దామని ముందుకు వచ్చింది. ఆమె అసాధారణమైన మేధస్సు కలదని అక్కడి వారందరికీ తెలుసు. ఆమె, "ఓ మహర్షీ! మనకు కనిపించే ఈ జగత్తులోని వస్తువులన్నీ దేని మీద ఆధారపడివున్నాయి?" అని ప్రశ్నించింది.

యాజ్ఞవల్క్యుడు, "ఆకాశం మీద! ఆకాశం అనే రూపంలో ఖాళీస్థలం లేకపోతే ఈ వస్తువులు ఎక్కడ ఉంటాయి? అందుచేత ఆకాశమే అన్నింటికీ ఆధారం," అని సమాధానం చెప్పాడు.

గార్గి: "మరి ఆకాశానికి ఆధారం ఏమిటి?"

యాజ్ఞవల్క్యుడు: "పరబ్రహ్మం"

గార్గి: "మరి ఆ పరబ్రహ్మానికో?"

యాజ్ఞవల్క్యుడు చిరాకుపడ్డాడు. "గార్గీ! ఊరికే ప్రశ్నలు వేయకు. నీవంటి మేధావులు వేయదగ్గ ప్రశ్న కాదిది!" అని అన్నాడు.

మిగిలిన వారందరూ ఆశ్చర్యంతో ఈ వాదనను వింటున్నారు. గార్గి ఒక్క క్షణం వెనక్కు తగ్గింది. కానీ మళ్ళీ తమాయించుకుని, "మహర్షీ! మిమ్మల్ని రెండు ప్రశ్నలు వేస్తాను. వీటికి మీరు సమాధానం చెపితే విజయం మీదేనని అంగీకరిస్తాను. వీటిలో మొదటి ప్రశ్న. మనం ఉంటున్న ఈ భూమి, నక్షత్ర మండలం మొత్తం అంతా వ్యాపించి ఉన్నది ఏమిటి? అలాగే భూత, భవిష్యత్, వర్తమానకాలాలతో సంబంధం లేకుండా నిరంతరం ఉండేది ఏది?" అని ప్రశ్నించింది.

"గార్గీ! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం సర్వవ్యాపకమైన ఆకాశమే. జరిగిపోయిన గతంలోనూ, జరుగుతున్న వర్తమానంలోనూ, జరగబోయే భవిష్యత్తు లోనూ నిరంతరం ఉండే తత్త్వం అదే" అని మహర్షి సమాధానం చెప్పాడు.

మహర్షి తనకు కావలసిన సమాధానం చెప్పడం చూచి గార్గి సంతోషించింది. తన రెండవ ప్రశ్నను సంధించింది: "ఓ మహర్షీ! మరి ఆకాశం కంటే సూక్ష్మమైనదీ, ఆ ఆకాశంలో కూడా వ్యాపించివున్నది ఏది?" సమావేశంలోని వారందరూ గార్గి ప్రశ్నలతో చేస్తున్న ఈ దాడికి చకితులైపోయారు.

యాజ్ఞవల్క్యమహర్షి మాత్రం చెక్కుచెదరని ప్రశాంతవదనంతో, "గార్గీ! అన్నింటికంటే సూక్ష్మమైనదీ, అన్నింటిలోనూ వ్యాపించివున్నదీ పరబ్రహ్మమే. ఈ చరాచర జగత్తులో జరిగే సృష్టి, స్థితి, లయ పరిణామాలకు అదే కారణం. దానికి ఆది, మధ్యం, అంతం మొదలైనవి లేవు. దానినే పరమసత్యం అని కూడా ప్రాజ్ఞులు అంటుంటారు. మనిషి ఆత్మలో నెలకొని, అతడు పొందే సుఖదుఃఖాలకు అతీతంగా దివ్యమైన తేజస్సుతో ప్రకాశించే ఆ పరబ్రహ్మాన్నే పరమాత్మ అని కూడా అంటారు" అని జవాబిచ్చాడు.

ఇది విన్న గార్గి ఇంక మాట్లాడేందుకు ఏమీ మిగలలేదని అంటూ తన ఓటమిని అంగీకరించింది. సభలోని వారికి తన అభిప్రాయాన్ని ఇలా చెప్పింది: "మనలోని ఎవరమూ ఈ మహర్షితో వాదించి గెలుపొందలేకపోయాం. ఈ మహాత్ముడే ఆధ్యాత్మిక విజ్ఞానానికి పరమగురువు అని ప్రకటించవచ్చు."

అంతటితో చర్చలు ముగిశాయి. అందరూ ముక్తకంఠంతో యాజ్ఞవల్క్యుని గొప్పతనాన్ని శ్లాఘించారు. గార్గి ప్రదర్శించిన ధైర్యానికీ, చొరవకూ సభాసదులు హర్షం వెలిబుచ్చారు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 29. యాజ్ఞవల్క్యుడు - మైత్రేయి

యాజ్ఞవల్క్యమహర్షికి ఇద్దరు భార్యలుండేవారు. వారు కాత్యాయని, మైత్రేయి. (పై కథలో మనం చూసిన గార్గికి మైత్రేయి వరుసకు కోడలు అవుతుంది. యాజ్ఞవల్క్యుడి విద్వత్తును చూసి అబ్బురపడిన మైత్రేయి, బ్రహ్మవిద్య నేర్చుకోవాలనే కుతూహలంతో అతడి దగ్గర శిష్యరికం చేయడానికి వీలుగా అతణ్ణి వివాహం చేసుకుంది. కాత్యాయని అంగీకారంతో యాజ్ఞవల్క్యుడు మైత్రేయిని వివాహం చేసుకున్నాడు.) మైత్రేయి జిజ్ఞాసువు. పరమసత్యాన్ని తెలుసుకోవాలని నిరంతరం కోరుకునేది. కానీ కాత్యాయని సామాన్య స్త్రీ. దైనందిన గృహకృత్యాలతో కాలం గడుపుతూ ఉండేది.

వారు చాలాకాలం కలిసి జీవించారు. ఇక ఈ విధమైన జీవితాన్ని చాలించి, అరణ్యాలకు పోయి, తపోమయ జీవితం గడపాలని యాజ్ఞవల్క్యుడు సంకల్పించాడు. తన సంపదలను భార్యలకు సమానంగా పంచి ఇద్దామని అనుకుని, వారి అనుమతి కోరాడు. ఎల్లప్పుడూ పరమసత్యం గురించి ఆలోచించే



మైత్రేయి, అప్పుడు ఆయనను ఒక మంచి ప్రశ్న అడిగింది. "స్వామీ! మీరు ఇవ్వబోయే సంపదలతో నాకు పరమసత్యం బోధపడుతుందా? అమృతత్వం లభిస్తుందా?" ఇది విని ఆ మహర్షి ఎంతో సంతోషించి, "లభించదు! ముమ్మాటికీ లభించదు. ఈ ప్రపంచంలోని వస్తుసముదాయాల వలన, భౌతిక సంపదల వలన పరిమితమైన ఆనందం మాత్రమే కలుగుతుంది. ఇవి ఏమాత్రం పరమసత్యానికి దారి చూపవు!" అని చెప్పాడు.

మైత్రేయికి ఈ విషయం మీద కొంత అవగాహన ఉన్నది. ఇప్పుడు భర్త చెప్పిన విషయం దానికి సరిపోలుతున్నది. కాబట్టి ఆమె వెంటనే, "అయితే నాకు మీరు ఇవ్వబోయే సంపదలతో పనిలేదు. వాటిని అక్క కాత్యాయనికే ఇవ్వండి. శాశ్వతమైన, అమృతమయమైన జీవితానికి చేరే మార్గమేమిటో నాకు బోధించండి. నేను ఆత్మజ్ఞానాన్ని కోరుకుంటున్నాను. పరమసత్యానికి చేరుకునే మార్గమేదో నాకు తెలపండి!" అని తన భర్తను వేడుకొంది.

ఈ సమాధానంతో మరింత సంప్రీతుడైన మహర్షి, "నేనెంతో ప్రేమతో నా హృదయంలో నింపుకున్న జ్ఞానాన్ని గురించి ప్రశ్నించి, నాకు ఎంతో సంతోషాన్ని కలిగించావు. నాకు తెలిసినంత వరకూ బోధిస్తాను. ఏకాగ్రమైన మనస్సుతో విను" అని అన్నాడు.

"సృష్టి అంతా ఆత్మస్వరూపమే. జీవంలేని జడపదార్థాలతో సహా, అన్ని ప్రాణులు, మనుష్యులు ఆత్మపదార్థంతోనే నిండివున్నారు. భర్త, తన భార్యనూ, పిల్లలనూ ప్రేమించడానికి నిజమైన కారణం కేవలం వారిలో ఉన్న ఆత్మ. అతడు వారిలో ఉన్న ఆత్మనే ప్రేమిస్తున్నాడు కానీ వారిని కాదు. ఇదే విధంగా భార్య కూడా తన భర్తలోను, పిల్లలలోను కల ఆత్మను చూడడం వలనే వారిని ప్రేమిస్తుంది. పిల్లలు తమ తల్లిదండ్రులను ఈ కారణం వలననే ప్రేమిస్తారు. మనందరం ఇతరులను, ధనాన్ని, దేవతలను ప్రేమిస్తున్నామంటే అర్థం ఏమిటి? మనలో ఉన్న ఆత్మను వాటిలోనూ దర్శించబట్టే ఇదంతా జరుగుతోంది. అంతేకాక ఆత్మను ప్రేమించడం వలన, ఆ ఆత్మను అన్ని వస్తువులలోనూ చూడడం వలన, అన్ని వస్తువులూ, అందరు మనుష్యులూ మనకు ప్రీతిపాత్రులే అవుతారు." (కానీ మాయ వలన మనిషి వారిలోని ఆత్మను మరచిపోయి నేను నాది అనే అహంకార, మమకారాల వలలో పడతాడు. అందువలన కొందరిని మాత్రమే తన వారిగా, కొన్నిటిని మాత్రమే తనకిష్టమైన వస్తువులుగా చూస్తాడు. ఏదియేమైనా వారందరినీ, వాటన్నింటినీ ప్రేమించడానికి నిజమైన కారణం, అతడికి తెలిసినా, తెలియకపోయినా వారిలోని ఆత్మస్వభావాన్ని దర్శించడమే. అలా ఆత్మయొక్క సర్వవ్యాపకత్వాన్ని గుర్తెరిగి ప్రవర్తించడమే పరిపూర్ణతకు దారితీస్తుంది.)

"ఈ స్థితికి చేరుకోవడం ఎలా?" అని మైత్రేయి తిరిగి ప్రశ్నించింది. దానికి జవాబుగా, "మనం ఆత్మ యొక్క సాన్నిధ్యాన్ని అనుభవించాలి. అదే ఆత్మానుభూతి. ఆ ఆత్మ గురించే ఎల్లవేళలా మననం చేయాలి. అన్ని వస్తువులలో ఆత్మను చూడడం అభ్యాసం చేయాలి. ఇది కొంతకాలానికి కానీ అలవడదు" అని యాజ్ఞవల్క్యుడు విపులీకరించి సమాధానం చెప్పాడు.

తర్వాత ఇంకా ఇలా వివరించాడు: "ఒక నగారా మ్రోగించామనుకో. దానిలో నుంచి ఎన్నో శ్రావ్యమైన ధ్వనులు వెలువడతాయి. అలాగే వీణ నుంచి మధురమైన ధ్వనులు వస్తాయి. శంఖం పూరించినపుడు మరొక రకమైన ధ్వని వినిపిస్తుంది. ఇలాగే రకరకాల ధ్వనులు. ఇవన్నీ ధ్వనులే అయినా, వీటిలో ఆంతరికంగా శబ్దరూపంలో ఉన్నది ఆత్మ. దానినే శబ్దబ్రహ్మం అంటారు. అదే విధంగా సృష్టిలోని అన్ని రూపాలలో ఆత్మ నెలకొని ఉంది." (మనకు నచ్చినవాటిలోనే కాక, నచ్చనివాటిలో కూడా ఆత్మను దర్శించడం నేర్చుకోవాలి. అన్ని భేదభావాలనూ దాటిపోవాలి. ఇటువంటి దృక్పథాన్ని అలవరచుకోవడానికి కొంత సాధన అవసరం.)

ఇంకా కొనసాగిస్తూ, "అన్నింటా ఉన్నది ఆత్మ ఒక్కటేనని చెప్పాను కదా. కాబట్టి ఉన్నదంతా ఒకటే. రెండు లేవు. రెండుగా ఉన్నప్పుడు మాత్రమే ఒకరు ఇంకొకరిని చూడడం, తెలుసుకోవడం, వారిని గురించి ఆలోచించడం వంటివి జరుగుతాయి. అన్నిటిలో ఉన్నది ఒకటే అయినపుడు ఎవరు ఎవరిని చూస్తారు? ఎవరు ఎవరి గురించి తెలుసుకుంటారు? ఎవరు ఎవరి గురించి ఆలోచిస్తారు? కాబట్టి ఆత్మానుభవం కలిగినప్పుడు అనేకం అనేది ఉండదు. ఆత్మ ఎప్పటికీ బహుళం కాదు, ఒకటే! అది ఏకైకతత్త్వం. ఆత్మానుభవాన్ని పొందే స్థితిని సాధించడమే అన్ని రకాల తపస్సాధనల గమ్యం. అందుకే నేను అరణ్యాలకు వెడుతున్నది. నీవు కూడా అదే మార్గంలో పయనించి ఆ ఆత్మను చేరుకో!" అని తన బోధనను ముగించి అరణ్యాలకు సాగిపోయాడు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

## 30. "ద" అనే అక్షరం ఇచ్చే సందేశం

బ్రహ్మదేవుడు సృష్టించిన దేవతలకు, మనుష్యులకు, రాక్షసులకు ఒకసారి బ్రహ్మదేవుని నుంచి ఉపదేశం పొందాలని కోరిక కలిగింది. అందుకు వారు కొంతకాలం బ్రహ్మచర్యం పాటిస్తూ, బ్రహ్మదేవుడికి సేవలు చేశారు.

కొంతకాలం గడిచాక దేవతలు, "తండ్రీ! మాకు ఏదైనా ఉపదేశం చేయండి" అని ప్రార్థించారు.

బ్రహ్మదేవుడు "ద" అని పలికి, "ఈ ఉపదేశంలోని అంతరార్థం మీకు అవగతం అయిందా?" అని ప్రశ్నించాడు.

దేవతలు, "ఆఁ! మాకు చక్కగా అర్థం అయింది. 'ద' అంటే 'దమ్యత'. అంటే



నిగ్రహం. దేవతలం కావడం వలన మాకు ఇంద్రియాల మీద అదుపు ఉండదు. పరమాత్మను చేర్చే పారమార్థిక పథంలో ప్రయాణించాలంటే ఇంద్రియ నిగ్రహమే కదా కావలసింది! మేము ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని సంయమనాన్ని పాటిస్తూ, ముందుకు సాగాలనే మీ ఉద్దేశ్యం. అంతే కదా?" అని పలికారు.

బ్రహ్మదేవుడు, "అవును! నేను చేసిన బోధన మీకు సరిగానే అవగతం అయింది" అని చెప్పి, వారిని పంపివేశాడు.

తర్వాత మనుష్యులు బ్రహ్మదేవుని సమీపించి, మరి మాకూ ఏదైనా సందేశం ప్రసాదించమని అర్థించారు. బ్రహ్మదేవుడు మళ్ళీ "ద" అని పలికి, "అర్థం అయిందా?" అని అడిగాడు.

మనుష్యులు, "ఓం! మాకు ఇచ్చిన ఉపదేశానికి అర్థం 'దత్త'. 'ద' అంటే 'దానగుణం'. మనుష్యులమైన మాకు లోభగుణం ఎక్కువ. దాన్ని వదిలించుకుని అందరికీ సహాయం చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి. అదే కదా మీ ఉపదేశం?" అని తిరిగి ప్రశ్నించారు.

బ్రహ్మదేవుడు, "నేను చేసిన ఉపదేశం మీకు అర్థం అయినట్లే" అని వారిని సాగనంపాడు.

చివరకు రాక్షసులు వచ్చి, "దేవా! మరి మా సంగతి ఏమిటి? మాకు కూడా ఉపదేశం చేయండి" అని వేడుకున్నారు. బ్రహ్మదేవుడు మళ్ళీ అదే అక్షరాన్ని పలికి, "మీకు బోధపడిందా?" అని అడిగాడు.

రాక్షసులు, "గురుదేవా! మాకు అర్థం అయింది. 'ద' అంటే 'దయాధ్వం'. మేము రాక్షసులం కాబట్టి మాది క్రూర స్వభావం. దాన్ని సరిదిద్దుకుని దయతో మెలగమని మీరు సెలవిచ్చారు. అంతేనా?" అని వారు ప్రశ్నించారు.

బ్రహ్మదేవుడు, "అవును! అంతే! నేను చేసిన ఉపదేశం మీకు కూడా అర్థం అయింది!" అని వారిని కూడా పంపివేశాడు.

నిజానికి మనకు ఇంద్రియనిగ్రహం, దానగుణం, దయాగుణం – ఈ మూడూ కావలసిందే. మేఘాలు గర్జించేటప్పుడు 'ద', 'ద', 'ద' అనే శబ్దం చేస్తాయనీ, ఆ శబ్దాలు బ్రహ్మదేవుని సందేశాన్ని మనకు గుర్తు చేస్తున్నాయనీ, ఆ మూడు అక్షరాల అంతరార్థం "దమ్యత! దత్త! దయాధ్వం!" అనీ పెద్దలు చెపుతారు.

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦

# నీతి శ్లోకాలు

మన సంస్కృతి మనకు అందించిన గొప్ప బహుమానం మన సంస్కృత శ్లోకాలు, తెలుగు పద్యాలు. చిన్నచిన్న మాటలలో, గుర్తుపెట్టుకుని, మరింత మననం చేసుకునేందుకు వీలుగా గొప్పగొప్ప జీవితసత్యాలను, ఆచరించదగ్గ నీతులను ఇమిడ్చి వాటిని మనకు అందించారు. మన సాహిత్యంలో అవి అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిలో మచ్చుకు కొన్నింటిని ఇక్కడ అందిస్తున్నాము. వివేకానంద స్వామి, "సంస్కృతం ద్వారా మనకు గౌరవం లభిస్తుంది!" అని చెప్పిన బోధనను ఆచరణలో పెట్టడంలో క్రింద శ్లోకాలను నేర్చుకోవడం, ఉదహరించడం మొదటి మెట్టు అవుతుంది.

**సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయా సఖా ।**
**శాంతిః పత్నీ క్షమా పుత్రః షడేతే మమ బాంధవాః ॥**

ధర్మరాజు చెప్పెను: సత్యం నా తల్లి; జ్ఞానం నా తండ్రి; ధర్మం నా సోదరుడు; దయ నా స్నేహితుడు; శాంతి నా భార్య; క్షమ నా పుత్రుడు. లోకంలో ఈ ఆరుగురు మాత్రమే నాకు నిజమైన బంధువులు.

**ఆలస్యం హి మనుష్యాణాం శరీరస్థో మహాన్ రిపుః ।**
**నాస్తి ఉద్యమ సమో బంధుః కుర్వాణో నావసీదతి ॥**

శరీరంతో ఉన్న మనుష్యులందరికీ మందకొడితనమే మహాశత్రువు. దీనిని వ్యతిరేకించేందుకు చేసే ప్రయత్నాన్ని మించిన స్నేహితుడు మరొకడు లేడు. అంతేకాక, అలా ప్రయత్నం చేసేవాడు (కొన్ని పొరపాట్లు చేసినప్పటికీ) ఎన్నటికీ అధోగతికి దిగజారడు.

**ప్రాణం చాపి పరిత్యజ్య మానమేవాభిరక్షతు ।**
**అనిత్యో భవతి ప్రాణో మానం ఆచంద్రతారకమ్ ॥**

హానికరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు, ప్రాణాలకు తెగించి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. ఎందుకంటే ప్రాణం క్షణభంగురం. కానీ ఆత్మగౌరవంతో జీవించినవాని కీర్తి చంద్రుడు, నక్షత్రాలు ఉన్నంతవరకూ నిలిచి ఉంటుంది.

**అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః ।**
**నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః ॥**

మృత్యువు అనుక్షణం మనను వెన్నంటే ఉంటుంది. మన శరీరాలు, సంపదలు శాశ్వతం కాదు. కాబట్టి ప్రతీ క్షణం ధర్మాన్ని పాటించడం మాత్రమే మనం చేయదగిన కర్తవ్యం.

**ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాలయాః ।**
**ఋణక్షయే క్షయం యాంతి కా తత్ర పరిదేవనా ॥**

భార్య (భర్త), సంతానం, ఇళ్ళు, పశువులు, సంపదలు మొదలైనవన్నీ పూర్వజన్మ సంస్కారాల వలన కలిగిన ఋణానుబంధం వలనే ఏర్పడుతున్నాయి. ఋణం తీరగానే అవన్నీ మనల్ని వదలిపోతాయి. మరి అటువంటి వాటి కోసం వగచడం దేనికి?

**అర్థాతురాణాం న గురుర్ న బంధుః**
**కామాతురాణాం న భయం న లజ్జా ।**
**విద్యాతురాణాం న సుఖం న నిద్రా**
**క్షుధాతురాణాం న రుచిర్ న పక్వమ్ ॥**

ధనవ్యామోహం కలవానికి గురువు, బంధువు వంటి వారు ఉండరు. కామేచ్ఛతో ఒళ్ళు తెలియని వానికి తన ప్రవర్తన తప్పేమోనన్న సిగ్గు, లజ్జ, భయం కలుగవు. విద్య నేర్చుకోవాలన్న కాంక్ష నిజంగా ఉన్నవాడు సుఖాన్ని, నిద్రను పట్టించుకోడు. ఆకలితో ఉన్నవాడు రుచిగా ఉందో లేదో, ఉడికిందో లేదో చూడకుండా, ఏది పెట్టినా ఆవురావురుమని తినేస్తాడు.

**ప్రస్తావ సదృశం వాక్యం స్వభావ సదృశీం క్రియామ్ ।**
**ఆత్మశక్తి సమం కోపం యో జానాతి స పండితః ॥**

సమయోచితంగా మాట్లాడడం, తన స్వభావానికి అనువైన కార్యాలనే చేపట్టడం, తన సమర్థతకు తగ్గట్టుగా కోపాన్ని నిగ్రహించడం – వీటిని చక్కగా ఎరిగినవాడే పండితుడు.

**కోకిలానాం స్వరోరూపం నృణాం తు సత్యభాషణమ్ ।**
**విద్యారూపం విరూపాణాం క్షమారూపం తపస్వినామ్ ॥**

కోకిలకు సుమధురమైన దాని స్వరమే రూపం. మనుష్యులకు సత్యం మాట్లాడడమే రూపం. ఎందుకంటే సత్యభాషిని మాత్రమే మనిషిగా పిలువగలం. కురూపులకు వారి విద్యయే రూపం. పారమార్థిక సాధకులకు క్షమయే రూపం.

**శకటం పంచహస్తేషు దశహస్తేషు వాజినమ్ ।**
**గజం హస్తసహస్రేషు దుర్జనం దూరతః త్యజేత్ ॥**

రహదారి మీద వాహనం ఎదురైనప్పుడు కనీసం ఐదుమూరల దూరం ప్రక్కకు తొలగాలి. గుఱ్ఱము ఎదురైతే పది మూరల దూరం తొలగిపోవాలి. మదపుటేనుగు ఎదురైతే వేయి మూరల దూరం తొలగిపోవాలి. దుర్మార్గుడు ఎదురైతే వీలయినంత దూరం నుంచే తప్పుకోవాలి.

**పిబంతి నద్యః స్వయమేవ నాంభః ఖాదంతి న స్వాదుఫలాని వృక్షాః ॥**
**పయోధరాః సస్యమదంతి నైవ పరోపకారాయ సతాం విభూతయః ॥**

నదులు తమలో పారుతున్న నీటిని తామే త్రాగవు. వృక్షాలు తాము కాసిన ఫలాలను తామే ఆరగించవు. తాము వర్షించడం వలన పండుతున్న పంటలను మేఘాలు తామే భక్షించాలని అనుకోవు. అదే విధంగా ధర్మాత్ములైన వారు తాము సంపాదించిన ధనాన్ని, విద్యలను పరోపకారం కోసమే వెచ్చిస్తారు.

**దైవాధీనం జగత్సర్వం భక్తాధీనం తు దైవతమ్ ।**
**తద్భక్తిః ఉత్తమాధీనం ఉత్తమో మమ దేవతా ।**

శ్రీకృష్ణుడు చెప్పెను: ఈ జగత్తు అంతా భగవంతుని ఆధీనంలో ఉంది. కానీ ఆ భగవంతుడు భక్తుని ఆధీనంలో ఉన్నాడు. మరి ఆ భక్తి ఉత్తములైన వారికి మాత్రమే సాధ్యం. కాబట్టి ఉత్తమమైన గుణములు కలవారే నాకు దేవతలు.

**విషాదప్యమృతం గ్రాహ్యం బాలాదపి సుభాషితమ్ ।**
**అమిత్రాదపి సద్వృత్తం అమేధ్యాదపి కాంచనమ్ ॥**

విషం నుంచి కూడా అమృతతుల్యమైన ఔషధాన్ని తయారు చేయవచ్చు. చిన్నపిల్లవాని నుంచి అయినా మంచి విషయాలను గ్రహించవచ్చు. శత్రువు నుంచి సైతం మంచి నడతను నేర్చుకోవచ్చు. పనికిరాని చెత్త నుంచి కూడా సంపదను సృష్టించవచ్చు. కాబట్టి దేనినీ చులకన చేసి చూడరాదు. ఏ వస్తువునూ వ్యర్థం చేయరాదు.

**పక్షిణాం బలమాకాశం మత్స్యానాముదకం బలమ్ ।**
**దుర్బలస్య బలం రాజా బాలానాం రోదనం బలమ్ ॥**

పక్షుల స్థావరం ఆకాశం. గాలిలో ఎగురుతున్నప్పుడు వాటికి ఏ ఆపదా కలుగదు. చేపలకు నీరు స్థావరం. నీటిలో ఉన్నంత కాలం అవి బలంగా, క్షేమంగా ఉంటాయి. దోపిడీకి గురికాకుండా ఉండేలా రక్షణ కల్పించే రాజే బలహీనులకు బలం. పసిబిడ్డలకు ఏడుపే బలాన్నిచ్చే వ్యాయామం.

**అభ్యాసానుసరీ విద్యా బుద్ధిః కర్మానుసారిణీ ।**
**ఉద్యోగసారిణీ లక్ష్మీః ఫలం భాగ్యానుసారిణీ ॥**

మనం ఎంత అభ్యాసం చేస్తే అంత విద్య లభిస్తుంది. మనం చేసే మంచీ, చెడూ పనులవల్ల మనకు మంచి, చెడు బుద్ధులు అలవడతాయి. చేసిన ప్రయత్నానికి తగ్గ విజయం లభిస్తుంది. మనం చేసుకున్న పనులకు (సంచిత కర్మలకు) అనుగుణంగా ఫలితాలు లభిస్తాయి.

**ఆజగామ యథా లక్ష్మీః నారికేళ ఫలాంబువత్ ॥**
**నిర్జగామ యథా లక్ష్మీః గజభుక్త కపిత్థవత్ ॥**

కొబ్బరికాయలోకి చేరే నీరు ఎప్పుడు చేరిందో తెలియకుండా చేరుతుంది. అలాగే సంపదలు కూడా వచ్చి చేరేటపుడు, మనకు ఏమాత్రం తెలియకుండా సంక్రమిస్తాయి. మరి నిష్క్రమించేటపుడు కూడా, ఏనుగు మింగి విసర్జించిన వెలగపండు లోపలిగుజ్జు మాయమైపోయి ఆ పండు ఖాళీ అయినట్లు, సంపదలు పోయేటప్పుడు కూడా మనకు ఏమాత్రం తెలియకుండానే జారిపోతాయి.

**అనభ్యాసే విషం శాస్త్రం అజీర్ణే భోజనం విషమ్ ।**
**సాధకస్య విషం గోష్ఠీ నృపతేః స్వార్థం విషమ్ ॥**

నేర్చుకున్న కళను (సంగీతం, నాట్యం మొదలైనవాటిని) లేదా విద్యను (వైద్యం, సాంకేతిక శాస్త్రం, రకరకాల చేతివృత్తులు మొదలైనవాటిని) సరిగా అభ్యాసం చేయకపోతే అది తనకే గాక తోటివారికి కూడా విషతుల్యంగా పరిణమిస్తుంది. అజీర్ణరోగికి భోజనమే విషంగా పరిణమిస్తుంది. సాధన చెయ్యాలనుకునేవాడు కబుర్లతో కాలం వెళ్ళబుచ్చితే లాభం లేదు. అతడు కాలయాపన మాని నిరంతరం సాధన చెయ్యాలి. రాజు కనుక స్వార్థపరుడైతే అతడితోపాటు అతడి రాజ్యం కూడా నాశనమవుతుంది.

**శ్వః కార్యమద్య కర్తవ్యం పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ।**
**న హి ప్రతీక్షతే మృత్యుః కృతమస్య న వా కృతమ్ ॥**

రేపటి పనిని రేపటిదాకా ఎదురుచూడకుండా ఈ రోజే చేయాలి! మరి ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేయాలి! మనం చేయవలసిన పనిని మనం చేసినా, చేయకపోయినా మృత్యువు మాత్రం తన పని తాను చేసేస్తుంది! (అంటే మరణం ఏ క్షణంలో అయినా వచ్చిపడవచ్చు కనుక చేయాల్సిన పనిని త్వరగా చెయ్యాలి అని అర్థం.)

**జాడ్యం ధియో హరతి సించతి వాచి సత్యం**
**మానోన్నతిం దిశతి పాపమపాకరోతి ।**
**చేతః ప్రసాదయతి దిక్షు తనోతి కీర్తిం**
**సత్సంగతిః కథయ కిం న కరోతి పుంసామ్ ॥**

సత్సాంగత్యాన్ని మించి మనకు మేలు చేయగలది మరి ఏమున్నది? బుద్ధికి పదునుపెట్టి, వాక్కును సత్యంతో నింపి, మానమర్యాదలను ఇనుమడింపచేసి, చెడు తలంపులను దూరం చేసి, మనస్సును పవిత్రీకరించి, కీర్తిప్రతిష్ఠలను అన్ని వైపులకూ వ్యాపింపచేసేదే సత్సాంగత్యం (అంటే సజ్జనులతో చేసే స్నేహం).

**సంపదో మహతామేవ మహతామేవ చాపదః ।**
**వర్ధతే క్షీయతే చంద్రః న తు తారాగణః క్వచిత్ ॥**

గొప్పవారినే సంపదలు వరిస్తాయి. గొప్పవారికే ఆపదలు కలుగుతాయి కూడా. చంద్రుడికే పెరిగి తగ్గే చంద్రకళలు ఉంటాయి కానీ నక్షత్రాలకు అవేమీ ఉండవు కదా! (చంద్రుడు నక్షత్రాల కన్నా పెద్దగా కనపడతాడు కాబట్టి ఈ శ్లోకంలో చంద్రుణ్ణి నక్షత్రాలకన్నా గొప్పవాడుగా వర్ణించారు.)

**శోకస్థాన సహస్రాణి భయస్థాన శతాని చ ।**
**దివసే దివసే మూఢం ఆవిశన్తి న పండితమ్ ॥**

తెలివితక్కువవాడు ప్రతిరోజూ వేలసార్లు దుఃఖాన్నీ, వందలసార్లు భయాన్నీ ఎదుర్కొంటాడు కానీ తెలివిగలవాడికి అలా జరుగదు.

**పాతితోపి కరాఘాతైః ఉత్పతత్యేవ కందుకః ।**
**ప్రాయేణ హి సవృత్తీనాం అస్థాయిన్యో విపత్తయః ॥**

నేలకేసి కొట్టినప్పుడు బంతి తిరిగి పైకెగురుతుంది. అదే విధంగా మంచివారికి అపాయాలు, తొట్రుపాట్లు కలిగినా అవి శాశ్వతంగా ఉండవు. అంతేకాక వారు తమ పట్టుదలతో వాటికి ఎదురొడ్డి నిలబడడమే కాక, వాటిని అధిగమిస్తారు.

**కదర్థిత స్యాపి చ ధైర్యవృత్తేః బుద్ధేర్వినాశో న హి శంకనీయః ।**
**అధః కృత స్యాపి తనూనపాదః న అధః శిఖా యాతి కదాచిదేవ ॥**

ఒక దీపాన్ని తల్లక్రిందులుగా పట్టుకున్నా దాని జ్యోతి ఎప్పటికీ తల్లక్రిందులు కాదు. తన గుణాన్ని విడిచిపెట్టకుండా అది పైవైపుకే నిలబడుతుంది. అదే విధంగా బలమైన వ్యక్తిత్వమూ, అనుకున్నది సాధించే శక్తి (సంకల్పశక్తి, ఇచ్ఛాశక్తి) ఉన్నవాణ్ణి ఎవ్వరూ బెదిరించి నిరుత్సాహపరచలేరు సరికదా కనీసం అడ్డగించలేరు.

**అజరామృతవత్ ప్రాజ్ఞో విద్యామర్థం చ సాధయేత్ ।**
**గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్ ॥**

బుద్ధిమంతులైన వారు విద్యనూ, ధనాన్నీ సంపాదించేటప్పుడు తమకెప్పటికీ ముసలితనం, మరణం అనేవి కలుగవని భావిస్తూ ప్రవర్తించాలి. కానీ ధర్మాన్ని ఆచరించేటప్పుడు మాత్రం మృత్యువు జుట్టు పట్టుకుని ఈడ్చుబోతుంటే ఎంతగా త్వరపడి, ఎంత నిజాయితీతో పనిచేస్తామో, అంత వేగంగా ధర్మకార్యాలు, నిస్వార్థమైన సేవ చెయ్యాలి. అంటే నిత్యజీవితంలో ఏ క్షణంలోనైనా మన ప్రాణం పోవచ్చు కాబట్టి, ప్రతి క్షణం ధర్మమార్గాన్నే అనుసరించాలి.

**యస్యాస్తి విత్తం స నరః కులీనః**
**స పండితః స శ్రుతవాన్ విధిజ్ఞః ।**
**స ఏవ వక్తా స చ దర్శనీయః**
**సర్వే గుణాః కాంచనమాశ్రయంతి ॥**

ఈ లోకంలో ధనవంతుడికి లేని సుగుణాలను కూడా ఆపాదిస్తారు. అతణ్ణే ఉన్నతుడిగా, చదువుకున్నవాడిగా, మంచిచెడులు తెలిసినవాడిగా, గొప్ప వక్తగా, దర్శించవలసిన మహాత్ముడుగా వర్ణిస్తూ, పొగుడుతుంటారు. అతడేమన్నా నాలుగురాళ్ళు విదులుస్తాడేమోనన్న ఆశతోనే జనం అలా చేస్తారు కానీ అలా చేయడం తప్పు.

ఒంటె సూదిబెజ్జంలో నుంచైనా దూరవచ్చునేమో కానీ ధనవంతుడికి పరలోకసామ్రాజ్యం లభించడం కల్ల అని ఏసుక్రీస్తు చెప్పాడు కదా!

**కిం నామ రోదిషి సఖే త్వయి సర్వ శక్తిః**
**ఆమంత్రయస్వ భగవన్ భగదం స్వరూపం ।**
**త్రైలోక్యమేతదఖిలం తవ పాదమూలే**
**ఆత్మైవ హి ప్రభవతి న జడః కదాచిత్ ॥**

ఓ స్నేహితుడా! ఎందుకు ఏడుస్తున్నావు? శక్తి అంతా నీలోనే ఉంది! నీ సహజ స్వభావమైన దివ్యత్వాన్ని ఎలుగెత్తి పిలువు! (ఎందుకంటే) నీలోనే ఉన్న సర్వశక్తిమంతమైన ఆత్మ నీ పిలుపు కోసం సిద్ధంగా వేచి చూస్తోంది. దాని శక్తుల్ని వెలువరించు! నీలోని శక్తులన్నింటినీ సమీకరించుకుని పనిచేసినప్పుడు ముల్లోకాలూ నీ పాదాల ముందు సాగిలపడతాయి! జడపదార్థమైన ఈ శరీరం నశించిపోతుంది కానీ ఆ ఆత్మ అన్నది శాశ్వతంగా నిలబడుతుంది. కాబట్టి నీవు ఏమాత్రం భయపడవలసిన పని లేదు!

✦ ✦ ✦ ✦ ✦ ✦ ✦